

40, పైసలు

ఆంధ్ర సచిత్రవార పత్రిక

coromandel

gromor

అన్ని పంటలకు అనువైంది

గ్రోమోర్ అమోనియం ఫాస్ఫేట్ 28-28-0

పుష్కలమైన పంట — అధిక లాభం!




గ్రోమోర్ 28-28-0 మీరు పండించే ప్రతి పంటకు వాడుటవలన ఏటేటా అధిక లాభాలు పొందగలరు.

నత్రజని, భాస్వరామ్లము సమ పాళ్ళలో. అత్యధిక పోషక శక్తి కల్గిగిన రసాయనిక ఎరువు ఈ గ్రోమోర్ అమోనియం ఫాస్ఫేట్ 28-28-0. ఇందలి నత్రజని అమోనియా రూపంలో నున్నందున పైరుకు పూర్తిగా — వృధాకాకుండా — లభ్యమవుతుంది. ఇందలి భాస్వరామ్లము, అమోనియా రూపంలో నున్న నత్రజనితో కలిసి యున్నందున, పైరుకు కావలసిన భాస్వరము ఎక్కువగా లభ్యమవుతుంది.

గ్రోమోర్ వాడుట వలన రవాణా, కూలి, వెల్ల చేయుటకగు ఖర్చులు తగును.

ఈ బోర్డును ప్రదర్శించు డిస్ట్రిబ్యూటర్ల వద్ద రైతులకు కావలసిన గ్రోమోర్ ఎరువులు దొరుకును.



కోరమాండల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్
[illegible], సర్దార్ పటేల్ రోడ్, సికింద్రాబాద్-3, (ఆం. ప్ర.)

వ్యాపార వివరములకు సంప్రదించండి:

ఇ. ఐ. డి. ప్యారీ లిమిటెడ్

66, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3, : డేటహౌస్, మద్రాసు 1.



"స్వాగతం ఓహో చిలిపినవ్వుల శ్రీవారు, సోగకన్నులు సైగచేస్తే ఆగవేని పొరగారు"
అశేష ప్రజాదరణ పొందిన చిత్రం!
శ్రీ సారథి స్టూడియోస్ వారి
ఆత్మీయులు
సంగీతం: రాజేశ్వరరావు * దర్శకత్వం: వి. మధుసూదనరావు * ఫోటోగ్రఫీ: సెల్వరాజ్
నిర్మాత: దుక్కిపాటి మధుసూదనరావు బి.ఏ.
నవయుగ

పాఠకులకి, రచయిత (త్రు)లకి స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా మా శుభాకాంక్షలు. స్థలాభావం వల్ల ఈ వారం ప్రశ్నావళి, సినిమా డైరీ, మీకు తెలుసా? శీర్షికలని వెయ్యలేకపోతున్నాము.
—సం.

*   *   *

వ్యాసాలు

నేటి తెలంగాణా విమోచనోద్యమములో, ఎన్. జి. వో.లు విద్యార్థులు టాక్సీ డ్రైవర్లు మొదలగువారు పాల్గొని దానిని విజయవంతం చేయడం మిగిలిన 'ఆంధ్రు' లందరికి సంతోషం. 'నేను నా బాధ్యత తీసుకుంటాను. నీవు నా విషయం ఏమి చూడనవసరం లేదంటే' అందరికీ సంతోషమే. 'మేము కలసి ఉండము మొర్రో అంటే ఎవరికి కావాలి. అంత బలవంతము ఎవరు పెడతారూ? ఆంధ్రలో ఉంటే, ఆంధ్రకు వచ్చే లాభము విడిపోతే పోయే నష్టము ఏమి లేదు. కాని కాకలుతీరిన ఆంధ్ర యోధులు సారీ సార్ తెలంగాణా యోధులు శ్రీ కె. వి. రంగారెడ్డిగారు మర్రి చెన్నారెడ్డిగారు (అదే మాజీ ఉపముఖ్యమంత్రి గారు, మాజీ ఆర్థికమంత్రిగారు మొ:వారు ఉండగా, మా (అంటే ఆంధ్రుల) దౌర్భాగ్యము కాకపోతే కేరళీయులు, కన్నడిగులు, మహారాష్ట్రీయులు, రాజస్థానీయులు కనీసం తెలుగు చదవడం వ్రాయడం రాని అమోన్, బద్రీవిశాల పిట్టీగార్లు ఈ ఉద్యమంలో ప్రవేశించి, సాటి 'ఆంధ్రు'ని, సోదరులని కనీసం జాలైనా తలచక ఎక్కడో మానాభిమానాలు బంధుమిత్రులను వదులుకుని మీ దేశంలో, అంటే తెలంగాణాలో కడుపు చేతితో పట్టుకొని ఉద్యోగాలు చేసుకొనే ఆంధ్రుల మీద మీ ప్రతాపాలు! మా ఆంధ్రులు మీకు ఏమి అపకారం చేసేరు? వారిని కుక్కలను తరిమినట్లు తరుముతున్నారు, గోడల నిండా అడ్డమైన వారాబులు చేస్తూ? తెలంగాణాలో ఆంధ్రులు తప్ప యింక ఏ రాష్ట్రీయులు లేరా? అపాటి చూచుకుంటే ఆంధ్రలోను ఉన్నారు మీ తెలంగాణీయులు, ఉద్యోగాలు చేసుకుంటూ. మీలా మేము ప్రవర్తించలేమా? మీరు హుందాగా ప్రవర్తిస్తే దేశం ప్రజల అభిమానం సంపాదిస్తారు.

ఈ విషయంలో తమిళులు హిందీని వ్యతిరేకించారు కాని హిందీ మాట్లాడే వారి జోలికి పోలేదు. మరి మీరు సాటి తెలుగువారై ఉండి సోదర తెలుగు వారిని కొడుతున్నారు. మనం ఎన్ని యుగాల వెనుక నున్నామో!

ప్రతి నాయకుడు 'ప్రత్యేక తెలంగాణా' కావాలి అని నినాదాలు చేసేవాడే కాని ఈ విషయాలు ఎవరికి కావాలి? తెలంగాణా విడిపోక ముందే ఆంధ్రుల మీద యింత కక్ష చూపిస్తున్నారు కాదా? యిక విడిపోతే 'తూర్పుపాకిస్తాన్‌'లోని హిందువులు లాగా ఉంటారేమో ఆంధ్రులు.'

మీ తెలంగాణానికి అసలు ఆంధ్రులు చేసిన అన్యాయాలు ఏమున్నాయి? మీరు ఎన్నుకున్న నాయకులే మిమ్మల్ని మోసం చేసేది, వాళ్ళే

ఉత్తరాలు

మిమ్ములను 12 సంవత్సరములు నిర్లక్ష్యం చేసినప్పుడు ఊరుకొని, యిప్పుడు కొందరు ఆంధ్రుల మీద పడితే అర్థముందా?

సెల్వ్. మాలతి, (కాకినాడ)

*   *   *

తెలంగాణా సమస్యను గూర్చి శ్రీ రాశిగారు మీ (మా) పత్రిక ద్వారా ప్రజలందరికి తెలియజెప్ప బూనటం ఎంతో అభినందనీయం. మీ విశేఖరి ఇచ్చిన విద్యుచ్ఛక్తి ఆదాయ వివరాలనుగూర్చి తెలంగాణావారు యేమంటారో వినాలని వుంది. శ్రీ చంద్రయ్యగారు సూచించినట్లు మీరు పత్రికా ముఖమున 'చర్చావేదిక' గొకదాని నేర్పాటు జేస్తే చాల బాగుంటుంది. రాశిగారు ఆంధ్రులపై ఆంధ్రస్త్రీలపై జరుపబడిన నికృష్టమైన అత్యాచారాలను గూర్చి ప్రస్తావిస్తూ, మద్రాసు వారితో పోల్చారు. మరి తమిళుల సంస్కార, సంప్రదాయాలు, తెలంగాణావారి సంస్కార, సంప్రదాయాలు ఒక టెలా అవుతవి? ఒకరి సంస్కారం హైద్రాబాద్ గోడలపైన చాటబడుతుంటే, మరొకరి సాంప్రదాయ సంస్కృతులు వారి భాషకు దేశంలో ప్రత్యేక స్థానాన్ని తెచ్చి పెట్టుతున్నాయి. 'ఆంధ్ర' పదాన్నే అసహ్యించుకొనే తెలంగాణా సోదరులు (!), వేర్పడిన తరువాత మరి 'ఉర్దూ'ను అధికార భాషగా చేస్తారా? ఇపుడు ఉద్యమానికి పెట్టుబడి పెడుతున్న గుత్తపెట్టుబడుదారీ వర్గాలకు కృతజ్ఞతా సూచనగానైనా ఆ పని చేయవలసిందే మన హైద్రాబాదు సోదరులు.

ఒక ఆంధ్రుడు, (రాంచీ)

*   *   *

మీ రాశిగారు వ్రాసిన వ్యాసం పూర్తిగా ప్రేరేపించేదిలాగుంది. 27—6—69లో రాశిగారు కె. చిన్నపరెడ్డిగార్కి బడ్జెటు లోట్లు మొదలగు విషయాలు విశదీకరించారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడకముందు తెలంగాణా బడ్జెటులోటు తక్కువగా వుంది. మరియు ఆంధ్రది. ఎక్కువగా వుంది. ఆ బడ్జెటు లోటులు ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత తెలంగాణాని అతిగా అయిపోయాయి, ఆంధ్రవి మాత్రం తగ్గిపోయాయి. దీని వలన అర్థము ఏమవుతుందో తెలుపుతారా?

మాతో విడిపోతే ఆ ప్రాంతానికే మంచిది అని ఇదే సంచికలో (27—6—69) వ్రాశారు. ఆంధ్రులకు మంచిది అయితే ఇంకా వారి నాయకులు మమ్మల్ని ఎందుకు పట్టుక వ్రేలాడుతున్నట్టు? రాశికి కొంచెం నోరు దురద పుట్టుతుందా ఏమి? ఇక్కడా (తెలంగాణా) ఒక్కొక్క ప్రభుత్వ శాఖలో దొడ్డి ద్రోవగుండా చేరి వున్నత పదవులు అలంకరించి (మా నోర్లుకొట్టి) మమ్మల్ని బానిసలుగా చూడడం, కసాయివానిగా ప్రవర్తించడం, న్యాయమా ధర్మమా మరి ఏమిటి? ఆంధ్ర ఆఫీసర్లు తెలంగాణాలో బిచ్చగాళ్ళమాదిరిగా జొరబడ్డారు. మళ్ళీ వాళ్ళే తిన్నయింటివాసాలు లెక్కపెడుతున్నారు. కఠినులు, నిర్దయులు. రాశికి ఇవన్నీ తెలుసా? రాశిని ఇగముందు కండ్లు మూసుకుని మాట్లాడవద్దని చెప్పండి. ఇదీ మీరు తప్పక ప్రచురించాలి. లేకుంటే ఇంకా చర్చించాల్సి వస్తుంది!

ఆర్. శ్రీధర్, పృథ్వీ, మురళి, జి. విశ్వేశం,
కె. అమర్‌నాథ్, ఆర్. సరేందర్ (జగిత్యాల)

* జవాబు

కింద కొన్ని సంవత్సరాలూ వాటిని సంబంధించిన బడ్జెటు లోటు అంకెలూ ఇవ్వబడ్డాయి.

	తెలంగాణా	ఆంధ్ర
1954-55	రు.50 లక్షలు	రు.8.18కోట్లు
1955-56	రు.1.7 కోట్లు	రు 5.29కోట్లు
1956-57	రు.2.25కోట్లు	రు.2.43కోట్లు
1957-58	రు 3 05కోట్లు	రు.2.43కోట్లు

చివరి అంకెలు బడ్జెటు అంచనాకి సంబంధించినవి—రాశి.

*   *

మీరు 23—5—69 వ తేది వారపత్రికలో ప్రచురించిన 2:1 లేక మాది మాకు—మీదీ మాకే......అన్న వ్యాసం చదివాక మేము ఏడవాలో లేక నవ్వాలో తెలియడంలేదు. తెలంగాణాకు అన్యాయం జరిగిందని బాహాటంగా అందరు ఒప్పుకుంటే, మీ రాశిగారు ఏ విషంలో వ్రాసారోగాని మీ ఆంధ్రపత్రికకు తెలంగాణాలోవున్న మంచి అభిప్రాయం గూపుమాపారు. మీ రాశిగారు ఎక్కడో మద్రాసులో కూర్చుని ఆంధ్రకే అన్యాయం జరిగింది, తెలంగాణాకు కాదు, అని అనడం విచిత్రము. నాగార్జునసాగర్ ప్రాజెక్టు తెలంగాణాలో నిర్మితమైనదాని క్రింద సాగుబడి మూడు వంతులకు ఎక్కువయే ఆంధ్రకు ఇవ్వబడినది. ఆంధ్ర మొదటనే వ్యవసాయంలో అభివృద్ధి జెందిన ప్రదేశము. అటువంటిదానికి ఇంక ఎక్కువ సదుపాయము కలిగించి తెలంగాణాను అణగద్రొక్కడము ఏమి సబబుకాదు. హైద్రాబాదు పట్టణములో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత వెలసిన క్రొత్త కాలనీలలో ఇండ్లు అన్నియు ఆంధ్రులకే కేటాయించబడినవి. ప్రభుత్వపు అప్పులు ఇల్లుకొరకు వారికే ఇవ్వబడినవి. న్యాయం ఎక్కడ వున్నది. మీ రాశి ఆంధ్రుడు కావచ్చు కనుక మీ పత్రికలో తప్పుడు లెక్కలుచూపి, తెలంగాణా ప్రజలకు దూరం కావద్దని నా మనవి.

—బి. చంద్రమోహన్, (హైద్రాబాదు)

(1) ప్రధానమంత్రి ఏప్రిల్ 11వ తేదీన లోక్ సభలో చేసిన ప్రకటన మేరకు తెలంగాణా అభివృద్ధికి సంబంధించి ఒక ఉన్నతాధికార సంఘాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

(2) తెలంగాణా ప్రాంతంలో ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి, అభివృద్ధి పథకాలను త్వరగా అమలు పరచేలా పరిపాలనా యంత్రాంగాన్ని పటిష్ఠం చేయడానికి వెంటనే 2000 ఉద్యోగాలను సృష్టించడానికి చర్యలు తీసుకొనబడుతున్నాయి.

(3) ప్రతి తెలంగాణా జిల్లాకు 1969—70 సంవత్సరానికి కోటి రూపాయల చొప్పున కేటాయించడం జరిగింది.

(4) ఆంధ్రరాష్ట్రములో మూడు విశ్వవిద్యాలయాలకు గ్రాంట్లు ఈవిధంగా కేటాయిస్తున్నారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం— 37 లక్షలు
ఆంధ్ర విశ్వవిద్యాలయం—20 లక్షలు.
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం—11.68 లక్షలు.

ఈ గ్రాంటును పరిశీలించి చూస్తే సగంకన్నా యెక్కువభాగం ఉస్మానియా విశ్వవిద్యాలయానికే ఇవ్వబడుతుంది.

(5) హైదరాబాదు, సికిందరాబాదు జంట నగరాలలో సౌకర్యాల అభివృద్ధికై 40 లక్షల రూపాయలు మంజూరు చేయటం జరుగుతుంది.

పైన చెప్పిన, ఇంకా ఎన్నో, సౌకర్యాలుముందే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తే ఎంతో, బాగుండేది. 'ఆలస్యం, అమృతం విషం'— అనే నానుడిని బుజువు చేసింది —ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. అయినా యింత తొందరలో ప్రభుత్వం కళ్ళు తెరిచింది—అని సంతోషపడి, ఇంకా ముందు ముందు ఎన్నో సౌకర్యాలు తప్పక కల్గిస్తుందనేఆశతో— పదవీ వ్యామోహం కోసం దేశంలోఅశాంతి జన నష్టం ధననష్టం కలుగ జేస్తున్న కొందరు నాయకుల అడుగుజాడల్లో నడుస్తున్న అనేక అమాయక ఆంధ్రప్రజలకు ఒక భారత పౌరునిగా నామనవి.

ఇప్పటికే అనేక రాష్ట్రాలుగా చీలి అనేకసేనలు తయారయినాయి. ఇంకా ప్రత్యేకరాష్ట్రం కావాలంటూ కోరి ఈ పవిత్రభరత భూమిని యింకా ఎన్నెక్కలు ముక్కలు చేయక ఐకమత్యంగా వుండి భారతదేశంయొక్క పరువు ప్రతిష్ట సంస్కృతిని కాపాడి దేశం—స్వదేశం—అభివృద్ధి పొందేటట్లు చేయమని మరీ, మరీ అందర్నీ కోరుతూ...

యస్. వి. అప్పారావు, (ఒరిస్సా)

* * *

'తెలంగాణా రాష్ట్రం కావలసింది తెలుగు జాతికా లేక..?'

గత ఆరునెలలుగా తెలంగాణాలో జరుగుతున్న సంఘటనలు చూస్తూ వుంటే, చదువుతూంటే నా మనస్సు బాధతో వరిగిపోతోంది. ఈ దారుణ

ఉత్తరాలు

మైన సంఘటనలు తెలుగుజాతి మీద ఎటువంటి ప్రభావాన్ని కలిగిస్తుందోనని భయపడుతున్నాను.

ఆంధ్రప్రాంతపు తెలుగువారి మీద తెలంగాణా ప్రాంతపు తెలుగువారు ద్వేషాన్ని పెంచుకోవడం, అంతటితో ఆగక ఆంధ్ర ప్రాంతాల నుండి ఉద్యోగ రీత్యా లేక వ్యాపార రీత్యా తెలంగాణా ప్రాంతాలకు వచ్చి నివసిస్తున్న వారి పైనా, వాళ్ల యిండ్ల పైనా లేక వాళ్ల ఆస్తులపై పడి ధ్వంసం చేయటమో లేక దహనం చేయటమో చేస్తున్నారు. మహాత్మా గాంధి శతజయంత్యుత్సవాలు జరుగుతున్న, కాలంలో యిటువంటి హింసాకాండలు జరుగుతుండడం చాలా విచారకరమైన విషయం. మరొక శోచనీయమైన విషయం ఏమిటంటే తెలంగాణా ప్రాంతాలలో ముఖ్యంగా భాగ్యనగర్ (హైదరాబాద్) లో ఏ వీధిలో వెళ్ళినా ఎటు చూసినా (ఆంధ్రప్రాంతపు) స్త్రీల గురించి అసభ్యకరమైన వ్రాతలతో గోడలన్నీ నిండబడి ఉన్నాయి. వాటిని చదివిన ప్రతిఒక్కరూ ఏ కొద్దిపాటి వివేకమున్నా అటువంటివాటిని మన్నించలేరు. ఈ చర్యల వల్ల తెలుగు తల్లికి ఎంతటి అగౌరవం జరుగుచున్నదో తెలంగాణా తెలుగువారు ఆలోచించలేకపోతున్నారా!?..

తెలుగు మాతృభాషగా గలవారు ఏ ప్రాంతములో నివసించినను వారు ఆంధ్రులనే పిలవబడుతారు. ఇది సర్వసత్యం. ఇటువంటి సత్యాన్ని గ్రహించక వెర్రి ఆవేశాలతో తెలంగాణా (ఆంధ్రులు) తెలుగు వారు తమ మీద తామే దౌర్జన్యం జరుపుకుంటున్నారు. తమ జాతిని తామే అగౌరవపరుచుకుంటున్నారు.

తమ జాతి మీద తమకే గౌరవం లేనప్పుడు వేరొక జాతికి మట్టుకు వాళ్ల మీద గౌరవం ఎందుకుంటుంది? ఈ నాడు జరుగుతున్న ఆందోళనలూ, దౌర్జన్యాలూ దురాశాపరులైన తెలంగాణా తెలుగు నాయకులే కాకుండా యితరులు కూడా నడుపుతున్నారని, ఈ చర్యలను వారు ప్రోత్సహిస్తున్నారని తెలుస్తోంది. దీని వలన వారు తెలుగు జాతిని, బలహీనపరుస్తున్నారని తేటతెల్లమౌతోంది. ఆంధ్ర జాతి లేక తెలుగు జాతి సమైక్యతను కాపాడవలసిన బాధ్యత ఇప్పుడు తెలంగాణాలోని తెలుగువారి పైన ఆధారపడి ఉంది. ఇది నా భావన.

కలసి వుంటే కలదు సుఖం. విడిపోవడం ఏమంత కష్టమైన పనికాదు. ఒకటిగా కలసి వుండటంతోనే వుంది కష్టమంతా. ఆ కష్టాల్ని ఎదుర్కొని భరించగలిగితేనే సుఖం ఉంది. ఇది కేవలం నా ఉద్దేశ్యం మాత్రమే. నేను తెలుగువాణ్ణి కాను. కాని నేను తెలుగుజాతి శ్రేయోభిలాషిని.

జై ఆంధ్రా, జై తెలంగాణా
జై ఆంధ్రప్రదేశ్
జైహింద్

దుర్గాసింగ్ ఠాకూర్ సింగ్ (హైదరాబాద్)

(63వ పేజీ చూడండి)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు.

శుక్రవారం : 15—8—'69
శ్రీ సౌమ్యనామ సం|| శ్రావణమాసం శు. విదియ
సంపుటము : 61 సంచిక : 51

స్థాపితము :
1908

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీధి, మద్రాసు-1

పోస్టు ద్వారా

సంవత్సర చందా	26.00
6 మాసముల చందా	13.00
3 మాసముల చందా	6.50

విషయానుక్రమణిక

సంపాదకీయం:

ఇప్పటికి ఇంచుమించు ఆరునెలలుగా ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిన కల్లోల పరిస్థితి తెలంగాణా ప్రాంతానికే అధికంగా పరిమితమయి ఉన్నప్పటికీ ఆ పరిస్థితి ప్రభావం క్రమంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలందరిమీదకీ వ్యాపిస్తుందనవచ్చు. ఇప్పటికే ఎందరో తెలుగువారు మానసికంగానే కాక ఆర్థికంగా కూడా తెలంగాణా ఉద్యమం వల్ల ఎన్నో విధాలుగా ఎన్నో బాధలకి లోనవుతున్నారు. కనీసం అందుకోసమయినా ఆ ఉద్యమం బాగోగులని యదార్థనిష్ఠతో అనుశీలించటం అవసరం.

ఎంతో చిన్నవిగా కనిపించేవి అనుకోనివిధంగా పెద్ద రాజకీయ పరిణామాలకి దారితియ్యటం చరిత్రలో సుపరిచితమయిన విషయమే — ఫ్రాన్స్‌లో డ్రేఫూస్ విచారణ, భారతదేశంలో ఒకప్పుడు తోటాలకివాడే కొవ్వుని గురించి జరిగిన వివాదం మొదలయిన ఉదాహరణలు చాలా ఉంటాయి. కాని, తెలంగాణా ఉద్యమానికి ప్రధమ కారణాలనదగిన ఉద్యోగ సంరక్షణలు, మిగులు నిధులు అంత స్వల్పవిషయాలు కావు. వాటిపేర జరిగిన అలజడి, హింసాకాండ అసలే స్వల్ప విషయాలు కావు.

ఉద్యోగాలకి సంరక్షణలని గురించి న్యాయస్థానం వారు తీర్పు ఇచ్చారు. ఇక అవి ఇక్కడ చర్చకి అతీతమయినవి. మిగులు నిధులని గురించిన చర్చ కొన్ని నెలలుగా తీవ్రంగా జరుగుతూ వచ్చింది. కుమార్ లలిత్ నివేదికమీద వెలువడిన వ్యాఖ్యలని బట్టి మిగులు నిధులు అనే మాటలకి ఎన్నో అర్థాలు చెప్పవచ్చునని తెలుస్తుంది. భార్గవా నివేదిక వెలువడక మునుపే తెలంగాణా నాయకులు కొందరు దానిపట్ల తమకి నమ్మకం లేనట్లు ప్రకటనలు చేశారు.

రాజ్యాంగానికి విరుద్ధమయిన ఉద్యోగ సంరక్షణలు; దేశం మొత్తం మీద వాడుకలో ఉన్న ప్రాథమిక ఆర్థిక సూత్రాలకి విరుద్ధమయిన మిగులు లెక్కింపులు, ఆంధ్రప్రదేశ్ సమైక్యతకి దోహదాలు కాలేవు సరికదా రెండు ప్రాంతాల తెలుగువారి మధ్య గాఢ వైరాలకీ, ద్వేషాలకీ ముఖ్య కారణాలు అయిపోయాయి. రాజకీయాలలో పోటీలను ఈ విధంగా పరిష్కరించటానికి అధికారంలో ఉన్న వర్గంవారూ, లేనివర్గంవారూ కూడా పూనుకోవటం వారి రాజనీతి లోటుకి తార్కాణం. ప్రాంతీయ సంఘాల ద్వారా పరిష్కారం అసలు కుదరకపోగా వర్గవిభేదాలు మరింత తీవ్రరూపం దాలుస్తాయి. ఇప్పటికే అవర్ణనీయమయిన ఆవేదనకి లోనవుతున్న ప్రజలు మరింత బాధపడతారు.

అపసరణకి దారితీసే విధానాలు ఎన్నో ఉన్నాయి. తోటివారిని దారలుగా ఎంచి ద్వేషించటం ఆత్మగౌరవానికి మంచిదిగా తోచదు. భావసమైక్యతకి వెలకట్టటంకూడా మంచి పద్ధతిగా తోచదు. భారతదేశ రాజ్యాంగం ప్రజాస్వామ్య సిద్ధాంతాల మీద ఆధారపడినది కాబట్టి దానికి అనుగుణంగా ఉండే పద్ధతులనే ఏ విధమయిన లక్ష్యానికయినా అనుసరించటం మంచిది.

* * *

భారతదేశం స్వతంత్రదేశం అయి 22 సంవత్సరాలు మాత్రమే అయినప్పటికీ ఇది అత్యాధునిక కాలం కాబట్టి భారత రాజకీయ చరిత్ర మామూలు కన్నా ఎక్కువ వేగంతో నడుస్తూ వస్తున్నది. ఇటీవల ఈ వేగం మరింత త్వరగా మారుతూ ఉండటం గమనించదగ్గ విషయం. కొన్ని నెలల్రకితమే బాంకులని 'సమాజం అదుపులో' ఉంచాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. పోయిన నెల కాంగ్రెసులో బయట పడుతున్న ముఠా తగాదాలవల్ల ఈ బాంకులు హఠాత్తుగా జాతీయం అయిపోయాయి. దీనికి సంబంధించిన ఆర్డినెన్సుమీద కొన్ని గంటలలో రాష్ట్రపతి భవనాన్ని కాళీ చెయ్యనున్న శ్రీ వరాహగిరి వెంకటగిరిగారు తమ ఆమోదముద్ర వేశారు. ఆంధ్ర, కేంద్ర రాజకీయాలు రెండిటిలోనూ ఎప్పుడూ ప్రాముఖ్యతలేని శ్రీ వి. వి. గిరిగారు కాంగ్రెసు పార్టీలోని అంతఃకలహాలకి ఒక చిహ్నం అనవచ్చు. జీవితం అంతా కాంగ్రెసుద్వారా దేశసేవలోనే గడిపానని చాటే ఈ వ్యక్తిని ఇద్దరు గొప్ప కాంగ్రెసు నాయకుల పేర్లు ధరించే కాంగ్రెసు ప్రధాన మంత్రి స్వతంత్రుడయిన అభ్యర్థిగా రాష్ట్రపతి పదవికి నిలబెడుతున్నారన్న వదంతిలో నిజం ఏమయినా ఉంటే పదవీ వ్యామోహం రాజకీయవాదులని ఎంతదూరం తీసుకువెళ్ళగలదో నిరూపిస్తుంది. దేనినయినా నిర్మించటం చాలా కష్టం; దానిని నాశనం చెయ్యటం చాలా తేలిక. స్వార్థాన్ని ప్రజాశ్రేయస్సుగా నిరూపించి ప్రచారం చెయ్యటంకూడా అంత కష్టమయినపని కాదు. ఈ రకం ప్రచారాన్ని చక్కగా చేసే వర్గాలు ఎన్నో కాంగ్రెసుని విచ్ఛిన్నం చెయ్యటానికి కృషి చేస్తున్నాయి. వీటిలో కొన్ని విదేశాల ఆదేశాల ప్రకారం నడుచుకునేవి. తమ ప్రాంతాలలోకి బయటివారిని తీసుకురావటం భారతీయ రాజకీయ సాంప్రదాయాలలో ఒకటి. ●

ఆకాశవాణిలో గోబెల్స్ విధానాలు

ఆకాశవాణిలో గోబెల్స్ విధానాలు

కంఠస్వరం ఆకాశవాణి మీద వార్తలు చదివే డిమెల్లోది కాని, ఆ స్వరాన్ని పలికించేది మాత్రం ఒక భారతీయ గోబెల్స్. జూలయి 29 (మంగళ వారం) నాడు నా ట్రాన్సిస్టర్ వింటున్నాను. డిమెల్లో గొంతుక సుసరించితంగానే ఉంది. మాటలు మాత్రం ఎవరో గోబెల్స్ శిష్యుడు రాసినట్లుగా ఉన్నాయి. అవి నిజమయితే భారతదేశంలోని ప్రజలంతా పధ్నాలుగు బాంకుల జాతీయకరణాన్ని ఏక కంఠంతో హర్షిస్తున్నారని నమ్మవలసి వచ్చేట్లుంది. జాతీయం అయిపోయిన బాంకులు ఎక్కడెక్కడ బాగా పని చేస్తున్నాయో నొక్కి చెప్పారు. శ్రీ జ్యోతి బాసు ఏలుతున్న పశ్చిమ బెంగాలులోకాదు, శ్రీ మొరార్జీదేశాయిగారి గుజరాత్‌లో.

ధైర్యం, సాహసం, సత్కార్యం

ప్రధానమంత్రి కార్యాలయానికి ప్రతిరోజూ లక్షలకొద్దీ టెలిగ్రామ్‌లు వస్తున్నాయట, బాంకుల జాతీయకరణాన్ని హర్షిస్తూ. అది ధైర్యసాహసాలతో కూడిన సత్కార్యంట. ప్రతిదినం కార్మికులు పూల మాలలతో ప్రధానమంత్రిగారి ఇంటికివెళ్ళి వారిని సత్కరిస్తున్నారుట. దేశానికొక గొప్ప నాయకులు ఉన్నందుకు హర్షిస్తున్నారుట.

జాతీయానికి లోనయిన ఉద్యోగులు తమ కృషి లోపం ఉండదని శపథం చేశారని శ్రీ డిమెల్లో చేత చెప్పించారు. ఇంతకిముునుపు స్టేట్‌బాంక్ ఆఫ్ ఇండియా ఏర్పడినప్పుడు ఆ సందర్భంలో ఉద్యోగులు ఈ విధంగా ఎందుకు శపథాలు చెయ్యలేదు? దానికి డిమెల్లోగారి పల్కింపులో సమాధానం దొరకదు

మేడమ్ గాంధిగారు ప్రధానమంత్రి కారను కోండి— వారేకనుక ఒక స్టేట్‌బాంక్‌కి వెళ్ళి చెక్ మార్చమని కోరితే ఎంతసేపు పడుతుంది? గంటసేపుకి తక్కువకాదని చెప్పవచ్చు. లాలా గుల్జారీ లాల్ నందాగారికి ఈ సంగతి తెలుసు.

అంతస్తుమీద మోజు

కొందరికి అంతస్తుమీద మోజు ఎక్కువ. వీలయినన్ని సారులు పెద్ద పదవులలో వారిని కలుస్తూ ఉంటారు. అందుకనే నేడు మేడమ్‌గాంధిగారిని అంతమందివచ్చి అభినందిస్తున్నారు. దేశంలో డబ్బులని (బాంకులలో) దాచుకున్నవారిని జూదరుల బారి నుంచి తప్పించినందుకు అభినందిస్తున్నారు.


మేడమ్ సుభద్రాజోషిగారు ఒక కమ్యూనిస్టుతో నివసిస్తున్నారు. వారి భావాలు మాత్రం అభ్యుదయ కాంగ్రెసువాదుల కోవకి చెందినవి. త్వరలో వీరు ఒక పెద్ద కార్మిక ప్రదర్శనని ఏర్పరుస్తారుట.

రూపాయిమారకం-బాంక్‌లు

శక్తినగర్ (న్యూఢిల్లీ)లో మేడమ్ జోషి ఇటీవలే ఒక ఉపన్యాసం ఇచ్చారు. శ్రోతలు అధికంగా ప్రాంతీయబ్లాక్ కాంగ్రెసు కమిటీవారు. ఈ ఉపన్యాసంలో ఆవిడ అన్నారు— బాంకులని జాతీయం చెయ్యటానికీ కమ్యూనిజానికీ సంబంధంలేదు, అని. రూపాయి మారకం విలువ తగ్గించినప్పుడు కూడా ఆమెగారు దానికీ విదేశాలు వేటికీ సంబంధం లేద న్నారు. తర్వాత, తర్వాత మారకం విలువ తగ్గింపు ప్రపంచబాంకు సూచనమీద (అమెరికన్ల సూచన మీద) జరిగినట్లు అందరూ అంగీకరించారు.

మేడమ్ గాంధిగారు కూడా పత్రికల విమర్శల పట్ల ఆశ్చర్యం ప్రకటించారు. దేశంలో 95శాతం ప్రజలు తమ కార్యక్రమాన్ని హర్షిస్తూ ఉంటే ఈ ధోరణి విపరీతంగా ఉందన్నట్లు మాట్లాడారు వారు.

1972లో తెలుస్తుంది, ఈ శాతం అసలు విలువ, 95 కన్నా ఎక్కువో, తక్కువో.



ఇటీవల ప్రపంచ యాత్ర చేస్తూ భారతదేశానికి వచ్చిన అమెరికా అధ్యక్షుడు శ్రీరిచర్డ్ ఎం. నిక్సన్‌తో ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ సంభాషణలు జరుపుతున్న దృశ్యం.

జాతీయ ముసల్మానులు

వెనుకటి రోజుల్లో జాతీయ ముసల్మాను లనే తెగ ఒకటి ఉండేది. ముసల్మానులలో అధికసంఖ్యాకులు కాంగ్రెసు పక్షమే ఉన్నారని వారు చాటేవారు. చివరికి దేశం రెండుగా చీలి పోయినందుకు బాధ్యులు కాంగ్రెసువారే అని ఆరోపించారు.

సిక్కిస్తాన్

సర్దార్ స్వరణసింగ్, గ్యానీగురుముఖసింగ్ ముసాఫిర్‌లు ఇద్దరూ సిక్కులందరూ కాంగ్రెసుపక్షమేనని వాదిస్తూ వచ్చారు. కేంద్రమంత్రి వర్గ సమావేశంలో సర్దార్ స్వరణసింగ్, పంజాబీ సుబా (లేక సిక్కిస్తాన్) కోసం ఓటు వేశారు.

శ్రీ కె. డి. మాలవీయా ఇటువంటి మాటలే చెపుతూ ఉంటారు కాని, దురదృష్టవశాత్తు, వారి మాటలని వారి నియోజక వర్గంవారే పట్టించుకున్నట్లు కనిపించదు; లేకపోయినట్లయితే రెండు సార్లు (ఒకసారి పండిత నెహ్రూ నియోజకవర్గం నుంచి) ఎన్నికలలో ఎందుకు ఓడిపోతారు?

ఇదంతా 95 శాతంలో ఒక భాగం. ఇక ఉద్యోగుల, పెటిగ్రాములు ఏర్పాటు చేసిన దెవరని పరిశీలిస్తే కమ్యూనిస్టులని తేలిపోతుంది.

బలం, కంగారు

ఈ వ్యవహారమంతా బలానికి చిహ్నమా, కంగరుకి చిహ్నమా? మేడమ్ గాంధిగారు పదవిలో ఉండటానికని దేనికయినా సిద్ధపడి ఉన్నారని కొందరు అంటున్నారు.

శ్రీ భగవత్‌అజాద్ మేడమ్ గాంధిగారి అనుచరులలో ఒకరు. ఆమెగారు ఇటీవలే శ్రీ ఎస్. కె. పాటల్ రోటరీ క్లబ్బు సమావేశంలో బాంక్‌ల జాతీయకరణాన్ని విమర్శించినందుకు కాంగ్రెసు అధ్యక్షులకి ఫిర్యాదు చేశారు కాని శ్రీ అజాద్ కక్కుతున్న నిప్పుల విషయాన్ని గురించి ఆలోచించినట్లు కనిపించదు.

మరొక జాతీయకరణం?

ఆగస్టు 15 వ తేదీ ప్రసంగంలో ప్రధానమంత్రిగారు ఎగుమతి దిగుమతి వ్యాపారాన్ని జాతీయం చెయ్యగలరని ఆశావాదులు అనుకుంటున్నారు.

ఇక కాంగ్రెసు సిండికేటు—వారిమధ్య కాల్పుల విరమణ తప్ప సంధి కుదరలేదు. మేడమ్ గాంధిగారు సిండికేట్‌ని నాశనం చెయ్యటానికి పూనుకున్నట్లున్నారు; సిండికేట్ ఆమెని నాశనం చెయ్యటానికి పూనుకున్నారు. అయితే, మేడమ్ గాంధిగారు అధికారంలో ఉన్నారు; సిండికేట్‌కి అధికార దాహం ఎక్కువ. అంతేకాక, శ్రీయుతులు దేశాయి, కామరాజులు కాంగ్రెసుని విరగకొట్టటానికి వెనుకాడవచ్చు. మేడమ్ గాంధిగారుమాత్రం ఈ విషయంలో తమ తాతగారిని పోలి ఉన్నారు. పండిత మోతిలాల్ నెహ్రూవలె కాంగ్రెసుని వదిలి వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నారు.


కాంగ్రెసు లేకుండా...

ఈ సందర్భంలో ఒకప్రశ్న ఉదయిస్తుంది. కాంగ్రెసు లేకుండా మేడమ్ గాంధిగారు అధికారంలో ఉండగలరా?

ఇదంతా వర్గ రాజకీయాలకి సంబంధించింది. అసలు విషయం —నెహ్రూకుమార్తె కాబట్టి ప్రధానమంత్రి అయిన మేడమ్‌గాంధి గారికి భారత దేశం పట్ల బాధ్యతలు లేవా?

(72 వ పేజీ చూడండి)

'మానవుడికి పెద్ద ముందడుగు'



జూలై 20వ తారీకున అమెరికా అధ్యక్షుడు శ్రీ నిక్సన్ తన నివాసంనుంచి చంద్రోపరితలంపై ఉన్న వ్యోమగాములు నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, ఎడ్విన్ ఆల్డ్రిన్‌తో టెలిఫోన్‌లో మాట్లాడుతున్న దృశ్యం. దీనిని "చరిత్రాత్మకమైన ఫోన్ కాల్"గా శ్రీ నిక్సన్ పేర్కొన్నారు.



చంద్రుడినుంచి భూమికి తిరిగివచ్చిన వ్యోమగాములు ధరించే దుస్తులు విసర్జించబడటం వల్ల, వారినుంచి భూమిపై ఉన్న ప్రాణికోటికి చంద్రమండలానికి సంబంధమైన వ్యాధులు వ్యాపించటం జరగదు.

ఎప్పటినుంచో ఎన్నో కథల్లో, కలల్లో ఎందరో చేసిన పనిని ఈ ఏడు ఇద్దరు అమెరికన్లు నిజంగా చేసేశారు! నెయిల్ ఆర్మ్‌స్ట్రాంగ్, ఎడ్విన్ ఆల్డ్రిన్‌లు చంద్రుడిమీద కాలుమోపి నడవగలిగారు. వారు చేసిన ఈ అద్భుతమయిన పనికి కావలసిన హంగులు కల్పించినవారిలో మొదటివాడు అనదగిన మైకేల్ కాలిన్స్ చంద్రమండలం చుట్టూ తిరుగుతూ వారికి అన్ని విధాలా సహాయపడ్డాడు. చంద్రమండలంమీద మానవుడి ముద్ర పడిందంటే ఆ గౌరవంలో భాగం కొందరు లక్షలాది ఇతర అమెరికా దేశస్థులతోబాటు, ఈ ముగ్గురికీ దక్కిందనాలి. ('నేను తప్పితే ప్రపంచంలో అందరూ దీన్ని టెలివిషన్‌మీద చూస్తారు!' అని సరదాగా అన్నాడుట కాలిన్స్)

చంద్రుడిమీద దిగిన ఆర్మ్‌స్ట్రాంగ్ అన్నాడు, 'ఇది మనిషికి చిన్న అడుగు, మానవుడికి పెద్ద ముందడుగు!' అని. వణుకుతున్న గొంతుకతో ఇంకా ఇలా అన్నాడు, 'నేల నునుపుగానే ఉంది. నీడలో చీకటిగా ఉంది... అడుగు వేసేచోటు బాగా కనిపించటం లేదు ... నేల సన్నటి పొడిగా ఉంది...(కాలి) బూటుతో తవ్వితే పడుతూ వస్తోంది ... బొగ్గు పొడిలాగా అంటుకుని ఉంటోంది...తవ్వటం అంత తేలికగా లేదు... యునైటెడ్ స్టేట్స్‌లో ఎడారిలాగా ఉంది కాని ప్రత్యేకమయిన అందం కూడా ఉంది. ఇక్కడ చాలా చక్కగా ఉంది...'

'ఇక్కడ (పెద్ద) రాళ్ళు కనబడుతున్నాయి' అన్నాడు ఆల్డ్రిన్. 'ఇక్కడ పావు అంగుళం కోసుకున్నా కనిపించటంలేదు...' చంద్రుడిమీదకి దిగిన నిమిషం కాళ్ళు 'తమకోలోకి దిగలేదని' చెప్పారు. ఒకచోట ఆల్డ్రిన్ అయిదంగుళాల లోతుకి తవ్వి శాంపిల్ తీసినప్పుడు 'తడిగా కనిపిస్తోం'దన్నాడు.

ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రుడిమీదకి దిగే సమయానికి సూర్యోదయం అయింది; చంద్రుడిమీద రాత్రిపగళ్ళు, ఒక్కొక్కటి సుమారు 14 రోజులు కొనసాగుతాయి. 'పగటి 250 డిగ్రీలు ఫారెన్‌హీట్; రాత్రి —280 డిగ్రీలు ఫారెన్‌హీట్'

చంద్రమండలంనుంచి అంతరిక్ష నౌకలు తీసుకువచ్చిన రాళ్ళు ఇంకా పూర్తిగా పరీక్ష చేయబడలేదు. [illegible] అవి భూమండలం [illegible] – గాని మనం [illegible] వచ్చే మార్పులలో – [illegible] ఇంకా ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు.


భారత్‌తో మామూలు సంబంధాలు
స్నేహ సంబంధాలు వద్దని ఎవరన్నారు?
పాత విధానం
క్రమ శిక్షణగా రాహిత్యమే కదా మీరు నేర్పింది?
బెంగాల్ పోలీస్
జ్యోతి బాసు
బ్యాంకుల జాతీయీకరణ మేలు చేస్తుందా స్వామీ?
రాజ తాంత్రికుల అధికారాన్ని ఎక్కువ చేస్తుంది!

తెలంగాణా ఉద్యమం - ఒక డైరీ

సేకరణ: పాలాక్షుడు

తెలంగాణా ఉద్యమం మొదలయి ఇప్పటికి ఏడునెలలు దాటింది! ఈ సంచిక 'భారత స్వాతంత్ర్య దినోత్సవ' సంచిక! ఈ సందర్భంలో తెలంగాణా ఉద్యమానికి సంబంధించిన కొన్ని ముఖ్య సంఘటనలని 'పాలాక్షుడు' సేకరించి పంపారు. వాటిని వరుసగా ప్రచురిస్తున్నాము

—సం॥

గురువారం 9—1—69

ఖమ్మంలో 8 వ తేదీ వుదయం విద్యార్థులు వూరేగింపు జరిపి, ఆంధ్ర నాయకులపై వ్యతిరేక నినాదాలు చేస్తూ తెలంగాణా ప్రయోజనాలకు భద్రత కలిగించాలని కోరారు. ఒక విద్యార్థి ఆంధ్ర ప్రదేశ్ తెలంగాణాను నిర్లక్ష్యం చేస్తున్నందుకు గాంధి విగ్రహంముందు అమరణ నిరాహారదీక్ష ప్రారంభించారు. మునిసిపల్ వైస్ చైర్మన్ శ్రీ కవిరాజమూర్తి కూడా సానుభూతిగా నిరాహార దీక్ష ప్రారంభించారు.

ఆదివారం 12—1—69.

తెలంగాణా ప్రజలకు రక్షణల కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులు మొన్న (10 th) రాత్రి ఒక ఆర్. టి. సి. బస్సును తగుల బెట్టారు. విద్యార్థులు బస్సును ఆపి, ప్రయాణికులను దిగిపొమ్మని చెప్పి, పెట్రోలు పోసి బస్సును తగుల బెట్టారు. అధికారులు యీ వార్తను ధ్రువీకరించలేదు.

ఆదివారం 12—1—69.

తెలంగాణా రక్షణకోసం సాగుతున్న వుద్యమ సందర్భంగా అధికారులు పట్టణంలో అమలు జరిపిన నిషేధాజ్ఞలను వుల్లంఘించి విద్యార్థులు (ఖమ్మంలో) వూరేగింపు జరిపారు ఆ వూరేగింపులో ముఖ్యమంత్రి చిత్రపటంతోపాటు శవ పేటికను పుచ్చుకుని వీధులలో తిరిగారు. తరువాత ఆ చిత్రపటాన్ని గడ్డి బొమ్మగల ఆ పేటికను అంత్యక్రియలతో తగుల బెట్టారు. ఇలాంటి ఆందోళనే నల్గొండ, కరీంనగర్, వరంగల్ జిల్లాలలో సాగించ దలచుకున్నట్లు తెలంగాణా రక్షణ సమితి ప్రతినిధి ఒకాయన చెప్పారు.

శుక్రవారం 17—1—69:

హైదరాబాదు జనవరి 16: నిన్న రాజధానిలో సమ్మె సందర్భంగా నగరంలోని ప్రతిపక్షాల నాయకులంతా విద్యార్థుల ఆందోళనలను సమర్థిస్తూ తెలంగాణా రక్షణలను అమలు చేయక పోవడానికి బాధ్యత ప్రభుత్వానిదీ, ప్రధానంగా తెలంగాణా మంత్రులదీ అని పేర్కొన్నారు. ఆందోళనలను దౌర్జన్యపూరితం చేయవద్దని విద్యార్థులకు వీరు విజ్ఞప్తి చేశారు. తెలంగాణాకు జరిగిన అన్యాయాన్ని నివారించడానికి తక్షణమే ప్రభుత్వం తగు చర్యలను తీసుకొనకపోతే భవిష్యత్తులో తాము తీసుకునే చర్యల గురించి తప్పక పరిశీలించవలసి వస్తుందని వీరు హెచ్చరించారు. కొంతమంది విద్యార్థులు విశ్వవిద్యాలయం నుంచి వూరేగింపుగా నిజాం కళాశాలకు వస్తూ దారిలో ఒక తెలంగాణా మంత్రి భవనానికి వెళ్ళి ఇంటి గోడకు మంత్రి పేరు వున్న బోర్డును విరగొట్టినట్లు తెలుస్తోంది.

శుక్రవారం 17—1—69

హైదరాబాద్ జనవరి 16· తెలంగాణా హక్కుల రక్షణకోసం నిన్న నిరవధిక సమ్మెను ప్రారంభించిన ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థుల నేడు బాహాటంగా చీలిపోయి, రెండు వర్గాలవారు రెండవ రోజు సమ్మెను కొనసాగించారు... విద్యార్థి వర్గం వూరేగింపుగా సచివాలయానికి వెళ్ళి అక్కడ సమావేశం జరిపి, ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సమావేశంలో ఉస్మానియా యూనివర్శిటీ విద్యార్థి సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ మల్లిఖార్జున, మరికొందరు నాయకులు ప్రసంగిస్తూ ప్రత్యేక తెలంగాణా కోసం తుదివరకూ పోరాడవలసి వుంటుందని, అందుకు ప్రాణత్యాగానికి కూడా విద్యార్థులు సిద్ధం కావాలని అన్నారు... కొత్తగూడెంలో పూర్తి హర్తాళ్ జరిగింది.... 20 సంవత్సరాల లోపు వయస్సు గల విద్యార్థులు మొన్న సాయంత్రం మొర్రేడు నదీ తీరాన కొత్తగూడెంలో ముఖ్యమంత్రి దిష్టి బొమ్మ తగుల బెట్టారు. "ఆంధ్రులారా: వెనక్కు పొండి. ముల్కీయేతరులారా వెళ్ళిపొండి. తెలంగాణా రక్షణ అమలు పరచాలి" అని వారు నినాదాలు చేశారు. పాల్వంచ ఎల్లెందులలో పత్రికల కట్టలు తగులబెట్టబడ్డాయి.

శనివారం 18—1—69.

ఖమ్మం జనవరి 17: తెలంగాణా వుద్యమం విద్యార్థి రవీంద్రనాథ్ దీక్షవల్లనే ప్రచారంలోకి వచ్చి, కేంద్రీకృత మయ్యింది. తెలంగాణాలో సర్కార్ ప్రాంతమని పిలవబడే ఖమ్మం జిల్లాలో యీ వుద్యమం ప్రారంభింపబడడం ఆశ్చర్యంగా ఉందన్నారు కొందరు. 4 నెలల క్రితం తెలంగాణా నిధులు ఆంధ్ర ప్రాంతానికి వినియోగపడుతున్నవని పత్రికా ప్రకటనల ద్వారా ఆందోళన ప్రారంభమయ్యింది. విద్యార్థులప్పుడు వూరేగింపు జరిపి కలెక్టరు వద్దకు రాయబారం వెళ్ళి విజ్ఞప్తులు అందచేశారు. ఆనక అంత తీవ్రంగా లేదు. ఈ నిరాహార దీక్ష ప్రారంభమవడానికి నిర్దిష్టమైన కారణమేమీ కనుపించదు. ఈ విద్యార్థి తలిదండ్రులు కూడా అసలు ఆంధ్ర ప్రాంతంవారే. విద్యార్థి కూడా ఆంధ్ర ప్రాంతంలోనే జన్మించాడు. సుమారు 15—20 ఏళ్ళుగా యిక్కడ వుంటున్నారు.

— విద్యార్థి ఎనిమిదవ తేదీన నిరాహారదీక్ష ప్రారంభించారు. ఆ రోజు సంఘటన ఏమీ లేదు. 9 వుదయం 20, 30 మంది పిల్లలు రైలు పెట్టెలో అలారం గొలుసులాగి, ప్రయాణికుల వద్ద విరాళాలు వసూలు చేశారు. నష్టం కలుగజేయలేదు. ఆ రాత్రి 8—30 గంటలకు వూరవతల ఒక బస్సును ఆపి, తగుల బెట్టారు. 10 వ తేదీరాత్రి ప్రశాంతంగానే గడిచింది. 11 వ కొందరు ప్లాంట్ప్రొటెక్షన్ వాను తగులబెట్టారు. 12 వ ప్రశాంతంగానే ఉండిపోయింది. 17 వ తేదీ పాల్వంచ, భద్రాచలం రోడ్డులో రాత్రి 7—30—8—00 లపుడు ఏలూరు డిపో నుండి భద్రాచలం బస్సును తగుల బెట్టారు. ఆ రాత్రి కొందరు కొత్తగూడెం థర్మల్ స్టేషను వుద్యోగస్తుల నివాస ప్రాంతంపై దాడిచేసి మంచినీటి గొట్టాలకు నష్టం కలిగించారు— అని కలెక్టరు పెంరాజా మాథూర్ ఆంధ్రపత్రిక ప్రతినిధితో మాట్లాడుతూ అన్నారు.

శనివారం 18—1—69·

హైదరాబాదు జనవరి 17: 14 వ తేదీన ఖమ్మంలో తెలంగాణా హక్కుల రక్షణ ఆందోళనదార్లు జిల్లా సాంఘిక సంక్షేమ కార్యాలయానికి చెందిన ఒక జీపును తగుల బెట్టారని అధికార రీత్యా వర్తమానం చేరింది. అధికారి నివాసగృహం వద్ద జీపు నిల్చి వుండగా యీ చర్య జరిగినట్లు పై వార్త పేర్కొన్నది.

శనివారం 18—1—69

కొత్తగూడెంలో ప్రదర్శకులు అక్కడికి వస్తున్న తెలుగు దినపత్రిక కట్టలను తీసుకుని ఆ పత్రికల పేరులోని 'ఆంధ్ర' పదంవరకు కాగితాన్ని కత్తిరించి పత్రికల కట్టలను ఏజంట్లకిచ్చేశారు. ఇక్కడికి 30 మైళ్ళ దూరంలోని ఎల్లందులో విద్యార్థులతో జరిగిన ఒక సంఘర్షణలో ఒక పోలీసు కానిస్టేబులు గాయపడ్డారు. ఆంధ్రప్రాంతం నుంచి వస్తున్న బస్సులను విద్యార్థులు ఆపి వేస్తున్నట్లు చెప్పబడుతోంది.

ఆదివారం 19—1—69

హైదరాబాదు: జనవరి 18కి సమ్మె చేస్తున్న ఉభయవర్గాల విద్యార్థులమధ్య నేటి మధ్యాహ్నం అబిడ్స్ జంక్షన్‌లో సంఘర్షణ జరిగినందువల్ల ఉభయవర్గాలనూ చెదరగొట్టడానికి పోలీసులు లాఠీ చార్జీ చేశారు. బాష్పవాయువును ప్రయోగించారు. ఒక ప్రయివేటు కారును తగులబెట్టే అగ్నిమాపక దళంవారొచ్చి మంటల నార్పారు. ఒక ప్రయివేటు కారును, రెండు ఆర్. టి. సి. బస్సులను పాడు చేసినట్టు సిటి పోలీసు ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ఉభయవర్గాల విద్యార్థులు కర్రలతో కొట్టుకున్నారట.

ఆదివారం 19—1—69

హైదరాబాదు, జనవరి 18: విద్యార్థుల్ని నేడు గార్లవద్ద విజయవాడ, సికింద్రాబాదు పాసింజరు రైలును ఎనిమిది నిముషాలు నిలుపు చేశారు. కేశముద్రంవద్ద 26 నిముషాలు నిలుపుచేశారు. విజయవాడ పాసింజరురైలును ఘనాపూర్ వద్ద 40 నిముషాలు నిలుపు చేశారు.

అబిడ్స్‌లో నేటి వుదయం జరిగిన విద్యార్థి సంఘటనలో ఒక సబిన్‌స్పెక్టరుతోపాటు 5గురు పోలీసులకు గాయాలయ్యాయి. అబిడ్‌వద్ద ఒకటి, గాంధిభవన్‌వద్ద ఒకటి— మొత్తం రెండు బస్సులు దెబ్బతిన్నాయి.

సోమవారం 20—1—69

హైదరాబాదు, 19: జమ్మికుంట రైల్వేస్టేషను వద్ద హైస్కూలు విద్యార్థులు గ్రాండ్‌ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌ను నిలుపుచేశారు. దానిపై పోస్టర్లు అంటించారు.

18న జరిగిన అల్లరులలో హైదరాబాద్‌లో 20 మందికి గాయాలు తగిలాయి. అసిస్టెంటు పోలీసు కమీషనర్‌తో సహా తొమ్మిదిమంది పోలీసులకు గాయాలు తగిలాయి.

సోమవారం 20—1—69

ఖమ్మం, 19 నిన్నరాత్రి ఇక్కడ విజయవాడ నుంచి పూరి వెళ్ళే రైలులో ఒకటవ తరగతిపెట్టెను ఎవరో కొందరు దుండగులు తగులబెట్టారు. బోనకల్లు స్టేషనులో ఎవరో కొందరు ఆ పెట్టెలోనే ఎక్కారట. ఖమ్మం స్టేషనువద్ద ఇన్నర్‌సిగ్నల్ ప్రాంతంలో అలారం గొలుసులాగి దిగిపోయారట. మొత్తం 2 వేల రూపాయలు నష్టం వచ్చి వుండవచ్చని అభిప్రాయపడుతున్నారు.

బుధవారం 22—1—69

హైదరాబాదు, 21: నిజాం కళాశాలలోపలున్న విద్యార్థులు బయటికివచ్చి అమలులో వున్న నిషేధాజ్ఞలను ఉల్లంఘించ ప్రయత్నం చేశారని, రోడ్డుమీదికి విపరీతంగా రాళ్ళు రువ్వుతున్నందువల్ల తప్పనిసరి అయి పోలీసులు భాష్పవాయువును ప్రయోగించినారని కళాశాల ఆవరణలోకే వెళ్ళి లాఠీ చార్జి చేయవలసి వచ్చిందని డి. సి. పి. సుబ్రహ్మణ్యం అన్నారు. బషీర్‌బాగ్‌లో రోడ్డుమీద పెట్రోలు పోశారని వెంటనే అసిస్టెంటు పోలీసుకమీషనర్ వెంకట్రావు వారిని చెదరగొట్టారనీ అన్నారాయన. **హైదర్‌గూడాలో వున్న కంపెనీల రిజిస్ట్రారు కార్యాలయంలోకి విద్యార్థులు వెళ్ళకుండా [illegible] వెళ్ళవలసి వచ్చిందని అన్నారు. ముగ్గురు సబ్‌ఇన్‌స్పెక్టర్లు, నలుగురు విద్యార్థులను ఆసుపత్రిలో చేర్పించుయుండవ్వారు.**

దారిపొడుగునా విద్యార్థులు రైలు పట్టాలపై తిష్టవేసి రైలు బండ్లను ఆపుతున్నందువల్ల గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌తోసహా అన్ని బండ్లూ ఆలస్యమవుతున్నవి. మహింబనగిరి రైల్వేస్టేషనువద్ద గ్రాండ్‌ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌ని గంటసేపు ఆపివేశారు. ఉప్పల్ స్టేషనునుంచి బయలుదేరలేకపోయింది. టెలి గ్రాఫ్‌తీగెలు తెంపివేయుటమె బహుశా కారణమై వుండొచ్చు. . . . వెయ్యిమంది విద్యార్థుల హైదరాబాద్, నాగపూర్ పాసింజరును 40 నిముషాలసేపు జనగాంవద్ద ఆపివేశారు. కొన్ని స్టేషనులలో రైల్వే సామగ్రి విద్యార్థులు పాడు చేశారు. టిక్కెట్లు లేకుండా రైళ్ళలో ప్రయాణాలు చేస్తూ, తెలంగాణా నిధి వసూలు చేస్తున్నారు . . 300 మంది విద్యార్థులు శంకరపల్లి రైల్వే స్టేషను భవనంమీద రాళ్ళు రువ్వారు. ఎలక్ట్రిక్ బల్బులు నాశనం చేశారు. నాగపూరు — హైదరాబాదు పాసింజరును 50 నిముషాలు ఘనావద్ద ఆపు చేశారు. . . . . నెం. 388 విజయవాడ—సికిందరాబాదు పాసింజరు బండి కప్లింగులు త్రెంచివేసారు. వార్ధానుంచి కాజీపేట వచ్చే రైలును జమ్మిగుంట రైల్వే స్టేషను అవుటర్‌సిగ్నల్ వద్ద 70 నిముషాలు ఆపివేశారు. విద్యార్థులు ఇంజను ముందుండే పెద్దబల్బును పగులకొట్టి, పెట్టెలో వున్న బల్బులనూ పగులకొట్టి హూస్ పైప్ సంబంధాలు తీసివేశారు. మద్రాసు— హైదరాబాదు ఎక్స్‌ప్రెస్ అలారం గొలుసు లాగినందువల్ల మధిరలో 3 నిముషాలు, ఖమ్మంలో 7 నిముషాలు, డోర్నకల్‌లో 13 నిముషాలు, గుండ్రాతిమెడు—మానుకోటల మధ్యలో 21 నిముషాలు ఆగిపోవలసి వచ్చింది.

గురువారం 23—1—69

తెలంగాణాలోని ఆంధ్ర వుద్యోగులు ఫిబ్రవరి 28లోగా తొలగింపు— ఉత్తర్వు అమలు విషయమై పర్యవేక్షణకు ఇద్దరు రెవెన్యూబోర్డు సభ్యుల నియామకం. తెలంగాణా మిగులునిధులు తేల్చేందుకు వారంరోజులలో ప్రత్యేకాధికారి రాక

పాల్వంచలో పోలీసు కాల్పులు భద్రాచలంలో ఎన్ సర్వీస్‌బంద్, భద్రాచలం జనవరి 22 థర్మల్ స్టేషనులో పని చేసు న్న ఆంధ్ర ఎని వారిని వెయ్యిమందిని వెంటనే తీసివేయాలన్న తెలంగాణా వారి ఆందోళనలతో పరిస్థితి విషమించి పోలీసులు లాటీచార్జీ చేసేవరకు వచ్చింది

కొత్తగూడెంలో తాలూకా కార్యాలయానికి విద్యార్థి ఆందోళనకారులు మొన్నరాత్రి నిప్పుపెట్టిన సందర్భంలో పోలీసులు స్వల్పంగా లాటిచార్జీ చేశారు. రైల్వే స్టేషనువద్ద విద్యార్థులు ఒక ఆర్. టి సి. బస్సుకు నిప్పుపెట్టారు. అగ్నిమాపక దళాలుతాలూకావద్ద, ఆర్ టి సి. బస్సువద్ద మంటలను అదుపులోకి తెచ్చాయి. నిన్న వుదయం ఆందోళనకారులు **ఆర్. టి. సి. బస్సులపైన, వాపీధిదీపాలపైన, రాళ్ళు [illegible] చార్జీ చేశారు. తర్వాత రువ్వడంవల్ల [illegible] ఆర్. టి. సి. బస్సులు దెబ్బ తిన్నాయి. ఆందోళనలో మహిళలు కూడా పాల్గొంటున్నారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులు సిరిపూర్ కాగజ్‌నగర్‌కు వెళ్ళవలసివున్న వాసాలతోనిండిన ఆరు పెట్టెలకు** నిప్పుపెట్టారు. అవి పూర్తి గా దగ్ధమైనాయి.

గురువారం 23—1—69

హైదరాబాదు 22 జనవరి: తెలంగాణాలో 1969 ఫిబ్రవరి 28 లోగా ఉద్యోగాల నుంచి తొలగించబడే నాన్‌ముల్కీ ఉద్యోగులు ఎంతమంది అనేది స్పష్టంగా తెలీకపోయినా, వారి సంఖ్య సుమారు 4000 వుంటుందనీ, అందులో 2500 మంది వుపాధ్యాయులున్నారనీ అంచనావేస్తున్నారు. వీరందరికీ ఆంధ్రప్రాంతంలో ఉద్యోగాలు చూపుతారు.

రవీంద్రనాథ్ జనవరి 22న నిరాహారదీక్షను విరమించారని రాజధానికి వచ్చిన వర్తమానం వల్ల తెలుస్తోంది.

విద్యార్థుల అల్లరుల మూలంగా సికిందరాబాదు —బొలారం మార్గంలో రైళ్ళను సురక్షితంగా నడపడం సాధ్యం కానందున వుదయాన వాటిని ఆపివేసినట్లు రైల్వే అధికారులు ప్రకటించారు.

ఖాజీపేట—విజయవాడ రైలును, విజయవాడ —సికిందరబాద్ రైలును గార్లవద్ద మహబూబాబాద్‌వద్ద, కేశముద్రంవద్ద ప్రదర్శకులు బళ్ళను ఆపు చేసి నిధులు వసూలు చేశారు.

జహీరాబాద్‌లో విద్యార్థులు పోలీసు స్టేషనుపై రాళ్ళురువ్వారు. దీనిని అదుపులోకి తేవడానికి పోలీసులు కాల్పులు సాగించారు.

శుక్రవారం 24—1—69

జనవరి 23 నుంచి తెలంగాణా అల్లరులకు నిరసనగా వెంకటేశ్వర, ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు సమ్మె ప్రారంభించనున్నారని విద్యార్థుల సంయుక్త కార్యాచరణ సంఘం అధ్యక్షుడు విజ్ఞప్తి చేశారు.


రాష్ట్ర మంత్రి వర్గంలో తెలంగాణా మంత్రులే అధిక సంఖ్యాకులున్నారని, హైదరాబాదు పదవులలో 70 శాతం తెలంగాణా వారే నిర్వహిస్తున్నారని, న్యాయమూర్తులలో 50 శాతం తెలంగాణా వారేనని, కొత్త భారీ పరిశ్రమలన్నింటిని తెలంగాణాలోనే నెలకొల్పుతున్నారని ఆయన అన్నారు.

ఆదివారం 26—1—69

ఆదిలాబాద్ జిల్లాలోని సరిపూర్-కాగజ్ నగర్‌లో గతశుక్రవారం నాడు తెలంగాణా ఆందోళనకారులు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన ఒక ఎక్స్‌ప్రెస్ బస్సును నిప్పంటించి తగుల బెట్టారని నిన్న ఇక్కడ పోలీసు ప్రధాన కార్యాలయానికి ఆలస్యంగా సమాచారం అందింది.

బుధవారం 29—1—69

హుజూర్ నగర్ మిరియాలగూడ కోదాడులోని నాగార్జున సాగర్ ప్రాజెక్టు సిబ్బంది 70కుటుం



తెలంగాణా ఉద్యమం

బాలవారిని నిన్న రాత్రి దౌర్జన్యంగా గెంటివేశారు. వారు జగ్గయ్యపేట క్లబ్బులోను, యస్. యస్. పి. కార్యాలయాలలోనూ తల దాచుకుంటున్నారు.

గురువారం 30—1—69.

హైదరాబాదు జనవరి .26: వరంగల్లులో ఒక బియ్యం మరను కొల్లగొట్టారు. ఒకసినిమా హాలుపై కూడా దాడి చేసినట్టు తెలియ వచ్చింది. కొన్నియిళ్ళు, కొన్ని దుకాణాలు కూడా తగుల బెట్టారు. ఇప్పుడు పరిస్థితి అదుపులో వున్నట్లు అధికారులు చెప్తున్నారు.

శుక్రవారం 31—1—69.

హైదరాబాదు, జనవరి30 ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆవరణలో నున్న రెండువిద్యార్థుల హాస్టళ్ళలో కనీసం 15 మంది ఆంధ్రవిద్యార్థులవున్న కొందరు దుండగులు నిన్న మధ్యాహ్నం ఆయావిద్యార్థుల గదుల బయట తగుల బెట్టారు. ఆ రూములకు చెందిన ఆంధ్ర విద్యార్థులు తమ మీద ఎట్టి అఘాయిత్యం జరుగుతుందోననే భయం వల్ల హాస్టళ్ళనుంచి వెళ్ళిపోయారు.

హాస్టళ్ళ నోటీసు బోర్డులో నిన్నవుదయం ఆంధ్ర విద్యార్థులందరూ ఇరవై నాలుగుగంటలలో ఖాళీచేసి వెళ్ళిపోవాలని తమకు కనిపించిందని, తరువాత కొంత సేపటికి ఎవరో దానిని చింపి వేశారని, హాస్టళ్ళకు పత్రికా ప్రతినిధులు వెళ్ళినప్పుడు వున్న విద్యార్థులు చెప్పారట.

జగ్గయ్యపేట, జనవరి 30· తెలంగాణాలోని కోదాడ, నల్గొండ, నడిగూడెం, పాలేరు, హుజూర్ నగర్, కాపుగల్లు, మిరియాలగూడ, గణపవరం ప్రాంతాల నుండి గత రెండు మూడు రోజుల గానుమారు వెయ్యిమంది యిక్కడికి వచ్చారు.

29 సాయంత్రం విజయవాడకు స్త్రీలు, పురుషులు, పిల్లలతో సహా 2000 మంది తెలంగాణా ప్రాంతంలో వివిధ జిల్లాలలోనుంచి తరలి వచ్చారు వీరిలో దాదాపు 800 మంది వరంగల్లు జిల్లా నుంచి వచ్చినట్లు తెలుస్తోంది. 2000లలో 1500 మంది ఎవరి గ్రామాలకు వారు వెళ్ళిపోగా 500 మంది మాత్రం స్టేషనులోనూ, బంధువుల యిళ్ళలోనూ వుంటున్నారు.

శనివారం 1—2—69:

గజ్వేలులో 30 వ తేదీ వుదయం నుంచి అల్లరి మూకల దుశ్చర్యలకు గురియై, ఏ మాత్రమూ భద్రతలులేని పరిస్థితులలో చిక్కుకుపోయిన గజ్వేల్‌బ్లాక్ డెవలప్‌మెంటు అధికారి శ్రీ మామిడిపూడి గోవిందరాఘవన్ కుటుంబం ఆత్మరక్షణ కోసం గోప్యంగా నిన్నరాత్రి హైదరాబాదుకు తరలి వచ్చారు. ఆంధ్రుడయిన యీ అధికారిని 24 గంటల సేపులో వూరు వదలి వెళ్ళిపొమ్మని గజ్వేలులో జిల్లా పరిషత్తు విద్యార్థులు వారి నివాస భవనం వద్ద దౌర్జన్యపూరితమైన ప్రదర్శనలు జరిపారు. అందులో 12 ఏళ్ళ విద్యార్థి ఒకడు మరణించాడు.

శ్రీ రాఘవన్‌కు 9 ఏళ్ళ కుమార్తె నాలుగేళ్ల కుమారుడు వున్నారు. శ్రీ రాఘవన్, ఆయన భార్య సత్యవతి, కుమార్తె, కుమారుడు ఇక్కడికి (హైదరాబాదు) కట్టుబట్టలతో ఇక్కడకువచ్చారు. వుద్యోగులు ఇంటిని చుట్టుముట్టి దౌర్జన్యం చేసినపుడింట్లో ఆయన లేరట. విద్యార్థులు యింటి మీద రాళ్ళువేసి కొట్టి తలుపులు పగుల గొట్టి లోపలకు చొరపడి, నానా బూతులూ తిట్టుతూ "మీ భర్త ఏడి, 24 గంటలలోగా వూరొదిలి పోవాలి" అని యిల్లంతా నాశనంచేసి, బయటున్న కారును రాళ్ళతో ఎప్పుపప్పుగా కొట్టారట. ప్రయివేటుకి వెళ్లిన ఆమెపిల్లలను తమ కప్పగించాలని నిర్బంధించారట. చివరకు పోలీసులు వచ్చి సహాయం చేశాక అంతా వెళ్ళిపోయి, మళ్ళీ నలుగురు నలుగురు గుంపుగుంపుగా వచ్చి నానా మాటలూ, దుర్భాషలూ ఆడనారంభించారని, తమ పిల్లలను హైదరాబాదు వెళుతున్న ఒక వైద్యునితో పంపించిందట మీద బట్టలు సామానులు వదేసి పంపించిందట.

ఉద్రిక్తులైన కొందరు విద్యార్థులు పోలీసు ఇనస్పెక్టరు ఇంటిలోనికి చొరబడి వస్తువులన్నీ బయటకు తెచ్చి కాల్చి పారేశారట. మరో యిద్దరు ముగ్గురు కానిస్టేబుళ్ళ యిళ్ళను కూడా నేల మట్టం చేశారట. అంతేగాక, పోలీసు స్టేషనును కూడా తగులపెట్టాలని ప్రయత్నించారట.

గజ్వేల్ సమితి అధ్యక్షుడు శ్రీ రంగారావు యీ సంఘటన జరిగినపుడు పక్క వూరిలో వున్నారట. విషయం తెలియగానే ఆయన హుటాహుటిని గజ్వేలు వచ్చారు. పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ నిన్న వుదయం సిద్దిపేట నుంచి కొందరు విద్యార్థులు గజ్వేల్ విద్యార్థులకు ఒక వ్యక్తిద్వారా గాజులు పంపించారని, మీరు సమ్మె జరుపలేరు కనుక గాజులు తొడుక్కోండి అని అతడిద్వారా కబురంపారని, దాంతో కోపోద్రిక్తులయిన విద్యార్థులు ప్రదర్శనలు జరిపారనీ ఆయనన్నారట.

కాలిన్న గాజు తలుపులు పగుల కొడుతున్నారు. హోస్ గొట్టాలను రైల్వే కప్లింగులను తప్పిస్తున్నారు.

ఆదివారం 2-2—69·

కరీంనగరంజిల్లా రామగుండం బొగ్గుగనుల ప్రాంతంలో గోదావరి గని కాలనీవద్ద ఇండ్లపై రాళ్లు విసురుతూ, గృహ దహనాలకూ, దోపిడీలకూ దిగిన సుమారు ఆరువేల మంది గుంపుపై పోలీసులు 1వ తేదీన కాల్పులు జరిపారు

శ్రీశైలం వద్ద ఒక ప్రాంతం కార్మికులకు మరో ప్రదేశం కార్మికుల మధ్య ఏర్పాటయిన ఘర్షణ పోలీసుల కాల్పులవరకూ తీసుకవెళ్లింది. ఈ కాల్పులలో యిద్దరు మరణించినట్లూ, ముగ్గురు గాయపడినట్లూ తెలిసినా, అసలు గాయపడిన వారిసంఖ్య ఇరువై తేలింది.



బ్లూ సీల్ టాల్క్

హెక్సక్లోరోఫీన్ కూడినది।

సాధారణ టాల్క్ ఇవ్వలేని హాయిని ఇస్తుంది...

శరీరానికి చమటవాసనను రానీయక రోజంతా నవనవలాడించే రక్ష



రక్ష: దీంట్లో చేరిన అమోఘమైన హెక్సక్లోరోఫీన్, చమటతో సూక్ష్మజీవుల విశ్లేషణంవల్లకల్గే శరీర దుర్గంధాన్ని నివారించి చర్మానికి రక్షనిస్తుంది...)

హాయి: చర్మాన్ని పట్టులా మృదువుగా నున్నగా వుంచి మనోహరమైన సువాసనతో పరిమళింపచేస్తూ హాయినిస్తుంది!

గమనించండి, బ్లూ సీల్ టాల్క్—ఏ యితర టాల్క్ ఇవ్వని చర్మరక్షణ నిచ్చి మనస్సుకు హాయినిస్తుంది—అనే మాటను నిలబెట్టుకుంటుంది!

హెక్సక్లోరోఫీన్ చేరిన

బ్లూ సీల్ టాల్క్

చీస్‌బ్రో-పాండ్స్ వారి మరో విశిష్టమైన తయారి)

చీస్‌బ్రో-పాండ్స్ ఇన్‌కార్పొరేటెడ్

(పరిమితమైన బాధ్యతతో యు.ఎస్.ఏలో స్థాపించబడినది)

తెలంగాణా ఉద్యమం

సోమవారం 3—2—69

వరంగల్లు, నల్లగొండ జిల్లాలలో ఆంధ్ర ఉద్యోగులపై దుండగులు జరిపిన దాడులు స్త్రీలను కూడా వదలిపెట్టలేదు. తరలి వచ్చినవారి నోటినుంచి వింటుంటే మానవులైన ఎవరైనా ఆవిధంగా వర్తిస్తారా అనిపించక మానదు. జన సంబంధశాఖకు చెందిన ఒక ఉద్యోగి కథనం ప్రకారం— ఆంధ్ర శబ్దం వినిపించిన ప్రతివారిమీదా దుండగులు దాడి చేశారని స్త్రీపురుష భేదం, వయోభేదం లేకుండా చేతికందిన వారిని బాదగొట్టారని, వారి సామానులన్నీ తగలేశారని చెప్పారు.

ఇక గోడలమీద అసభ్యకరమైన మాటలు రాశారు. చిత్రాలు గీశారు.

శనివారం 8—2—69:

ఈ ఉద్యమం సందర్భంలో రాష్ట్రంలో మొత్తం 1400 మంది అరెస్టయ్యారు. ఒక్క వరంగల్లు జిల్లాలోనే 363 మంది అరెస్టయినారు. ఉద్యమ సందర్భంగా జరిగిన కాల్పులవల్ల ఏడుగురు, జీపు ప్రమాదంవల్ల ఒకరు మరణించారు.

ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర నిర్మాణంవల్ల తాను ఎంతమాత్రమూ సుముఖుడను కానని, ఆనాంధ్ర అర్థరహితమైనదని కాంగ్రెసు అధ్యక్షుడు నిజలింగప్ప (బెంగుళూరులో) అన్నారు.

ఆదివారం 9—2—69.

రాష్ట్రంలో ప్రస్తుతం తెలంగాణా, ఆంధ్ర ప్రాంతాలలో చెలరేగుతున్న ప్రత్యేక తెలంగాణా, ఆంధ్రుల వాక్కుల రక్షణ అనే నినాదాలను తెలంగాణా ప్రాంతీయ సంఘ అధ్యక్షుడు జి. చొక్కారావు నిశితంగా ఖండించారు. ఆంధ్రలోనూ తెలంగాణాలోనూ ప్రస్తుతపు ఉద్యమాలు బయలుదేరిన అనంతరం మొట్టమొదటిసారిగా చేసిన ప్రకటనలో శ్రీ చొక్కారావు తమకు హామీ యివ్వబడిన రక్షణలను పూర్తిగా, సునిశ్చితంగా అమలు జరిపించడానికి ప్రాంతీయ సంఘం శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని హామీ యిచ్చారు.

సోమవారం 10—2—69

తెలంగాణా ప్రత్యేకావసరాలను ప్రభుత్వం తీరుస్తుందని, ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పడాలంటూ కొందరు లేవదీసిన నినాదాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి తీవ్రంగా ఖండించారు.

మంగళవారం 11—2—69.

వరంగల్ జిల్లాలో యిప్పటివరకూ తెలంగాణా ఉద్యమ సందర్భంలో 470 మంది అరెస్టయ్యారు. అల్లరులు ఎకువగా జరిగిన జిల్లాలలో ఇది ఒకటి. గృహ దహనాలు, దోపిడీ నేరాలను 238 మందిని, మిగతా వారిని ముందు జాగ్రత్తగాను అరెస్టు చేశారని అధికార రీత్యా తెలిసింది. ఒక్క వరంగల్ లోనే 321 మంది అరెస్టయినారు. ఇందులో 192 మందిని ప్రివెంటివ్ కస్టడీ

లోకి తీసుకున్నారు. తతిమా వారిని వివిధనేరాల క్రింద అరెస్టు చేశారు.

నల్లగుండలో డిప్యూటీ సర్వేయరు రంగాచార్యులు అనే ఆయనను సజీవంగా దహనం చేశారు. అయితే ఆనక యీ విషయం దర్యాప్తు చేస్తే కేవలం యిది తెలంగాణా సమస్యలో జరిగిన ఘోరంకాదని ఆయన పనిచేసే ఆఫీసులో వ్యక్తిగత తగాదాలేనని తేలిందట.

గురువారం 13—2—69

కోహిడ్, ఫిబ్రవరి 11: ఆంధ్ర సోదరుల భద్రతను, రక్షణను చూడవలసిన ఒంచ్యత ప్రతి తెలంగాణావానిపై వున్నదని, వివిధ ప్రజలమధ్య శాంతిని నిలబెట్టవలసిన బాధ్యత కూడా వారిమీద వుందని, బాధ్యత గల ప్రభుత్వం ఏదీ దుండగుల యథేచ్ఛ విధ్వంసాన్ని సహించజాలదని జనసంబంధ శాఖమంత్రి కొండాలక్ష్మణ్ బాపూజీ మాట్లాడుతూ అన్నారు.

శనివారం 15—2—69

పెళ్ళికొడుకు పెళ్ళికూతురు విద్య, వయోలావణ్యాలను చూసుకొని వివాహం చేసుకుని పెద్దల ఆశీర్వచనాలుబడసి, పన్నెండేళ్ళ దాంపత్య జీవితం గడిపిన తరువాత భార్య భర్తకు విడాకులిస్తానని ఏవో సాకులు చెపితే ఆర్ష సాంప్రదాయానికి చెందిన భర్తగాని, దేశ ప్రజలుగాని ఎలా హర్షించరో తెలంగాణా విడిపోవాలనే వాదనని కూడా అలాగే హర్షించరని మంత్రి శ్రీ జె. వి. నరసింగరావు (హైదరాబాదు) సచివాలయంలో పత్రికా విలేఖరులతో అన్నారు.

ఫజల్ ఆలీకమిషన్ నివేదిక వచ్చినప్పుడు తెలంగాణా అయిదేళ్ళపాటు విడిగావుంటే బాగుంటుందే మోననుకున్నవాడిలో నేనో ఒకడినే. అయితే తెలుగు జిల్లాలన్నీ, తెలుగుభాష మాట్లాడే వారంతా ఒకే రాష్ట్రంగా ఏర్పడితే భాషా రాష్ట్రంగానూ, దేశాభ్యుదయ కార్యక్రమంలోనూ, సర్వతోముఖ వికాసాన్ని పొందవచ్చునని నా అభిప్రాయాన్ని మార్చుకుని ఆంధ్రప్రదేశ్ ఏర్పడడం శ్రేయస్కరమే అనే భావానికి నేను మారాను అన్నారాయన.

ఏలూరులో శ్రీ వెంకట్రాజు (జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు) మాట్లాడుతూ, హక్కుల రక్షణ ఉద్యోగాలకు, వారి నిధుల ఖర్చుకూ సంబంధించినది. దీనికి అక్కడ భూమిని సాగుచేసి, అభివృద్ధిచేసి, బంగారు ఎంటలు పండిస్తున్న రైతులను, వర్తకం చేసుకునేవారిని, యంత్రాగారాలు నెలకొల్పుకున్న వారిని హింసించి, స్త్రీలను చెరపట్టి, ఆస్తులు తగులబెట్టి, వెళ్ళగొట్టడానికి సంబంధం ఏమిటి? భారతదేశంలో ఎవరికైనా, ఎక్కడ నివసించేందుకైనా అవకాశం వున్నదా? లేదా? ప్రభుత్వ నిధులు ఖర్చుగాక పోయినా, ఆంధ్ర నుండి అనేక మందివెళ్ళి వందలకొలదీ, వేలకొలదీ, కోట్లకొలదీ ఖర్చుచేసి, బంజరు భూములు సాగుచేసి, ఫ్యాక్టరీలు, యితర యంత్రాగారాలు, సినిమాలు వగైరాలు కట్టించి ఎంతో సహకారంచేశారు. అసలీ తగాదా అంతా మంత్రి పదవులకోసం కొందరు చేసిన కుతంత్రంలా కనబడుతోంది ఈ దారుణ హింసాకాండవలన నష్టపడిన వాళ్ళందరికి పూర్తి పరిహారం ప్రభుత్వం తెలంగాణా నిధులనుండి యివ్వాలి. ఈ విషయంలో ప్రభుత్వం

(72వ పేజీ చూడండి)

డాక్టర్ పై పేషంట్ దావా


ఉస్మాన్ సాహెబ్ అనే అతనికి మూత్రాశయానికి సంబంధించిన ఒక వ్యాధితో బాధపడుతున్నందు వల్ల గుల్బర్గా ఆసుపత్రిలో మార్చి 17న ఆపరేషను చేశారట. అయినా తగ్గనందు వల్ల తిరిగి ఏప్రియల్ 16న ఇంకో ఆపరేషను చేశారట. రెండో ఆపరేషను చేశాక కడుపులో నొప్పి కొత్తగా ఆరంభమయ్యిందట. దాంతో ఒక డాక్టరు సలహాతో ఎక్స్‌రే తీయించుకున్నాడట. పొట్టలో ఒక స్టీలు చమ్చావంటి—లేక సూది వంటి ఆయుధం వుందట. ఉస్మాన్ సాహెబ్ తనకు ఆపరేషన్ చేసిన డాక్టరు గారి మీద 16 వేలకు దావా వేశాడట. ఈ డాక్టరు గుల్బర్గా జనరల్ ఆసుపత్రి సర్జికల్ వార్డు డిపార్టుమెంటు హెడ్డట. ఆయనే గుల్బర్గా మెడికల్ కాలేజిలో కూడా సర్జికల్ డిపార్టుమెంటు హెడ్డట—


మనిషికి పులిపిల్ల!

తిరువళ్ళూరుకు చెందిన పుళ్ళరంపాలానికి చెందిన 17 ఏళ్ళ అమ్మాయి (వివాహిత) కి పుట్టిన పిల్ల పులిపిల్లలా వుందట. కాళ్ళు చేతులు, ముఖం అన్నీ పులి అవయవాలను పోలి వుండటమే గాక, పిల్ల ఏడిచినా పులి అరిచినట్టే వుందట. తల్లీ, పిల్లా (!) ఖులాసాగానే వున్నారట

65 మైళ్ళు-25 రోజులు

యమునా నగర్‌లో జూన్ 19 వ తేదీన బయలుదేరిన ఒక మనియార్డరు 65 మైళ్ళ దూరంలో వున్న చండీఘర్‌లో పంజాబ్ యూనివర్సిటీ రిజిస్ట్రారుకు చేరడానికి 25 రోజులు తీసుకుని 15 న చేరింది. ఏం చేరినందుకు ఆనందిస్తే పోలా!!





న్యూస్ పేపర్ లో వజ్రం

టోక్యోలో హిరోషియూమమోటో అనే 52 ఏళ్ళ ఆయన దినప్రతిక చదువుతుంటే ఒక పేజిలో కాగితం మీద ఒక బుడిపెలాటిది కన్పించిందట. ఇదేమిట్రా అని వేలుతోగోకి చూస్తే, ఆ బుడిపె లోపల ఓ వజ్రం వుందట. దీనిని 'న్యూసులో వజ్రం' అనే శీర్షికలో టోక్యోకి చెందిన 'దిస్ వీక్ ఇన్ టోక్యో' అనే పత్రిక రాసింది. ఈ వజ్రం దొరికిన హిరోషియా షిమోనోసకికు చెందినవారట.

* * *

జపాను రైలు ప్రయాణీకులు అందరూ రైళ్ళల్లో నిర్లక్ష్యంగా తమ తమ సామానులన్నీ వదిలేసి వెళుతుంటారట. రిస్టువాచీలు, ట్రాన్సిస్టర్లు వంటివి. గత పది ఏళ్ళ లెక్కలు చూస్తే, యీ రైళ్ళల్లో వదిలిన సరకుల ధర 8 నుంచి 27 శాతం పెరిగిందట—

పార్టీలోని టీ లో విషం

కురునిగల (సిలన్) అనే చోట ఒక పార్టీలో టీ తాగిన సిలన్ విద్యాశాఖమంత్రి ఇలియగోల అనే ఆయన టీ తాగడంతోనే కడుపులో తిప్పిందని ఆసుపత్రిని శరణు కోరారట. ఆయన తాగిన టీ లో విషం కలపబడినట్టు తేలిందట. ఆయన మాత్రం గండం దాటారు.

* * *

న్యూఢిల్లీ ఆర్గనయిసర్ పత్రికలో పడిన కథ—1962 చైనా దురాక్రమణ సందర్భంలో శ్రీమతి గాంధిగారు తమ బంగారు నగలన్నిటినీ జాతీయ రక్షణ నిధికి యిచ్చారని 'స్టేట్స్‌మన్' పత్రిక వార్త వేసింది. తర్వాత 1969 నాటికి శ్రీమతి గాంధి గారి వద్ద ఉన్న నగల ఖరీదు రు. 20,801 ఉన్నట్లు తెలిసిందట! ఈ వార్త 'ఆర్గనైజర్' వెయ్యగా శ్రీమతి గాంధి గారు నొచ్చుకున్నట్లు వారి మంత్రులలో ఒకరు చెప్పటమే కాక 'సవరణ' ఒకటి ఏర్పాటు చేస్తామన్నారుట. ఇంతలో ఆర్గనయిసర్‌కి తెలిసినది ఏమిటంటే శ్రీమతి గాంధిగారి నగల ఖరీదు రు, 20,801 కాదు రు. 73,000 ట! ఈ 73,000 రూపాయల విలువ శ్రీమతి గాంధి గారు వెలిబుచ్చిన వెల్త్ టాక్స్ (ఆస్తి మీద సుంకం) రిటర్న్‌లలో లేదుట !


ఆర్గనయిసర్ పత్రిక వేసే ప్రశ్న—1962 లో తమ నగలన్నిటినీ శ్రీమతి గాంధి ఇచ్చివేసినట్లయితే 20,000 రూపాయలవి ఎక్కడివి?!!

* * *

ఒక పెద్దమనిషి విమానంలో ఢిల్లీ నుంచి మద్రాసుకు వెడుతున్నారు — వారి కుటుంబంలో ఒక పెళ్లికిలేండి! వారితో బాటు ఒక సంచీ వస్తోంది. ఆ సంచీ పాలమ్ విమానాశ్రయంలో తెరుచుకుంది అందులో ఉన్న ఉల్లిపాయలు చిందర వందర అయ్యాయి. పెద్ద మనిషి కింద వుండే ఎ. డి. సి. లు వాటిని ఏరటం మొదలు పెట్టారు. ఎవరీ పెద్దమనిషి ? జవాబు వచ్చే వారం...

* * *

1968 వ సంవత్సరపు లెక్కల ప్రకారం ఇందిరాగాంధి గారి మనుష్యుల మీదఖర్చు కన్నా మొరార్జీ దేశాయ్‌గారి మనుష్యులమీద అధికంగా ఖర్చు అయ్యిందట. ఇందిరాగాంధిగారి 16 మంది పరివారం మీద 2,08,185 రూపాయలయితే మొరార్జీగారి 24 మంది మీద, 2,31,729 రూపాయ లయ్యిందట.



స్వగతాలు...



శ్రీ సంజీవరెడ్డి భారతదేశానికి అన్నివిధాలా తగిన రాష్ట్రపతి. శ్రీయుతులు ఎస్. కె. పాటిల్, మొరార్జీదేశాయిలు తమ సోషలిస్టు విధానాలద్వారా దేశానికీ, నాక్కూ ఎంతో హాని చేస్తున్నారు. నేను రిటైరయిపోయిన తర్వాత ఏభయికోట్ల రూపాయలకన్నా తక్కువ డిపాసిట్లు కల బాంకులో మంచి ఉద్యోగం తీసుకుని దేశసేవ చేస్తాను...



మద్యపాన నిషేధం ద్వారా పాపం ఎందరికో దాహం తీరటం లేదు! ఖాదీ వల్ల టెర్లిన్ షర్టుల వ్యాపారానికి దెబ్బ!! కుడి కమ్యూనిస్టుపార్టీలో చేరి త్వరలో మాస్కో తీర్థయాత్ర చేసుకుని రావాలి ... 'బ్లిట్స్' పత్రికలో ఖాళీ లేవయినా ఉంటే దరఖాస్తు పెట్టుకోవాలి. దరఖాస్తు రాసిపెట్టమని కాంతికి చెప్పనా?...



రాష్ట్రపతి భవన్ మంచి ఇల్లు కాదు! అక్కడ గాలి వాకెందుకో పడలేదు. గంజాంజిల్లా నీరు వంటికి చాలా మంచివి ... ఏమయినా సరే మేడమ్ గాంధీ చెప్పినట్లు చెయ్యటం మంచిదికాదు !, ఉల్లిపాయలు విమానంలో తీసుకువెళ్లడం కూడా మంచిది కాదు! విదూషకుడు, అనే మాటకి ఆ కుర్రవెధవ అర్థం అడిగాడెందుకబ్బా...



ముఖ్యమంత్రి పదవిని రద్దుచేసేస్తే బాగుంటుంది...లేదా, అందరూ ముఖ్యమంత్రులయినా బాగానే ఉంటుంది... అది వీలుకాకపోతే జిల్లాకొక ముఖ్యమంత్రి (అరె! మన జిల్లాకి ఒకరు చాలరు, కనీసం...) ముల్కీ సర్టిఫికేటు సంపాదించటం ఎలాగబ్బా ?...



బి. పి. సి. సి. వదిలేసి యు పి. సి. సి లో చేరితే బాగుంటుందిలాగుంది...శివసేన బెడదకూడా తగ్గుతుంది! సిండికేట్ ఇండికేట్‌ని సృష్టించింది... మేమూ ఒకప్పుడు కాశ్మీరు వాళ్లమేనంటారు కాని ప్రస్తుతం కుడి ఎడమ కమ్యూనిస్టు పార్టీలలో ఏదో ఒకదానిలో— వీలయితే రెండింటిలో — సభ్యత్వం తీసుకోవటం మంచిది...



బ్రహ్మానందరెడ్డిగారు నా ప్రాణమిత్రులు, శ్రేయోభిలాషి... వారికింత దూరంగా ఉండటం కష్టంగా ఉంది... భాగ్యనగరమే రాజమహేంద్రవరం అని నచ్చచెప్పుకుంటాను... మహా తెలంగాణా నామాంతరమే విశాలాంధ్ర...ఇంత ఎత్తుగోడమీద ఎవరూ ఏమీ రాయలేదేమిటీ...?


తెలంగాణా సమస్య

తెలంగాణా ఉద్యమం మొదలుపెట్టిన వారు తెలుగువారు కాకపోవచ్చు. కాని ఈ ఉద్యమం తెలుగువారే మొదలుపెట్టాలిసిన 'తెలుగువారు వేర్పాటు' అనే ఉద్యమంకాదు. ఇది తెలంగాణా ఉద్యమం. అంటే తెలంగాణా అనబడే ఈ ప్రాంతపు వారి ఉద్యమం. తెలంగాణాలో నివసించేది ఒక్క తెలుగువారేకాదు. అన్ని జాతులవారు ఉన్నారు. తెలంగాణాలోని తెలుగువారితో సహా అన్నిజాతులను అణగద్రొక్కి పాదాక్రాంతులను చేసుకో ప్రయత్నిస్తున్న ఆంధ్ర నాయకులను ప్రతిఘటించడానికి ఈ ప్రాంతపు ప్రతిపౌరునికీ హక్కుంది. అంతేగాని వాడు తెలుగువాడా, కాడా వాడికి తెలుగువచ్చా, రాదా అన్న సంకుచితభావము ఉండడం అసహ్యకరమైనది. ఒకడు కేరళీయుడని, ఒకడు తమిళుడని, మార్వాడని, ఇవేనా విశాలహృదయులమని ఘంటా బజాయించే మీ భావనలు?

కలిసిఉంటే కలదు సుఖం అని మున్ముందు అన్ని వర్గాలవారు ఆకస్మాత్తుగా ఉద్యమం ప్రారంభమైనప్పుడు అన్నా ఆ తరువాత ఆరునెల్లు యోచించి చితిపోతేనే మేలని అంతా అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయవర్గం తేల్చింది తెలంగాణావారు ఆంధ్రావారితో కల్సిఉంటే లాభమా? నష్టమా? ఈ పన్నెండేళ్ళుగా కలిసి ఉన్నందుకు ఫలితమేమిటో అవేగాని వేరేమీ కాదు.

ఉద్యమం విద్యార్థులే మొదలుపెట్టారు. అది క్రమంగా ప్రజాభిమానము చూరగొంది. అంటే ప్రజల్లోకూడ విడిపోవాలనే భావన, ఆంధ్రులంటే అయిష్టత, అంతరంతరాల్లో ఉన్నదన్నమాటే. హోటళ్లలో టిఫినుపెట్టిస్తే దినభత్యాలిస్తే జరిగిన ఉద్యమమైతే ఆరునెల్లుగా ఇది తెలంగాణాలోని నలుమూలలకూ చొచ్చుకుపోగలదా! ఇలా చొచ్చుకుపోయిందంటే దీనికి ప్రజాసహాయము, అభిమానము ఉందన్నమాటే గదా. భయస్తులు స్వతహాగా ఇష్టములేనివారు; కూలీ డబ్బుల కాశపడినవారు నడిపిన ఉద్యమం ఇంత తీవ్రతరం కాగలదా? ప్రభుత్వాన్ని స్తంభింపచేయగలదా? డబ్బిచ్చి అడిగినవారికి కార్లిచ్చి కొందరి నోర్లుమూయించి 'సమైక్యతా సంఘం' అని స్థాపించారుకదా. వారేమైన చేయగలిగారా ప్రభుత్వ నాయకుల సహాయ సహకారాలుండికూడా. స్వచ్ఛందంగా ప్రజలుజరిపే ఉద్యమంముందు ఇలాంటి సంఘాలు బలాదూరయినవంటే ఇది కూలిడబ్బులిచ్చి జరిపిన ఉద్యమం అని నమ్మగలరా? నిజం తెలంగాణా నాయకులు లూటీలు; దహనాలు, అత్యాచారాలు జరిపినని ఆదేశాలిస్తే ఈ పాటికి తెలంగాణాలో ఒక్క ఆంధ్రుడు కూడా లేకుండా పోయేవాడు కాదా. కుర్రకారు డబ్బులు పట్టుకొని తెలంగాణా ప్రజా సమితి ప్రెసిడెంటుకి జమచేశారు ఈ గడ్డమీద కనపడిన ప్రతిపౌరుణ్ణి అడిగారు గాని కేవలం ఆంధ్రులదగ్గరే వసూలు చేయలేదు. అసలు సిసలైన నాయకులంతా మీటింగుల్లోనూ, రేడియోల్లోనూ, వార్తాపత్రికల్లోనూ ప్రజలకు ఎంతో చెప్పిన అయినా ప్రజాభిప్రాయం అలాగే వుండగా జనం ఆంధ్రులేదో అఘాయిత్యం చేస్తున్నారంటే అటు మొగ్గడంటే అందులో అంతో ఇంతో సత్యం ఉందన్న మాటే గాదా. శాంతియుత సత్యాగ్రహాలు ముమ్మరంగా జరిగాయి. ప్రభుత్వం దౌర్జన్యముపయోగించడంతో వారూ అవి ఆపేసి దౌర్జన్యానికి దిగారు... తెలంగాణాలో తెలుగేతరులు ఎన్నడో స్థిరపడిపోయారు. వారంతా ఒకవేళ నిజంగా దమననీతి ననుకరిస్తే ఇప్పుడు ఆంధ్రుల సహవాసంముకున్న దానికంటే ఎక్కువ అసహ్యంచుకొని తరిమేసేవారు మరి అలా జరుగలేదంటే తెలుగేతరులంతా తెలుగువారితో కలిసిపోయారనే కదా! తెలుగేతరులవల్లే ఇక్కడి తెలుగువారు పైకి రాలేదని కదా మీ కన్నీరు. మీరు మదరాసులో కలిసి ఉన్నప్పుడు ఏమయింది ఈ ఆంధ్రప్రేమ? పోనీ జరిగింది జరుగకూడదని ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన పిదప ఏమైనా కట్టుదిట్టాలు చేశారా మీరు. అలా చేయకపోగా మూకుమ్మడిగా దొరికిందే ఛాన్సని దోచుకోవాలన్నట్టుగా ప్రవర్తించడం మంచిదేనా?

భాగ్యనగరం అంటూ ఆంధ్రలోని పరిశ్రమలేమన్నా ఇక్కడికి తరలించారా? వృద్ధి చెందుతున్న దేశంలో కొత్త పరిశ్రమలు అన్ని ప్రాంతాల్లోనూ స్థాపిస్తారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడినపిదప ఆంధ్రాలో



పరిశ్రమలు నెలకొనబడలేదా ?

కార్మికుల సంఖ్య పెరిగింది, కూలిరేటు పెరిగింది, అంతేగాదు ఆంధ్రులు ముమ్మరంగా తెలంగాణాకు రావటంకూడ జరిగింది. అంతేకాదు మేము రాకుంటే ఇక్కడివారు బ్రతకలేక పోదురు, అనిగదా మీరనేది. వెనకటికి ఎవతో నేను లేకుంటే ఎవరిని చేసుకునేవాడి వన్నాదట. ఇల్లు ఆక్రమించి ఇంటివారికి గంజి పోస్తున్నాననటం సబబేనా? హైద్రాబాద్ పెరిగింది, ద్రాక్షతోటలు ఫ్యాక్టరీలు పెరిగాయి. కాని తెలంగాణావారి ఉద్యోగావకాశాలు పెరగలేదు. కారణం '<u>మనవాడు కావాలనే</u>' మీ ప్రాంతీయుల సంకుచితపు కోరిక. మిద్దెలు, మేడలు పెరిగాయి. కాని మా జీవన ప్రమాణాలు పెరగలేదు. అంతేగాదు మా విశ్వవిద్యాలయాన్ని మురాతత్వాలకు, పార్టీ రాజకీయాలకు, పరస్పర ద్వేషాలకు ఉనికిపట్టుగా చేశారు మీ నాయకులు. ఇంత జరిగాక ఇప్పుడు మేము విడిపోతామంటే ఎటూ బలవంతులమని మానోరు మూయ ప్రయత్నించడం న్యాయం కాదు. ఒక్కవేళ మీరన్నట్లు తెలుగేతరులంతా తోడేళ్లే అయితే వారికే లదరు పుట్టించే ఆంధ్రులు అంతకంటే ఎక్కువకాదా? సోదరులం, ఒక తల్లి బిడ్డలం అన్న భావాలు నిజంగా మనలోఉంటే విడిపోయినాక కూడా ఆత్మీయతలు పెంచుకోవచ్చు. అంతేగాని కలిసిఉండి కయ్యాలు పెట్టుకుంటూ ఒకరినొకరు ఎద్దేవా చేసుకోవడము మంచిదికాదు. అయినా ఒక మాట... విడిపోతే మీకు నష్టమా? కావట్లయితే ఏ కలతలు లేకుండా విడిపోయి ప్రేమలు పెంచుకోవచ్చుగదా. విడిపోతే తెలుగు జాతికి ఏదో ముప్పునుకోవడము పొరపాటేమో. అది మన అభివృద్ధికి నాంది సూచకము అనుకొంటే అసహజమా!

—యస్. కృష్ణారెడ్డి.
(నిజామాబాదు.)

ప్రశ్నావళి

1. ఈ క్రింది వ్యక్తులు ఎవరు ?

అ. నీలం సంజీవరెడ్డి — 1. పాగోపాగోలో భారతదేశ ప్రతినిధి. 2. మాస్కోస్టు కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి. 3. రాష్ట్రపతి ఎన్నికలో కాంగ్రెసు అభ్యర్థి. 4. తమిళనాడు ముఖ్యమంత్రి.

ఆ. వరహాగిరి వెంకటగిరి — 1. గాంధి సిద్ధాంతాల ప్రథమ ప్రచారకుడు. 2. తాత్కాలిక రాష్ట్రపతి 3. రాష్ట్రపతి ఎన్నికలో —రా—థి అభ్యర్థి 4. స్పెయిన్ విదేశాంగ మంత్రి.

ఇ. ఇందిరానెహ్రూగాంధి — 1. ఆర్థికశాఖ మంత్రి 2. మహాత్మాగాంధి వారసులు 3. కుడి కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షులు 4. స్విట్జర్‌లాండ్ ప్రధానమంత్రి.

ఈ. జగజీవన్‌రామ్ — 1. అమెరికా సెక్రెటరీ ఆఫ్ స్టేట్ 2. ఆహారశాఖ మంత్రి, 3 కాశీవిద్యాపీఠ్‌లో జర్మన్ ఉపాధ్యాయులు 4. కన్యాశుల్కంలో కరటక శాస్త్రి వేషం వెయ్యగలిగిన మహానటుడు.

ఉ. మొరార్జీ దేశాయి — 1. కాంతిలాల్‌దేశాయి కుమారుడు 2. మద్యపాన నిషేధం ఉద్యమం వాలంటీరు 3 టాస్ వార్తాసంస్థ సంపాదకుడు. 4. గుజరాత్ నుంచి ఎన్నిక అయిన పార్లమెంటు సభ్యుడు.

2. ఈ క్రింది ఊర్లు ఎక్కడ ఉన్నాయి ?

అ హైద్రాబాదు — 1 రాజస్థాన్ 2. ఆంధ్రప్రదేశ్ 3 తెలంగాణా 4 ఉత్తరప్రదేశ్

ఆ. న్యూఢిల్లీ — 1. అమెరికా సంయుక్త రాష్ట్రాలు 2. నయిజీరియా, 3 భారతదేశం 4. ట్రకమూకాస్.

ఇ బెంగుళూరు — 1. ఎస్ కె పాటిల్ జేబు 2 మైసూరు రాష్ట్రం 3. శ్రీ చవాన్ రాయబోయే ఆత్మకథ 4. ఉత్తరధ్రువం.

ఈ భద్రాచలం — 1. ఆంధ్రప్రదేశ్ 2 సర్కార్ 3. తెలంగాణా 4. రాయలసీమ.

ఉ. కేప్‌కెన్నెడీ — 1. తెలంగాణా 2. ఆంధ్ర 3. న్యూఢిల్లీ 4. ఫ్లారిడా రాష్ట్రంలో.

3. ఈ క్రింది సంఘటనలు జరిగిన సంవత్సరాలు.

అ చంద్రలోకంమీద మానవుడు — 1. 1773 2. 1857 3. 1969 4. 1441

ఆ ప్రాంతీయోద్యమంలో ఒక ప్రభుత్వోద్యోగి సజీవ దహనం — 1. 303 2. 1391 3. 2112 4. 1969.


ఇ. అలాస్కా అమెరికా సంయుక్త రాష్ట్రాలలో 49 వ రాష్ట్రంగా చేరిన సంవత్సరం — 1. 1774 2. 3416 3. 1959 4. 1564.

ఈ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన సంవత్సరం — 1. 1953 2. 1969 3. 1956 4. 1947

ఉ. విశాలాంధ్ర రాష్ట్రంలో విశాల మంత్రివర్గ నిర్మాణం జరిగిన సంవత్సరం — 1. 1793 2. 1956 3. 1953 4. 1969.

ఈ ప్రశ్నావళికి సరయిన సమాధానావళి లేదు : చదివే వారికి తోచిన జవాబులు వారే ఇచ్చుకోవచ్చు — అన్నిటికీ నిండు మార్కులే :

పరివేష్టం



సీరియల్

శిఖా వెంకటరమణ

2

బాల్యం చాలా చిత్రమైనది. ఆ వయసులో యెవరికి వాళ్లే తాము సర్వస్వతంత్రులైనట్లూ, మరొకరికి తలవంచాల్సిన అవసరం లేనట్లూ ప్రవర్తిస్తారు. అప్పుడే యిరుగుపొరుగులతోనో సాటి పిల్లలతోనో యథేచ్ఛగా స్నేహంచేసి మమతలు పెంచుకుని తమకు మరి యెదురే లేనట్లు గడుపుతారు. కొన్నిసార్లు ఈ స్నేహాలు పెరిగి పెంపొందే అవకాశం వుంటుంది. మరికొన్నిసార్లు నామరూపాలు సైతం గుర్తుకు లేనంతకాలపు పరుగుల యిరుసుల్లోపడి నలిగిపోతుంది. విధి యెంతో క్రూరంగా మనుష్యుల్ని మమతల్ని చీల్చేస్తుంటే ప్రేక్షకులమాదిరి చూడడం తప్ప చేయగలిగేది వుండదు. అలాంటప్పుడు సరిగ్గా అటువంటి అవస్థే రాజశేఖరానికి యెదురైంది. భార్యతోనూ, గిరిధర్ దంపతులతోనూ అతను విషయం చెప్పినప్పుడు ఆ బాధని వాళ్లుకూడా పంచుకున్నారు.

చిరకాలంగా తాము పెంచుకుని యెపుగా వృద్ధి అయేందుకు నాటుకున్న మమతల మొలక నొకటి పెకిలించి వేయబడుతోందన్న విషయం జయా, సాంబశివం గ్రహించలేక పోయేరు. జయ మామూలుగా అమ్మవారి గుడివెనుక ఆటకోసం ప్రత్యేకం నాఖరు శాంతారావుచేత పందిర వేయించుకున్న చోటికి పరిగెత్తుకు వచ్చింది. చుట్టూ పెగ్గురుపొదలతో యెవరికీ కనిపించని ప్రదేశంలో సాంబశివం చెక్కిట చేయిజేర్చి విచార సముద్రంలో మునిగిపోయి శూన్యంలోకి చూస్తూ కూర్చున్నాడు. జయ అతనివాలకం చూసి కొంచెం జంకింది. తరువాత అతని వెనుకగావచ్చి భుజాల చుట్టూ చేతులువేసి 'మేము చాలాదూరం వెళ్లిపోతున్నాం సాంబూ రైలెక్కి, లాంచీ యెక్కి యెంతోదూరం వెళ్లాలని నాన్నగారన్నారు' అన్నది.

సాంబశివం పలకలేదు.

'నువ్వూ వస్తే యెంతో బావుంటుంది కదు సాంబూ'

అప్పటికీ అతను మాట్లాడలేదు.

'ఛ! నువ్వలా మాట్లాడకుండావుంటే నాకు యేడుపు వస్తుంది. మాట్లాడు సాంబూ'

'ఛ! ఛ! రైలెక్కి వెడుతున్నాను అని గొప్పగా చెప్పేందుకు వచ్చేవు. మనం యెంత సావాసం చేశాం. నువ్వు వుండిపో. నేనెలా వస్తాను నీతో' సాంబశివం విసురుగా చేతులు దూరంగా తోసేశాడు.

జయ కళ్లు పెద్దవిచేసుకుని చూస్తూ: 'మేం మళ్లీ వచ్చేస్తాంగా. నాన్నగారు చెప్పేరు అలాగని' అన్నది.

సాంబశివం అక్కసు వెళ్లగక్కేడు: 'అంతా అబద్ధం అక్కడ మీ తాతగారు పొలాలుకొని మీ అమ్మపేరరాసి చచ్చిపోయేరుట. మీరు గొప్పవాళ్లయి పోయేరు. అక్కడేవుండి వాటిని చూసుకుంటూ ప్రాక్టీసు చేస్తానని చెప్పేరుట మీ నాన్న'

'అయితే మరెప్పుడూ యిక్కడికిరామా మేము'

'యేమో నాకేంతెలుసు?'

'మీ అమ్మ చెప్పలేదా,

'మా అమ్మా నాన్నగారూ యింతే అనుకుంటూంటే విన్నాను. నువ్వు వుండిపో జయా' సాంబశివం పసిహృదయం పదునైన చాకుతో పరపర లాడిస్తున్నట్లు బాధపడ సాగింది.

'నేనా...మరి అమ్మా నాన్నా' జయ సంశయంగా అడిగింది.

'వాళ్లు వెళ్లిపోతారు. మనం యిద్దరం కలిసి చదువుకుందాం. నిన్ను మాయింట్లో వుంచుకోమని నాన్నగారితో నేను చెబుతానుగా' చెంపలమీద కన్నీటిని తుడుచుకుంటూ ధైర్యం చెబుతున్న వాడిలా అన్నాడు సాంబశివం.

జయ క్షణం లోచించి! 'అలాగేచేయి సాంబూ. మనం మీ యింట్లో చదువు

కుందాం. యిక్కడే ఆడుకుందాం నేను అక్కడికి వెళ్ళనే వెళ్ళను. ఒట్టు. నువ్వు యేడవకు మరి' అన్నది.

పసివాళ్ళ ప్రమాణాలు నిలవలేదు. నీటిమీద వ్రాతల్లా తేలితేలి పోసాగాయి. రాఘవేంద్రరావుగారు వున్నడబ్బంతా ఖర్చు చేసి పశివేటిపల్లిలో పొలాలుకొని వంశాంకురం లేనికారణంగా మొత్తంగా రమపేరు మీద వ్రాసి చివరిదశలోకూడా పంతం సడలించుకోకుండా, దగ్గర కూతురులేకుండానే కళ్ళుమూశారు. రమ కన్నీరుని గుండెల్లో దాచుకుని భర్తవెనుకే ప్రయాణమైంది. జయ తనమాట తెలుస్తుందని వెర్రి అపోహ పడింది. సాంబశివం జయమీది గట్టి నమ్మకంతో వున్నాడు. సామానంతా సర్దేసి లారీల్లో పంపేయబడుతూంటే అమ్మవారి గుడిపక్క ఆటస్థలంలో యిద్దరూ కలుసుకుని ఒకరికొకరు ధైర్యం చెప్పుకున్నారు. ఒకళ్లదుఃఖాన్ని మరొకళ్లు అర్థం చేసుకున్నవాళ్ల మాదిరిగా ఓదార్చుకున్నారు. విధి ఊరుకుని ఆశీర్వదించలేక పోయింది. అంతే.

ప్లాట్‌ఫారంమీద తనూ వెడతానని యేడుస్తూ స్టేషనంతా ఒక్కటి చేయడం



పరిలిప్తం

(ప్రారంభించేడు. లేత హృదయాల్లో బాకులు దూర్చినట్లయింది. జయ చేతులు చాపి పొంబళిపంక్తోసం అంతకంతక్కు అధిగ మిస్తున్న రైల్లోంచి యించుమించు క్రిందికి దూకే ప్రయత్నం చేస్తోంది. తల్లితండ్రులు యెంత వారించినా వినడం లేదు. మంచి బొమ్మలు, ఖరీదైన ఆట వస్తువులూ యివియేవీ ఆ పిల్లని మదుపు లోకి తేవడంలేదు.


మర్నాడు కనుమాపువేళ రాజశేఖరం సఖినేటిపల్లి చేరుకున్నాడు దాదాపు కొన్ని గంటలు చేసిన ఈ ప్రయాణంలో జయలో యేమాత్రం మార్పు రాలేదు. రైలు దిగడం, రాజమండ్రీలో లాంచీ యెక్కడం, బొబ్బర్లంకలో దిగి బస్సు యెక్కడం మధ్య మధ్య సుష్టుగా తినడం మళ్లీ ప్రయాణం చేయడం యివి కూడా చిన్నారి జయని కదిలించలేదు. రైలు యెక్కి మళ్లీ గృహప్రాంగణంలో అడుగు పెట్టేవరకూ ఆకాశంలోకి చూస్తూనేవుంది. మధ్యలో తల్లీ తండ్రీ పలకరించినా పెట్టుగా సమాధానం యిచ్చింది. పదేళ్లు అయినా నిండని ఆ పసిదాని మనసు ముక్కలై పోయింది. చెంపలమీద కారే కన్నీటికి చారలు కట్టేయి. మొహం రాత్రి నిద్ర లేక పోవడంవల్ల వాచిపోయింది. అయినా వెర్రిదానిలా తండ్రివైపు తిరిగి చీకట్లో ప్రశ్నవేసింది. పల్లెటూరిలో కరెంటు దీపాలు వెలుగు నివ్వలేక పోయినట్లే తండ్రి సమాధానం ఆ కటిక చీకట్లో జయ మనసుని వూరట పరచలేక పోయేయి. 'ఇప్పుడిప్పుడే వెళ్లం తల్లీ. తరువాత వెడతాం.'

అరుగుమీద కూర్చుని చిన్నగా నిట్టూర్చింది జయ. జయ పుట్టి, బుద్ధి యెరిగాక మొదటిసారిగా మేనత్త యింట అడుగు పెట్టింది బండిదిగిన తమ్ముడినీ, మరదల్నీ, మేనకోడల్నీ ఆదరంగా అహ్వానించింది మనోరమ. చిన్నప్పుడు పుట్టి పెరిగి కొంతకాలం పొట్ట చేతో పట్టుకు వెళ్లిపోయినా కోర్టులో నెగ్గిన కారణంగా దాయాదుల దగ్గరనుంచి రాజశేఖరానికి యీ యిల్లు దక్కింది. అతను నగరంలో వుంటూ ఆ యింటిని అక్కగారు వుండేందుకు యిచ్చేశాడు. అతను మామగారి పట్టుదల చెబుతూ, ఆస్తి పొస్తులని తనపేర వ్రాసిన విషయాన్ని ప్రస్తావిస్తూ వ్యవసాయమే తెలియని తనకి చేదోడు వాదోడుగా వుండమనీ, మరోవైపుకి చీలిపోవద్దనీ బావగారిని బతిమాలుకున్నాడు. ముందుగేటువైపు రోడ్డూ, వెనుక పెరటి గుమ్మంవైపు పంటకాలువా మధ్య ప్రశాంతిని మూట గట్టుకున్న శాంతినిలయంలా తోచింది రాజశేఖరం ప్రాణానికి. తమ్ముడికి అత్యంత ప్రీతికరమైన పెసరపప్పూ మామిడికాయ పచ్చడిచేసి విస్తట్లోవేసి ద్వారం పక్కనే నిలబడిపోయింది మనోరమ. రాజశేఖరం అత్యంత ప్రేమగా బావగారితో మాట్లాడుతూ తలదించుకుని భోజనంచేస్తున్నాడు. మనోరమ బుర్రవొంచుకుని మారు అడుగుతున్న అతన్ని చూసి సిగ్గుపడింది కూడా. విశ్వనాథం అన్నాడు. 'చూడు బావా! నువ్వు పట్నంలో చదివి అక్కడి అలవాట్లని జీర్ణం చేసుకున్న మనిషివి. నీకీ పల్లెటూరి పేదవాళ్ల పచ్చళ్లు నచ్చుతాయనుకోను కుచేలుడింటికే శ్రీకృష్ణ పరమాత్మ వచ్చినట్లుగా అనిపిస్తోంది.'

రాజశేఖరం తలెత్తి అక్కవైపూ బావవైపూ క్షణం పరీక్షగా చూశాడు. ఒక్కగా నొక్క కొడుకుని కన్న మనోరమ లేమివల్ల చాలా పలచగా రోగిష్టిదానికి మల్లే కనిపించింది. చిరిగిన చీరలో అనేక కుట్లు కనిపిస్తున్నాయి. హరికేన్‌లాంతర్ నీడ ఆ చీర చెరగుల్లో దాగిన చిరుగుల్ని బాహాటంగా కనిపించేట్లు చేస్తోంది. స్వాభిమానంగల ఆ యువతి కన్నవారు లక్షాధికార్లే అయినా తన కష్టాన్ని వెల్లడి చేయలేక పోయింది. రాజశేఖరం కళ్లు చెమర్చాయి. 'తను...యింత చదివిన తను తోడబుట్టిన అక్కగారిని అర్థం చేసుకోలేక పోయేడు.' అతని అంతరంగం బాధగా మూల్గింది. భోజనం చేస్తుండగా మనోరమ కొడుకు అయిదేళ్ల అవతల స్నేహితుడింటినుంచి చదువుకుని యిల్లు చేరుకున్నాడు. పుట్టి యింత వాడైనా వాడికి తల్లితరపు బంధువులెవరో తెలియదు. అడుగులో అడుగు వేసుకుంటూ తల్లి కొంగులో దూరి ఆగిపోయి అప్పుడు అడిగేడు: 'యెవరమ్మా వీళ్లంతా' అని. మనోరమ చెప్పింది.

రాజశేఖరం మేనల్లుడిని పిలిచి 'నీ పేరేమిటోయ్', అని అడిగాడు.

'కాళిదాసు' అన్నాడు మేనమామని యెగాదిగా చూస్తూ. ఆ పక్కనే వున్న జయ అతని చూపుల్ని ఆకర్షించింది. బెరుకు లేకుండా అటుపక్కకు వెళ్లి ఆ పిల్ల భుజంమీద చేయివేసి 'నీపేరు' అని ప్రశ్నించేడు. జయ వచ్చి కూర్చోవడం



ఎవరూ గమనించనేలేదు.

జయ మాట్లాడలేదు. కాళిదాసు ఋరిచమించు సాంబశివం అంతే వున్నాడు. అతని మాదిరిగానే చిందరవందరగా క్రాపు దువ్వుకున్నాడు. పోతే చామన ఛాయలో కొద్దిగా దృఢం అయిన శరీరంతో మిసమిస లాడుతున్నాడు. జయ చేతిలో స్నేహపూర్వకంగా చేయివేసి 'నీపేరు గొప్పేవుకాదు', అన్నాడు. జయ అతని మొహంలోకి తేరపారి చూసింది. నిజానికి ఆ వయసులో పిల్లలకి అంత నోరిమి వుండడం జయ మనసు దానిని నిర్వచించలేక పోయినా 'ఇదే మా స్కూల్లో అడిగిన వెంటనే పేరు చెప్పక పోతె తిట్టకుండా ఊరుకోరు!' అనుకో సాగింది. సాంబశివం తప్పు చేసినపుడు తను సమర్థించినా, తను చేసిన తప్పుని సాంబశివం యెత్తి చూపించి మొట్టికాయలు మొట్టేవాడు. ఇప్పుడేడీ ఆ సాంబశివం? రెండు మూడు వందలమైళ్ళదూరంలో నిశ్శబ్దంగా అవిరామంగా యేడుస్తున్న ఆ పిల్లసంగతి యెలా తెలుస్తుంది? చిన్ననాటి చెలిమిని బలిమి చేసే సాధనం ఒక్కటె అనుకుంటే పరిస్థితులూ కాలం, దైవం యివన్నీ కలిసి వచ్చి అనుకూలించవద్దూ. చిన్నారి జయ వయసుని అంచనావేసి చూసుకని 'ఓహో' అనుకుని తేలికగా కొట్టిపారేస్తేగానీ దానికో నిర్వచనం చూపించి జాలిగా ఓదార్పుమాట ఒకటి చెవిన వేయరేం? జయ ఆరాత్రి భోజనం చేయలేదు.

రమ ఖస్సుమన్నది: 'చూడండి వదినా! నిన్న ప్రొద్దుట సాంబశివంతో తిన్నతిండి. ఇంతవరకూ మంచినీళ్ళు ముట్టలేదు. ఇప్పటినుంచీ ఈ పట్టుదలలు యెంత వరకూ పనికివస్తయంటారు?'

మనోరమ ప్రశ్నార్థకంగా చూసింది.

రాజశేఖరం అప్పటికి బావగారితో భోజనం ముగించి చేతులు కడుక్కుని ఆరు బయట మంచంమీద ప్రయాణపు బడలికతో మేనువాల్చేడు. విశ్వనాథం కబుర్లు చెబుతూంటే 'వూఁ' కొడుతున్నాడు. అతనికి క్రమంగా సఖినేటిపల్లి యెలాగో ఒకవిధంగా వదిలేసి అమలాపురంలో ప్రాక్టీసుపెట్టుకోవాలనీ యిల్లు దొరకని పక్షంలో బండార్లంకలో యిల్లు క్షణాల మీద కట్టించాలనీ కోరికగా వుంది. ఈ విషయమే వీలుచూసుకుని బావగారి చెవిన వేయాలని అతని వుద్దేశ్యం.

రమ నెమ్మదిగా చెబుతోంది: 'సాంబశివం స్నేహితుడి కొడుకు వదినా. జానకీ వేమా చదివిన కాలేజిలోనే ఇంటర్ చదువు మగవాళ్ళుకూడా చదువుతున్నారు. యెదురెదురు యిళ్ళల్లో వుండేవారం. మొద



టోన్లనే వీళ్ళ తమ్ముడితో చెప్పేను. ఆయన విన్నారుకాదు. యిప్పుడు యిలా చీలి పోయేం. అది యేడుస్తూంటే అర్థంచేసు కోరుకదా ఖర్మ. యిదంతా వాళ్ళ నాన్న తప్పిదం.'

మనోరమ రెండుచేతులూ చాపింది జయవైపు చూస్తూ. మనోరమ కళ్ళల్లో కోటిదీపాలు వెలుగుతూ కనిపించేయి. జయ మరోసారి మరోసారి చూసింది.

'రా తల్లీ. మనం హైదరాబాదు వెళ్ళి పోదాం. యిప్పుడు లక్కుడంతా సెలవలకి వూరికి వెళ్ళిపోయేరు. స్కూళ్ళుతెరిచాక అందరం కలిసి వెళ్ళిపోదాం. సాంబశివాన్ని మా కాళిదాసుకి చూపిస్తాను.'

మనోరమ మాటల్లో సాంబశివం ప్రస్తావన లేనిపోనిల మాదిరి వినవచ్చింది. జయ కడుపులో అప్పటికే గగ్గోలు ప్రారంభం అయింది. అరుస్తున్న పేగుల్ని సైతం లెక్కచేయకుండా యింతవరకూ. ఆత్మీయుల్లా తనవైపే చూస్తూ పదే పదే పలకరించే అల్పస్థి భావనే చూడగానే కొద్దిగా చలించింది జయ పసి మనసు... మనోరమ 'రా' అని చేయి చాపగానే కదిలివెళ్ళి కూర్చుని వున్న ఆవిడ ఘటం చుట్టూ చేతులువేసి నిలబడిపోయి నోటికి అందించిన ముద్దల్ని మింగుతూ కాళిదాసు వైపు చూసింది. అతను నవ్వేడు స్వచ్ఛంగా.

ఆ రుపు తెల్లవారుతూంటే చటుక్కున తెలివి వచ్చింది జయకి. అప్పటికే చుట్టు పక్కల రెండు మూడిళ్ళ తలుపులూ తెరుచుకుని వీధి వాకిళ్ళు తుడిచి ముగ్గులు పెడుతున్నారు యింటి ఆడవాళ్ళు. దొడ్లో గేదెన్ని తరుముకుని వెడుతున్నాడు పాలేరు గోపాలం. జయకి వీళ్ళంతా లపరిచితులు. కళ్ళు తెరవగానే యెదురింటి మేడ అరుగులో అందమైన లబ్బాయి కనిపిస్తా డనుకున్నదే కానీ, కల కరిగి వాస్తవం బయటపడిందని తెలుసుకోలేక పోయింది. హరికేన్ లాంతరు వత్తి పెద్దది చేసి కాళిదాసు పుస్తకాల ముందు కూర్చుని దీక్షగా చదువుతున్నవాడల్లా, మంచం మధ్యలో పీటం వేసుకుని కూర్చుని తెల్ల బడే ఆకాశం వైపు నిశ్చలంగా చూస్తున్న జయ హఠాత్తుగా కనిపించే సరికి ఒకటికి రెండుసార్లు ఆ వైపు చూసేడు. నెమ్మ

పరిలిప్తం

దిగా కదిలి వెళ్ళి జయ మంచాన్ని సమీ పించి కుడిచేయి అందించి 'దిగు జయా నీకు తమాషా చూపిస్తాను,' అన్నాడు.

జయ అతని చేయి అందుకుని దిగింది. పెరట్లోంచి దొడ్డిగుమ్మం ద్వారా గోపాలం పశువుల్ని తీసుకు వెళ్ళే స్థలానికి తీసుకు వెళ్ళాడు. అప్పటికే ఆకాశం వొళ్ళు విరుచుకుంది. పాలనురుగు లాంటి కాంతి ప్రకృతిని చుట్టేసింది. గోపాలం యాలపాట పాడుతూ గేదెన్ని అదిలించడం ఆపి పాల చెంబులో పాలు పితుకుతూ దూరం నుంచి కాళిదాసుని చూసి 'యేంటండబ్బాయిగోరూ ప్రొద్దుటె బయ ల్దేరేరు,' అన్నాడు.

కాళిదాసు ఆరిందాలా ఓ చిన్న నవ్వు విసిరేసి 'చూడు గోపాలం ఓ గ్లాసులో గుమ్మపాలు అమ్మాయిగారికి తీసుకు వచ్చి యివ్వు,' అన్నాడు.

జయ అతని చేయి బలంగా పట్టుకుంది పెంటిదారి పూర్తిగా బంకమన్నులా అంటి పెట్టుకుని జారిపోతోంది. గోపాలం తెచ్చిన పాలు తాగేసి గ్లాసు యిచ్చేసి కాళిదాసు వైపు తిరిగి 'యింత ప్రొద్దుటే యిలా వస్తే మీ నాన్నగారు తిట్టరూ.' అని అడిగింది.

'లేదు నాకు అలవాటే. గుమ్మపాలు తాగేసి వెళ్ళి చదువుకుంటే ఆయన యేమీ అనరు.'

'మరి అత్త'

'ఆవిడ కూడా యేమీ అనదు.' కాళి దాసు పొలాలగట్ల వెంట చుట్టు తిప్పి యింట్లోకి తీసుకు వచ్చేడు. వస్తూనే బెల్లం వేసిన పాలు తాగేసి పుస్తకాల ముందు కూర్చున్నాడు. జయ ఆసక్తిగా అడిగింది 'అయితే నువ్వు మొహం కడుక్కోలేదు అవునా' అంటూ.

కాళిదాసు నవ్వి 'యెప్పుడో పండుం పుల్లతో కడిగేసుకున్నాను. నువ్వు లేచి కూర్చున్నావని నిన్ను షికారు తీసుకు వెళ్ళేను' అన్నాడు.

జయ తలవాల్చేసింది సిగ్గుపడ్డ దానిలా.

'ఫరవాలేదు జయా. అప్పుడప్పుడు నేనుకూడా లేవగానే కాఫీ తాగేస్తాను'

మనోరమ వంటయింట్లో మరదల్ని సుతి మెత్తగా చీవాట్లు వేస్తోంది. 'పసి పిల్లలు బంకమట్టితో తయారుచేసే బొమ్మల్లాంటివాళ్ళు రమా. మనం వాళ్ళని యెలా మార్చుకోవాలంటే సమయం చూసి నేర్పుగా తిప్పేసుకోవాలి. యిప్పుడు చూడు మీ జయని.'

జయ క్రమంగా కాళిదాసు స్నేహంలో సాంబశివాన్ని గుర్తుకు తెచ్చుకోసాగింది. గతంలో కాళిదాసుకి స్నేహితులే లేరు ఒక వేళ వున్నా చదువుకునే నిమిత్తం రెండు మూడిళ్ళ అవతలవున్న ప్రకాశం, శ్రీధర్ల యిళ్ళు, వాళ్ళస్నేహం తప్ప అతను మరేదీ యెరుగడు జయ కూడా కూడా తిరుగుతూ హైదరాబాదు మహా నగరంలో తను ఆడిన ఆటలూ, తిరిగిన ప్రదేశాలూ, చెలిమికాడు సాంబశివం గురించి కథలు కథలుగా చెబుతూంటె చెవులప్పగించి ఆసక్తిగా వింటూండేవాడు. మధ్యమధ్య అతను కుతూహలంగా అడిగే ప్రశ్నలకి నిపుణురాలైన అధ్యాపకురాలు చెప్పేవిధంగా రివి వాలకపోస్తూ జవాబులు చెబుతుంది. 'పతంగీ అంటే యెలా వుంటుంది జయా.' అని అడిగేడు కాళి దాసు. లతనికి వుండేల్ ఆట ఆడ్డం, గోళీబిళ్ళ, చెడుగుడు తప్ప యీ కొత్త పేరు తెలీదు. జయ అతన్నిచూసి జాలిగా నవ్వి 'నీకేవీ తెలీవు, అన్నీ నేనే చెప్పాలి. గాలిపటం పైపైకి యెగరేస్తాడు సాంబు. గోళీలు ఆడేడంటే వాడిలాంటి ఛాంపియన్ మరెవ్వరూ వుండరు,' అన్నది. సాంబశివంపేరు ప్రస్తావనలోకి రాగనే కళ్ళనీళ్ళు తిరిగాయి. 'యిప్పుడేం చేస్తున్నాడో,' అనేసింది అప్రయత్నంగా. కాళి దాసు చేతిని అందుకుని తోటవైపు బయలు దేరాడు. జయ ఆ రోజంతా అన్యమనస్కం గనే వుంది.

రాజశేఖరం ప్రణాళికలు తలక్రిందు లయ్యేయి అతను అమలాపురంలో ప్రాక్టీసు పెట్టాలనుకునే తలంపుని పూర్తిగా మరిచి పోయేడు. జయ సాంబశివాన్ని మరిచిపోయే ప్రయత్నంలో వుంది. కొన్నాళ్ళు పోయేక యేకంగా కాకినాడకే తన మకాం మార్చాలని అతని వుద్దేశ్యం. చిన్నపిల్ల యిప్పటి వరకూ ఆ షాక్ నుంచి కోలుకోలేక పోయింది. మెంటల్ గా దెబ్బతిన్న మనిషి చివరికి యేవిధంగా మారిపోయేదీ డాక్టర్ గా అతనికి

కొంత తెలుసును.

* * *

రోజులమీద రోజులు గడిచిపోతున్నాయి. జయ పల్లెటూర్లో కాళిదాసు స్నేహంలో ముద్దు ముద్దుగా పదమూడేళ్లు తెచ్చుకుంది. జయ స్మృతిపథంలో సాంబశివం పేరుకూడా గుర్తుకులేదు. కాళిదాసు స్కూలుఫైనల్లోకి వచ్చేడు. మేలిమి బంగరు ఛాయలో అసలే అందంగావున్న ఆపిల్ల వయసుతోపాటు మరికొంత అందాన్ని పుణికి పుచ్చుకుని ఫిఫ్త్‌ఫారంలో అడుగు పెట్టింది. యిల్లూ, స్కూలూ, తోటా కాళిదాసుతో ఆటా తప్ప మరేమీ తెలియవు ఆ పిల్లకి. గౌన్లు తొడగడం మానేసి పరికిణీవోణీ వేసుకుని కాళిదాసు పక్కగా నడిచి వెళ్లేందుకు యిప్పుడు సిగ్గుపడుతోంది. కాళిదాసు పూర్వంలాగే జయ సరసనే నడవడానికీ ఆమెతో ఆడుకోవడానికి సంకోచించడు. పదమూడో సంవత్సరంలో కాలుపెట్టాక జయ పెద్దదైందని అట్టహాసంగా పేరంటంచేసింది మనోరమ. కాలం కలిసివచ్చి కడుపులో చల్ల కదలని స్థితికి వచ్చేసింది ఆవిడ.

పేరంటాళ్లు నెమ్మదిగా అడిగేరు: కోడల్ని యిప్పుడే అబ్బురంగా చూస్తున్నావు మనోరమా. రేపు యింటి కోడలైతే కాలుకింద పెట్టనిస్తావోలేదో'

మధ్యలో మరొకావిడ అందుకుంది: అయితే మమ్మా,పిల్ల పెద్దదవ్వాలని యెదురుచూసి పెళ్లి ఆపావా యేం యిన్నాళ్లూ. ఊఁ వైశాఖంలో ఆ కాస్తా కానిచ్చి మాకు త్వరలోనే పప్పన్నం పెట్టే యేర్పాట్లు చేయి.'

మనోరమ నవ్వి వూరుకుంది. రమ కూతుర్ని చూసి సన్నగా నవ్వింది. జయ ఆలోచనల్లో పెళ్లికి ప్రతిరూపం నిలబడిపోయింది. ఆ మనసులో కాళిదాసుమాత్రం లేడు. తనగురించి నలుగురూ మాట్లాడ్డంతో సిగ్గుపడిందికూడా.

క్రమంగా రోజులు గడుస్తున్నాయి. రాజశేఖరం దృష్టి జయ భవిష్యత్‌మీదా, చదువుమీదా కేంద్రీకృతం అయిపోయింది. వరుసా వావీ అయిన పిల్లలుకనుక యిరుగుపొరుగులు జయపెళ్లివిషయం పదేపదే అన్నప్పటికీ, భార్య రమకుకూడా ఈడేరిన పిల్లకి పెళ్లి ముఖ్యావసరం అని గుర్తు చేసినప్పటికీ రాజశేఖరం ససేమిరా వొప్పుకోలేదు. ఆయేడు వోపికపట్టి జయ ఫస్టుక్లాసులో పాసైనతరువాత చదువుమిషతో కాకినాడ మకాం మార్చేడు. ఇప్పుడు యిలా విడిపోతూంటే జయ నిశ్చలంగా వూరుకుంది. కాళిదాసుని ఖర్చులు భరించి రాజశేఖరం మెడ్రాసు పంపేడు మెడిసన్ చదివేందుకు. నాగరికత అంతకంతకు ప్రబలి ప్రజల నరనరాల్లోనూ వ్యాపించే రోజులు వచ్చేయి. రమ యిష్టం కొనసాగలేదు. ఆరేళ్లపై చదువులు ఆడామగా సమానంగా చదవడంమీద రమకి అంత ఆసక్తి లేదు.


భర్తకి యెదురు చెప్పి నిలిచే సాహసం యెప్పుడూ లేదు రమకి.

కాలం పరుగులో అనేకరోజులు దొర్లిపోయేయి. జయ ప్రౌఢవయస్కురాలైంది. తల్లినీ తండ్రినీ వదిలి కాకినాడలో చదవడం యిష్టంలేక మెడ్రాసు ప్రయాణం అయింది. రమ కళ్లనీళ్ల పర్యంతంకాగా కూతురి భుజంమీద చేయివేసి 'మనకున్న చదువులు చాలు జయా! యింక చదివి యెవరిని వుద్ధరించాలి మనం. దీనిమీదే బ్రతకడంలేదు కద. ఒక్కదానివీ అంత దూరంలో యిద్దర్నీ వదిలి యెలా వెళ్లగలవు?'

జయ తల్లివైపు ఆశ్చర్యంగా చూసింది. యెదురుగా జీవితాన్ని పుటలు పుటలుగా చదివి కన్నవారిని సైతం కాదని, వచ్చేసి ఆ బెంగలో నిరాశలో తల ముగ్గుబుట్ట అయిపోయి. హృదయం చివికి చితికిపోయి, గుండె రాయిచేసుకుని, పెదవులమీద చిరునవ్వుకి అలనాడు గోవర్ధనగిరిని చిటికెనవ్రేలుమీద ఆడించిన శ్రీమన్నారాయణుడిలా ఆడిస్తూ తనను తాను ఆత్మవంచన చేసుకొంటూ రెప్పలచాటున ప్రపంచపు సముద్రాలన్నిటినీ మూతవేసి బిగించి ఆ కళ్లల్లో నటనాచాతుర్యపుకాంతులు వొలికిపోస్తున్న తల్లి వర్గం వెర్రి బాగుల్దానిలా కనిపించింది. నవనాగరికతని అప్పటికే జీర్ణంచేసుకున్న జయకి యిదంతా చిత్రంగా అనిపిస్తోంది. తల్లి భుజంమీద చేయి వేసి 'యేమిటమ్మా నువ్వు మరీను. నేనేం అత్తవారింటికి వెడుతున్నానా భయపడి బెంగపడిపోయేందుకు. నాలా యెంతమంది చదువుకుందుకి వస్తున్నారు. డబ్బుండని వాళ్లకి ఆ అదృష్టం యెలాగూ లేదు. నాన్నగారికి యిష్టమైంది నాన్నకే కొడుకువుంటే తన తరువాత డిగ్రీ పుచ్చుకుని తండ్రిపేరు నిలబెట్టేవాడని ఆయన వాపోతూవుంటారు. ఆడపిల్ల అందుకు యేమాత్రం తీసిపోదని నేను ఋజువు చేస్తానమ్మా' అన్నది ధైర్యంగా.

రమ కళ్లనీళ్లురాలి చెంపలమీద పడ్డాయి! 'ఒక్కదానివి యెలా బ్రతుకుతావో, మన కాళిదాసువున్నాడని కొంచెం ధైర్యం తప్పితే కాని లోకంలో ఆడపిల్లవి యెలా నెగ్గుకు వస్తావో యేమిటో.'

'భలేదానివేనమ్మా. కాళిదాసు లేకపోతే అసలు మెడ్రాసే పంపేట్లులేదు నీధోరణి



చూస్తే. అతనేం చేయగలడమ్మా హాస్టల్లో వుండేదానికి.'

రమ కూతుర్ని పూర్తిగా గ్రహించింది. ఆ బుర్రలో మెడిసన్ చదవాలనే కోరిక వేయి తలల్తో పైకెత్తింది. యింక ఆశక్తిని ఆపేందుకు యెవరితరమూ కాదు. తల్లీ తండ్రీ, బంధుజనం వేటిమీదా ఆసక్తి లేదు జయకి. తనువారించి ప్రయోజనం లేదని తెలిసినా దింపుడు కళ్లం ఆశ విధంగా నచ్చచెప్ప ప్రయత్నించి విఫలురాలైంది. తండ్రి మద్దతు జయకి పూర్తిగా లభించింది. మద్రాసు వెళ్లిపోయే నంబరంలో ఆ పిల్లకి తల్లి దుఃఖం అంతుపట్టలేదు. 'వెళ్లగానే వుత్తరం రాస్తావా అదీ లేదా,' అన్నది రమ.

ప్లాట్ఫారం మీద నిలుచున్న తల్లివైపో సారి చూసి 'అలాగే రాస్తానమ్మా,' అన్నది. రైలు రావడం, ప్రయాణీకులు యెక్కడం, గుండెలు దద్దరిల్లేలా రైలు కూతవేసి సాగిపోవడం నిమిషాల మీద జరిగిపోయేయి. రమ దుఃఖంతో కళ్లు తుడుచుకుంటూంటే రాజశేఖరం అనునయంగా అన్నాడు: 'మనకి మగపిల్లలు లేరు రమా. ఇంత ఆస్తీ ఈ సంపదా యెవరి కోసం అనిపిస్తూంటుంది. జయ తెలివిగల పిల్ల. దాని సుఖం కోసం నేను యేం చేయమన్నా చేసేందుకు సిద్ధంగ వున్నాను.'

రమ అతనివైపు కోపంగా చూసింది: 'అవకాశాలు మగపిల్లలకి కలిగిస్తేనే బాగుంటుంది. మీరు...మీరు ఆడపిల్లని చేతులారా పాడు చేస్తున్నారు. కన్నతల్లిగా నేను పడే బాధ మీకెందుకు తెలుస్తుంది? మగవాడి మనసుతో ఆలోచించకండి మీరు...

'రమా!' రాజశేఖరం ఆశ్చర్యపోయేడు. 'యెంత చిత్రంగా మాట్లాడుతున్నావు రమా. నేనా ఆడపిల్లని చెడగొట్టే విధంగా పెంచే మనిషిని. నా బాధ నీకెలా తెలుస్తుంది? నా బిడ్డ పెద్ద డాక్టరై మంచిపేరు సంపాదించుకుని నలుగురిలో నా పేరుకి కూడా కొంతకారణం అవుతే ఆ గర్వం నాది కాదంటావా,' రమ అతని మాటలకి జవాబు చెప్పలేదు. ఇంటికి వచ్చేక కిటికీ గుండా శూన్యాకాశంలోకి చూస్తూ పిచ్చిగా నవ్వుకుంది ఒకటికి రెండుసార్లు. రాజశేఖరం భార్యని పలకరించలేదు. అలాచేసి ఆవిడని రెచ్చగొట్టడం యిష్టంలేదు అతనికి.

* *

మద్రాసు మెడికల్ కాలేజీలో జయ ఫస్టియర్లో జాయిన్ అయింది. కాళిదాసే మేనమామ ఆజ్ఞ ప్రకారం అనేక సదుపాయాలు చూశాడు. కాలేజీ జీవితం జయకి చాలా ఆసక్తికరంగ వుంది. ముఖ్యంగా కాళిదాసు చూపించే శ్రద్ధ ఒక విధంగా పరోక్షంగా ప్రోత్సాహకారణం అయింది. కాలేజీ మొత్తంలో కాళిదాసుకి ప్రత్యేకమైన స్థానం వుంది. అతను విద్యార్థి బృందానికి నాయకుడు. అందమైన వర్చస్సుతో, ఆరడుగుల యెత్తులో బలంగా వుండే అతను మూడో సంవత్సరం చదువుతున్నాడు. కాలేజీకి కొంచెం దూరంలో జయకి యిల్లు చూశేడు. వంటమనిషి, పనిమనిషి అన్నిటికీ అనుకూలంగా వుంది ఆ యిల్లు. ఆదివారం మధ్యాహ్నం అతను వెంట మరొక వ్యక్తిని తీసుకుని 'చూడు జయా!' అంటూ ప్రవేశించేడు. జయ విడిగా వుండేందుకు కారణం హాస్టల్ భోజనం పడకపోవడమే. జయ తలనిండా స్నానంచేసి వెంట్రుకలు ఆరేందుకు యెండ పడచోట కిటికీకి దగ్గరగా నిలబడినదల్లా యిటు తిరిగి 'కాళా! రా కాళీ లోపలికి,' అన్నది

'యితను సాంబశివం నా క్లాస్మేట్, నా క్లోజ్ ఫ్రెండ్. యీవిడ మిస్ జయ నా మరదలు,' కాళిదాసు మోడామీద కూర్చుంటూ అతనికి యెదురుగా వున్న కుర్చీ చూపించేడు.

పరిచయాలు పూర్తయ్యేక సాంబశివం ఆలోచనలో ఆగిపోయేడు. వచ్చినంత హుషారు అతనిలో లేశమాత్రం కూడా లేదు. అతని సూక్ష్మగ్రాహితనం పసితనం మీద దాడిచేస్తోంది. మెదడులో సంచలనం తప్ప మరేదీ లేదు. జయ లోపలికి వెడుతూ, వస్తూ తన యెదుటే పదేపదే తిరుగుతూంటే గతించిన జ్ఞాపకాలు పెను తుఫానులయి అతన్ని నట్టనడి సముద్రంలో చుక్కానిలేని నావికుడిలా ప్రయాణం చేయిస్తున్నాయి. యెన్నోయేళ్ళ తరువాత చూసినా అతను అనునిత్యం ఆరాధిస్తూ వచ్చిన అపురూప స్నేహితురాల్ని గుర్తుపట్టకుండా వుండలేక పోయేడు. కాళిదాసు సంభాషణలు చెవికెక్కడం లేదు. అతను చెప్పుకు పోయేమాటలకి యాంత్రికంగా 'వూఁ' కొడుతున్నాడు.

కాళిదాసు వున్నట్టుండి పెద్దపెట్టున నవ్వాడు. 'యేమిట్రా పరధ్యానం. మా మరదల్ని చూస్తే యెవరైనా గుర్తుకు వస్తున్నారేమిటి కొంపతీసి. లాడ్జింగ్ తప్ప గత్యంతరం లేనివాళ్ళం. నిన్ను హఠాత్తుగా యెక్కడికైనా తీసుకు వెళ్లమన్నా నావల్ల కాదు. యిన్టైమ్లో హాజరు కాకపోతే భోజనం యీపూటకి నిల్'

ఉలిక్కిపడ్డాడు సాంబశివం. తొట్రుపాటు సవరించుకుంటూ 'భలేవాడివే. యేదో గుర్తుకు వచ్చింది. నేనేం ఆలోచించడం లేదు. ఆటువంటి పిచ్చిపిచ్చి వాటి గురించి' అన్నాడు. వున్నట్టుండి యెన్నడూ లేనిది కాళిదాసుమీద క్షణంలో అసూయలాంటిది బయలుదేరి అది అంతకంతకు విజృంభిస్తూ కదంతొక్కుతూ సాంబశివం మెదడులో చిన్నపురుగులా దూరి అరగంటా, గంటా గడిచేసరికి వటవృక్షం మాదిరి యెదిగిపోయింది. 'ఈవిడ మా మరదలు!' కాళిదాసు మొహంలో గర్వరేఖలేవో సాంబశివానికే స్పష్టంగా కనిపిస్తున్నాయి.

జయ జడవేసుకోవడం పూర్తి చేసుకుని 'మీరు ఒక్కమాట కూడా మాట్లాడేరు కాదు,' అన్నది.

అతనుతలెత్తి చూశాడు: 'నువ్వు ఒక్కమాటకూడా మాట్లాడవేం సాంబూ' అని అడిగినట్లుగానే వుంది: 'యేం మాట్లాడను?' అన్నాడు చిన్నగా నవ్వుతూ.

జయ ప్రతిగా నవ్వింది. 'యేదైనాసరే యేదో ఒకటి రాజకీయాలూ, సినిమాలూ బోలెడు టాపిక్స్'

'నేను సినిమాలు చూడనండి. రాజకీయాలు నాకు తెలియవు'

కాళిదాసు లేచి నిలుచున్నాడు. సాంబశివం కూడా బయలుదేరాడు. అతని ఆలోచనలు పరిపరివిధాల పోతున్నాయి. తనకంటే రెండో మూడో యేళ్లు చిన్నదైన మాత్రంలో పాతవిషయాలు పూర్తిగా మరిచిపోతుందా ఈ జయ. తనని చూసీ, గుర్తుపట్టికూడా యేమీ తెలియనట్టు నటిస్తోంది. కాళిదాసు అందం, తెలివితేటలూ స్వార్థానికి ఆజ్యం పోశాయి. త్వరలోనే

అతడు డాక్టరవుతాడు. విదేశాలకి ప్రభుత్వం పంపిస్తుంది. వీటిముందు తను ఒక లెక్క: 'యేరా జయ మరదలన్నావు అంటే' అరోక్తిలో ఆపేశాడు గలగలా నవ్వేస్తూ.

సాంబశివం ప్రశ్నకి కాళిదాసు క్షణం నడవడం ఆపేశాడు. ఆగి అతని మొహంలోకి చూశాడు. చూసి అయితే నువ్వు ఆలోచిస్తున్నది ఆపిల్ల నాకు కాబోయేదనా? నో. నో. అలాంటిదేం లేదు. మా మేనమామ కూతురు. నాకసలా అయిడియా లేనేలేదు' అన్నాడు

సాంబశివం మరి మాట్లాడ లేదు. యిద్దరూ భోజనాలు చేసి నెరోదారి చీలిపోయేరు నాలుగు గోడలమధ్యా పరుపు మీద వెల్లకిలా పరుండి సాంబశివం ఒకటికి రెండుసార్లు కన్నీళ్లు తుడుచుకున్నాడు: 'నువ్వు నా జయవే జయా. చిన్నప్పటి ఆటపాటలు నువ్వు మరిచిపోయేవా నిజంగా. చీలిపోతూ స్టేషన్లో అవిరామంగా యేడ్చావు సికోసం ప్లాట్‌ఫామ్ మీద దొర్లి దొర్లి యేడ్చాను. అదీ మరిచిపోయేవా?' అతను అంతరంగంలో గగ్గోలు పెడుతున్నాడు

అతని కళ్లలో అంతకంతకు నీరు పూరతోంది. మనుష్యుల్ని కోసే చదువు చదివే అతడు మనసు కోత భరించ లేక పోతున్నాడు. అమాయకంగా పసివయసులో అతను చేసిన స్నేహం హృదయంలో పటిష్టంగా పాతుకు పోయింది. చిన్నతనంలో తను అజ్ఞాతంగా వున్నా ఆక్షణంలో జయ 'నాది' అనే దిలాసాలో యెన్నో అక్రమాలు చేశాడు. జయ లేనిదే క్షణం గడిపేవాడు కాడు, ఆ వయసులో సర్వసాధారణంగా అందరూ చేస్తున్నట్లే తనూ స్నేహం చేశాననుకున్నాడు. కాలం చేస్తున్న ప్రయాణంలో తను ఆనాడు ప్లాట్‌-ఫారమ్‌మీద చీలిపోయేడు. మళ్లీ ఈనాడు యాదృచ్ఛికంగా తానాశించిన చిటారుకొమ్మని మిఠాయిపొట్లం కనిపించగానే నిరుత్తరుడయిపోయేడు. శరీరభాగంలో ఏదో ఒకభాగానికి పక్షవాతం రాగా ఆపార్శ్వం స్వాధీనంలో లేనట్టు మథనపడ్డాడు. అందుకే అతనికా క్షణంలో గొంతు పెగిలి రాలేదు. జయని ప్రేమగా, మరీ అపురూపంగా కంటికి రెప్పలా చూసుకుంటున్న కాళిదాసుమీద అతనికి కలిగిన అభిప్రాయం చెరిగిపోవడం లేదు.

జయ 'నాది' అని సగర్వంగా చెప్పుకుందుకి అవకాశమే లేకుండా పోయిందనిపించింది అతనికా క్షణంలో. చటుక్కున లేచి కూర్చున్నాడు. క్షణం ఆలోచించి బట్టలు మార్చుకుని రూమ్‌కి తాళంవేసి బుర్ర వొంచుకుని బయలుదేరాడు కాలేజీకి అభిముఖంగా. అతని అడుగులు ముందుకు సాగుతున్నాయి. కరిగిపోయిన గతం కళ్లల్లో మళ్లీ కాపురం చేయడం ప్రారంభించింది.

జయ అప్పటికే భోజనం చేసి వాలు కుర్చీలో వెనక్కి చేరగిలబడి క్లాసు పుస్తకాన్ని తిరగేస్తోంది. అడుగుల చప్పుడు విని తలెత్తి 'మీరా.' అన్నది లేచి నిలుచుంటూ.

'నేనే' సాంబశివం తనివితీరా అన్నాడు: 'నేనే జయా, సాంబశివాన్ని, నీకు జ్ఞాపకం రావడం లేదూ. సికింద్రాబాద్‌లో అమ్మా నాన్నా వుండగా, చిన్నప్పుడు మనం ఒకే స్కూల్లో చదువుకుని...' అతను జ్ఞాపకం చేసిందుకు తాపత్రయపడుతున్నాడు.

అడుగు లోపలికి వేయబోయేదల్లా ఆగిపోయింది జయ. పాతజ్ఞాపకాల పుటలు తిరుగుతున్నాయి. ఆ పుటలమధ్య బిళ్లంగోటీ, వుండేల్‌ఆట, ముంతకాయల వేట,



పాలనగట్ల షికారు, చింతచెట్టుమీద యెక్కి కోతికొమ్మచ్చులాట, తంపడేసిన తేగల్ని పంచుకు తినడం, మగరాయుడిలా చెడుగుడు ఆడడం, కోవెల ప్రాంగణంలో మట్టితో పిట్టగూళ్లు కట్టడం యికిరీటు మాదిరిగా తిరుగుతూ అక్కడ కాళిదాసు తప్ప మరోవ్యక్తి అసలు గుర్తుకు రావడం లేదు. 'స్టేషనంటున్నాడు, యేడ్చావంటున్నాడు; యివన్నీ అభూత కల్పనల మాదిరిగా కనిపిస్తున్నాయాక్షణంలో జయకి.

'మానాన్నగారి పేరు గిరిధర్. అమ్మ జానకి గుర్తురావడం లేదా జయా నీకు.'

జయ ఆలోచనల్లోంచి తేరుకుంది: 'మీరు పొరపాటుపడుతున్నారేమో. నేను మీ జయనే అనే యేముంది?' అనాలనుకుంది. కానీ ఆ మాటలు పెదవిదాటి పైకి రాలేదు.

'అప్పట్లో మనం రోజూ నాన్నగారితో హుసేన్‌సాగర్ వైపు షికారు వెళ్లేవాళ్లం. మన యింటి పక్క గోవిందుని, బ్రమరని కలవనిచ్చేవాళ్లం కాదు అన్నట్టు యిప్పుడు అమ్మా, నాన్నా కులాసాయేకదూ,' సాంబశివం వివరాలు అడుగుతూంటే అప్పుడు అన్నది జయ: 'క్షమించాలి. యెప్పుడో హైద్రాబాదులో వున్నాం అనే సంగతి లీలగా గుర్తుంది కానీ మీరు చెప్పేవి నాకసలు జ్ఞాపకం లేవు'

సాంబశివం ప్రాన్పడి పోయేడు. గుండెల మీద చేయివేసుకుని 'నేను సాంబశివాన్ని. నిన్ను కొట్టి, నీతో ఆడుకున్న ఆ దౌర్భాగ్యుడని,' అని గట్టిగా కొట్టుకోనా అనిపించింది. అతని తెల్లని కనుపాపల్లో నీరు క్షణం దోబూచులాడింది కర్చీఫ్‌తో వాటిని అదిమేసి 'నిజంగా నాదెంత దురదృష్టం మీకు నేనసలు గుర్తుకు రావడం లేదు పోనివ్వండి యిలా నేను వొంటరిగా వచ్చేసి పాత విషయాలు గుర్తు చేయడం ఏదేమంత న్యాయం కాదు. ఈ విషయం చెప్పాలనిపిస్తే కాళిదాసుతో చెప్పండి. మరి వస్తాను,' అంటూ వెనుతిరిగేడు.

జయ వీధి గుమ్మం వరకూ వచ్చి వెళ్లిపోయే అతనివైపు దృష్టి సారించి నిలబడిపోయింది.

(ఇంకావుంది)

వారఫలం

15-8-1969 శుక్రవారం మొదలు 21-8-1969 గురువారం వరకు

మేషం. వ్యాపారంలో పోటీవారితో పోటీ పెరుగుతుంది. రావలసిన డబ్బు మీద ఆధారపడి యే వ్యవహారమూ ప్రారంభించడం తగదు. వారంమధ్యలో వృత్తిలో ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. సజ్జన సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు—ఆడంబరం కోసం వ్యయం చేస్తారు. కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి.

వృషభం: వృత్తిలో ఆదాయం పెరుగుతుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి ప్రయాణాలోచనలు చేస్తారు. రాజకీయ వ్యవహారాల్లో ప్రతిపక్షాల సంచలనం పెరుగుతుంది. ఉద్యోగంలో యితరుల నిమిత్తం శ్రమకు గురి కాగలరు.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. దైవ కార్యాలు నెరవేరతాయి.

మిధునం. సామాన్యమైన పనులకు కూడా విశేషమైన కృషి చేయవలసి వస్తుంది. ఆర్థిక వ్యవహారాల్లో ముగమూటాలు లగవు. వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి ప్రయాణం ద్వారా కార్యసాధన చేయగలరు నూతన విషయాలను తెల్సుకొంటారు.

స్త్రీలకు—పోటీవారిలో గౌరవం లభిస్తుంది. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

కర్కాటకం. వ్యాపారంలో మిత్రుల సహకారం లభించగలదు. రాజకీయ వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది. స్థిరాస్థి వ్యవహారాలు బాగా ఉంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. ప్రయాణాలు వాయిదా పడతాయి.

స్త్రీలకు—వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. పుణ్యకార్యాలు చేస్తారు.

సింహం వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. రావలసిన డబ్బు సమయానికి అందగలదు అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరతాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. మిత్రులకు సహాయం చేస్తారు.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. సంతోషకరమైన వార్తలను వింటారు.

కన్య: అన్ని వ్యవహారాల్లోను క్రమాభివృద్ధిని సాధించగలరు. నూతన వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. విద్యావైజ్ఞానికరంగాల్లో మీ కృషి రాణిస్తుంది. ప్రయోజనంగల పరిచయాలు యేర్పడతాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. శు కార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది.

తుల: వారం ప్రారంభంలోనే అన్ని వ్యవహారాల్లోను చికాకులు యేర్పడి తరువాత సర్దుకొంటాయి. మీ తాలూకు వస్తువులు పోవచ్చును వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. సాంఘిక వ్యవహారాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో అధిక వ్యయం జరుగుతుంది. బంధుమిత్రులను కల్సుకొంటారు.

వృశ్చికం: వృత్తిలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. వారం మధ్యలో ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వ్యాపారంలో యెవరినీ విశేషంగా నమ్మడం తగదు. ప్రయాణాలు వాయిదా పడతాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

ధనుస్సు మీ కంటే పెద్దవారు కూడా మీ సహకారాన్ని కోరవలసి వస్తుంది. ప్రయాణం ద్వారా కార్యసాధన చేయగలరు. వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. రావలసిన డబ్బు సమయానికి అందగలదు. విద్యావైజ్ఞానికరంగాల్లో మీ కృషి రాణించగలదు

స్త్రీలకు— పుణ్యకార్యాలు చేస్తారు సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి

మకరం వ్యాపారంలో అనుకూల వార్తలను వింటారు. నూతన వ్యవహారాలు లాభదాయకంగా ఉంటాయి. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరతాయి. స్థిరాస్థి వ్యవహారాలు బాగా ఉంటాయి ఉద్యోగంలో గౌరవం లభించగలదు.

స్త్రీలకు—నూతన విషయాలను తెల్సుకొంటారు. బంధువులకు సహాయం చేయగలరు

కుంభం లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం రావచ్చును సాహసముతో కూడిన వ్యవహారాల్లో జోక్యం చేసికోవడం తగదు. ఆందోళన కలుగుతుంది వారం మధ్యలో వృత్తిలో ఆదాయం పెరుగుతుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభించగలదు.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉండదు. బంధుమిత్రులను కల్సుకొంటారు

మీనం ప్రయత్నించిన ప్రతి పనీ సులువుగా నెరవేరుతుంది రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. పోటీవారిలో గౌరవం లభిస్తుంది. వారం మధ్యలో వ్యాపారంలో శ్రమ కలుగుతుంది. రాజకీయ వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. అధికవ్యయం జరుగుతుంది.

—మహేష్

బావా-మరదలూ

శ్రీమతి రాధారాఘవ



టిఫిను పళ్ళెం బల్లమీద పెడుతూ, 'ఎక్కడి నుంచో శుభలేఖ?' అనడిగింది వాసంతి.

'మా మామయ్య దగ్గర్నుంచి. వాళ్ళ అమ్మాయికి పెళ్ళి నిశ్చయించేశారట' అన్నాడు ప్రభాకరం.

—'అన్నట్టు నువ్వు మామయ్యగారి రేఖను చూడలేదు గదూ? భలే చిలిపి పిల్లలే. చాలా అల్లరి చేస్తుంది. మన పెళ్ళికి రాలేకపోయింది పాపం. అప్పుడు వాళ్ళకి బి. ఎస్. సి. గాబోలు ఫైనల్ ఎగ్జామినేషన్సు జరుగుతున్నాయి. 'నేను పి

పెళ్ళికి రాలేదని; నువ్వో మానేవు సుమా; తప్పకుండా రావాలి. నువ్వు రాకపోతే అసలు నేను పెళ్ళిపీటల మీదే కూర్చోను' అంటూ ఉత్తరం వ్రాసింది. ఇదిగో చూడు అంటూ ఉత్తరాన్నిచ్చాడు.

వాసంతి ఉత్తరాన్ని చదువుతూంటే ప్రభాకరం హుషారుగా యీల వేస్తూ, అద్దం ముందు నిలబడి తల దువ్వుకోవడం మొదలు పెట్టాడు.

ఉత్తరం చదవడం అయ్యాక, తిరిగి దాన్ని భర్తకిచ్చేస్తూ, నవ్వుతూ అంది వాసంతి. 'తీరుచూస్తే గడుసుపిల్లలానే ఉందే.'

'ఆఁ మరేమిటనుకున్నావ్. ఎవడొస్తున్నాడోగాని చెవులట్టుకు ఆడిస్తుంది. ఎమ్. ఎస్. సి. డిగ్రీ తీసుకునేదాకా పెళ్ళి చేసుకోననీ, ఫారిన్ రిటర్నర్నేగాని మరోడిని వివాహమాడననీ డబ్బాలు కొట్టేది. మొత్తానికి రెండూ సాధించింది. నువ్వో చూద్దుగాని పదిరోజులు శలవుపెట్టి వెళ్దాం ఏమంటావ్?'

'దానికేం. తప్పకుండా వెళ్దాం. నాకూ ఆ అమ్మాయిని చూడాలని కుతూహలంగానే ఉంది. తరచూ ఆ అమ్మాయి గురించి మీ నోటంట వింటూంటానుగా.'

'ఓ. కే! రేపే లీవ్‌కి అప్లయి చేస్తాను'

'చిన్న రిక్వెస్ట్.'

'చెప్పొచ్చు...చీరలు కావాలా? నగలు కావాలా? నాణ్యాలా?...'

'ఆవేం ఒద్దుగాని నాకు, ఎటూ అంత దూరం ఎలాగా వెళ్తున్నాం కాబట్టి కొంచెం ఎక్కువ రోజులు శలవు పెట్టండి, ఏకంగా మా వాళ్ళింటికీ వెళ్ళొద్దాం. ఏమంటారు?'

'అంగీకరించాం.'

'ఏం ఫోజుగాని, అయితే రేపే ఉత్తరం వ్రాసేస్తాను మా యింటికి. పండుగ అందరం సరదాగా కలిసి చేసుకోవచ్చు. మా అక్కయ్యలను కూడ రమ్మని వ్రాసేస్తాను. పెళ్ళయ్యాక కలిసి, అందరం ఒక్కసారీ ఉండలేదు.'

'ఆగాగు. అప్పుడే అంతదూరం వెళ్ళిపోకు. ఇంకా లీవ్ దొరికినప్పటి మాటగా. అప్పుడు వ్రాద్దుగానిలే. అయినా యింటికి వెళ్తే రాణిగార్కి, అక్కలూ బావలూ మధ్య నేను గుర్తుంటానా? అందులోనూ అందరికీ చిన్నారి మరదలివి-గారాబాలు నువ్వు. నన్నొక్కడ్నీ వదిలేసి, తమరు పెత్తనాలకి చెక్కేస్తుంటే, ఆ గదిలో ముక్కూ, మొహం సరిగ్గా ఎరగని మనుష్యుల మధ్య బిక్కుబిక్కుమంటూ ఒక్కడ్నే పడుండాలి. ఎందుకొచ్చింది బాబూ. నేను రాను. నువ్వొక్కదానివీ వెళ్ళు.'

'గొప్ప సలహాయె... అంతగా గిరిగీసుకు ఒక్కరూ కూర్చోపోతే నలుగురితో చనువుగా కలిసిపోయి మీరూ తిరిగేయండి. అప్పుడు క్రొత్త వదిలిపోయి, అందరూ పాతయి పోతారు. రేపు మీ మామయ్యగారింట్లో పెళ్ళిలో నేను అందరితో కలిసిపోనూ? నాకు మాత్రం వాళ్ళంతా సరిగ్గా తెలుసా, ఏమిటి? మీరూ అలాగే కలిసిపోవాలి. అదీగాక నేనే పెత్తనాలకు పోతే మాత్రమేం? తమర్నెప్పుడూ నా హృదయ పీఠంలో పెట్టుకునే తిరుగుతానుగా. కనుక ఏ దిగులూ పెట్టుకోకండి.'

అబ్బ తలుచుకుంటూంటే ఎప్పుడు యింటికి వెళ్ళిపోదామా అనిపిస్తోందండీ. ఇన్ని పండుగలు చేసుకున్నాంగాని, మా యింటి దగ్గరున్నంత నిండు ఒక్క పండుక్కీ రాలేదు. ఏ పండుగొచ్చినా మా యిల్లు పెళ్ళివారిల్లులా ఉంటుంది. అక్కల పరిహాసాలూ, వదినల వేళాకోళాలూ, బావల్ని ఏడిపించడాలూ ఎంత సందడి! ఎంత హడావుడి! నలుగురున్న కుటుంబమేమో, ఎంత సరదాగా ఉంటుందో చెప్పలేను.

ఇంక మా శేఖరం బావ ఉంటే చెప్పనే అక్కర్లేదు. ఈ బావకు జోడీ మా చిన్నన్నయ్య, వీళ్ళిద్దరూ తలుచుకున్నారూ అంటే చాలు. సినిమాకి నాన్నగార్ని ఒప్పించి, నిద్రలో వున్నవాళ్ళను సైతం లేపి క్షణంలో యింటిల్లిపాదినీ కదిలించేవారు. అత్తయ్యా! ఆ సినిమాలో హరిద్వార్‌లో గుడులు చూపిస్తున్నారట అంటే చాలు; మా అమ్మమ్మ లేచి కూర్చునేది— అయితే నేనూ వస్తా పదండంటూ. అనక తిరిగొచ్చాక, సినిమాలో గుడులు చూపించకపోడానికి కారణం ఏదో కల్పించేవారనుకోండి. తను చలాకీగా ఉండడం కాక, అందర్నీకూడ హుషారుగా ఉంచేవాడు.

అందులోనూ మేనరికమేమో, చిన్నప్పట్నుంచీ అనుకున్న సంబంధం, మొదట్నుంచీఉన్న చనువు కావడాన — అల్లుడంటే దశమగ్రహం అంటారే, అలాంటి బాధలేవీ యింతవరకూ అనుభవంలోకి రాలేదు మా వాళ్ళకు. నిజం చెప్పాలంటే మా బావలిద్దరూ మంచివాళ్ళే. మా నాన్నగారూ, అమ్మా నొచ్చుకునేలా యేనాడూ ప్రవర్తించలేదు.

ఇంక మా భాస్కరం బావ ఎలాంటివాడంటే తను నవ్వుతూ, అందర్నీ నవ్విస్తూ కులాసాగా గడిపేస్తూంటాడెప్పుడూ. ఆ రోజుల్లో మా బావ వచ్చినప్పుడు, ఆ నాలుగురోజులూ నాలుగు క్షణాల్లా గడిచిపోయేవి.

ఒకసారేమైందంటే, మా నీరజక్క పెళ్ళయిన కొత్తది. దసరాపండక్కి బావొచ్చాడు. పండగనాడు మీద వసంతం పోయమని యింట్లో అందరూ నన్ను ప్రోత్సహించారు తెల్లటి బట్టలేసుకుని, నీటుగా ముస్తాబయి, బయటికెళ్ళడానికి తయారయి ఉన్నాడు మా బావ. గప్‌చిప్‌గా వెళ్ళి మీద పోసేశాను వెనుకనుంచి. వెంటనే బావ చటుక్కున నన్ను పట్టుకుని, అక్కడే డ్రెస్సింగ్ టేబిలుమీదున్న కాటుకా కుంకం తీసి ముఖమంతా పులిమేశాడు ..'

'అబ్బబ్బ మీ బావల ముచ్చట్లు చాలుగాని. తల బద్దలవుతోంది; కొంచెం కాఫీ తగలేస్తావా?'

చిన్ననాటి మధురస్మృతులను కలబోసుకుంటున్న వాసంతి భర్త కటుస్వరానికి విస్తుపోయింది. కళకళలాడుతోన్న ఆమె ముఖం కళాహీనమైపోయింది.

సిగరెట్టు పీలుస్తూ, గదిలో విసురుగా పచార్లు చేస్తున్నాడు ప్రభాకరం. పెట్టిన టిఫిను పెట్టినట్టే ఉంది. అంతవరకూ రేఖ గురించి, ఆ అమ్మాయి పెళ్ళి ముచ్చట్ల గురించి, పెట్టబోయే శలవు గురించి, హుషారుగా ఆలోచనలు సాగిస్తూన్న అతని ముఖం ఎర్రబడిపోయి ఉంది.

అతని తీవ్రత చూసేసరికి భయం కల్గింది వాసంతికి. ముఖం చిన్నబుచ్చుకుని, చటుక్కున లేచి వంటింట్లో కెళ్ళిపోయింది.

* * *

మిట్టమధ్యాహ్నం వేళ. ఏదీ కాని

స్నానంలో. భోజనాలవ్వగానే, ప్రభాకరం కాఫీ కావాలంటే చేసి, తీసుకెళ్తోంది వాసంతి. పండుగ భోజనాలు పూర్తయ్యే సరికి చాలా పొద్దెక్కిపోయింది. అంత క్రితమే వంటింటి పనులు ముగించుకుని నడుం వాల్చింది కామేశ్వరమ్మగారు.

పండక్కి పుట్టింటికొచ్చిందన్నమాటే గాని, నలుగురూ కలిశారన్న సంతోషం లేకుండా పోయింది వాసంతికి.

ఎంచేతో యిక్కడికొచ్చినప్పట్నుంచీ ప్రభాకరం ముభావంగానే ఉంటున్నాడు. అడిగినదానికి సమాధానం చెప్పడం, ఏదైనా వేళాకోళం చేసినా సీరియస్‌గా చూడ్డం, ఏవి పెట్టినా ఒద్దంటూ సరిగ్గా తినక పోవడం — అతనిదగ్గర నిలబడ్డానికే భయంగా ఉంటోంది వాసంతికి.

పండుగ ఎంతో సరదాగా గడపాలనీ, ఒకరోజు పిక్నిక్‌కనీ, మరో రోజు సినిమా కనీ యిలా ప్రోగ్రాంలు పెట్టుకుని ఉల్లాసంగా గడపాలనీ, ఎన్నెన్నో ఊహించుకుంది.

భర్త ప్రక్కగా తను వెళ్తూంటే, నలుగురిలో తమ జంట, అందరికంటే అధిక్యంగా కనిపించాలనీ, 'వాసంతీ! వాసంతీ!' అంటూ ఆప్యాయంగా అతను తనను పలకరిస్తూ తిరుగుతూంటే, తమ అన్యోన్యతను చూసి, వృద్ధులైన తల్లిదండ్రులు మురిసిపోవాలనీ, నలుగురితో చనువుగా కలిసిపోయి తిరుగుతోన్న అతన్ని చూసి, 'ఎంతో కలుపుగోలుమనిషి, గర్వం ఏమీలేదు' అని అందరూ చెప్పుకోవాలనీ, బావలూ, ఆయనా ఏమైనా తనను ఉడికిస్తూంటే, అక్కలను వెనకేసుకు తను దెబ్బలాడాలనీ ఎన్నో అనుకుంది.

కాని భర్త ముభావంతో అన్నీ తల క్రిందులయి పోయాయి. ఉత్సాహమంతా పొంగుతోన్న పాలమీద నీళ్ళు చిలకరించినట్టు అణిగిపోయింది. పుట్టింటికొచ్చానన్న సంతోషం ఆమెలో కాగడా పెట్టి వెదికినా కనిపించడంలేదు.

ఇటు చూస్తే భర్త మౌనంతో బాధిస్తున్నాడు. అటుచూస్తే తను సరదాగా నలుగురితో కలవలేక పోతోంది. అసలు ఎందుకొచ్చిందిక్కడకు? రాకపోయినా ఎంతో బాగుండి పోనుగదా అనుకోసాగింది పదే పదే.

బావా-మరదలూ

తను కాలేజీ చదువులు చదివింది. బావలందరికంటే పెద్ద చదువులు. చదివిన పెద్ద ఆఫీసర్ని తెచ్చి పెళ్ళి చేశాడు తండ్రి. అందరికంటే తనే ఎక్కువ అదృష్టవంతురాలంటారంతా. కాని అదీ ?...నిజానికి తనకంటే ఎన్నోరెట్లు అదృష్టవంతులు నీరజక్క, జలజక్కాను.

ఇలాంటి కోపతాపాలు, అలకలు, బతిమాలుకోడాలు వాళ్ళ జీవితాలలోనే లేవు. ఆయనకంటే బాగా తక్కువ చదివినా బావలు ఎంత సహృదయులు? వాళ్ళ సంస్కారంముందు యీయన సంస్కారం ఎంత అల్పంగా కనిపిస్తోంది?

నలుగురూ సరదాగా చేసుకుందామనుకున్న ఈ పండుగ ఎంతభారంగా గడుస్తోంది?

వాళ్ళ మామయ్యగారింటికి పెళ్ళికి వెళ్ళింది మొన్న. అక్కడ తనిలాగే సంకుచితంగా ప్రవర్తించిందా? వాళ్ళందరిలో ఎంత యిదిగా కలిసిపోయింది?

వాళ్ళు వాళ్ళతో నవ్వుతూ తుళ్ళుతూ తిరిగిన పెద్దమనిషి, ఇక్కడ కొచ్చింది లగాయితు శిక్ష ననుభవిస్తున్నట్టుగా కూర్చున్నారు నలుగురితో సరదాగా కబుర్లు చెప్పడంగాని ఏమీలేదు. ఎవరైనా వెళ్ళి మాట్లాడించినా తూచినట్టు రెండుమాటలు మాట్లాడుతున్నారంతే

ఆయన తీరుచూసి, 'ఎప్పుడూ అతనిలాగే ఉంటాడేమిటి? ఎలా చేస్తున్నావే బాబూ అతనితో కాపరం' అనేశాడు అన్నయ్య.

సరిగ్గా తిండి అదీ తినకపోవడంచూసి అమ్మ అడిగింది.

'ఎందుకే అతనదోలా ఉంటున్నాడు. పండుగ బహుమానాల కోసమా? ఏం కావాలో కనుక్కో, మా శక్తికి మించనిదైతే యివ్వగలం గాని, శక్తికి మించినది ఎక్కడ్నించి తేగలం చెప్పు. నీకూ తెలుసుగా మన స్థితిగతులు' అంది అమ్మ.

తను సుఖంగా కాపరం చేసుకుంటోందనీ, ఏమీ కష్టపడడం లేదనీ, భర్త ఎంతో యిష్టంగా చూసుకుంటాడని అందరూ అనుకోవాలనీ, తల్లిదండ్రులు ఎంతో తృప్తిపడాలని ఆశించింది. కాని తన ప్రవర్తనతో అంతా తారుమారు చేశాడు భర్త.

తన నిక్కడ యింత యిరుకున పడేసి నలగ్గొట్టి, హృదయాన్ని తూట్లుచేసి, రేపు తమింట్లో ఒంటరిగా ఉన్నప్పుడు ఎంత ఆప్యాయం చూపిస్తేనేం? ఎంత అనురాగం కురిపిస్తేనేం? ఎవరిక్కావాలి? హృదయంలో ఒకమూల ఈ నాటి ఈ ప్రవర్తన, ముల్లులా కలుక్కు కలుక్కుమంటూంటే, ఆ ఆప్యాయానురాగాల్ని మనస్ఫూర్తిగా స్వీకరించగలదా? పరిపూర్ణ హృదయంతో తనను తాను, అతనికి అర్పించుకోగలదా?

తల్లిదండ్రుల తృప్తికోసం, —పండుగ పూట వాళ్ళ మనస్సులను కష్టబెట్టకూడదన్న ఉద్దేశంతో, లేని ఉత్సాహం తెచ్చిపెట్టుకుని, దిగులుతో కృంగిపోతోన్న మనస్సుని మాటిమాటికి సమాధాన పరుచుకుంటూ, క్రొత్తబట్టలు కట్టుకుంది వాసంతి.

క్రొత్తచీరలో, నూతన శోభ సంతరించుకుని, క్రొత్త అందాలు చిందిస్తోన్న వాసంతిని చూస్తోన్న కొద్దీ, దగ్గరకు తీసుకోవాలన్న కోర్కెకంటే, అర్థం లేని చికాకు ఎక్కువైపోయింది ప్రభాకరానికి. ఈ వాసంతి నాది, ఈ అందమంతా నా సొత్తు, ఇందులో మరెవరికీ పాలులేదు అని అతని మనస్సు ఘోషిస్తూంటే, అంతరాంతరాల్లోంచి ఎవరో, 'కాదు, కాదు. ఈ వాసంతి నాది కావొచ్చు గాని, ఆమె మనస్సంతా వాళ్ళ బావలచుట్టూ ఉంది. ఆ క్రొత్తబట్టలు, ఆ పండుగ ముస్తాబు నాకోసంకాదు, వాళ్ళ బావల కోసం' అంటూ అరుస్తోన్నట్టు అనిపించసాగింది. తెలియని కోపంతో అతని మనస్సంతా గజిబిజయి పోయింది.

ఈ వాసంతికి తనంటే ప్రేమలేదా? తనకంటే వాళ్ళ బావలే ఎక్కువా? — తన బాధ అర్థం చేసుకోదేం? తనను దగ్గరకు తీసుకుని, మీ దంతా వట్టి అపోహ. మీరే నా సర్వస్వం అని చెప్తే ఎంత బాగుంటుంది.

తనను లెక్కపెట్టకుండా ఎంత నిర్లక్ష్యంగా తిరుగుతోంది? వాళ్ళక్కలూ బావలూతోటీ ఎంత కులాసాగా కబుర్లు చెప్తోంది? క్రొత్తచీర కట్టుకుని ఫోజులు

కొడుతూ వాళ్ళ బావలముందు అలా తిరుగుతోందిగాని, కట్టుకున్న భర్త క్షోభతో యిలా అలమటించి పోతుంటే చీమ కుట్టినట్టయినా లేదేం? తన కోపానికి, విసురుకీ జడిసి, కొంచెం దిగులుగా ఉందంటే, 'నన్నెందుకిలా దూరం చేస్తున్నారు? అంటూ ఒక్కసారి తన హృదయంలో తలదూర్చి ఏడిస్తే తనకెంత తృప్తిగా ఉండును?' ఒంటికి కారం రాసుకున్నట్టు అవస్థపడుతున్నాడు ప్రభాకరం.

'ఛ ఛ బుద్ధితక్కువై వచ్చానిక్కడికి జన్మలో రాకూడదింక' అనుకున్నాడు ఎన్నోసార్లు. ఆ విసుగుతోటే ఆకలిలేదని, పిండివంటలన్నీ తీసేసినమనిషి వెంటనే కాఫీ కావాలనేసరికి వాసంతి విస్తుపోయింది.

కాఫీచేసి, కప్పుతో వస్తూంటే, 'వాసంతి పక్కా గృహిణయిపోయింది,' అన్నారెవరో ప్రక్కగదిలోంచి.

'అబ్బ ఎంత ఓపిక. ఇదివరకటి రోజుల్లో గ్లాసుతో మంచినీళ్లు తెచ్చిపెట్టమన్నా మాటవినేదికాదు బద్ధకమంతా ఏమైపోయిందో?' — అవతలి గదిలోంచి విని పిస్తోన్నమాటలు విననట్టు తలొంచుకు లోపల కొచ్చేసింది.

సన్నగా రేడియోపెట్టుకు, పేపరు తిరగేస్తూ, మౌనంగా కూర్చున్నాడు ప్రభాకరం. అతన్ని కదిపితే ఎక్కడ కరవొస్తాడో, మాట్లాడిస్తే,ఏం మాటలు విసురుతాడో నన్న భయంతో దిగులుగా కూర్చుంది వాసంతి.

గంటలు దొర్లిపోతున్నాయి. అతను మాట్లాడడు — అక్కడ్నించి కదలడానికి తనకులేదు. శిక్షనుభవిస్తున్నట్టు ఉలుకూ పలుకూ లేకుండా ఎదురుగా అలా కూర్చోవల్సిందే

అంతక్రితం రోజు శేఖరం బావ అంటున్నాడు. — 'ఎలాగా పెళ్ళయ్యాక వాసంతి బాగా మారిపోయింది గదా సిరజా! ఇదివరకటిలా ఆ ఆప్యాయత, చనువుగా తిరగడం, అన్నీ తగ్గించేసింది. కీపిగా, బెట్టుగా కూర్చుంటోంది. పలకరించినా తూచినట్టు సమాధానా లిస్తోందంతే. ఎలాగైనా పెద్దాఫీసరు పెళ్ళాం గదా. మనమెంత వాళ్లముందు?'

'ఛ అదేంలేదు. పెళ్ళయ్యాక కొంత చిలిపితనం పోయిందంతే. ఎల్లకాలం ఒకలా ఉండదుగదా. దానిముఖం, దానికి గర్వమేమిటి?' అంటూ తేల్చేసింది నీరజక్కయ్య.

ఎందుకో ప్రక్కగదిలోకి వెళ్లిన వాసంతికి, ఆమాటలు వినిపించేసరికి భోరున ఏడవాలని పించింది.

సాయంత్రం ముఖం కడుక్కొని వస్తూంటే, భాస్కరంబావ అంటున్నాడు. 'ఏమోయ్! జలజా! మీ చెల్లెలు నల్లపూసయి పోయిందేమిటి? శ్రీవారొచ్చాక మిగతా ప్రపంచం కనిపిస్తున్నట్టులేదే' అని.

'గది వదలకుండా ఎంతసేపుంటావు గాని, యిలా వచ్చికూర్చో కొంచెంసేపు' అంటూ పిలిచాడు శేఖరంబావ.

బావగారి పిలుపుతో తప్పనిసరయి వచ్చి కూర్చుంది.

'అవునే వసంతా నువ్వుమాస్తే మళ్లీ రేపు వెళ్లిపోతున్నావు. మళ్లీ ఎన్నాళ్ళకో గాని చూడ్డం పడదని, మీ బావను పోరి నేను తీసుకొస్తే నువ్వు క్షణమైనా మాతో మాట్లాడకపోతే ఎలా? రేపట్నుంచి ఎలాగా, నిన్ను మీ శ్రీవారూ, మీ శ్రీవారిని నువ్వూ చూసుకోవాల్సిందే గదా ఈ ఒక్క రోజుకి మాదగ్గర కూర్చో'

ఏడవలేక నవ్వుతూ కూర్చుంది వాసంతి.

ఆ కబుర్లూ యీ కబుర్లూ అందరూ తెగ చెప్పేస్తున్నారు. లోపల, గుండెలు పీచుపీచుమంటున్నా, బాగుండదని మధ్య మధ్య సంభాషణల్లో పాల్గొంటోంది వాసంతి.

బావ, తను బాగా చిన్నపిల్లప్పుడు చేసిన అల్లరేదో చెప్తున్నాడు. అందరూ నవ్వుతూంటె తనకూ నవ్వొచ్చేసింది.

ప్రక్కగదిలో ఒకసారిగా కుర్చీలు బల్లలు దబదబలాడేయి. వాసంతిగుండెల్లో వేయిపిడుగులు పడ్డట్టయింది,

'మీవారు సిగ్నలు యిచ్చినట్టున్నారు వెళ్లు తల్లీ' అంది అక్కయ్య.

లోపల భయంగా వున్నా, వెంటనే లేస్తే అందరూ నవ్వుతారని కొంచెంసేపు అలాగే వుండిపోయి అప్పుడు లేచివెళ్లింది వాసంతి.

'అప్పుడే వచ్చేశావేం? మళ్లీ పాపం! ఎన్నాళ్లకోగాని కలుసుకోవు – వెళ్లి అక్కడే కూర్చోలేక పోయావా?' అన్నాడు వెటకారంగా ప్రభాకరం.

అతని మాటలకు వెంటనే సమాధానం చెప్పలేకపోయింది వాసంతి

'అక్కా వాళ్లూ ఏవో వేళాకోళాలాడుతూంటే వదిలి వస్తే బాగుండదని కూర్చుండిపోయాను' అంది నెమ్మదిగా.

'వేళాకోళాలకి చంటిపిల్లవా యేం? అంత మోజు తీరకపోతే, ఆ బావలింటికే

మీ వయసు చెప్పనవసరం లేదులెండి! పోయిన సంవత్సరం జనాభా లెక్కల్ని చూచి రాసుకుంటాం!



వెళ్ళి పోసి.'

అసహ్యంతో నిలువెల్లా కంపించింది వాసంతి.

పూజ్యనీయులు, తండ్రిలాంటి వారూ అయిన బావల గురించి ఎంత హేయంగా మాట్లాడుతున్నాడు! తనను చూడగానే, 'రా అమ్మా! కూర్చో' అంటూ ఆప్యాయంగా పలకరించే బావలను ఎంత నీచంగా అంచనా వేశాడు!

బాధ, కోపం అనుమానాలతో వాసంతి అతకుతలాడి పోయింది. 'మీ రేమయినా అంటే పడతానుగానీ, మా బావల గురించి అన్యాయం మాటలంటే పడను. వాళ్ళు నాకు తండ్రి తర్వాత తండ్రి అంతటి వారు.'

'ఎక్కడా మొగుడు లేకపోతే అక్క మొగుడే గతన్నారు పెద్దలావాడే. అలాంటిదీ వేళ నువ్వు బయల్దేరి బావ తండ్రితో సమానమని బుజాపు చేద్దాంగాని.

అయినా మీ యిళ్ళలో యిలా జరుగుతాయేమో గాని, మా యిళ్ళలో బావగారి యెదుటకు మరదలు రాదు. వాళ్ళకు కనిపించదు.'

'అలాగా—అయితే మీ యిళ్ళలో బావగార్కి మరదలు కనిపించక పోవచ్చు గాని, వయసొచ్చిన మరదలు బావగారికి ఉత్తరాలు వ్రాయొచ్చనుకుంటా???

మీరన్నట్టు, ఆలస్యంగా పెళ్ళి చేసుకొన్న మగవాడికి, వయస్సులో ఉన్న మరదలు కనిపిస్తే ఆక్షేపణ కావొచ్చు. కాని ఊహ వచ్చి రాకముందే, యింట్లో బావగారిలా అడుగు పెట్టిన వ్యక్తి చుట్టూ, బావా? బావా? అంటూ పసితనం నుంచి కాళ్ళా వేళ్ళా తిరిగిన మరదలికీ, ఆ మరదలికీ వ్యత్యాసం లేదా?'

'ఏమో? నువ్వెన్ని చెప్పు — నువ్విలా వాళ్ళతో నవ్వుతూ తుళ్ళుతూ మాట్లాడడం నా కిష్టముండదు. సంస్కారంలేని మనిషి ననుకో. సభ్యత తెలీకుండా మాట్లాడుతున్నా ననుకో. తర్వాత నీ యిష్టం'—అదే అతని అసలు ఉక్రోషం, నిజ స్వరూపమూను.

* * *

మంచంమీద కూర్చుని, అప్పుడే వచ్చిన మల్లెలూ, కనకాంబరాలూ మాల కడ్తోంది వాసంతి, ప్రభాకరం ఆఫీసు నుంచి తిరిగి వచ్చేశాడు.

'నీ కిష్టమైన బావగారు వేంచేస్తున్నారట. ఇప్పట్నుంచీ గులాబ్‌జాం చేసి రెడీగా పెట్టుకో' అంటూ మంచం మీద గిరాటేశాడు.

ఎకసక్కెంగా అంటూ, గులాబ్ జాం దగ్గర 'ఒత్తి పలికిన భర్త మాటలకు వాసంతి నిర్లిప్తంగా ఉండిపోయింది.

ఇన్నాళ్ళకు తనింటికి బావ వస్తున్నాడన్న ఆనందంకంటె దిగులు భయం అధికం అయ్యాయి ఆమెకి.

'అర్జంటుగా ఏదో పని తగిలి యిటు వైపుల కొస్తున్నాడట అతను. ఇంతకాలానికైనా వాసంతి కాపురం చూసే అవకాశం కలిగినందుకు ఎంతో సంతోషంగా ఉందని మరదలి నలభీమ పాకాలు త్వరలో వచ్చి రుచి చూస్తాననీ, ముఖ్యంగా తనొచ్చేసరికి గులాబ్‌జాం రెడీగా వుంచమనీ ఉత్తరం వ్రాశాడతను

పెళ్ళయిన క్రొత్తలో ఒకసారి ఏవో మాటల మధ్య భర్తతో అంది వాసంతి—'మా బావకు గులాబ్ జాం ఎంతో యిష్టమని, ఒకసారి అతనొచ్చినప్పుడు, పుస్తకంలో చదివి, ట్రై చేసి చూసేను ఎంతో బాగా కుదిరింది. అప్పట్నుంచీ నవ్వుతూ అంటూంటాడు—మీ యింటికొచ్చినప్పుడు గులాబ్‌జాం చేసిపెట్టు అని' అంది.

ఆ మాటలింకా ఎక్కడ జ్ఞాపకం ఉన్నాయో అతనికి, యిప్పుడు నొక్కి పలుకుతున్నాడు.

'మొన్న యింటికి వెళ్ళినప్పుడు నీచేతి గులాబ్‌జాం తిని చాలా రోజులయిందన్నాడు బావ.

'ఇక్కడ చేయాలంటే నాకు బిడియం బాబూ! అమ్మదగ్గరకి రెమ్మకోసం వచ్చాను. అంతగా కావాలంటే మా యింటికొచ్చినప్పుడు కావల్సినవి వండి పెడతాలే' అన్నాను. అందుకు సరదాకి యిలా వ్రాశాడనుకుంటా' అంది సంజాయిషీ యిస్తున్నట్టుగా.

'నీ యిష్టమైన బావగారు వస్తోంటే, మధ్య పానకంలో పుడకలా నేనెందుకు అడ్డు. నేను ఏ క్యాంపో వెళ్ళిపోతాను మీరు సరదాగా ఎంజాయ్ చేసుకోవచ్చు' అన్నాడోసారి.

మా వాళ్ళ బావల విషయంలో అనుమానం, సాధింపులు ఎప్పుడూ ఉన్నవే. తన ఉద్దేశ్యం కూడ ఏ నాడో సూటిగా తెలియ చెప్పేశాడు గనుక, యింక ఏం అనడానికీ వెనుదీయడంలేదు ప్రభాకరం.

అతనికీ జడిసే, గులాబ్‌జాం వండాలని మనస్ఫూర్తిగా ఉన్నా తయారుచేయడం మానేసింది వాసంతి.

ఆవేళ కొంచెం మంచిచీర కట్టుకుంది. 'ఏమిటి విశేషం. ముస్తాబయ్యావు' అన్నాడు ప్రభాకరం. 'ఓహో తమరి బావగారు వస్తున్నారుకదూ. మర్చే పోయాను' అన్నాడు ఆ వెంటనే.

'ఏమిటో ఆ ఎత్తిపొడుపులు. రోజూ ముస్తాబవడం లేదా? రోజూ బట్టలు కట్టుకోవడం లేదా? ఏ వెలిసిన చీరో కట్టుకున్నా ప్రభాకరం పెళ్ళామనే అంటారుగాని, ఆ తలవంపులు ఎక్కడో ఉన్న అమ్మకూ నాన్నగార్కి రావుగదా?' అని బాధపడింది వాసంతి.

వాళ్ళ బావ రాగానే, ముభావంగా ఏవో రెండు మాటలు మాట్లాడి, అర్జంటు మీటింగేదో ఉందని, తీరుబడిగా బావా మరదళ్ళు మాట్లాడుకోండంటూ వెళ్ళిపోయాడతను. అమాయకంగా నవ్వుతూ ఉన్న బావకేం తెలుసు—హృదయాన్ని కోసే ఆ మాటల అర్థం.

అడుగడుగునా యివే మాటలు. నిలబడ్డానికి, కూర్చోడానికీ కూడ బెదురుగానే ఉంది. బావతో మనసారా మాట్లాడాలన్నా భయమే.

ఆ సాయంత్రం భోంచేస్తూ, 'ఏకంగా యిన్ని చేసేశావేమిటి? ఎందుకూ నేస్తూ పోదుపో అని దేశమంతా గగ్గోలుగా ఉంటే —' అన్నాడు నవ్వుతూ. వాసంతి ఖిన్నురాలయి పోయింది. వాళ్ళ బావా చిన్నబుచ్చుకున్నాడు.

భర్త ఆఫీసుకి వెళ్ళిపోయాక కూడ, అతను దగ్గరలేకపోయినా, అతని మాటల ప్రభావంవల్ల మనసారా వాళ్ళ బావతో మాట్లాడలేకపోతోంది వాసంతి.

బావతో సరదాగా కబుర్లు చెప్పుకుంటూ, బావా భర్తా కలిసి తనని ఉడికిస్తూంటే, ఒకరోజు సినిమాకని, మరో రోజు ఊరు చూడ్డానికని, అలా వెళ్తుంటే ఎంత బాగుండిపోను.

భర్త మాటల ప్రభావంతో బావకు తను దూరమైపోయింది. బావంటే తన కెక్కడ అంతులేని అభిమానమోనన్న బెంగతో అతను తప్పుకు తిరుగుతున్నాడు మధ్య—ఎటూ అర్థంకాక సతమతమయ్యేది బావ' అనుకోసాగింది వాసంతి.

* * *

వాసంతి వాళ్ళక్క ఉత్తరం వ్రాసింది. ఆ ఉత్తరంలో నిష్ఠూరం ఎక్కువగా ధ్వనించింది.

'మీ బావగారు క్షేమంగా యిక్కడికి చేరారు. రాగానే పరుగుపరుగున ఎదురెళ్ళి 'మా వాసంతి ఎలా ఉంది? వంట బాగా చేసేయగల్గుతోందా? ఇల్లెలా చక్కబెట్టుకుంటోంది? వారం ఉంటానని వెళ్ళి నాలుగురోజుల్లోనే వచ్చేశారేం' అంటూ ప్రశ్నలవర్షం కురిపించాను.

'ఎంతైనా ఆయన పెద్దాఫీసరుగదూ? మనలాంటివాళ్ళలో కులాసాగా గడపడానికి, వాళ్ళ టైము వేస్టు చేయాల్సివస్తుందని, వచ్చేశానన్నారు.

ఆఖరికి గుచ్చిగుచ్చి అడగ్గా, 'వాసంతి పరాయిదైపోయింది భర్త ప్రభావం బాగా పనిచేస్తోంది. ఇదివరకటిలా ఆటలు పట్టిస్తూ, విసిగిస్తూ, బావా! బావా! అంటూ చుట్టూచుట్టూ తిరిగే వాసంతి కాదు ఇప్పుడు బాగా మారిపోయింది' అన్నారు ఎంతో బాధగా.

మీ యింటిదగ్గర్నుంచి తిరిగొచ్చాక, చాలా రోజులదాకా బావ మామూలు మనిషి కాలేకపోయారు' అంటూ వ్రాసుకొచ్చింది.

ఇలా చదవడం ముగించిందో లేదో, ప్రభాకరం ఆఫీసునుంచి వచ్చేశాడు

ఉత్తరం చేతోపట్టుకుని, స్థాణువులా నిలబడున్న వాసంతినిచూసి, 'ఎక్కణ్ణించా ఉత్తరం?' అంటూ తీసుకు చదివాడు.

'ఏడవలేక పోయారు. వెధవ ఈర్ష్య; మనల్ని చూసి. లేకపోతే అడ్డమైనవాళ్ళూ వచ్చారని, చేతులు కట్టుకు వెంటబడ తిరుగుతాను' అంటూ విసురుగా గిరాటేశాడు ఉత్తరాన్ని.

'తన స్వంత బావ!

—శ్రీవారి దృష్టిలో అడ్డమైన వాళ్ళూ అన్న లెక్కలోకి జమయ్యాడు!

ఆఫీసరని అహంకారమా?

కాదు.

డబ్బుందని గర్వమా?

అంతకంటే కాదు.

తన క్రింద పనిచేసే చిన్న చిన్న ఉద్యోగులతో స్నేహితం ఎంతో ఆదరంగా అతను మాట్లాడటం ఎన్నోసార్లు చూసింది.

డబ్బుందని గర్వంగా వుండేవాళ్ళంటే అతనికి ఎంతో అసహ్యం — ఆ విషయం తనకు తెలుసు.

మరి...??? మరి? ఒకటే కారణం కనిపిస్తోంది.

బావా మరదళ్ళ మధ్య వుండె అను బంధం మాటల కతీతమైనది. ఏ కవీ వర్ణించలేనట్టిది. దానిని అర్థం చేసుకోగల శక్తి ఏ కొద్ది మందికో తప్ప అందరికీ ఉండదు.

అలాంటిది—మెడలో మూడు ముళ్ళూ వేసి, తన సర్వస్వం చేసుకొన్న అమ్మాయీ ఎప్పుడో అప్పుడు, ఏనాడో ఒకనాడు, ఈ చెట్టంత మనిషితోటీ, 'మా బావ' అంటూ పరాయి పురుషుడి గురించి యిష్టంగా చెప్తే, ఏ మొగుడు — ఏ మగవాడు సహించగలడు?

ఎవ్వరూ సహించలేరు.

నిజంగా సహించాడూ అంటే అతనో గొప్ప వ్యక్తనే అనుకోవచ్చు

ఆ రాత్రి భర్త నిద్రపోయాక వాసంతి కలం, కాగితం తీసి అక్కగార్కి ఉత్తరం వ్రాయడాన్కి కూర్చుంది.

'నీ ఉత్తరం అందినది. నీకు, బావకూ నా మీదున్న ఆప్యాయానురాగాలకి, సరిపడ ఆదరాన్ని తిరిగి పొందలేదని నాకూ తెలుసు. అందుకు క్షమించు.

నేనలా ప్రవర్తించడాన్కి కారణం మీ రనుకున్నట్టు అహంకారంకాదు. మా యిద్దరి ఆ ప్రవర్తనకు కారణం నేను ఒక బావగార్కి మరదలును కావడమే. అదే గొప్ప నేరమయిపోయింది శ్రీవారి దృష్టిలో.

సంసారంలో భార్యాభర్తల్లో ఒకరిమీద ఒకరికి నమ్మకం లేనప్పుడు ఆ సంసారం ఎలా ఉంటుందో వేరే రాయనవసరం లేదు.

ఆయన కిష్టంలేనప్పుడు, అందుకు వ్యతిరేకంగా ప్రవర్తించడం ఎందుకు? గృహాన్ని నరకం చేసుకోవడ మెందుకనే, నేను ఆయన కనుగుణంగా మారిపోయి నడుచుకున్నాను.


బావమనస్సు నొప్పిస్తున్నానని తెలుసుండీ, ఏమీ చేయలేకపోయిన నిర్భాగ్యురాలిని నన్నర్థం చేసుకోగల్గితే ధన్యురాలినే.'

ఉత్తరం అయితే వ్రాసిందిగాని, దాన్ని పోస్టుచేయలేక పోయింది వాసంతి.

ఇన్నాళ్ళూ వాసంతి తన భర్తగురించి అందరూ ఎంతో విద్యావంతుడనీ, సంస్కారవంతుడనీ, చాలా తెలివైనవాడనీ చెప్పుకుంటూంటే మాత్రమేవింది.

అలాంటిదిప్పుడు, అతని గురించి, ఎంతో సంకుచిత హృదయుడన్నా పట్టి అనుమానస్తుడనీ నలుగురూ అనుకుంటూంటే తను సహించలేదు.

అనుకుంటే అనుకోనీ, తనగురించి — అహంకారనీ, పెళ్ళయాక మారిపోయిందనీని'—అనుకుని ఆ ఉత్తరాన్ని ముక్కలు ముక్కలుగా చింపేసింది వాసంతి.



నేటి బాలలు



నేను అన్నయ్య గదిలో చదూకోను - నాకు ప్రత్యేకమైన గది కావాలి!
వాడి గదిలో సిగరెట్లు తాగడానికి కుదర్దు - నాన్నతో చెప్తాడు
పెద్దలకు మాత్రమే!
శృంగారయాత్ర
వాళ్ళే అలా రాస్తారుగాని మనల్నికూడా వెళ్ళనిస్తార్రా - వెళదాం పద
తొరతొరగా 'అఆ'లు నేర్చుకొని సీతకో ప్రేమలేఖ రాయాలా!
నువ్వు కిట్టిగాడితో స్నేహం పట్టినప్పట్నుంచి నాతో మాట్లాడ్డం మానేశావ్! వాడు బాగా చెడగొట్టేస్తాడ్రా నిన్ను!

రేపటి పౌరుడు



ఏమేవ్! మనవాడు ఎంతమంచి వస్తువులతో ఆడుకుంటున్నాడో చూద్దువుగాని రా!
కిరసనాయిలు
ఇదుగో పంతులూ - అది చదవలేదేం ఇది చదవలేదేం అనడిగితే మాత్రం నీ ఉద్యోగం ఊడిపోతుంది జాగ్రత్త!
మర్యాదగా ప్రోగ్రెస్ కార్డుమీద సంతకం పెట్టు నానా!
పరీక్షలు కదా - శాయిగాడింట్లో చదువుకుంటానని చెప్పి వచ్చేశాను! ఇప్పుడేం సిన్మాకి వెళదాం మరి?

సీరియల్



బ్రతుకు బాట

పి. సత్యవతి

జరిగిన కథ

మాధవరావు, విమల, రఘుపతి, సుమిత్ర అన్న పూర్ణమ్మగారి సంతానం. తండ్రి చనిపోవడంతో కుటుంబ భారమంతా మాధవరావు మీద పడు తుంది. మాధవరావు భార్య ఇందుమతి. కొడుకు విశ్వనాథం. సంసారాన్ని ఈదుకుంటూనే తమ్ముడు రఘుపతి, చెల్లెలు సుమిత్ర పెళ్ళిళ్ళు చెయ్యా అని సంబంధాలు చూస్తాడు. మాధవరావు అంగీ కారంతో సుమిత్ర కాలేజీలో చేరుతుంది అక్కడే ఆమెకు కుముదినితో పరిచయమవుతుంది కుముదిని సహాయంతో ఉద్యోగం సంపాదించు కుంటుంది. ఆమె బసవరాజు సలహామీద బ్యాంకులో ఉద్యోగం సంపాదించుకుంటుంది సావిత్రి పెళ్ళి కాకుండానే గర్భవతి అయిన విషయం విని దిగ్భ్రాంతి చెందుతుంది. ఆమె భారాన్ని మోయక తప్పలేదు సుమిత్రకి. సావిత్రి ప్రసవించిన కొద్ది సేపటిలోనే బిడ్డ మరణిస్తుంది. ఆమె సుమిత్ర తోనే వుండిపోడానికి నిశ్చయించుకుంటుంది

11

పగలంతా కాసినఎండ పడమటి దిక్కుకి వెళ్ళిపోయి అదృశ్యమై పోయింది. ఆవార్త చెవిన పడగానే చల్లటి గాలిని వెంటపెట్టుకు వచ్చింది సాయంత్రం. హైదరాబాద్ నగరం వాతావరణంలోవున్న సుగుణం ఇదే వొళ్ళు మంట తెత్తించే వడగాల్పులు వీయవు నడివేసవిలోనైనా.

వరీక్ష సంతృప్తిగా వ్రాసివచ్చిన సుమిత్ర తీరికగా కూర్చుని కల్యాణికీ కుముదినికీ, వారణాసిలో తనకి కలిగిన అనుభవాలు వివరిస్తున్నది. గదిలో లైటు వేసి వాళ్ళకి షర్బత్ కలిపి తీసుకువచ్చి, తనూ కూర్చుంది సావిత్రి.

'నేను వెళ్ళినతరువాత సావిత్రికి కాస్త హుషారు వచ్చినట్లుంది. అంత నీరసంగా కనపడడంలేదు' అన్నది సుమిత్ర.

'అవును— మా చెల్లాయిలు సావిత్రిని ఒక్కక్షణం వూరుకోనిచ్చారా! వెంట బెట్టుకుని ఊరంతా త్రిప్పారు. సినిమాలకి తీసుకువెళ్ళారు— అంతేకాదు — సికింద్రా బాద్‌లో ఒక పెద్దబట్టల షాపులో సేల్స్ గరల్ ఉద్యోగం సంపాదించింది మీసావిత్రి!' అన్నది కుముదిని—

'సేల్స్‌జాబ్ అంటే పగలంతా కాళ్ళు నెప్పులు పుట్టేటట్లు నిలబడాలి. నువ్వు చెయ్యలేవు సావిత్రి ఆ వుద్యోగం!' అన్నది సుమిత్ర.

'నాకు కొంచెం ఓపికగానే వుంది. అయినా ఇంకా పదిహేనురోజులు టైం వుంది చేరడానికి ఈలోపల టానిక్కులు త్రాగి బలుస్తాను—' నవ్వింది సావిత్రి

'సంతోషం సగంబలం—' అన్నది కల్యాణి—

'విమలత్త వ్రాసిన ఉత్తరం చదివావు కాదు—ఎల్లుండి వస్తుందట!' అన్నది సావిత్రి.

'అవును — అసలే నేను అప్పులో వున్నాను — అమ్మగారి జైత్రయాత్రకి ఏం తట్టుకుంటానో!.

'అందుకే ఇంగ్లీషు వాళ్ళల్లాగ నిర్మొహమాటంగా వ్రాసెయ్యాలి—ఇప్పుడు నేను కొంచెం ఇబ్బందిలోవున్నాను తర్వాత రమ్మని—' అన్నది కుముదిని—

'ఇలాంటి విషయాల్లో మనవాళ్ళకి అర్థం చేసుకునేశక్తి వుండదు కుముదినీ— వాళ్ళ యిష్టమున్నప్పుడు రావడం వాళ్ళ జన్మహక్కైనట్లు భావిస్తారు మన బంధు వులు—మనం ఎంత ఇబ్బందిలోవున్నా వాళ్ళకి జరిపే మర్యాదలన్నీ జరిపి పంపాల్సిందే లేకపోతే నడివీధిలోకి లాగు తారు మన పరువుని— మన మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక పతనానికి ముఖ్య కారణం ఇదే—' అన్నది కల్యాణి

'బంధువులు రాకూడదని కాదు—కానీ వాళ్ళుంక మనమీద అనురాగంతో మనని చూడాలనే వాత్సల్యంతో అయితే ఫరవా లేదు—మనమిక్కడ ఎంత సుఖపడు తున్నామోచూసి ఓ నెల రోజులు మనకి టాక్స్‌వేసి పోదామనుకునే మనస్తత్వం వున్న చుట్టాలంటే నాకు చాలా కోపం' అన్నది సుమిత్ర.

అలా అంటున్నప్పుడు తను రెండురోజుల క్రితం చిన్నన్నయ్యకి వ్రాసిన ఉత్తరం జ్ఞాపకం వచ్చింది వేసవి సెలవులకి రమ్మని అర్థిస్తూ వ్రాసిన ఉత్తరం అది వాళ్ళనిరమ్మని వ్రాయడం, విమల వస్తుంటే విసుక్కోడం న్యాయమేనా? అని తనలోతనే ప్రశ్నించుకుంది సుమిత్ర. తను ఇందాక చెప్పినమాట వాటికి సరైన జవాబు కృష్ణుడిని తను వాచీ కొనుక్కో నివ్వనందుకు విమలక్కకి కోపంవచ్చి ఘాటుగా ఉత్తరం వ్రాసింది. సంవత్సరం తను వాడిని ఇంట్లో వుంచుకుని, కాలేజి ఫీజులుకట్టి పుస్తకాలు కొనిచ్చినా, విమ లక్కకి సంతోషం లేకపోయింది. అందరి దగ్గరా సహాయం పొందడం దాని జన్మ హక్కనుకుంటుంది కాబోలు!

'రేపు జాయినవుతారా డ్యూటీలో—' అనడిగింది కల్యాణి.

'కాక తప్పుతుందా!' అన్నది సుమిత్ర. ఆమె బెనారస్‌నుంచివచ్చి నాలుగు రోజు లైంది.

వచ్చినరోజునే కుముదిని వచ్చింది. ఇవ్వాళ కల్యాణీ వచ్చింది.

కాని బసవరాజుమాత్రం కన్పించలేదు—

'అతను ఆఫీసుకువస్తే తను తిరిగి వచ్చిన సంగతి తెలియకుండా వుండదు. అతనిసంగతి కల్యాణిని అడగాలనిపించ లేదు—

ప్రక్కగదిలో స్టూడెంట్స్ సెలవులకి వెడుతున్నారుకాబోలు. వాకిట్లో రిక్షాలు ఆగాయి.

'వాళ్ళదగ్గర తాళంచెవులు అడిగి తీసుకో చిన్నత్తా! బాబాయి వాళ్ళూ, విమలత్తా వస్తే ఈ ఒక్కగదీ చాలదుగా!' అన్నది సావిత్రి.

'అవునవును—'అంటూ లేచి వెళ్ళింది సుమిత్ర.

'పెళ్ళిగిళ్ళీ లేదుగానీ అలివిమాలిన సంసారం ఈదుతోంది, వెర్రిది!' అన్నది కుముదిని.

'నేనింక వెడతాను ఎనిమిది కావచ్చింది—' అని కల్యాణి లేచింది.

'నేనూ వస్తాను పదండి' అని హ్యాండ్ బ్యాగ్‌లోనుంచి కవరొకటితీసి డ్రాయర్ మీద పడేసి వెళ్ళిపోయింది కుముదిని. ఆమె వెళ్ళాక ఆ కవరువిప్పి చూసింది సావిత్రి.

అందులో కొన్ని వదిరూపాయల కాగితాలూ, చిన్నచీటీ వున్నాయి. 'చుట్టాలొస్తున్నారని తెలిసింది. ఈ డబ్బు నీ దగ్గర వుంచు—వీలున్నప్పుడు తీర్చవచ్చు. తిప్పి పంపితే మన ఇద్దరికీ 'ఇక స్నేహం వుండదు' అనివుంది చీటీలో.

'ఇంతమంచి స్నేహితురాలు దొరకడం ఎంత అదృష్టం!' అనుకుంది సావిత్రి. ఆ కవరు సుమిత్ర చేతికిచ్చి.

'వీళ్ళందరి ఋణం ఎప్పటికి తీర్చుకుంటానో!' అనుకుంది సుమిత్ర.

భోజనానికి రమ్మని పిలిచింది సావిత్రి.

'నీకు ఆకలేస్తోందా!' అనడిగింది సుమిత్ర. బసవరాజు తనకోసం వచ్చే టైంయిదే అతను ఇవ్వాళైనా రాకపోతాడా అనే ఆశ పీకుతున్నది మనస్సులో.

'ఆకలిగానే వుంది—దా చిన్నత్తా ఇద్దరం తినేద్దాం—' అంటూనే కంచాలుపెట్టింది సావిత్రి.

'పది నిముషాలు చూడనివ్వు సావిత్రీ— ఇవాళ బసవరాజుగారు వస్తారేమో!' అనేసింది సుమిత్ర.

సావిత్రి ఇంకేమీ అనలేదు— మ్యాగజీన్ ఏదో తీసుకుని చదువుకోడం మొదలు పెట్టింది.

ఎనిమిదిన్నరకి వచ్చాడు బసవరాజు. అతనిలో మునుపు వున్న ఉత్సాహం చాలా వరకు తగ్గింది. ఏదో తీవ్రమైన ఆలోచన చెలరేగుతున్నట్లు వుంది అతని ముఖం.

'మా కుటుంబంలో చాలా గొడవలొచ్చాయి సుమిత్రా! అందుకని రాలేపోయాను—మీరు ఆఫీసుకు వస్తారుగా — తీరిగ్గా ఎప్పుడైనా మాట్లాడుకుందాం! అనేసి వెళ్ళిపోయాడు.

అతనికోసం తెచ్చిన రసగుల్లాలు



దొడకాలంగా వరలు? మా పడకాయి షిపులోవుండే ఇత్తడి యాష్ట్రే, అతని కివ్వవేలోదు—

రెండురోజుల కల్లా కొడుకునూ, పెద్ద కూతుర్నీ తీసుకుని రానేవచ్చింది విమల. తాటాకు బుట్టెడు మామిడిపళ్ళూ, కమ్మసున్నీ, వడియాలు, అప్పడాలూ ఆవకాయా, చెల్లెలికోసం తెచ్చింది.

'హైద్రాబాద్ చూడాలని ఎన్నాళ్ళ నుంచో అనుకుంటాను. ఇప్పటికి పడింది' అని బోలెడు సంతోషం ప్రకటించింది. పిల్లలందర్నీ భర్తదగ్గర వదిలి, పెద్ద కూతుర్ని ఎందుకు తీసుకువచ్చిందో అర్థం కాలేదు సుమిత్రకి.

చెల్లెల్ని అప్యాయంగా పలకరించి కుశల ప్రశ్నలు వేసింది.

'ఇదింకా ఇక్కడే వున్నదేం! వచ్చిన పనైందిగా — వెళ్ళమనక పోయావా?' అన్నది మేనకోడల్ని వుద్దేశించి.

'దాన్నేమీ అనకు—అదసలే వెర్రిబాగుల్ది. మనస్సుకష్టపెట్టుకుంటుంది—మనందరకి మళ్ళనే అదీ నాకు బంధువే—' అన్నది సుమిత్ర.

'మంచికిచెబితే వినవు — దీనిమూలంగా నీ పరువు పోతుందని ఆలోచించవు —'

'ఇతరుల మూలంగా పోయేపరువు నాకక్కర్లేదు విమలక్కా—పడ్డవాళ్ళని పైకెత్తే లేవదీయాలి కానీ ప్రక్కనుంచీ పోతూ ఓరాయి విసిరి నవ్వి వెళ్ళడం నాకసహ్యం'

బ్రతుకు బాట

'చదువుకున్నదానివి! స్వతంత్రురాలివి! నిన్ననే ధైర్యం ఎవరికుంది—ఏదో పెద్ద దాన్ని కనుక చెప్పబోయాను—' అని సర్దుకుంది విమల.

తల్లినీ చెల్లెల్నీ దిగబెట్టి ఘర్నాడే వెళ్ళిపోయాడు కృష్ణమూర్తి ఏదో పని వుందని.

మరో నాలుగయిదు రోజుల్లో రఘుపతీ రాధా వస్తున్నారని విమలకి చెప్పలేదు సుమిత్ర. అనవసరం అనుకుంది విమల వచ్చిన రెండు రోజులవరకూ ఊపిరి సలప లేదు సుమిత్రకి

'పెద్దదాన్ని పెద్దదాన్ని అని ఇన్నిసార్లు అంటావుగానీ, నేను పదిగంటల కల్లా ఆఫీసుకి వెళ్ళాలికదా! కాస్త వంటచేసి పెట్టకూడదూ—ఒరందు వదినె నన్ను కాఫీ కూడా కలపనిచ్చేదికాదు—' అని నెమ్మదిగా విమలని వంటలో యిరికించేసింది సుమిత్ర అప్పటికి కొంచెం ఊపిరివచ్చింది ఆమెకి

రెండు మూడు రోజులనుంచీ ఆఫీసు నుంచీ చాలా త్వరగా ఇంటికి వస్తున్నది తను. ఇవ్వాళైనా బసవరాజుతో మాట్లాడాలి అనుకుంది ఆరోజు సుమిత్ర. మరునాడే చిన్నన్నయ్యవాళ్ళు వచ్చేరోజు తరువాత అసలుతీరదు—

'ఎప్పుడుచూసినా బిజీగా వుంటారు— కాస్సేపు అల్లా రాకూడదూ పబ్లిక్ గార్డెన్స్ కి—' అన్నాడు బసవరాజు ఆ సాయంత్రం

'నేనూ అదే అనుకుంటున్నాను— పదండి' అన్నది సుమిత్ర.

ఒకొక్కరుగా అందరూ వెళ్ళిపోతున్నారు ఫైళ్ళు మూసివేసి. తను చూడవలసిన పని గబగబ పూర్తిచేసేసి బయట పడింది సుమిత్ర.

'ఈ వేసవిలో నాకు పెళ్ళిచేసి తీరాలని అమ్మ పట్టుబట్టింది—' అన్నాడు బసవరాజు లాన్‌లోకూర్చుని సంభాషణకి నాందిగా. వులిక్కిపడింది సుమిత్ర.

'అల్లాగే...కంగ్రాట్యులేషన్స్' అన్నది తెచ్చిపెట్టుకున్న చిరునవ్వుతో.


'అలా తేలిగ్గా కొట్టిపారేసే సమస్య కాదిది. నేను మీతో చాలా సీరియస్‌గా మాట్లాడాలని వచ్చాను—మీ వివేకంపట్ల, సంస్కారంమీదా అపారమైన గౌరవం కలవాణ్ణి నేను—'

'చెప్పండి బసవరాజా!' అన్నది సుమిత్ర తలవంచుకుని చిన్న చిన్న గడ్డిపరకలు పీకుతూ.

'నేను చెప్పేవిషయం మీరు వూహించలేరా! సరే! డైరెక్ట్‌గానే అడుగుతాను— నన్ను పెళ్ళిచేసుకోవాలనే ఉద్దేశ్యం మీకు లేదా!' అన్నాడు బసవరాజు. ఆ వుద్దేశ్యం ఆమెకి లేకపోలేదు కానీ అతనంత సూటిగా అడిగే ఆ ప్రశ్నకి సమాధానం చెప్పలేక పోయింది. ఎఱ్ఱబడిపోయిన ముఖాన్ని ఎత్తలేక అల్లాగే కూర్చుంది.

'చెప్పండి—' కొంచెం దగ్గరగా జరిగి ఆమె చెయ్యి పట్టుకున్నాడు బసవరాజు. సుమిత్ర ఏమీ అనలేదు అతని చేతుల్లోనుంచీ తన చేయి వెనక్కి తీసుకునే ప్రయత్నం చెయ్యలేదు. ఎప్పుడూ ఆ వెచ్చని చేతిలోనే తన చెయ్యివుంటె ఎంత బావుండునూ అని లోలోపల అనుకుంది.

రెండు నిముషాలు మౌనంగా దొర్లిపోయాక 'మా కుటుంబ పరిస్థితులు మీకు తెలియనివి కావు—బాగా ఆలోచించుకోండి—పైగా మీ శాఖ వేరు—మా శాఖవేరు—ఈ పట్టింపులన్నీ మీ అమ్మగారికి వున్నాయని నాకు తెలుసు. ఇన్నాళ్ళ కష్టాలూ, సుఖాలూ, బాధలూ, సంతోషాలూ అన్నీ వొంటరిగా అనుభవించడం అలవాటయిపోయింది. ఇకమీదకూడా దానికి సిద్ధంగానే వున్నాను—నాకోసం మీరు త్యాగాలనుకునే



చేసి చెయ్యకండి బసవరాజూ! దాంపత్య జీవనం కలతలతో ప్రారంభం కాకూడదు!' అన్నది సుమిత్ర అరనివంక సూటిగా చూసి.

'ఇదంతా నాకు తెలుసు సుమిత్రా! అమ్మకి నే నొక్కణ్ణే కొడుకును కాను— నా మీద కోపం వస్తే అన్నయ్య ఆ దగ్గరుంటుంది. అసలు ఆవిడకి ఎక్కడా వుండాల్సిన పనిలేదు. మావూళ్లో లంకంత ఇల్లూ బంగారం పండే భూమీ వున్నాయి. వాటిల్లో నాకు భాగం రాదని నాన్న బెదిరిస్తారు—రాకపోనివ్వండి. నాకే వుద్యోగం చాలు. కొంచెం కష్టపడి పరీక్షలకి చదువుకుంటే ఇంకా మెరుగైన ఉద్యోగం రావచ్చు — ఆస్తులు లేనివాళ్లెంతమంది బ్రతకడం లేదు? తన తమ్ముడు కూతురు రేణుకని పెళ్లిచేసుకోడం లేదని అమ్మకి కోపం! మా వసంతకి కూడా రేణుకంటేనే యిష్టం—చాలా కట్నంతో వస్తుందని! అది మీ విషయం అప్పుడే రేణుకకి వ్రాసేసింది! ఇదుగో రేణుక జవాబు చదవండి.'

ఉత్తరం విప్పింది సుమిత్ర.

'బలవంతంగా నన్ను పెళ్లి చేసుకోవాలని నిన్ను కోరను - నీ యిష్టం వచ్చిన వాళ్లని పెళ్లిచేసుకో రాజుబావా! నాకిప్పుడప్పుడే పెళ్లి చేసుకోవాలని లేదు. మంచి మార్కులొస్తే డాక్టర్‌కోర్సు చదవాలనుంది చెబితే వినరు అమ్మా నాన్నా—నువ్వైనా వాళ్లకి చెప్పిమాడు.'

'బావుంది — ఇంకేం ఈ ఉత్తరం చూపకపోయారా మీ వాళ్లకి!' అన్నది

'చూపాను—నేనే రేణుకకి ఏదో నూరిపోశానని మా అమ్మ వాదన—

అమ్మా, నాన్నగారూ పెద్దన్నయ్యా వసంత వీళ్లంతా ఒకపక్షం— నా వైపు పలికేది చిన్నన్నయ్యా, పెద్దవదినా ఇద్దరే —వాళ్ల వాదనకి ఇంట్లో బలం లేదు—' అన్నాడు బసవరాజు.

'ఉమ్మడి కుటుంబంలో యిలాంటి సమస్యల పరిష్కారం చాలా కష్టం — ఇప్పుడు తెలియకపోయినా సావిత్రి సంగతి కానీ, మా చిన్నన్నయ్య వర్ణాంతర వివాహం సంగతికానీ మీ వాళ్లకి తెలియకుండా పోవు ఉత్తరోత్రా! అప్పుడు వాళ్లు చేసే హేళననీ, అనే మాటలనీ, భరిం



చడం చాలా కష్టం—నేనేదైనా జవాబు చెపితే సహించేశక్తి మీకుండాలి!' అన్నది సుమిత్ర, ధైర్యంగా.

'ఇది ఉమ్మడి కుటుంబం కాదు సుమిత్రా! అమ్మకి గ్యాస్ట్రిక్ ట్రబుల్ వున్నది. అందుకని ఏడాదినుంచీ ఇక్కడ వుండి ట్రీట్‌మెంటు తీసుకుంటున్నది. అమ్మకోసం నాన్నగారుకూడా వచ్చిపోతూ వుంటారు — వాళ్ళనిబట్టి బంధువులూ వస్తూంటారు—అమ్మ ఇంక వెళ్ళిపోతానంటున్నది — నన్నుకూడా సెలవు పెట్టి వచ్చి పెళ్ళిచేసుకు పొమ్మని బలవంతం చేస్తున్నది—వాళ్ళు నిన్నుఏమీ అనే పరిస్థితి నేను రానివ్వను—మీకు జరిగే అవమానం నాకుమాత్రం అవమానం కాదా!'

'మీ ఇష్టం బసవరాజూ! కోరివచ్చిన అదృష్టాన్ని కాలదన్నుకునేటంత మూర్ఖురాలిని కాదు' అన్నది సుమిత్ర చివరికి

'మావాళ్ళంతా అక్కడికి వెడుతున్నారు. అక్కడ మీటింగులుపెట్టి, శుభలేఖలు కూడా అచ్చువేయించగల సమర్థులు. మనం ఈలోగానే పెళ్ళిచేసుకుని వాళ్ళకా ఛాన్స్ లేకుండా చెయ్యాలి.'

'బావుందండీ! మీకంతా తొందరే. ఇంటి దగ్గర బంధువులున్నారు రేపు మాచిన్నన్నయ్య వస్తున్నాడు. నేనిక వెడతాను' అని లేచింది సుమిత్ర.

'ఐస్ క్రీం తిని వెళ్ళండి దేవీ!'

ఆపిలుపులో క్రొత్తదనానికి చలించింది సుమిత్ర.

అప్రయత్నంగా తలవంచుకుని, 'పదండి' అన్నది.

రిక్షా పిలిచి ఎక్కి కూర్చున్నాడతను. సుమిత్రకూడా ఎక్కింది.

రిక్షా ఆగింది హోటల్ దగ్గరకాదు. నగలషాపు దగ్గర.

ముత్యంవేసిన ఉంగరంకొని, 'తీసుకో! సుమిత్రా! ఇంతకన్న నగలేం పెట్టలేను ప్రస్తుతానికి!' అన్నాడు బసవరాజు

హోటల్‌లో ఐస్‌క్రీంకి బిల్లుయిచ్చి

'సారీ బసవరాజూ ఇదే నేనివ్వగల కట్నం' అని పకపక నవ్వేసింది సుమిత్ర.

* * *

'నాకన్న వారంరోజులు ముందుగానే చేసుకుంటున్నావే పెళ్ళి' అన్నది కుముదిని, సుమిత్ర బుగ్గమీద కాటుక చుక్క

బ్రతుకు బాట

పెట్టి, అక్కడున్న వాళ్ళంతా సుమిత్ర తరఫు బంధువులే. బసవరాజు చిన్నన్నయ్యా, యింకెవరో స్నేహితులూ వచ్చారు.

'మా పెళ్ళి ఇల్లాగే జరిగింది. ఆయన తరఫున ఒక్కబంధువూ రాలేదు. నేను చాలా బాధపడ్డాను ఆ రోజున!' అన్నది రాధ.

'మీరంతా ఒకేరకం మనుష్యులు—పెద్దలు నలుగురూచేరి తలా నాలుగక్షతలూ వేసి దీవిస్తేగాని పెళ్ళి జయప్రదం కాదు పెద్దవాళ్ళ ఆచారాలు ఊరికే వచ్చాయా? నామటుకు నాకు ఈ పెళ్ళి ఏమీ నచ్చలేదు' అన్నది విమల.

నిర్మొహమాటంగా ఆవిడ ఆమాట యిప్పటికి చాలాసార్లే అన్నది.

'మీకు నచ్చడంతో ఏం పనిలెండి—రాసిపెట్టివుంటే జరక్క మానుతుందా!' అని వెక్కిరించింది కల్యాణి.

'ఆ అమ్మాయికి మనం పెళ్ళిచెయ్యలేకపోయాం. తన జీవితాన్ని తనే తీర్చిదిద్దుకుంటున్నది. తనే పెళ్ళిచేసుకుంటున్నది అందుకు మనం హర్షించాలి. అంతే కాని వ్యాఖ్యానాలు చెయ్యకూడదు వదినా!' అన్నది ఇందుమతి.

'హైస్కూల్ విడిచి పెట్టాక చదువుకి స్వస్తి చెప్పి, పెళ్ళి సంబంధాలు కుదరక, కట్నాలు యిచ్చుకోలేక ఎంతో మంది ఆడపిల్లలు ఇంట్లో మగ్గిపోతున్నారు మన తెలుగు దేశంలో! ఆ రోజు ధైర్యం చేసి సుమిత్ర కాలేజిలో చేరకపోతే దాని పనీ అలాగే అయ్యేది. ఈనాటి కది వృద్ధిలోకి వచ్చిందని నాకెంతో సంతోషంగా వుంది.' అన్నాడు మాధవరావు—అక్కడున్న వాళ్ళంతా ఒకే రకంగా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

'పెళ్ళయ్యాక కూడా ఆవిడ చేత ఉద్యోగం చేయిస్తారా?' అన్నాడొక స్నేహితుడు. బసవరాజు ప్రక్కన చేరి.

'ఇప్పుడు నేను చేయిస్తున్నానా?' అన్నాడు బసవరాజు పెద్దగా నవ్వి.

స్నేహితుడు దెబ్బతిన్నట్లు చూసి, 'అది కాదు రాజుగారూ! పెళ్ళయ్యాక కూడా ఆవిడ ఉద్యోగం చేస్తారా?' అన్నాడు.

'అది ఆవిడ యిష్టం — ఆవిడనే అడగండి—'

'మీ భార్యను గురించి మీకేమీ కోరికలు లేవా? ఆవిడ ఫలానా విధంగా వుండాలని!'

'నేనేం అలాంటి ఆలోచనలు యింకా చెయ్యలేదు — ఆవిడ ఫలానా విధంగా వుండాలని నాకెందుకుంటుంది! తను ఫలానా విధంగా వుండాలని ఆవిడ కుంటుంది గాని!' వెంకిగా అన్నాడు బసవరాజు. కొంచెం దూరంలో కూర్చున్న కల్యాణీ. సావిత్రి పమిటెలచాటుకుండా నవ్వుకున్నారు

పెళ్ళి ముహూర్తం దగ్గర పడింది. మాధవరావూ, ఇందుమతి పీటల మీద కూర్చుని శాస్త్రోక్తంగా జరిపించారు.

తలంబ్రాలూ చదివింపులూ కూడా అయ్యేవరకూ బసవరాజు వైపు బంధువు లెవరైనా వస్తారేమోనని ఎదురు చూసింది. వాళ్ళు రాలేదుకాని బ్యాంకు ఏజెంటుగారూ ఆయన భార్యా వచ్చారు—

'నా తరఫు పెళ్ళిపెద్దలు మీరే!' అంటూ వాళ్ళకి నమస్కరించాడు బసవరాజు. అప్పటి వరకూ ఏదో లోటుగా అనిపించిందతనికి. వాళ్ళరాకతో ఆ లోటు తీరినట్లు భావించాడు.

సాయంత్రం వరకూ వుండి వెళ్ళిపోయింది కుముదిని. కల్యాణీ, ఆమె భర్త కూడా వెళ్ళారు.

'అమ్మ వాళ్ళంతా వెళ్ళారు కదా! నా ఇల్లు కొంచెం పెద్దదే! ముందు అక్కడికి పోదాం—గృహ ప్రవేశానికి' అని సజెస్ట్ చేశాడు బసవరాజు.

పెళ్ళి వారంతా బాలాజి భవన్ ఖాళీచేసి బసవరాజు ఇంటికి వెళ్ళారు.

'మీ ఇల్లు కూడా మీ మనస్సులాగే చక్కగా వుంచుకున్నారు బసవరాజూ! మీరు నాకు చాలా నచ్చారు మా ఎత్తు ధనం పోసినా మీలాంటి వరుడిని మేము సుమిత్రకి తేగలిగేవాళ్ళం కాదు—మా అమ్మకి పుట్టిన వాళ్ళంతా చాలా అదృష్టవంతులు. ఇందు వదినె అనుకూలవతియైన గృహిణి—మా రాధ నా పాలిటి దేవత. ఇక మీరో మా చెల్లాయిచేసుకున్న పుణ్యానికి ప్రతిరూపం' అన్నాడు రఘుపతి.

బసవరాజు ఇల్లు శుభ్రంగా చక్కగా సర్ది పెట్టి వున్నది. వంటగది, మరొకగది

వరండా వున్నాయి.

వరండాలో గార్డెన్ ఛైర్స్ వున్నాయి లోపల గదిలో మంచాలు రెండూ, పుస్తకాలకొక బీరువా, బట్టలకొక బీరువా వున్నాయి. గోడలకి చక్కని పెయింటింగ్స్, కిటికీల్లో క్రోటన్ మొక్కల కుండీలు వున్నాయి.

'బ్రహ్మచారి మరిదిగారికి అన్నీ వున్నాయే!' అన్నది విమల

'అవును—మొన్నటిదాకా అమ్మ వుండి వెళ్ళింది' అన్నాడు బసవరాజు

ఇందుమతీ, సావిత్రీ, వంటమనిషీ కలిసి విందు భోజనం ఏర్పాటుచేస్తున్నారు. రాధ పిల్లలకి ముస్తాబుచేసి సుమిత్ర ప్రక్కన కూర్చున్నది. విమల ఆజ్ఞప్రకారం ఆమెకి వంట గదిలో ప్రవేశం లేదు. విమలకూడా అక్కడే కూర్చుని కూతురికి జడవేస్తున్నది.

'అవునే అమ్మాయీ, ఇక నువ్వు ఉద్యోగానికి రాజీనామా ఇచ్చినట్లేనా?' అన్నది వున్నట్లుండి.

'ఎందుకివ్వాలి?' అన్నది సుమిత్ర.

'పెళ్ళయింది కనుక! మొగుడికి మంచి ఉద్యోగమూ, ఆస్తీ వున్నాయి కనుక!' అన్నది విమల

'అందుకని రాజీనామాయివ్వాలని రూలెక్కడా లేదే!' అన్నదిసుమిత్ర. రాధనవ్వింది.

'రూల్సూ గీల్సూ నాకేం తెలుసూ!' అని మూతి విరిచింది విమల.

'ఇప్పట్లో ఉద్యోగం మానే ఆలోచన లేదక్కయ్యా! చదువుకూడా ఇంకో ఏడాది వుంది—తరువాత ఇంకొంత మంచి ఉద్యోగం—కొంచెం తీరిక దొరికే ఉద్యోగం వస్తుంది.' అన్నది సుమిత్ర.

విమల మరేమీ అనలేదు

బసవరాజూ, రఘుపతి బజారుకి వెళ్ళారు మాధవరావు వరండాలో కూర్చుని పత్రిక చదువుకుంటున్నాడు.

'అయితే మరి కృష్ణుడిని నీ దగ్గరే వుంచుకుంటావా! దీన్నికూడా నీదగ్గర దించాలని తీసుకొచ్చాను — రేపు నేను వెళ్ళాలికదా!' అన్నది విమల, ఇక దాచి ప్రయోజనం లేదన్నట్లు.

సుమిత్రతోపాటు రాధకూడా ఆశ్చర్యపడింది.

'కృష్ణుడిని హాస్టల్లో వుంచవచ్చు— వాడి పరిస్థితి ఇప్పుడు బాగానే వుందిగా! అమ్మడు ఇక్కడెందుకు విమలక్కా? నీ దగ్గరే వుంచుకో! దానికెటూ చదువురాదు. పైగా నాదగ్గర సావిత్రి వుంటుందాయె! దాన్ని చూసి యిది చెడిపోవచ్చు, ఈ బాదరబందీలన్నీ నాకెందుకు తగిలిస్తావ్! నేను ఇన్నాళ్ళ సుమిత్రనుకాదు. ఇప్పుడు బసవరాజుగారి భార్యను. నాతోపాటు వీళ్ళందర్నీ వుంచుకుంటానని ఆయన నాకేం ఎగ్రిమెంట్ వ్రాసివ్వలేదు.' అన్నది సుమిత్ర మొండిగా.

తెల్లబోయింది విమల. తన కూతుర్ని ఎలాగో సుమిత్రదగ్గర వుంచి మెట్రిక్ ప్యాస్ చేయించాలని కొండంత ఆశతో వచ్చింది.

అయినా, సుమిత్రకిలా పెళ్ళవుతుందనీ, ఇంత సూటిగా మాట్లాడుతుందనీ తనకేం తెలుసు!

'అమ్మడును నా దగ్గరుంచుకుంటాను పంపండి వదినెగారూ!' అన్నది రాధ ధైర్యం చేసి

ఆ ఆహ్వానికి విమల బదులు చెప్పలేదు. దానికి కారణం లేకపోలేదు. వీళ్ళంతా కాలానుగుణంగా నడిచి జీవితాలను సుఖప్రదం చేసుకుంటున్నారు. చొరవగా ముందుకు వెడుతున్నారు. తను మాత్రం తన ఆలోచనల్లాగానే వెనకబడిపోయింది. కులం వేరైతే మాత్రం రాధ వలన తనకేం నష్టం జరిగిందని ఆమెపైన ద్వేషం!


'మాట్లాడవేం అక్కా! అమ్మడుని విశాఖపట్నం పంపు—రాధ వదినె దాన్ని బాగా దారిలో పెట్టి మెట్రిక్ ప్యాస్ చేయిస్తుంది—' అన్నది సుమిత్ర. విమల ఆలోచనలో పడిపోయింది. రాధ మంచితనంలో ఆమెకి అనుమానం లేదు. తన భర్త యిందుకు వొప్పుకోడనే చింతా లేదు.

అక్కడ విశ్వం వున్నాడు. వాడు పెద్ద చదువు చదువుతున్నాడు. మంచి ఉద్యోగం వస్తుంది. అమ్మడు అందంలో తీసిపోయినదేం కాదు. అమ్మడును చూసి విశ్వం యిష్టపడితే దాని అదృష్టం పండుతుంది. ఈ విషయంలో తను మాధవన్నయ్యను అడిగే అవసరం తప్పుతుంది.

'ఇదే బాగుందమ్మాయ్ రాధా! తీసుకు వెళ్ళు. మీరంతా నన్ను వెలివేయ్యకండి— నేనూ మీలో మనిషినే?' అనేసింది విమల.

'మిమ్మల్ని మేం వెలివేసిందెప్పుడూ లేదు వదినెగారూ! మీకు మీరే వెలివేసుకుని చుట్టూ గిరి గీసుకున్నారు. ఈ నాటికి ఆ గిరి దాటి బయటికి రాగలిగారు. అదే సంతోషం ఆలోచనలకీ, ఆప్యాయతలకీ, అనురాగానికీ కూడా పరిధులు నిర్మించుకుని హద్దుమేరకి కుంచింప జేసుకుంటే బ్రతుకుబాట అంతా కంటకావృతమే అవుతుంది—హృదయాన్ని కాస్త విశాలం చేసుకుని మెదడుకి పదును పెట్టుకోగలిగితే పూలబాట అవుతుంది. అంతా మన చేతిలోనే వుంది—' అన్నది రాధ, చంటిపిల్ల తలలో పూలు తురిమి.

(అయిపోయింది)



భారత రాజధానిలో ప్రాంతీయ పాఠశాలలు

ఢిల్లీలో 31 దాకా రీజనల్ స్కూల్‌లు (లేక ప్రాంతీయ పాఠశాలలు ఉన్నాయి). ఢిల్లీలో ఉంటున్నవారి పిల్లలకి మాతృ భాషలో విద్యాభ్యాసం కావాలంటే ఈ పాఠశాలలకి వారిని పంపవచ్చు.

ఈ బళ్లలో సుమారు 25000 మంది చదువుకుంటున్నారు. వీటిలో బెంగాలీవి పది. పంజాబీవి ఏడు. తమిళం, సింధీ, గుజరాతీ, మరాఠీ, తెలుగు, మలయాళమ్, కన్నడమ్, మార్వారీ భాషలకి తలొక నాలుగు పాఠశాలలు ఉన్నాయి.

ఇండియా ముక్కలయినప్పుడు ఎన్నో ప్రాంతాలవారు ఢిల్లీలో గుమిగూడారు. వీరి కృషివల్ల నెలకొల్పబడిన పాఠశాలలు చాలా ఉన్నాయి. కాని, 1920 ప్రాంతాలలో పెట్టిన బళ్ళుకూడా ఉన్నాయి.

వీటిలో కొన్ని మాతృభాషలోనే విద్యాబోధన ఇస్తాయి మరికొన్ని 3-భాషల సిద్ధాంతాన్ని అనుసరిస్తున్నాయి.

ఈ విద్యాలయాలకి ధనం ఎవరు ఇస్తారు. అధికంగా వివిధ ప్రాంతాల దాతలు ఇస్తూ ఉంటారు.

ఇవి సరిపోవు. అందుచేత చాలా పాఠశాలలు ఇబ్బందులలో ఉంటూ ఉంటాయి. ఆదాయాలలో సుమారు 95 శాతం ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్లలోనే. ప్రభుత్వం గ్రాంట్లు ఇస్తుంది కాబట్టి నిర్వాహకులని నియమిస్తూ ఉంటుంది. ఈ నియమాలు ఆ ఆ పాఠశాలలో నేర్పే భాషలకి చెందిన వారికి పరిమితం అవకుండా ఇతరభాషల వారికి కూడా వర్తిస్తూ ఉంటాయి. అటువంటప్పుడు పేచీలు రావటంలో ఆశ్చర్యం లేదు. ఈ పేచీలు బెంగాలీ బళ్ళలో ఎక్కువగా కనిపిస్తూ ఉంటాయి.

'మదరాసీ ఎడ్యుకేషన్ సొసయిటీ' అయిదుబళ్ళని నడుపుతుంది. వాటిలో మొదటిదానిని 1923 లో స్థాపించారు. ఈ సొసయిటీ ఆస్తుల విలువ నేడు 25 లక్షల రూపాయలు, స్కూళ్లలో వస్తు సామగ్రి విలువ సుమారు 14 లక్షల రూపాయలు. వీటిలో హిందీ, తమిళం, ఇంగ్లీషు, సంస్కృతం నేర్పుతారు. మాధ్యమిక స్థాయిదాకా తమిళంలో విద్యాభ్యాసం జరుగుతుంది. ఉపాధ్యాయులలో ఏడుగురు తమిళేతరులు ఉన్నారు. ప్రిన్సిపాల్‌లలో ముగ్గురు, విద్యార్థులలో 20 శాతం ఉత్తరదేశంవారు.

ఇక ఆంధ్రా ఎడ్యుకేషన్ సొసయిటీ స్కూల్‌లో ముగ్గురిలో ఒకరే తెలుగు ప్రాంతంవారు! (మొత్తం 1300 మంది విద్యార్థులున్నారు.) ప్రిన్సిపాల్ ఉత్తర భారతీయుడు. టీచర్లలో మదరాసు, ఉ. ప్రదేశం, పంజాబు, కాశ్మీరు, రాజస్థాన్, సింధీవారున్నారు.

గుజరాతీ సమాజ్ స్కూల్ ఆర్థిక బాధలలో లేదంటే ఆశ్చర్యంలేదు. చక్కగా నడిచే బడి ఇది.


గురుద్వారా ప్రబంధక్ సమాజ్ కింద ఎన్నో పాఠశాల లున్నాయి. వీటిలో విద్యాభ్యాసం ఇంగ్లీషులోకూడా జరుగుతుంది.


అన్నిటిలో పాత బడి ఏది?

బెంగాలీ బాయ్స్ హైయ్యర్ సెకండరీ స్కూల్. దాని పరిస్థితి అంత బాగా లేదు. ఇక్కడ బాల బాలికలు కలిసి చదువుకుంటారు.

ఇటువంటి పాఠశాలలద్వారా జాతీయ సమైక్యత పెరుగుతుందని ప్రభుత్వ వర్గాలలో అనుకుంటున్నారుట. అందువల్ల ధనసహాయం బాగా జరిగేట్లు చూడటం వారి బాధ్యత.

—ఉమా బెనర్జీ





శాంతి

పాలకోడేటి సత్యనారాయణరావు

తలుపు తట్టిన చప్పుడు విని వెళ్ళి విసుగ్గా తలుపుతీశాను.

తలుపు తీసేసరికి నా ఆ విసుగు నాకే ఆశ్చర్యం కలిగించేటట్లుగ ఏమయిందో ఏమో! ఆ క్షణంలో మనసెందుకో ఆనందంతో ఎగిరి పడుతుంది!

తనవారిని చూస్తే ఈ మనసెందుకో అంతగ ఉత్సాహంతో ఎగిరి పడుతుంది!

ఇంతకీ వచ్చింది శాంతి తమ్ముడు!

ఛ— వీణ్ణలా అనకూడదనుకున్నాను చాలసార్లు!

కానీ నా మనసు నా అదుపులో ఉండటం ఈ జన్మకిక తీరనికోరికే!

'రా రా లోపలికి!'

ఆప్యాయత అరవైపాళ్ళు, అనురాగం ఇరవైపాళ్ళు.

మిగతా ఇరవై ఆశ్చర్యానికే అంకితం.

ఈ వెధవ ఎందుకు రావాల్సి వచ్చింది హైదరాబాదు?

ఎక్కడి కంకిపాడు? ఎక్కడి హైదరాబాదు??

వాడు ఈసురోమంటూ లోపలికి వచ్చాడు.

'బావా!'

'బావా!' — రాగయుక్తంగనే అన్నాను నేను.

పకాలున నవ్వాడు వాడు — 'పాడకురా బావా!'

'అభయం ఇచ్చానురా!'

'నా క్కావల్సింది అభయం కాదురా, కాఫీ!'

'అదీ ఇస్తానుగానీ...ఏమిటి విశేషం?'

'ఏమీలేదు—'

అబద్ధం ఆడకూడదంటారు, తెలిసి మరీ ఆడనే కూడదంటారు.

కానీ — వాడికి తెలుసు అబద్ధం ఆడుతున్నట్లు.

అయినా జంకు గొంకూ లేక అబద్ధం ఆడేశాడు. అంతకన్న విశేషం — వాడు చెప్పిన ఆ అబద్ధాన్ని పచ్చి నిజమన్నట్లుగ నేను భావించినట్లు నటించటం!

నిజమే! వీడికిది అబ్బపోలిక!

ఎన్ని అబద్ధాలాడితే ఆరుగురు ఆడపిల్లల తండ్రి కాగలడనేది ప్రశ్న!

అనేశాను అదే—

'మనసులోది నువ్వు దాచుకోవురా!' నవ్వుతూ అన్నాడు వాడు

ఇది కామెంటో, కాంప్లిమెంటో నా కింకా తెలియలేదు.

ఫ్లాస్కులో కాఫీ కప్పులో పోసి ఇచ్చాను. మారుమాటడక తాగాడు.

'నిద్ర వస్తోందిరా బావా!' అన్న పది నిమిషాలకు వాడు గురక నిద్రలో ఉన్నాడు.

నాకు అసూయవేసింది— నిద్ర రావాలి అనుకోగానే పడుకోగలిగిన వాళ్ళు ఎంత అదృష్టవంతులు! నేను నిద్రపోవాలంటే ముందు పెద్ద తతంగం—ఆరోజంతా అడ్డగాడిదలా ఎండలో తిరిగి అలిసిపోవాలి. లేక

పోతే అలావెళ్ళి ఒక టీ తాగిరావాలి. లేకపోతే కనీసం ఓ గంటసేపు మూసిన కన్ను తెరవకుండా పడుకునే ఉండాలి. అప్పటికి నిద్రపట్టితే పట్టొచ్చు!

బహుశా—ఇది అబద్ధమాడే వాళ్ళకుగల అడిషనల్ క్వాలిఫికేషనేమో!

ఏమో!—నాకు తెలియదు.

నేను జీవితంలో నిజం ఒకసారి చెప్పాను. అంతే! నిద్రపట్టడం మానేసింది ఆ తర్వాత.

'నిజం చెబితే నిద్రరాదు' అనుకున్నాను.

కానీ, అబద్ధాలాడగలిగితే నిద్ర వస్తుందన్నది తెలియలేదు.

ఇకమీదట అబద్ధాలాడి చూడాలి.

అదో క్రేజీ అంతే!!

ఈవెధవ—వీడిపేరు శ్రీహరి, అయినా ముద్దుగా వెధవా అనడమే అలవాటు. వాడికి నేనూ అంతే అనుకోండి—నిద్ర లేస్తే బాగుణ్ణు.

విశేషాలు తెలుస్తాయి

అసలు విశేషాలేమైనా శేషించి ఉన్నావా అని!

శేషగిరి నాకు చెప్పింది విశేషం—విశేషాలు సశేషంకాకుండా చెప్పినవార్త అది! నన్ను అనుకోనంతగ కృంగదీసింది కూడాను.

'మహాలక్ష్మి చచ్చిపోయింది'—ఇంతే ఆ వార్త!

కానీ ఎంతటి విషాదం నిండుకొని ఉంది!

మహాలక్ష్మి—

నిజానికి నాకు నవ్వొస్తుంది—మహాలక్ష్మి నా చుట్టమా? కాదు నాకు బాగ తెలిసిన వ్యక్తి అంటే అదీకాదు.

కానీ—ఆవార్త నన్ను విపరీతంగా కలవర పెట్టింది.

మహాలక్ష్మిగురించి విన్నపుడు నాకు అనిపించలేదు—ఈవ్యక్తి నా జీవితంలో, ముఖ్యంగ శాంతివల్ల, ఒక ప్రధానపాత్ర వాగలదని! ఏదో ఉబుసుపోకకువిన్న కబుర్లవి. ఆ వార్తలకు అంతకన్న ప్రాముఖ్యాన్నివ్వటం—అప్పట్లో—తెలివితక్కువే!

'చూడు బావా! మహాలక్ష్మి చచ్చిపోతుందిట!' నవ్వుతూ అనేది శాంతి.

'ఏం?' విచారంకన్నా వివరణ కోరటమే అధికం'

'ఏం ఏమిటి? ఒళ్ళుపొగరు అంతే!' అని నాతో అనేసి—'అంతేకదు మే?' అని అడిగేది మహాలక్ష్మిని.

'పొండి, మీరు మరీను ఏదన్నా ఏలా కోలంగనే మాస్తారు' అనేది మహాలక్ష్మి చేస్తున్న పనిలోంచి తలైనా ఎత్తనే!

పనిమనిషి—మహాలక్ష్మి—వెళ్ళిపోయాక చెప్పింది శాంతి— 'వాణ్ణి చేసుకుంటానని తనంటే నాన్న పద్దంటాడుట. ఎవరికో ఇవ్వాలని యత్నం ఆ ముసిలాడిది. అంతే—ఇదీ ఓ పెద్ద ప్రేమపక్షే!'

అసలు జగత్తులో ప్రేమ పక్షి గాని దెవరు ?

ప్రేమ అనే పదం నా జీవితంలోకి తొంగి చూడలేదు అని ఎవరైనా చెప్పగలరా అంటే ఎవ్వరూ ఉండరేమో!

ఏదోవిధంగా ప్రతివాడి జీవితంలో ఒక్కసారైనా పలుకరించి పోతుందిది!

ఆ పలకరింత కొందరికి పులకింతలనిస్తే మరికొందరికి కలవరింతలు ప్రసాదిస్తుంది. అంతే తేడా!

శ్రీహరి లేచాడు ఆవలిస్తూనే—

'బజార్లోకి వెళ్ళాలి, తయారవరా!'

'ఎందుకని ? అందామనుకొని ఆపుకొన్నాను నేను. వెడితే అదే తెలుస్తుంది.

స్టేషనరీ షాపులోకి వెళ్ళాము అటూ యిటూ తిరిగి.

'లేటెస్ట్ డిజైన్స్ వెడ్డింగ్ కార్డ్స్ ఉంటే చూపించు.'

ఆశ్చర్యపోయాను—వెడ్డింగ్ కార్డ్స్?

'ఎవరికిరా ?'

'ఎవరికేమిటి నీ మొహం! మనకే!' శ్రీహరి జవాబు ఇది.

తెల్లపోయాను నేను—'మనకి' అంటే?

షాప్ వాడు పకాలున నవ్వాడు— 'సారీ సర్'

వాడికేసి చూసి తనూ నవ్వాడు శ్రీహరి. క్షణం తర్వాత, తేరుకొని నేనూ నవ్వాను.

'మంచి డిజైన్ సెలెక్ట్ చేయరా'

ఇంకేమీ ప్రశ్నించకుండా నే నాకు తోచింది తీశాను. వాడికీ అదే నచ్చినట్లుంది—పాక్ చేయించాడు.

ప్రెస్ దగ్గరకు రాగానే అన్నాడు శ్రీహరి—'బావా! ఈ మేటర్ ప్రింట్ చేయించాలిరా!'

అందించిన కాగితం మడత విప్పి చూశాను. ఏదో శుభలేఖార్థములు!

చదివాను—నిజమే!

శాంతి పెళ్ళి!!!

నేను పొరబడలేదు. నా ఇంద్రియాలు ఇంకా నన్నే మోసగించటం లేదు.

వరుడెవరో వీరభద్రరావు!

'అదిరా సంగతి' అన్నాడు వాడేదో నాకు చెప్పినట్లుగ.

ఆ కాగితం అందించగానే తెలియజేయటం పూర్తయిం దనుకున్నాడు.

అసలు ఆ కాగితం అందుకొన్నాకనే నాకు ఏమీ తెలియదన్న సంగతి తెలిసింది.

ఇలా ఎలా జరుగుతోంది ?

ఎందుకు జరుగుతోంది ?

బెజవాడ వెళ్ళి ప్రింట్ చేయించుకు రమ్మన్నారు. నేను నీ కోసం హైదరాబాదుకు వచ్చాను.

ఎంత విశ్వాసం వీడికి!

ఈ మాత్రం నమ్మకం మామయ్యకు నా మీద ఉంటే ఎంత బాగుండేది!

ఫిబ్రవరి ఆరున పెళ్ళి: ఈవేళ జనవరి ఇరవై.

ఇంకా పదిహేనురోజులు.

అంతే! —ఆ తర్వాత ఎవరో 'శాంతి' అయిపోతుంది.

ఎవరి మనసులోనో దేవతగ—

ఎవరి ఇంట్లోనో దీపంగా—

అంతే—నా జీవితం ఎంత చీకటిగా మారిపోతుందో అని తెలుసుకోకుండానె వెళ్ళిపోతుంది.

ఈ ఇంటి దీపాన్ని ఆర్పేస్తూ, వేరొక ఇంట్లో దీపం పెడతాననటం నిశ్చయంగా బాగలేదు.

'కానీ అదేం చేస్తుందిరా బావా!'

'అంటే?'—నిజంగానే నాకర్థం కాలేదు శ్రీహరి మాటలు.

'పురుషుడే తనకు కావల్సింది చొరవ చేసుకొని తీసుకోవాలని ఏ స్త్రీ అయినా కోరుకుంటుంది. తనకెంత ఆదుర్దా ఉన్నా నిబ్బరంగానే కనిపిస్తుంది, అంతేరా, ఇక నీ యిష్టం!'

నాకు అర్థం కాలేదు. ఏమిటి వీడి సొద ?

'నువ్వుత్త ఫూల్విరా బావా!' శ్రీహరి ఒళ్ళు మండి అన్నాడు

నాకు తెలియదు నేనెంత ఫూల్నో!

మౌనంగ ఊర్కొన్నాను.

నా మౌనాన్ని వాడెలా అర్థం చేసుకొన్నాడోగానీ చాలాసేపు తర్వాత అన్నాడు—'శాంతి నిన్ను రమ్మంది రా!'

'పెళ్ళికేనా? తప్పకుండా వస్తాను. ఫిబ్రవరి నాలుగుకే వచ్చేస్తాను.' మనసులోని ఆవేదనను ఆపుకొంటూ అన్నాను

శ్రీహరి నాకేసి ఓసారి చూసి తల దించుకొని అన్నాడు — 'అయాం సారీరా బావా! నాకేగనుక అధికారం ఉంటే శాంతి నీదే అయేది!'

నాకిపుడర్థం అయింది — ఫూల్‌ను నేను కాదు, శ్రీహరే ఉత్త ఫూల్!

* * *

ఫిబ్రవరి నాలుగుకే అనుకున్నట్టు కంకిపాడు చేరాను. అంతా సందడితో నిండిపోయింది. ఆ ఇంటికే పెళ్ళి కళ వచ్చేసినట్లనిపించింది.

నా ఊహకు నవ్వొచ్చింది నాకే — నా ఒక్కడి మనసులో ఏదో బాధ చెలరేగుతున్నంత మాత్రాన, వివాహమండపంలోనే పెళ్ళి కళ గోచరించదనుకోవటం వెర్రితనం.

నా కోడి కుంపటి లేకనే తెల్లారిపోతోంది.

అదే నాబాధ కూడాను!

ఏం చేయాలో తోచక అలా శేషగిరి ఇంటికి బయలుదేరాను.

శేషగిరి వాళ్ళమ్మగారు కనబడి పలుకరించారు—అది పలుకరింపనుకోవటం ఆత్మవంచనే తప్ప మరొకటి కాదు.

అది నిస్సందేహంగా పరామర్శ చేయటమే!

—ఆత్మీయులెవరైనా మరణిస్తే, ఎవరో వచ్చి పలికే సానునయ వాక్యాలులాటివి!

—అవి నీకున్న బాధను తొలగించవు సరిగదా, సింహావలోకానికి మాత్రం మార్గం అవుతాయి.

'శాంతి పెళ్ళికి వచ్చావా రాజా!'

మనసు ఒకసారి మసిబారింది.

'ఔనండీ— శేషగిరి ఇంట్లో లేడా?'

'ఇట్టా రాజా మాట—ఔనుగానీ, నీకూ మీ మామయ్యకు మాటపట్టింపు వచ్చిందా? ఏం?'

జవాబు చెప్పకపోవడమే మేలు— నిజం చెప్పినా నమ్మి చావదు ఈ లోకం కొన్ని సందర్భాలలో. అలాటప్పుడు అతికేలా అబద్ధం చెప్పాలంటే చేతకాదు!

అబద్ధం చెప్పగలగటం నిశ్చయంగ కళే!

అది బహుశా మామయ్యకు తెలుసు!—ఈ విషయంలో నాకు మేనమామ పోలిక రాలేదన్నది పచ్చి నిజం!

'అలాటి గొడవలేం లేదండి—'

ఆవిడ నమ్మలేదు, తెలుస్తూనే ఉంది

'నిజమేనా? నమ్మమంటావా?'

'నిజమే —' నమ్మమనిమాత్రం అనలేకపోయాను, నమ్మరని తెలుసు గనుక.

ఆశ్చర్యంతో అంది ఆవిడ— 'ఇలా రా రాజా! ఏమీ అనుకోకు ఓమాట అడుగుతా నిన్ను—'

'అడగండి—'

'పట్నంలో ఎవరో పిల్లతో కులుకుతున్నావటగా?— అహ, ఎవరో అనుకోగా విన్నానులే!'

'ఎవరో' ఏం ఖర్మ?—ఇది మామయ్య పనే!

బహుశా అమ్మ ఉంటే గుండె పగిలి చచ్చిపోయేది— మామయ్యకన్నా కొంత డబ్బు విషయంలో లేనివాళ్ళమే కానీ పరువు ప్రతిష్ఠలకుమాత్రం కాదు.

నేను నిజం చెప్పను—దాన్ని నమ్మరు. నిజాన్ని నమ్మకపోవటంకన్న దానికి మనమే విధమైన అవమానం చేయలేము అందుకే మాట మార్చాను.

'శేషగిరి లేడా ఇంట్లో?'

'లేడుగానీ అడిగినదానికి జవాబు చెప్పవేం?'

నేను మౌనంగ ముందుకు సాగాను జవాబు చెప్పకనే.

'నిజమే గాబోలు — పెదపకాలపు బుద్ధులు—' వెనుకనుంచి ఆవిడ అంటూనే ఉంది. నేను నవ్వుకోగలిగాను నిర్మలంగ.

ఇంటికి తిరిగి వచ్చేస్తుంటే శేషగిరి కనిపించాడు. పొలాలవేపు వెళ్ళాము.

'నీకు తెలుసురా ఈ సంగతి?'

వాడడిగేది నాకు తెలుసు. అయినా అడిగాను— 'ఏ సంగతిరా?'

'మహాలక్ష్మి చావలేదురా రాజా!'

ఆశ్చర్యపోయా నేను. శ్రీహరి వాతో చెప్పలేదేం?

'చంపేశారు దాన్ని—' శేషగిరే అన్నాడు మళ్ళీ

'హత్య?'

'కాదు, ఆత్మహత్య చేసుకొందిరా — కానీ ఎందుకు అని అడగవేం?'

'కారణం ఊహించుకో గలుగుతున్నాను.'

'అయితే అదే కరక్టు — మనుష్యుల్లో మమతలను, మనసులను ఎందుకు చూడలేక పోతున్నారంటావ్ వీళ్ళు?'

నేనేం జవాబియ్యలేదు.

'మా మామయ్య ఏమంటున్నాడు?' — శేషగిరి నా ప్రశ్నవిని ఆశ్చర్యపోయాడు.

'నీకూ తెలిసిందా?'

'ఇపుడే మీ అమ్మ గారడిగారు.'

శేషగిరి నాకేసి చూశాడు ఆశ్చర్యంగ

'నీకేమీ అనిపించలేదురా?'

'ఎంటే?' — ఈ సారి శేషగిరి ఏమీ అనలేదు.

'సరేలే, ఇంతకీ మహాలక్ష్మి సంగతి..'

'ఏముందిరా, గంగులుకిచ్చి పెళ్ళి చేయనన్నాడు. చేయకపోతే చస్తానంది. చచ్చి చూపించింది. ఈ వేళ ఏడుస్తాడురా వాడు — గంగులుకన్నా ఇచ్చిచేశాను కాను అని! అంతేరా రాజా! — బ్రతికిన మనిషికి విల్లిచ్చేవిలువ బండి సున్నారా! చనిపోయాకే తెలుస్తుంది వీళ్ళకు వాళ్ళ విలువ! ఏమంటావ్?'

శేషగిరి ఇంతటి నిజాన్ని చెబుతూంటే కాదని ఎలా అనను?

కాదన్నాకానీ—నిజం చావదు!

'మీ మామయ్య ఏమన్నాడురా?'

'ఇంకా కనిపించలేదు.'

'శాంతి?'

'శాంతిని చూడలేదు.'

ఏమిటో వెలితిగవుంది ఈ సంభాషణ. అందుకే అన్నాను—'వెళతానురా!'

'హైదరాబాదుకా?'

'ఛ! పెళ్ళయ్యాకే వెడతానురా—ఇంటికి పోతాం'

'పదరా—నాకే మనసంతా అదోలా ఉంది'

ఇంటికి వచ్చేసరికి పందిరిక్రింద మామయ్య ఎవరితోనో మాట్లాడుతున్నాడు.

నన్ను చూడగనే ముఖం ఒకసారిగ పాలిపోయినా, లేని నవ్వు తెచ్చుకుంటూ

అన్నాడు—'కులాసాగ ఉన్నావురా ?'

'ఆ—' ఇంక మాట్లాడటం ఇష్టం లేక లోపలికి నడిచాను

లోపలికి రాగానే శ్రీహరి కనిపించాడు — 'ఎంతసేపయింది రావచ్చి ?'

ఎడారిలో ఒయాసిస్ పరిసరాలు ఇంత కన్నా చల్లగ ఉంటాయంటే నేను నమ్మను. మనసు ఆవేదనతో నిండినపుడు ఆప్యాయతతో ఒక మాటంటే చాలు-ఇంకేం వద్దని పిస్తుంది-కానీ, చల్లనిమాటకు నోచుకునే యోగం ఉండాలి; ఆ అదృష్టానికి పెట్టి పుట్టాలి.

'ఒకగంట దాటిందిరా!'

'అక్కయ్యను కలుసుకున్నావా?'

'లేదు —'

'ఆ గదిలో ఉంది; వెళ్లరా వెడితే!'— అంటూ శ్రీహరి వెళ్లిపోయాడు.

వెళ్లడమా వద్దా అని క్షణకాలం ఆలోచించి మెల్లగ అడుగు వేశాను.

లోపల చాలామంది ఆడవాళ్లు — ఎక్కువభాగం తెలిసినవాళ్లే అయినా — ఉన్నారు. వెనుదిరిగి శ్రీహరి గది చేరుకున్నాను.

'ఏరా వచ్చేశావ్?

'చాలమంది ఆడవాళ్లున్నార్రా!'

'ఔనురా, చెప్పడం మరిచాను, — శాంతిని ఈవేళ పెళ్లికూతురు చేశార్రా!'

సరిగ గురిమాసి గుండెమీద సమ్మెటతో కొట్టినట్లయింది.

ఎంతటి దురదృష్టవంతుణ్ణి నేను!

శాంతి నాది కాకపోతే—శాంతిగ ఎలా బతకగలను?

శ్రీహరి, అన్నదానికి జవాబేమీ లేదు నా దగ్గర.

*   *   *

రాత్రి పదయింది— బహుశా దాటిందేమో గూడ.

అందరూ భోజనాలు చేసి సావకాశంగ పందిరి క్రింద కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. శ్రీహరి, నేను మాత్రం శ్రీహరి గదిలోనే పడుకోవాలని నిశ్చయించుకొని పక్కలమీద పడుకొన్నాము.

నిద్రపట్టడంలేదు— అటూ ఇటూ పొర్లుతున్నాను ప్రక్కమీద.

తలుపు తట్టిన చప్పుడయింది—శ్రీహరి వెళ్లి తలుపు తీశాడు.

శాంతి వచ్చింది.

'బావా!'

తలెత్తి చూశాను నేను.

'నిద్రపోతున్నావా?'

'లేదు '

శాంతి వచ్చి, నా పక్కమీదే కూర్చుంది— ఆశ్చర్యపోయాను.

నవ్వుతూ అంది శాంతి— 'శ్రీహరి వెళ్లిపోయాడు బావా—పందిర్లో కబుర్లు వినడానికి '

'శాంతీ— ఇదేమైనా బాగుందా ?'— అడగడం బాగుండదనిపించినా అడిగాను

'ఏం? ఈ ప్రశ్న నువ్వే వేస్తున్నావా? నా మనసు నిర్మలంగ ఉన్నంతకాలం నా తమ్ముడు నన్ను విశ్వసించే తీరుతాడు ... పైగా నువ్వు ఏం చేయలేవు నన్ను!'

'ఏం?'

'నువ్వు నా మేలు కోరతావు గనుక.'

అందుకే—

ఈ అచంచలమైన విశ్వాసానికే—!

నేను శాంతిని కోరుకునేది!

'మహాలక్ష్మి చచ్చిపోయింది బావా! నీకు తెలుసా?'

'ఆ—అయినా శుభ సమయంలో ఇవెందుకు?' అన్నానేకానీ మనసారా అన్నమాట మాత్రం కాదు.

శాంతి జవాబివ్వలేదు.

తలెత్తి శాంతికేసి చూశాను. పసుపుపచ్చని చీరతో వుంది. మోకాళ్లమీద తల ఆన్చుకుని నాకేసే చూస్తోంది. ఆ చూపుల్ని భరించలేక తల తిప్పుకున్నాను.

'బావా! నేను అదృష్టవంతురాలినే గదూ!'

నేనేమీ అనలేదు—అనలేక కాదు— అనడానికి లేక.

'నిజం బావా! రమ్మని కబురు పంపగానే వచ్చావు—ఎల్లుండే నా పెళ్లి—' ఆ కంఠం నాకు కొత్తగ భాసించింది. ఆ కంఠంలో ఏదో తెలియని వ్యథ ఎక్కడో పలుకుతూనే ఉంది ఈ వాదంలో అపశ్రుతికి చోటు ఎక్కడో ఉండనే వుంది.

'మాట్లాడు బావా! ఏమీ మాట్లాడక నన్నెందుకు చిత్రహింస చేస్తావ్?'

'ఏం మాట్లాడమంటావ్ ?'

'ఏదయినా సరే—నీ యిష్టం.'

'ఏమీ మాట్లాడలేను శాంతీ! అశాంతిలో కొట్టుకొంటూ పైకి మాత్రం సంతోషాన్ని ఎలా వెలిబుచ్చగలను చెప్పు?'


'కానీ బావా, ఇది శుభ సమయం.'

'నిజమే!'

'నిజమా ? ఇది నీకు శుభ సమయమేమోగానీ నాకు మాత్రం కాదు. నిజం— తీరని అశాంతితో అల్లాడేకంటే క్షణకాలం శాంతితో జీవించడం మేలు కదా బావా!'

నేనేమీ అనలేదు.

'చెప్పవేం? — శ్రీహరితో చెప్పాను బావను నేను రమ్మన్నానని చెప్పమని నువ్వు వచ్చావు బావా—కానీ నే నాశించింది వేరు; నా బావనిలా కాదు నేను ఊహిం



ింది — వకొనిలా, సర్వసంగ పరిత్యాగిగ
ాదు బావా నేను ఊహించుకొన్నది! నా
ావలో చీము, రక్తం, ప్రేమ ద్వేషం
న్నీ ఉన్నాయనుకున్నాను అంతే బావా
ేను ఊహించింది !'

ఎంత చిత్రమైన పరిణామం ఇది!
ాంతి ఇలా ఎలా అనగలుగుతోంది ?

'చెప్పు బావా—మౌనంగ ఉంటే అంగీ
రించినట్లే అంటారు. పట్నంలో ని
ోకిళ్లు నిజమే అంటారు—నాకు తెలుసు
ని వచ్చి అభూతకల్పనలు నా బావ నన్ను
ాసం చేయడు. చేయలేడని నాకు తెలుసు'

ఏమిటీ వింత ప్రకృతి?

నానుంచి శాంతి ఏమాశిస్తోంది ?

నాకు అర్థంగావటం లేదు.

మౌనంగా ఊరుకొన్నాను నేనేం జవా
బివ్వాలో తెలీక.

శాంతి నా జవాబు కోసం చాలసేపు
ిరీక్షించి, చివరకు అంది—'పోనీలే బావా!
ా అదృష్టం ఇంతే అనుకుంటాను. కానీ
ొక్కమాట— ఆడదెప్పుడూ ఒకడికే మన
ివ్వ గలుగుతుంది. ఆ మనసుతో బాటు
ప్రాణం కూడ ఇవ్వడానికి సిద్ధంగానే
ఉంటుంది'

ఆశ్చర్యపోయాను నేను.

'ఏమిటి శాంతీ — నువ్వనేది నీకర్థ
మవుతోందా?'

నవ్వుతూ అంది శాంతి: 'నే ననేది
నాకర్థమవుతూనే ఉంది. కానీ నీకే
అర్థం గావటంలేదు అదే నా బాధ...పోనీలే
బావా, ఒక్కటి అడుగుతా, చెబుతావా?'

శాంతి

'అడుగు'

'అడగడంకాదు, అర్థించడం'

'సరేలే. చెప్పు.'

క్షణం ఆలోచించి అంది శాంతి—
'మనం వెళ్లిపోదాం బావా!'

'శాంతి!...'

శాంతి ఏమీ మాట్లాడలేదు.

'శాంతీ-నిజం చెబుతాను నేను నాతోటి
మగవాడికి అన్యాయం చేయలేను. వెళ్లిపో
గలమనేది కలలోని మాట......ఎల్లుండే
నీ పెళ్లి, ఆ విషయం మర్చిపోకు'

శాంతి చిన్నగ నవ్వింది.

'ఎలా మర్చిపోతాను బావా! మీరంతా
నా పెళ్లికేగా వచ్చింది!'

శాంతి లేచి నిలబడింది. నేనూ లేచాను.

తలుపుదాక వెళ్లి, మళ్లీ వెనుదిరిగి
హఠాత్తుగ నాపాదాలకు వందనం చేసింది.

ఆ ఆశ్చర్యంనుండి తేరుకునే సరికే
శాంతి వెళ్లిపోయింది.

*   *   *

తెల్లగ తెల్లవారింది.

రాత్రి సరిగ నిద్రలేకపోవడంతో కళ్లు
మండుతున్నాయి—లేచి లేవగనే నన్నాకర్షిం
చింది రెపరెప లాడుతూ టేబుల్ మీదనున్న
కాగితం.

ఎందుకో కీడే శంకించాను — ముందు
శ్రీహరికేసి చూశాను, వాడింకా నిద్ర
పోతున్నాడు.

కాగితం అందుకొని మడత విప్పాను.

'బావా!

నువ్వింతగ ఎదిగిపోయావని — ముఖ్యంగా
నాకూ, నా కలలకూ, నా ఊహలకూ కూడ
అందనంతగ—ఎదిగిపోయావని ఊహించుకో
లేక పోయాను.

అందుకే నిన్నరాత్రి అంత ధైర్యంగా
నిన్ను అడగగలిగాను. కానీ నా దుర
దృష్టం— నువ్వు నీతోటి మానవుడికి
అన్యాయం చెయ్యడం నీవల్ల సాధ్యమవదని
చెప్పావు. కానీ నీకు అబద్ధం చెప్పడం,
ఆత్మవంచన చేసుకోవడంకూడ రాదని నాకు
నిన్ననే తెలిసింది—రెండుసార్లు నేను
రావటం, నువ్వు నిద్రరాక దొర్లటం
చూశాను— ఎలాగ్గాతేనేం నిద్రపోగలిగావు.

కానీ నేను నిద్రపోలేను—నన్ను నేను
వంచించుకోలేను గనుక! నీలా ఆత్మ
వంచన చేసుకోవడమూ తెలియలేదు;
మా నాన్నలాగ అబద్ధాలాడి జీవించడమూ
చేతకాలేదు.

నిజం బావా! ఈ జీవితం నేనూ
హించింది కాదు. నా కలల స్వరూపం ఇది
కాదు, ఇలా భయంకరంగా మారటంకన్నా
నా కల కలగానే ఉండటం నాకిష్టం. కానీ
నా జీవితమే, తెల్లారిన తర్వాత భయం
కరంగా మారిపోతుంది.

అది నేను భరించలేనిది—

అందుకే — అశాంతితో ఈ శాంతి
జీవించలేదు.

మహలక్ష్మి నాకు జీవితంలో ఇంతటి
మార్గదర్శి అవుతుందనుకోలేదు నేను.
కానీ అనుకోనివి జరగటమే జీవితం!

అందుకే బావా— తెల్లవారకముందే నా
జీవితం తెల్లవారిపోతుంది!

నువ్వు అంగీకరించినా, అంగీకరించక
పోయినా శాంతి నీ కోసమే చచ్చిపోయిం
దన్నది నిజం!

ఆఖరిక్షణాల్లో అందర్నీ చూశాననే
తృప్తిమాత్రం మిగిలింది.


నమస్కారాలతో,


నీ శాంతి.'

ఉత్తరం చదివాను—ఆ పదాలకు అర్థం
తెలియలేదు నాకు.

ఆ అర్థం వెతుక్కుంటూ ఇంట్లోకి
వెళ్లాను.

లోనికి వెళ్లగనే అర్థమయింది నాకు
శాంతి అన్నదేమిటో! ●





ధర్మపథం
అర్ఘ్యప్రదానం
బులుసు వేంకటరమణయ్య

ప్రాతఃకాలంలోనూ, సాయంకాలంలోనూ – సూర్యోదయానికీ, సూర్యాస్తమయానికీ ముందు స్నానంచేసి, పరిశుద్ధులై, పరిశుద్ధమైన మనస్సుతో – భగవానుడైన సూర్యునికి అర్ఘ్యం ఇవ్వడం పెద్దలు ఏర్పరచిన నియమం. దోసిలితో నీరు ఎత్తి, గాయత్రిని జపిస్తూ క్రింద విడిచిపెట్టడమే ఆ పద్ధతి!

అలా ఎందుకు చెయ్యాలనే ప్రశ్న కలుగవచ్చు.

పూర్వం మందేహులనే రాక్షసులు వుండేవారు! సూర్యుణ్ణి జయించాలనే దుష్టమైన సంకల్పం కలిగింది వారికి. ఆ సంకల్పం నెరవేరడానికై వారు బ్రహ్మదేవుణ్ణి గురించి ఘోరమైన తపస్సు చేశారు. వారి తపస్సుకు మెచ్చి వరాలు కోరుకోమన్నాడు. సూర్యుడితో యుద్ధంచేసే శక్తి తమకు ప్రసాదించాలని ఆ రాక్షసులు కోరారు. బ్రహ్మ ఆ విధంగానే వారికి వరం అనుగ్రహించాడు.

ఆ రాక్షసులు సూర్యోదయం మొదలుకొని, సూర్యాస్తమయంవరకూ సూర్యుడితో యుద్ధం చేస్తూనే వుంటారు. సూర్యుని ప్రతాపం అధికంగా వుండడంవల్ల వారు ఆయన్ని ఓడించలేక పోయారు కానీ, సూర్యోదయ సమయంలోనూ, అస్తమించే సమయంలోనూ అతని శక్తి ప్రతాపాలు చాలా క్షీణించి వుంటాయి. క్రమక్రమంగానే – ఉదయానంతరం వృద్ధి పొందుతాయి. అప్పుడు రాక్షసుల బలం అధికంగా వుండడంవల్ల సూర్యునికి ప్రమాదకరస్థితి సంభవించ వచ్చును.

మందేహులు, సూర్యుడు ఉదయించకుండా అడ్డుపడతారనీ, అస్తమించే సమయంలో అతనిని అణచివెయ్యడానికి ప్రయత్నిస్తారనీ కూడా పెద్దలు చెప్పడం వున్నది.

అట్టి చిక్కులు కలగకుండా చెయ్యడానికే అర్ఘ్య ప్రదానం ఉద్దేశించబడిందట!

అర్ఘ్యప్రదానం చేసేటప్పుడు బ్రహ్మవాదులు, జలాంజలిని గాయత్రీమంత్రంతో అభిమంత్రించి, ఆ జలాన్ని విడుస్తారు. ఆ విడిచిన జలం వజ్రరూపమయి; ఆ రాక్షసులను తరిమి తరిమి వరుణద్వీపంలో పడేటట్లు చేస్తుంది. గాయత్రీమంత్రంతో అభిమంత్రితమైన జలానికే అట్టి శక్తి వుంది.


మంత్రాలలో గాయత్రి మంత్రమే గొప్పది. దానిని మించిన మంత్రం లేదు. తల్లిని మించిన దైవం లేనట్లే! ఈ విషయాన్నే.

'న గాయత్ర్యాః పరో మంత్రో
న మాతుః పరదైవతం'

అనేమాట చెప్తూఉన్నది.

గానం చేసేవానిని—జపించేవాడిని రక్షించేదికూడా ఆ మంత్రమే!

అయితే—ఆ మందేహులను హతమార్చినందువల్ల పాపం సంభవిస్తుంది. ఈ సంగతి బ్రహ్మవాదులకు తెలుసును. ఆ పాపాన్ని పోగొట్టుకొనడానికే వారు, అర్ఘ్యాన్ని విడిచిన తర్వాత, మంత్రాలను జపిస్తూ జలాన్ని తలచుట్టూ తిప్పుతారు. అలా చుట్టివేయడంవల్ల పాపాలు వారి పరిసరాలను చేరకుండా ఉంటాయి! ●



కొత్త సీరియల్ ప్రారంభం!



ఉన్నవ విజయలక్ష్మి

'అమ్మా!'...

నూతి పళ్లెం మీద గిన్నెలు తోలుముకుంటున్న సుభద్రమ్మగారికి వీధి వరండాలోంచి వినిపించిన కొడుకు పిలుపులో ఏదో విశేషం వుందనిపించింది-ఆ గొంతు మామూలుగా లేదు. దాచుకోలేని సంతోషం, ఎంత త్వరగా తల్లితో మాట్లాడతానా అన్న ఆత్రుత ఆ రెండక్షరాల లోనూ పోటాపోటీలు పడి మరీ అర్థం అవుతున్నాయి ఆ తల్లి హృదయానికి

'వస్తున్నా.' అంటూ చేతిలో గిన్నెలు అక్కడే వదిలేసి తడిచేతులు కొంగుని తుడుకుంటూ వరండా వేపు వెళ్లబోయింది.

'నాకు వుద్యోగం దొరికిందమ్మా.' - నాలుగు అంగల్లో, వరండా, హాలూ, ఆ తరువాత నడవా అన్నీ దాటుకుని అప్పటికే పెరట్లోకి వచ్చేసిన ముకుందం తల్లిని సమీపిస్తూ అన్నాడు- హడావిడిగా నడిచి రావటం వల్ల కలిగిన ఆయాసం కడుపు నిండిపోయినంత సంతోషం అతని గొంతులోంచి అంతకన్న మాటలు పెగలనివ్వ లేదు-

వంగి తన పాదాలకు నమస్కరించబోతున్న కొడుకుని ఆదరంగా రెండు చేతులతోనూ లేవదీసి, 'నీమాట వింటూనే నేను గ్రహించేసుకున్నాను-ఇంతకీ ఎక్కడా వుద్యోగం.' అని అడుగుతూ పసివాడిలా దగ్గరకు తీసుకుంది సుభద్రమ్మగారు.

'విశ్వనాథంగారు తెలుసు— వాళ్ల ఎలక్ట్రికల్ షాపులో—రేపటినుంచే పనిలో చేరమన్నారు—నీకు తెలుసో లేదో, ఈవూళ్లో పెద్ద ఎత్తున వ్యాపారంచేసే వాళ్లల్లో ఆయన ఒకరు-' అన్నాడు ముకుందం వుత్సాహంగా.

'పోనీలే బాబూ—ఇప్పటికయినా నీ శ్రమ ఫలించింది—నీ ప్రయత్నాలకి ఒక రూపం వచ్చింది — నాకు చాలా సంతోషంగా వుంది. — ఉత్సాహంగా మాట్లాడుతున్న తల్లిగొంతులో రవంత వణుకు, చటుక్కున తల తిప్పేసుకోబోయిన ఆవిడ కళ్లల్లో కాస్తంత తడి గుర్తించిన ముకుందానికి ఆమె ఆంతర్యం అర్థం చేసుకోటం ఏమీ కష్టం కాలేదు— అవే భావాలు అతని అంతర్యాన్ని కూడ ఒక్కసారి కదిలించివేయగా అతని కళ్లల్లో కూడ నీళ్లు తిరిగాయి.

ముకుందం తండ్రి హరినారాయణ జగన్నాథంగారి దగ్గర గుమాస్తాగా వుండేవారు ప్లీడరుగారు జీతం రూపంలో ఇచ్చేది అంత చెప్పుకోదగ్గది కాకపోయినా, ఆయన క్లయింట్లదగ్గర హరినారాయణ బాగనే రాబట్టుకొనేవాడు — వ్యవహారం అసలు కోర్టుదాకా ఎక్క అక్కర్లేకుండా తన లోకానుభవంతోనూ నోటి మంచితనంతోనూ దాన్ని పరిష్కరించి ఇరుపక్షాలవారికీ రాజీ కుదిర్చిన సందర్భాలు కూడ అక్కడా అక్కడా వున్నాయి— ఏ వ్యవహారంలో అయినా అతను తన స్వార్థం కించిత్తయినా చూసుకోకుండా కేవలం పరోపకార బుద్ధితోనే అదంతా చేస్తున్నానని అతనే నాడూ అనుకోలేదు. అలా అని పదిమందికీ చెప్పుకోనూ లేదు- తను పడిన శ్రమకి ప్రతిఫలం ఇంతో అంతో నిస్సంకోచంగా అడిగి మరీ పుచ్చుకునేవాడు—ఏమీ చెయ్యకుండా ఆ జీతం రాళ్ల తోనే తృప్తిపడి వూరుకుంటే, రెక్కాడితే కాని డొక్కాడని స్థితిలోంచి వచ్చిన అతను పదెకరాల పొలానికీ, ఓ సామాన్యమైన కుటుంబం హాయిగా కాలక్షేపం చెయ్యటానికి సరిపోయే యింటికీ స్వంతదారు కావటం జరిగివుండేది కాదు—అతని సంసారం కూడ కాస్త పెద్దదే అయిదుగురు పిల్లలు భార్యా తనూ—తన అవసరాలు గడుపుకుని ఇంకా ఇంతో అంతో వెనకేసుకుని భూమీ పుట్రా అంటూ నిర్వాకం చేసుకుంటున్న గుమస్తాని చూసి

జగన్నాథంగారు ఏనాడూ పెద్దగా అనుకో లేదు. 'చదువంటే లేదు కాని కొంతమందికి ప్లీడర్లనే మించిన తెలివితేట లున్నాయి—అవసరం అయితే వంద మెలికలుపెట్టి మళ్ళీ విప్పగలిగే అఖండమైన బుర్ర.' అని తన స్నేహితులతో చెప్పి నవ్వుకుంటూండేవారు—కొన్నికొన్ని రాజీ వ్యవహారాలలో 'పంతులుగారూ ఏం చేద్దాం అంటారు.' అంటూ హరినారాయణ సలహాలు అడిగిన సందర్భాలు కూడ వున్నాయి.

'ఇదంతా ఆ జగన్నాథంగారు ఇచ్చిన అలుసే—ఇంతోటి గుమాస్తా వుద్యోగాల్ని చూసుకుని మరీ క్రిందామీదా నిలవటం లేదు.' అని అతన్ని చూసి అసూయపడే వాళ్ళూ అక్కడా అక్కడా వున్నారు కాని,

'అతనేం అన్యాయంగానూ అక్రమంగానూ ఎవ్వరినీ దోచుకోటంలేదు — కష్టపడుతున్నాడు; అందుకు తగిన ప్రతిఫలం పుచ్చుకుంటున్నాడు — పిల్లలుగలవాడు — ఆమాత్రం తాపత్రయం లేకపోతే పెళ్ళాం బిడ్డలకి కడుపునిండా తిండికూడ పెట్టలేడు ఆ జీతం డబ్బులతోటి' అంటూ హరినారాయణపట్ల సదభిప్రాయం కలవాడే ఎక్కువమంది వున్నారు.

'ఉండటానికి ఓ యిల్లు, తిండి గింజలకి సరిపోయే పొలం సంపాదించాను. ఇంక నాకు దిగులులేదు—పిల్లలకి పెద్ద చదువులు చెప్పించి వాళ్ళని ప్రయోజకుల్ని చెయ్యగలిగితే నా అదృష్టాన్ని చూసి నేనే మురిసిపోవచ్చు—అమ్మాయిలిద్దరికీ కూడ పెద్ద వుద్యోగం, ఆస్తివున్న అల్లుళ్ళని తీసుకురావాలి — భగవంతుడు ఈ అయిదుగురినీ చల్లగాచూస్తే చాలు.' అనుకునేవాడు అతను—ఆఖరిది శశిరేఖ పుట్టినప్పుడు సుభద్రమ్మగారికి చాల జబ్బుచేసి, కాన్పు కష్టమై చివరికి మరి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చెయ్యటం జరిగింది—

ముగ్గురు కొడుకుల్లోనూ ఒకర్ని డాక్టరీ చదివించాలి ఇంకొకణ్ణి ఇంజనీరు చెయ్యాలి మూడోవాణ్ణి—ప్లీడరీ చదివిస్తే బాగుంటుంది అనుకుంటూ వాళ్ళ చదువుల్ని గురించికూడ అతను పథకాలు వేస్తూండేవాడు.

పెద్దకొడుకు ముకుందం ఆయన ఆలోచనా ధోరణికి అంతరాయం కలిగించాడు—లెక్కలగ్రూపు తీసుకుని మంచి మార్కులతో ఇంటరు ప్యాసయాకకూడ తనుతండ్రి ఆశించినట్లు, సూచించినట్లు ఇంజనీరింగుకి వెళ్ళక బికాం చదువుతాను అన్నాడు. "సరే—బియిస్సీలా—పోనీ ఆ తరువాత లా చదువు మా ప్లీడరుగారి అబ్బాయిలా' అన్నాడు హరినారాయణ; ఒకణ్ణి ప్లీడర్ని చెయ్యాలని తను



ఆశలూ అనుభవాలూ

అనుకుంటున్నదే కదా అన్న ధోరణిలో.

'ఊహూ — నా కదీ యిష్టంలేదు.' అన్నాడు ముకుందం తల కొద్దిగా వంచుకుని.

'అంటే ఈ బికాంతోనే చదువు చాలించుకుంటా నంటావా — సరే నీ యిష్టం — నువ్వు సరదా పడతావేమో ఇంకా పెద్ద చదువులు చదివిద్దా మనుకున్నాను.' అనేశాడు హరినారాయణ కొడుకు అభిప్రాయం గ్రహించుకోలేక.


'అదికాదు—నాకు ఆడిటర్ కావాలని వుంది వాళ్ల రమణమూర్తిలాగా—ఈ డిగ్రీ వచ్చాక ఏ ఆడిటర్ దగ్గరయినా నాలుగేళ్లు పనినేర్చుకుని తరువాత పరీక్ష ప్యాసయితే స్వంతంగా ప్రాక్టీసూ పెట్టుకోవచ్చు లేకపోతే ఏ పెద్ద కంపెనీలో నయినా వుద్యోగమూ దొరుకుతుంది.' అన్నాడు ముకుందం మెల్లిగా తల ఎత్తి ఆశగా తండ్రి కళ్లల్లోకి చూస్తూ.

'ఆడిటరా?' అన్నాడు హరినారాయణ కొడుకుమాటలు అర్థం చేసుకోటానికా అన్నట్లు అతని కళ్లలోకి చూస్తూ — ఔను అన్నట్లు మెల్లిగా తల వూగించాడతను—

హరినారాయణకి ఆమధ్య ఎవరో చెప్తూ వుంటూంటే విన్న సంగతులన్నీ గుర్తు వచ్చాయి— ఆ పెద్ద బజారు వీధిలో 'మూర్తి అండ్ కంపెనీ, ఆడిటర్సు అండ్ ఛార్టర్డు ఎక్కౌంటెంట్సు' అని వున్న పెద్దబోర్డు కళ్లల్లో మెదిలింది.

'దానికి ముందుగా నాలుగువేలో ఎంతో ఫీజు కట్టాలిట ఆ—అయితే అవుతుంది—ఏ పెద్ద చదువుకో పైవూరు పంపిస్తే మాత్రం నెల తిరిగేసరికి వందలకి వందలు పంపించక్కర్లేదా—ఆ ఖర్చు చేసేదేదో ఒక్కసారే సర్దుబాటు చేస్తే సరిపోతుంది. ఫలానా పనికోసం అని చెప్తే ఎవరైనా అప్పు ఇస్తారు తనకి—పెద్ద చదువులూ ఆపైన దండిగా రాబడీ కావాలనుకునేటప్పుడు ముందుగా కొన్ని ఇబ్బందుల్ని ఎదుర్కోక తప్పదుమరి. అనుకుని ఆమాటే కొడుకుతోకూడ చెప్పాడు, నువ్వు ఎలాంటి సంశయమూ పెట్టుకోకు నీకేం కావలిస్తే అదే చదివిస్తాను అనే ధోరణిలో.

'ముందుగా డబ్బు కడుతున్నాం అన్న


లక్ష్మీస్
డేటాన్ &
డెమోక్రాట్
కాటన్ షర్టింగ్‌లు
లక్ష్మీ మిల్స్
కంపెనీ లిమిటెడ్
కోయంబత్తూరు

పేరేకాని ఆ ట్రైనింగు కాలంలో వాళ్ళు మనకి నెలకి డబ్బియ్యో ఎంతో స్టైఫండు ఇస్తారుట.' అన్నాడు అప్పటికే చాలా వివరాలు సేకరించి అట్టే పెట్టుకున్న ముకుందం.

'ఔను—ఇప్పుడు జ్ఞాపకం వస్తోంది. నేనూ అలాగే విన్నాను — ఇంక మనకి ఇబ్బంది అవుతుంది అన్న ప్రశ్నేరాదు— ఒకవేళ అయినా నేను ఎలాగో తంటాలు పడతాను — నువ్వు అదే చదువుదుగాని.' అన్నాడు ఆయన మురిసిపోతూ.

తండ్రి ప్రోత్సాహం చూస్తూంటే అపేళే ఆడిటర్ బోర్డు కట్టుకున్నంత సంబరంగా వుంది ముకుందానికి. భవిష్యత్తుకి ఓ నిర్ణయం అంటూ జరిగిపోయాక ఆరేడు సంవత్సరాలు ఎంతలో తిరిగివస్తాయి అనిపించింది— ఆ రోజుకోసం ఎదురుచూస్తూ శ్రద్ధగా పుస్తకాలు చదువుకుంటూ నిశ్చింతగా కాలం దొర్లించేస్తున్నా డతను.

ముకుందం ఫైనల్ బి.ఎ. చదువుతూండగా, హఠాత్తుగా ముంచుకు వచ్చిన పక్షవాతంతో హరినారాయణ మంచం ఎక్కటం ఆ కుటుంబానికి గొడ్డలి పెట్టులాగే తగిలింది.

లేచి ఆఫీసుకువెళ్ళి ఎప్పటిలా పని పాటలు చూసుకునే స్థితిలోనూ లేడు — పోనీ అంటే తన సలహా సంప్రతింపులు ఆశించి ఇంటికి వచ్చినవారితో మాట్లాడి చక్రం నడిపించగలిగే స్థితిలోనూ లేడు — ఒక కాలూ, చెయ్యీ, నోరూ పడిపోయి అవిటివాడుగా మంచంలోంచి లేవలేని స్థితిలో వున్నాడు—నెల నెలా వచ్చే జీతం రాళ్ళురావు. ప్రావిడెంటు ఫండూ, పెన్షనులాంటి సౌకర్యాలయినా లేవు — ఏడాదిక్రిందట రెండెకరాల పొలం కొనటానికి చేసిన వెయ్యిరూపాయల అప్పులో అయిదువందలు ఇంకా అలాగే వుంది.

'ఈ సంసారం ఎలా గడుస్తుంది — ఆ అప్పు ఎలా తీరుతుంది.' అన్నట్లు దిగులుగా భార్యాబిడ్డలవంక చూసేవా రాయన.

'మీకేం భయంలేదు — పదిరోజుల్లో లేచి తిరుగుతారు—అయినా మీ రింతకష్టపడి సంపాదించి కుటుంబాన్ని పోషించాల్సిన అవసరం ఏంలేదు—మీరు హైరాన పడకుండా హాయిగా విశ్రాంతి తీసుకోవచ్చు —ఈ ఏటితో పెద్దబ్బాయి చదువయి పోతుంది—ఏదో ఓ వుద్యోగం, చూసుకుంటాడు.' అంటూ ఎవరికితోచిన ఓదార్పు మాటలు వాళ్ళు చెప్పి వెళ్తూండేవారు ఇరుగూ పొరుగూ, స్నేహితులూ అంతా.

'మీకు తెలియదు — వాడిని ఇంకా పెద్దచదువులు చదివిద్దా మనుకున్నాను. వాడు ఎన్నోఆశలు పెట్టుకున్నాడు— నేను ఎన్నో కలలు కన్నాను అవన్నీ పేకమేడల్లా కూలిపోవలసిందేనా—చదువు చాలించుకుని వాడు ఇంక సంసార తాపత్రయంలో పడవలసిందేనా' అన్నట్లు దీనంగా అందరి కళ్ళల్లోకి చూసేవారాయన.

ఇరుగూ పొరుగూ ధైర్యం చెప్పినట్లూ ఇంట్లోఅంతా కోరుతున్నట్లూ ఆయన పదిరోజుల్లో లేచి తిరగలేదు సరికదా జబ్బుకూడా ఏమీ తగ్గుముఖం పట్టలేదు రోజులూ నెలలూ గడిచిపోతున్నాయి— నెల నెలా వచ్చే జీతం రాకపోగా డాక్టరు బిల్లులూ మందుఖర్చులూకూడ అదనంగా వచ్చి పడ్డాయి — ఆయన జబ్బుపడిన కొత్తలో ప్లీడరుగారు ఇచ్చిన వెయ్యిరూపాయిలూ లేకపోతే ఆకుటుంబం ఇంకా ఎన్నో ఇబ్బందులకు గురిఅయ్యేది.

ఆ నాడు ఆయన నోట్లువుంచిన కవరు ముకుందం చేతికి ఇస్తూంటే, 'మీ మేలు నేనీజన్మలో మరిచిపోలేను' అన్నట్లు కృతజ్ఞత నింపుకున్న కళ్ళతో ఆయనవంక చూశాడు హరినారాయణ.

'అవసరంలో ఆదుకున్నారు— మీ కెలా కృతజ్ఞత చెప్పుకోవాలో తెలియటంలేదు.' అన్నాడు ముకుందం.

'నేనేదో మీకు పెద్దసహాయం చేస్తున్నానని కాని, ఈ కాస్తంత డబ్బుతో మీ కుటుంబాన్ని ఆదుకుంటున్నానని కాని అనుకోటంలేదు—మీ నాన్నగారు ఇన్ని సంవత్సరాలూ చేసినపనికి ఓ విలువకట్టి ఇది ఇస్తున్నానని చెప్పటము నా అభిమతం కాదు—గవర్నమెంటు, రిటైరయినవుద్యోగులకి ఏదో ఏర్పాటుచేస్తుంది. నా కంత శక్తిలేదు...'

'అబ్బే మీరలా అనకండి. ఇలాంటి సహృదయంమాత్రం ఎంతమందికుంటుంది' అంటూ మధ్యలోనే ఆయన మాటల్ని అడ్డుకున్నాడు ముకుందం.

'మీకు త్వరలోనే ఆరోగ్యం చేకూరుతుందనీ మళ్ళీఎప్పట్లా మీ సలహా సహకారాలు మాకువుంటాయనీ ఆశిస్తున్నాను.' అంటూ హరినారాయణకి వోసారి ధైర్యం చెప్పి.

'మీ కెప్పుడే సహాయం కావలసివచ్చినా నన్ను అడగటానికి ఎలాంటి మొహమాటం పెట్టుకోవద్దు' అని ముకుందాన్ని హెచ్చరించి వెళ్ళిపోయారాయన—పదినెలలపైనే గడిచాయి.

ప్లీడరుగారు ఇచ్చిన డబ్బూ, పొలం మీదవచ్చిన డబ్బూఅన్నీ అయిపోయాయి—జబ్బు తిరుగుముఖం పట్టకపోయినా ఆశ వదులుకోకుండా వైద్యం చేయిస్తున్నా ఆ కుటుంబంమీద జాలిపుట్టిందో కాబోలు ఇంక మిమ్మల్ని బాధపెట్టటం ఇష్టంలేదు అన్నట్లు హరినారాయణ ప్రాణ వాయువులు అనంతవాయువుల్లో కలిసి పోయాయి వోనాటి రాత్రి.

ఏడాదిగా మంచంలోవున్న మనిషే అయినా ఇలాంటిది త్వరలోనే సంభవిస్తుంది అని ముందుగానే తెలిసినదే అయినా పోయినవాళ్ళకోసం వున్నవాళ్ళు దుఃఖపడటం మానలేరు—ఏడుపులూ వోదార్పులూ అన్నీ యధావిధిగా జరిగిపోయాయి.

'ఇప్పుడు నువ్వే యింటికి పెద్దవాడివి— సంసారం గుట్టుగా గడుపుకావటం తమ్ముళ్ళని, చెల్లాయిల్ని చదివించటం అదీ అన్నీ నువ్వే చూసుకోవాలి— నువ్వు అడిగినప్పుడు సలహాలివ్వటం తప్ప మీ అమ్మ ఇంకేమీ చెయ్యలేదు — ఆవిడ మనస్సుకి కష్టం కలగకుండా మెలగటం, ఆవిడ చెప్పినట్లు చెయ్యటం నీకు విధి — నువ్వూ చిన్నవాడివే కాని పెద్ద బాధ్యతలు వచ్చి మీదపడ్డాయి' అన్నారు వచ్చిన బంధువులూ, ఊళ్ళో పెద్దలూ అంతా ఒకే ధోరణిగా.

వాళ్ళందరి మాటలూ వింటూంటే తండ్రి మరణానికి ముందు సాయంకాలం సంఘటన గుర్తుకు వచ్చింది. ఆవాళ మధ్యాహ్నం మంచి ఆయన రోజూ కన్న కాస్త తెలివిగాను హుషారుగానూ వున్నట్లు కనిపించారు—కొత్త మందులు పనిచేయటం మొదలుపెట్టాయేమో ఇంక వ్యాధి క్రమంగా తిరుగుముఖం పడుతుందేమో

అన్న ఆశ అందరి మనస్సులలోనూ రెపరెపలాడింది ఆ పూటంతా...తేటగా వున్న తండ్రి మొహంలోకి చూస్తూ, కావాలని ఏదోటికల్పించుకుని ఆయనతో అవీ ఇవీ చెప్తూ, తల్లీ పిల్లలూ అందరూ ఇంచుమించు ఆ పూటంతా ఆయన మంచం దగ్గరే గడిపారు — వాళ్ల మాటలన్నీ వింటున్నట్లు కుతూహలంగా వాళ్ళ మొహాలలోకి చూస్తూ, వాళ్ళని పలకరిస్తున్నట్లు చిన్నగా నవ్వుతూ వున్న ఆయన అంతలోనే చటుక్కున కళ్లంట నీళ్లు పెట్టేసుకున్నారు–చివరికి ముకుందం వైపు దృష్టి నిలిపి జాలిగా తపనగా అతని కళ్లలోకి చూస్తుంటే అతనితో ఏదో చెప్పాలని ఆయన మనస్సు కొట్టుకు పోతుందనీ అది మాటల రూపంలో వ్యక్తం చేయగలిగే శక్తి లేనందుకు ఆయన ప్రాణం విలవిల్లాడిపోతోందనీ అందరికీ అర్థం అయింది–ఆయన అవస్థ చూస్తుంటే అందరికీ గుండెలు కదిలిపోయినట్లయాయి.

'ఏమిటినాన్నా; ఏంకావాలి.'—మంచం మీద ఆయనకి మరీ దగ్గరగా జరిగి కూర్చుని అడిగాడు ముకుందం దుఃఖం నిగమింగుకుని.

ఆయన కంపిస్తున్న వేళ్లతో ఆప్యాయంగా అతని చెయ్యి నిమిరారు–దిగులు నిండుకున్న కళ్లతో మిగిలిన పిల్లలవైపు భార్యవైపు చూశాడు ఒక్కసారి — ఆతరువాత ఆ చూపు పెద్దకొడుకువైపు తిప్పి 'వాళ్లందరి భారం నీదే' అన్నట్లు చూశారు.

హఠాత్తుగా ఆయనలో వచ్చిన ఈ మార్పుకి అందరి ధైర్యం చెదిరిపోయినట్లయింది—పిల్లలు బిక్కమొహాలు వేసుకుని, కళ్లు ఒత్తుకోడంకూడ మరిచిపోయి కూర్చుండి పోయారు—

'ఏమిటండీ—ఇప్పుడేం జరిగిందని—ఈ అప్పగింతలన్నీ ఎందుకు — మీకేం భయంలేదు,' అంటూ పైకి ఆయనకి ధైర్యం చెప్తూ వెక్కిళ్లు దిగమింగుకుంది సుభద్రమ్మగారు,

కాని హరినారాయణ కళ్లల్లో ఆరాటం అణగలేదు. సైకిలిచ్చి పొరుగువాళ్ల అబ్బాయిని డాక్టరు దగ్గరికి పంపించి లోపలికి వచ్చిన ముకుందం ఉప్పెనలా ముంచుకొస్తున్న దుఃఖాన్ని అదిమి పడుతూ

తండ్రిచేయి తన రెండు చేతులలోకి తీసుకుని 'మీరేమీ బెంగపెట్టుకోకండి — అమ్మనీ తమ్ముళ్ళనీ చెల్లాయిలనీ కంటికి రెప్పలా చూసుకుంటాను—వాళ్ళకే లోటూ రానివ్వను — అమ్మ మనసు, ఏవిధంగానూ కష్టపెట్టను—ఆవిడ ఇష్టప్రకారమే నేను నడుచుకుంటాను.' అన్నాడు.

చూస్తూండగానే ఆయన ముఖంలో కళ్ళలో శాంతిపరుచుకుంది—

హడావిడిగా వచ్చిన డాక్టరు అందరిని కాస్త ప్రక్కకి జరగమని ఇంజక్షను ఇవ్వటానికి సిద్ధపడుతూంటే ఎంత వెర్రివాడివి అన్నట్లు అతని కళ్ళల్లోకి చూశాడు-కేవలం పెద్దకొడుకు దగ్గర ఆమాట తీసుకోటంకోసమే ఎదురు చూసినట్లు ఆ రాత్రే ప్రశాంతంగా కళ్ళు మూశారు...అదంతా గుర్తువచ్చి 'నామీద పెద్ద బరువుపెట్టి మీరు నిశ్చింతగా వెళ్ళిపోయారు నాన్నా' అనుకున్నాడు ముకుందం మరోసారి—

వచ్చిన బంధువులంతా వెళ్ళిపోయినా హరినారాయణ విధవ అప్పగారు ఓనెల రోజులు వుండి ఆ కుటుంబం ఆలనా పాలనా చూసి ఆతరువాత ఆవిడా వెళ్ళిపోయింది తన కొడుకుల దగ్గరికి—కళ్ళలో చిమ్ముతున్న కన్నీటిని కొంగుతో అద్దుకుంటూనే ఇంటి పనిపాటలలో చొరబడిపోక తప్పలేదు సుభద్రమ్మగారికి—రోజులు గడుస్తున్నకొద్దీ ఎవరిప్రమేయం లక్ష్యపెట్టకుండానే ఇంటి బాధ్యత వహించటం అలవాటయి పోయింది ముకుందానికి — తమ్ముళ్ళూ చెల్లెళ్ళూ తననే ఇంటికి పెద్దవాడుగా గౌరవించటం ప్రతిదానికీ తన మాటమీదే నిలబడటం అతనికి తృప్తినే కలిగించింది'

కొద్దిరోజుల తేడాలో అందరి పరీక్షా ఫలితాలు తెలిశాయి. అందరూ ప్యాసయ్యారు, -

మూర్తి అండ్ కంపెనీ మూర్తిగారు ఓరోజు ముకుందానికి బజార్లో కనిపించి 'మీ రిజల్ట్సు వచ్చినట్లున్నాయి.' అంటూ పలకరించాడు.

'వచ్చాయండీ — ప్యాసయ్యాను నాకు క్లాసుకూడ వచ్చింది.' అన్నాడు ముకుందం వినయంగా.

'ఓ— కంగ్రాచ్యులేషన్సు — తరువాతేం చెయ్యాలనుకుంటున్నావు' అని అడిగి అతని సమాధానానికైనా చూడకుండా ఆయనే మళ్ళీ మొదలుపెట్టాడు. 'చూడు నిన్ను ఆడిటర్ని చెయ్యాలని మీ నాన్నగారు మహా ముచ్చట పడ్డారు— నాతో ఎన్నిసార్లో అన్నాడు—నీకూ అదే ఇష్టంట కదూ—నీలాంటి తెలివైన కుర్రాడు మా దగ్గరచేరటం నాకూ సంతోషమే—మీనాన్నగారికీ నాకూవున్న పరిచయంవల్ల నేను నీకు ఒక చిన్న సదుపాయం చూపించ దలుచుకున్నాను - అందరిలా నువ్వు నాకు ఫీజేమీ కట్టక్కరలేదు...' మూర్తిగారి మాటలు వింటూంటే ముకుందం గుండెలు ఒక్కక్షణం సంతోషంతో ఎగిరిపడ్డాయి — అణగారిపోయాయి అనుకున్న ఆశలు మళ్ళీ ఒక్కసారి రేగాయి. ఆయనకి కృతజ్ఞత తెలియజేసుకోటానికి మాటలకోసం తడుముకుంటూంటే ఆయనే మళ్ళీ అన్నారు 'అయితే మా ఇబ్బందులుకూడ మేం ఆలోచించుకోవాలిగా—ఇలా నేను స్పష్టంగా చెప్పేస్తున్నందుకు ఏమీ అనుకోకు—నీకు స్టైఫండు ఇవ్వటానికి మరి మాకువీలు కాదు—నువ్వు ఆలోచించుకుని అంగీకారం అయితే వెంటనే వచ్చిచేరు...'

ఒక్క త్రుటికాలం ముకుందం ముఖం చిన్నబోయినా అది ఆయన దృష్టిలో పడకుండా తలవాల్చుకుని 'నేనింకా ఏది నిశ్చయించుకోలేదండీ —అమ్మతోకూడ ఆలోచించి ఏ సంగతీచెప్తాను' అన్నాడు ఎటూ నిర్ణయించుకోలేని సందిగ్ధావస్థలో పడికొట్టుకుంటూ.

'నిజమే — పెద్దవారు—ఆవిడ సలహా తీసుకోటం తప్పకుండా అవసరం — సరే మళ్ళీ కనిపించు' అనేసి తన పనిమీద వెళ్ళిపోయారాయన.

అంతావిన్న సుభద్రమ్మగారు, 'పోనీ ఇదీ బాగానేవుంది—ఆయన చేతిలో వున్న వుపకారం ఏదో ఆయనచేస్తానంటున్నాడు— ఈమాత్రం అవకాశం అయినా వస్తుందని మనం అనుకోలేదుగా—ఎప్పటి నుండో సరదాపడ్డావు—చదువుకో.' అంది.

నాకూ సరదాగానేవుంది — కాని ఎలా సాగుతుందమ్మా' — ఈ చదువులో పడ్డానంటే నాలుగేళ్ళుగడిచి పరీక్ష ప్యాసయ్యేం దాకా నాకు వుద్యోగం దొరకదు.'

'అందాకా ఆ పొలంమీద వచ్చినదాంతో సర్దుకోలేమా...'

'నాకు ఆ ఆలోచన ఏమీ తృప్తిగా లేదమ్మా...నాలుగేళ్ళు అన్న చదువు నాలుగేళ్ళలో పూర్తికాకపోవచ్చు — వెంటనే పరీక్ష ప్యాసుకాలేకపోవచ్చు—తీరా మధ్యలో మానటానికీ మనస్సు ఒప్పదు — ఇప్పుడు చూడు పదిరోజుల్లో కాలేజీ తెరుస్తారు — సుందరాన్ని ఇంటర్లో జాయిన్‌చెయ్యాలి — మిగిలిన వాళ్ళవి స్కూలు చదువులే అనుకో — అయినా అందరికి జీతాలు పుస్తకాలు అదీ బోలెడు ఖర్చువుంటుంది — చేతిలో పదిరూపాయలకి మించి డబ్బులేదు— పొలంమీది డబ్బు చేతికి రావటానికింకా వ్యవధివుంది—మన రాబడి సంగతిమాస్తే ఇలావుంది—మరో ప్రక్క అప్పులు తలుచుకుంటే భయంవేస్తోంది.—అప్పుడెప్పుడో పొలం కొనటానికి నాన్నగారు చేసినబాకీ. ఆయన పోయినరోజుల్లో మనం జగన్నాధం గారి దగ్గర తీసుకున్న డబ్బు తీర్చాలి— ఆయినా మళ్ళీ ఆయన్నేఅడిగి ఎంతోకొంత తీసుకొచ్చి ఇప్పటి అవసరాలు గడుపుకోటం తప్ప మరోమార్గం లేదు—సరే ఆ తరువాత ఆ అప్పులన్నీతీర్చాలి, వారూ అన్నం అయినా తిని మనకడుపులు నింపుకోవాలి— ఆ ఏటికావేడు పిల్లలూ పెద్ద చదువుల్లోకి వస్తారు - అన్నిఖర్చులు ముందు పెట్టుకుని నేనుకూడ మరి కొన్నేళ్ళపాటు పైసా సంపాదనలేకుండా చదువులో దిగుతాననటం ఏమి బాగుంటుంది.' అన్నాడు లోలోపల తలఎత్తుతున్న ఆశనీ ఉత్సాహాన్నీ అణచుకుని,

మర్నాడు వెళ్ళి ఆ నిర్ణయాన్నే మూర్తిగారికి చెప్పాడు. 'మీరెంతో దయతోనూ


మా ఆవిడొచ్చేసిందిగా! ఇక నువ్వెందుకోయ్!!

అభిమానంతోనూ నాకో అవకాశం కల్పించినా దాన్ని వినియోగించుకునే స్థితిలో నేను లేనప్పుడు—పరిస్థితులు అవే చక్కబడతాయి నువ్వు చదువుకో అని అమ్మ అన్నది కాని నాకు ఇష్టంలేదు—నాకింతే ప్రాప్తం అని సరిపెట్టుకుంటాను—మీరు మాత్రం నాకు మరో సహాయం చెయ్యాలి, ఎక్కడైనా నాకు ఉద్యోగం చూపించాలి—మీకు అదేమంత కష్టం కాదనుకుంటాను.' అన్నాడు కాస్త చనువుగా.

'నీ పరిస్థితి నాకు అర్థంఅయింది—ఉద్యోగమూ అంటే మాదగ్గర ఏమీ లేవనుకో — నాకు తెలిసినవాళ్ళెవరికైనా చెప్తాను' అన్నారు.

ఆయన అన్నారని ఆశపెట్టుకుని వూరికే కూర్చోకుండా ముకుందం తన ప్రయత్నాలు తను చేసుకోటం మొదలు పెట్టాడు.

'ఈ వూళ్లో కూర్చుంటే ఏంవుద్యోగం దొరుకుతుంది—ఏదైనా పెద్దపట్నం వెళ్ళి ప్రయత్నంచేసుకుంటే బాగుంటుంది అన్న ఆలోచనకూడ రాకపోలేదు—వాళ్ల అచ్యుతరావు బొంబాయివెళ్లి ప్రయత్నించుకుంటే అదేదో పెద్దకంపెనీలో మంచి ఉద్యోగమే దొరికిందిట—వాళ్ల కామేశానికి మాత్రం జంషెడ్‌పూర్‌లో మంచి జాబ్ రాలేదా అని గుర్తుచేసుకుంటూ తన అభిప్రాయాన్ని సమర్థించుకుంటూండేవాడు—అయినా అంతదూరం వెళ్ళటానికీ అక్కడేదో దొరికేదాకా తిండి తినటానికీ సరిపడే డబ్బు చేతిలో వుండాలిగా ముందర. అని మళ్లీ వెనక్కిలాగుతూండేది మనసు—చివరికి కవుండబట్టలేక జగన్నాథంగారు లాంటి ఒకరిద్దరి దగ్గర తనఉద్దేశ్యాలు బైటపెట్టాడు.

అంతావిని వాళ్ళ 'ఎందుకొచ్చిన వుద్యోగాలయ్యా — అంతమేత గోదావరి ఈత అన్నట్లు అక్కడవచ్చిన పెద్ద జీతం అక్కడి ఖర్చులకి సరిపోతుంది. ఇంక ఇంటికేం పంపిస్తావు వీళ్ల అవసరాలేం తీరుస్తావు—అయినా యింటికి పెద్దవాడివి నువ్వెళ్లి ఎక్కడో కూర్చుంటే ఇక్కడి వ్యవహారాలు పిల్లల చదువులూ అవీ బాధ్యతగా ఎవరుచూస్తారు — నిన్ను నిరుత్సాహపరుస్తున్నా ననుకోకు—ఇప్పటి మీ పరిస్థితులదృష్ట్యా. కొన్నాళ్లపాటైనా నువ్వు ఈవూళ్లోనే వుంటే నీ అమ్మ గారికి కూడ ధైర్యంగా వుంటుంది—ఇక్కడయినా ఏదో ఒకటి దొరక్కపోదు ప్రయత్నాలు చేస్తున్నాంగా.' అన్నారు పెద్దతరహాగా సలహాయిస్తూ.

రెండుమూడు నెలలు కాస్త శ్రమపడినా చివరికి కాస్త మంచికంపెనీలోనే దొరికింది వుద్యోగం—ప్రయోజకుడై తన ఎదుట నిలబడిన కొడుకుని చూసుకుంటూంటే చెప్పలేని గర్వం సంతోషం కలిగాయి సుభద్రమ్మ గారికి.

పట్టుమని రెండుపదులు నిండని కొడుకు పొట్ట చేతపట్టుకుని వాళ్ల వెంట వీళ్లవెంట తిరగటం—ఎంతో చదువుకోవాలి ఏదో అయిపోవాలి అనుకుంటూ పదిలంగా పేర్చుకుంటూ వచ్చిన ఆశలన్నీ ఒక్కసారి దులిపేసుకుని ఇలా ఓ చిన్న వుద్యోగంలో చేరిపోవటం...

ఆవిడకి పుట్టెడు జాలి ముంచుకువచ్చి కళ్లల్లో నీళ్లు తిరిగాయి—అది కొడుకు కంటపడకుండా మొహం కొద్దిగా ప్రక్కకి తిప్పుకుని, 'నాకు చాలా సంతోషంగా వుంది బాబూ,' అంది అతని జుట్టు

[illegible] నెం 53 — 18 క్లూలు

1. గర్వం వలెనే ఆశ, **అభివృద్ధి/న్యాయ బుద్ధి** కి గొప్ప ప్రతిబంధకం. మరి ఈ రెండున్ను నిర్దాక్షిణ్యంగా తొలగింపబడవలెను.

2. భారతదేశంలో ఇప్పటికిన్ని ధరిత్రి మీద అత్యంత అధిక **ప్రాచీన/సంబద్ధ** సంయుత గలదు.

3. ప్రమాదంలో మానవ యుక్తి **ఉల్లాసం/సాహసం** అయి వున్నది.

4. ఉత్పాదన విస్తారమై యున్నప్పుడు మాత్రమే మరియు ఉత్పాదక శక్తులలో నిర్బంధాలు లేనప్పుడే **అవమూల్యన / ముద్రా స్ఫీతి** దేశానికి సహాకరింపగలదు.

5. ఆధునిక మనుష్యుడు దాని సృష్టిలో తన వ్యర్థ పాత్ర లేనటువంటి విస్తార మరియు విశ్లిష్ట సభ్యతలో వసింపుతాడు; అయితే తాను చిన్న **వాడు / నిశ్చేష్టితుడు** గా భావింపు కొన్నచో ఆశ్చర్యం ఏమీ లేదు.

6. సభ్య సమాజానికి ఆదిమములకు తోడుగా **సభ్య భావనలు / రివాజులు** కావలసియున్నవి.

7. సామాజిక జీవన మందలి సాంస్కృతిక ఆకృతులలో అనుశాసనానికి ఆవశ్యకత లేదు, ఇచ్చట మనం మన **క్షమతలను / కల్పనలను** ఉప యోగిస్తుంటాము.

8. కళాకారుని అన్వేషణ వైజ్ఞానికుని అన్వేషణకంటె తక్కువ **లాభదాయకం / తత్వ పూర్ణం** మరియు యత్నభరితమైనది కాదు.

9. గోధుమ అధికంగా పండుట మానవుని దానికంటె ఎక్కువగా ప్రకృతి యొక్క **ప్రామాణికం / దక్షత** వల్లనే.

10. మనలను మానవులుగా జేయునది **పరి కల్పన / విచారత** గురించి మన క్షమతయే.

11. రాష్ట్ర నిర్మాణ కష్టసాధ్య కార్యములో, ఆర్థిక వికాసం, దేశ భౌతికాభివృద్ధి ఎంత అవసరమో, వకాలిక విచారణ మరియు జాగృత **జీవనం / ప్రేమ** వల్ల ఉత్పన్నమైన సృజనాత్మక సాహిత్యం అంత అగత్యం.

12. ఇదియొక ప్రాచీన యుక్తి; స్వార్థ రాజనీతిక ప్రయోజనాలను దాచి యుంచుకున్న, మా లోపయుక్త పాపముల నుండి ధ్యానము మరలించే నిమిత్తమున్ను మీరు మది ఎంత తక్కువగా చేయ సంకల్పింతురో అంత ఎక్కువగా **ప్రతిజ్ఞలు / వాక్యాలు** ప్రసరింప వలసి యుంటుంది.

13. వకాలిక అనుసంధానాలు విజ్ఞానంలోవలెనే కళలోకూడ **అరుదు/లాభదాయకం** అయినవి.

14. ధరిత్రిమీద మానవుడుగా అవతరించినందుకు మరి దేనిని ఆశించక సంసార భోగములకే ఆ తపనే మానవుని అస్తిత్వం యొక్క అసలైన **ఉద్దేశ్యం / గౌరవం** అణగిపోయింది.

15. ప్రపంచంలో ప్రయోజనకరంగా ప్రసిద్ధిన కార్యమును సాధించిన జనులు సర్వదా **తిరుగబడువారుగా / క్రియాశీలురుగా** వుంటారు.

16. శ్రద్ధా మూలమందు **క్రాస్, ముక్తి/సహనశీలతా** చిహ్నమై యున్నది.

17. మనము ఎంత ఎక్కువ **స్వార్థులం / అవిశ్వాసులం** గా అయి వుంటామో అంత ఎక్కువగా మనంతట మనకు చెరుపు కలిగించుకొన్నవారమే కాక నిజంగా మన ఇరుగు పొరుగు వారికి కూడ కీడు కలిగించినవారల మౌతాము.

18. **కెరటములు/శబ్దములు**(మాటలు)యందు ఇంద్రజాలం మరియు ప్రమాదం రెండున్ను గలవు.

No. 53: 18 CLUES

(1) Like Pride, **Greed is a great** obstacle to **Advancement / Judgement**, and both of these must be ruthlessly washed away.

(2) India still has the most **Ancient/ Coherent** civilization on earth.

(3) **Cheer / Courage** is man's salvation in danger.

(4) **Devaluation Inflation** can only help a country when the production is abundant and when there are no restraints on the forces of production.

(5) Modern man lives amid an immense, complex civilization that he did little to create; it is not surprising if he feels **Diminutive / Passive**.

(6) A civilised society needs civilised **Emotions / Institutions** in addition to the primitive ones

(7) In the cultural aspects of social life, there is little need for discipline. Here we exercise our **Faculties / Fancies**.

(8) The exploration of the artist is no less **Fruitful / Youthful** and strenuous than that of the scientist.

(9) Wheat grows more by nature's **Honesty / Ingenuity** than by man's.

(10) What makes us human is our capacity for **Innovation / Reflection.**

(11) In the uphill march of nation-Building, Creative literature, born of creative thinking and enlightned **Living Love**, is as much needed as the economic development and material uplift of the country.

(12) It is an old tactic: The less you mean to do The more you have to keep **Promising Talking**, to conceal your selfish political expediencies, and to distract attention from your sins of omission.

(13) Original discoveries are as **Rare / Rewarding** in art as in science

(14) The true **Reason / Record** of man's existence on earth has been over shadowed by his anxiety to obtain from his incarnation nothing but worldly gain.

(15) People who have achieved anything worth achieving in this world have ever been **Rebels / Restless.**

(16) The cross, at the core of its faith, is a symbol of **Salvation / Suffering.**

(17) The more **Selfish / Suspicious** we are the more evil we do to our selves, and indeed to our neighbours.

(18) There is both magic and menance in **Waves / Words.**

గమనిక: పై క్లూలు ప్రసిద్ధ గ్రంధకర్తల పుస్తకములనుండి తీసుకొనబడినవి. అవి పూర్తి వాక్యములు ఎందియు వేరువేరుగా పూర్తి అర్థవంతమైనవి. గ్రంధకర్తలు, వారి పుస్తకముల పేర్లు అఫిషియల్ సొల్యూషన్‌తో పాటు టిట్‌క్విజ్ వీక్లీలో ప్రచురించబడును.

ఆశలూ అనుభవాలూ

నిముషాలు.

'నాకూ ఎంత సంతోషంగా వుందో చెప్పలేక పోతున్నానమ్మా' అనాలను కున్నాడు ముకుందం. కాని అతని గొంతు పెగలలేదు.

అప్పుడే కాలేజీనుంచి వచ్చిన సుందరం స్కూలునుంచి వచ్చిన ప్రకాశం, కమలా, శశి పుస్తకాలు అలమారులో పడేసి పెరట్లోకి రాబోయారు—తల్లినీ అన్న గారినీ ఆస్థితిలో చూస్తూంటే ఏమయిందో అర్థంకాలేదు వాళ్ళకి—అమర్థ్య కొన్నాళ్ళపాటు ఇంట్లో అందరికీ అలవాటు పోయిన చిర్నవ్వు దిగులు చూపులు ఇప్పుడిప్పుడే కొన్ని మరుపుకు వస్తు న్నాయి—

వాళ్ళన్ని చూసి సిగ్గుపడుతున్న వాడిలా తల్లి చేతులు విడిపించుకుని కొన్ని దూరంగా జరిగాడు ముకుందం - బిక్క మొహాలు వేసుకుని నిలబడిపోయిన పిల్లలని చూస్తూ సుభద్రమ్మగారే అంది 'అన్నయ్యకి వుద్యోగం అయిందర్రా.' అంటూ వాతావరణం ఒక్కసారి వుల్లాసంగా మారి పోయింది. అందరి మొహాలలోనూ సంతోషం సంతృప్తి వరుచుకుపోయాయి.

'ఎక్కడా. ఈ వూళ్ళోనేనా' అన్నాడు సుందరం. 'ఆ—విశ్వనాథంగారి షాపులో ఎక్కవుంట్స్ అవీ చూసేపని.' అని ముకుందం అంటూంటే 'అన్నయ్యా, నీకు వుద్యోగం రాగానే నాకు వట్టు పరికిణీ కుట్టిస్తానన్నావు గదూ' ముద్దుగా అడి గింది శశి.

'నేను మరిచిపోలేదమ్మా — మొదటి జీతం అందుకోగానే నీకూ అక్కయ్యకీ పట్టు పరికిణీలు కొంటాను.' అన్నాడు ముకుందం చెల్లెలి బుగ్గలు పుణికి ముద్దు పెట్టుకుంటూ.

'అన్నయ్యా, మరి—నాకు—పండగకి ప్యాంటూ పొడుగుచేతుల చొక్కా కావాలి... నాకు వున్నవన్నీ నిక్కరూ పొట్టిచేతుల చొక్కాలే.' అన్నాడు ప్రకాశం బుంగ మూతి పెట్టి. అప్పుడే జ్ఞాపకం చెయ్యక పోతే తనమాట ఎక్కడ మరిచిపోతారో అన్నట్టు.

'అలాగే లేరా' అన్నాడు ముకుందం నవ్వుకుంటూ.

(ఇంకావుంది)

[illegible]
ఒక్కొక్కరు ఒక మర్ఫీ ట్రాన్సిస్టరు వంతున 170 మంది పొందియున్నారు. రూ. 10,000 లకు పైగా అదనపు బహుమతులు



—: ముఖ్యాంశములు :—

1. మొదటి బహుమతి మొత్తము హెచ్చింపు.
2. 4 & 5 బహుమతుల మొత్తం హెచ్చింపు
3. మిని క్విజ్ లో 4 తప్పుల వరకు బహుమతులు గలవు.
4. మిని క్విజ్ లో రన్నర్స్ అప్ల బహుమతుల మొత్తం హెచ్చింపు.
5. చందాదారుల బహుమతులకు కొత్త పథకము. హెచ్చింపు మొత్తములు.

లిట్ క్విజ్ వీక్లీ ఉచిత కాపీకై వ్రాయండి.

లిట్ క్విజ్ నెం. 53 అధికార ఎంట్రీ ఫారము

ఆఖరు ముగింపు తేది 20-8-69 బుధవారం

ADDRESS: LITQUIZ No. 53. ALANKAR, BALARAM STREET, BOMBAY-7. (W B)

గమనిక: 1) ఒక్కొక్క కాలంలో మీరు వద్దనే పదమును కొట్టివేయండి. (2) ఒక కూపన్ మాత్రం పంపినచో ఇతర కూపనులను కొట్టివేయండి. (3) ఎంట్రీ రుసుము M.O. ద్వారా పంపినచో, పోస్టాఫీసునుండి పొందిన M.O. రసీదును ఎంట్రీ ఫారమునకు జతపరచవలెను. M. O. రసీదు లేని ఎంట్రీలు నిరాకరించబడును. (4) I. P. O. క్రాస్ చేయవద్దు. అది లిట్ క్విజ్ నెం. 53 బొంబాయి—7 వారికి చెల్లించునట్లు ఉండవలెను.

Re. 1 — 1

1	ADVANCEMENT	JUDGEMENT
2	ANCIENT	COHERENT
3	CHEER	COURAGE
4	DEVALUATION	INFLATION
5	DIMINUTIVE	PASSIVE
6	EMOTIONS	INSTITUTIONS
7	FACULTIES	FANCIES
8	FRUITFUL	TRUTHFUL
9	HONESTY	INGENUITY
10	INNOVATION	REFLECTION
11	LIVING	LOVE
12	PROMISING	TALKING
13	RARE	REWARDING
14	REASON	RECORD
15	REBELS	RESTLESS
16	SALVATION	SUFFERING
17	SELFISH	SUSPICIOUS
18	WAVES	WORDS

Re. 1 — 2

1	ADVANCEMENT	JUDGEMENT
2	ANCIENT	COHERENT
3	CHEER	COURAGE
4	DEVALUATION	INFLATION
5	DIMINUTIVE	PASSIVE
6	EMOTIONS	INSTITUTIONS
7	FACULTIES	FANCIES
8	FRUITFUL	TRUTHFUL
9	HONESTY	INGENUITY
10	INNOVATION	REFLECTION
11	LIVING	LOVE
12	PROMISING	TALKING
13	RARE	REWARDING
14	REASON	RECORD
15	REBELS	RESTLESS
16	SALVATION	SUFFERING
17	SELFISH	SUSPICIOUS
18	WAVES	WORDS

Re. 1 — 3

1	ADVANCEMENT	JUDGEMENT
2	ANCIENT	COHERENT
3	CHEER	COURAGE
4	DEVALUATION	INFLATION
5	DIMINUTIVE	PASSIVE
6	EMOTIONS	INSTITUTIONS
7	FACULTIES	FANCIES
8	FRUITFUL	TRUTHFUL
9	HONESTY	INGENUITY
10	INNOVATION	REFLECTION
11	LIVING	LOVE
12	PROMISING	TALKING
13	RARE	REWARDING
14	REASON	RECORD
15	REBELS	RESTLESS
16	SALVATION	SUFFERING
17	SELFISH	SUSPICIOUS
18	WAVES	WORDS

Re. 1 — 4

1	ADVANCEMENT	JUDGEMENT
2	ANCIENT	COHERENT
3	CHEER	COURAGE
4	DEVALUATION	INFLATION
5	DIMINUTIVE	PASSIVE
6	EMOTIONS	INSTITUTIONS
7	FACULTIES	FANCIES
8	FRUITFUL	TRUTHFUL
9	HONESTY	INGENUITY
10	INNOVATION	REFLECTION
11	LIVING	LOVE
12	PROMISING	TALKING
13	RARE	REWARDING
14	REASON	RECORD
15	REBELS	RESTLESS
16	SALVATION	SUFFERING
17	SELFISH	SUSPICIOUS
18	WAVES	WORDS

FREE AFTER 4 COUPONS — 53



MINIQUIZ

ADVANCEMENT	JUDGEMENT	DIMINUTIVE	PASSIVE	HONESTY	INGENUITY
ANCIENT	COHERENT	EMOTIONS	INSTITUTIONS	INNOVATION	REFLECTION
CHEER	COURAGE	FACULTIES	FANCIES	LIVING	LOVE
DEVALUATION	INFLATION	FRUITFUL	TRUTHFUL	PROMISING	TALKING

3/6/ ANNUAL SUB. No. ____ / NEW ,

ఈ క్విజ్ ప్రవేశమునకుచెందిన నిబంధనలను, షరతులను పాటించుటకు అంగీకరిస్తున్నాను. మరియు కాంపిటిషన్ ఎడిటరుగారి నిర్ణయమును తుది నిర్ణయముగాను, న్యాయబద్ధమైనదిగాను అంగీకరించుటకు ఆమోదిస్తున్నాను. ప్రతి కూపనుకు ఎంట్రీ ఫీజు రు. 1/— ఈ పూర్తి ఎంట్రీ ఫారము (4 కూపనులకు) ఫీజు రు. 4/—M. O. రసీదు/I.P.O./లిట్ క్విజ్ క్యాష్ రశీదు/ప్రైజ్ కార్డు జతపరుస్తున్నాను. వాటి నెం.........................

53 (ASVP)

CAPITAL LETTERS

NAME..

....

ADDRESS ....

....

....

ఈ పూర్తి ఫారమును కత్తిరించి పంపవలెను

చందాదారుల బహుమతి రూ. 1,500/— లిట్ క్విజ్ వీక్లీకి 3 నెలల, 6 నెలల మరియు సంవత్సర చందాదారులు 4వ కూపనులో కడపటి 4 క్లూలకు సరియైన జవాబులు ఇచ్చినయెడల రు. 1500 కు 1 : 2 : 3 నిష్పత్తిలో పంచుకొనవలెను. అనగా 3 నెలల చందాదారుకు తన వాటాకు రు. 10 వచ్చినయెడల, 6 నెలల చందాదారునకు రు. 20; సంవత్సర చందాదారునకు రు. 30 వచ్చును. మినిక్విజ్ క్రింద ప్రత్యేకించిన స్థలములో మీ చందా నెంబరు తప్పక గుర్తించవలెను. రు 3 (3నెలలకు), రు 6 (6 నెలలకు) లేక రు 12 (సంవత్సరమునకు) చందాను మీ ఎంట్రీతో పంపి, ఈ బహుమతికి అర్హులు కండి. ఇలా పంపేవారు మినిక్విజ్ క్రిందగల 'న్యూ' అనే పదమును కొట్టివేయండి.

ఆఖరు ముగింపు తేది. 20—8—69.
సొల్యూషన్ ఆంధ్రపత్రికః 24-8-69.
• సొల్యూషన్ వెంటనే పొందుటకు 10 పైసల స్టాంపు, స్వంత అడ్రసుగల కార్డును పంపవలెను.

వేదం వేంకటరాయ శాస్త్రి

తెలుగువారెవరు?

ప్రపంచములో ఒక్క తెలుగుకి తప్ప మరే యితర భాషకి రెండుపేర్లు ఉన్నట్లు కనిపించదు. తెలుగువారే ఆంధ్రులు అనటంలో ఏ ఒక్కరికీ సందేహం కానీ, ఆశ్చర్యంకానీ కలగదు. కాదన్నదే వింత. నిజంగా ఆశ్చర్యాన్ని కలిగించేది ఒకే భాషకి రెండుపేర్లు ఉండటం. ఐతరేయ బ్రాహ్మణమునుండి, పురాణకాలంనించి కనిపిస్తున్న ఆంధ్ర శబ్దం ప్రాచీనమైనదే. క్రీస్తు తర్వాత కొన్ని శతాబ్దాలకి తెలుగు ప్రచారంలోకి వచ్చింది. ఆంధ్రమునకు తెలుగు పర్యాయపదమైనది. నన్నయ భట్టారకుని (11 వ శతాబ్దం మధ్యకాలం) నాటికి తెలుగుకి తెనుగు రూపాంతరమైనది. ఇతర జాతులు, వర్ణములు లేక తెగలవలె తెలుగువారొకరు ఉండేవారు. తెలుగుచోళులు, రేనాటివారు, వెలనాటివారు మొదలైనవారే మొదటి తెలుగువారు. తెలుగు, తెలుంగు, తిలింగు పదములు వ్యవహారమునకువచ్చి వెలనాటిని కూడా కాకతీయులు జయించిన తర్వాత ఆంధ్రదేశము, తెలుగుదేశము ఒక భూభాగమై అభేద ప్రతిపత్తిని పొందాయి. కాకతీయులు కూడా తెలుగుచోళులకి దగ్గరి బంధువులని చరిత్రనిబట్టి తెలుస్తోంది.

(గత సంచిక తరువాయి)

ఇప్పటికి తెలుగే ఆదిరూపమని తేలినది. దాని మార్పు తెనుగు. ప్రాచీనాంధ్రులు తెనుగువారు కారు. వారి భాష ప్రాకృతము. తర్వాతివారును తూర్పు చాళుక్యులవరకు అంతే. చాళుక్యులు కూడ తెనుగువారు కారు. వారి జన్మస్థానము రేనాటిలోని చళుక్యగిరియే యైనను ఆంధ్రదేశమునకు కర్నాటకులుగా వచ్చిరి. మొదట పిఠాపురమును, కళింగాంధ్ర ప్రాంతమును జయించి అటునుండియే తీరాంధ్ర దేశమున వ్యాపించిరి. వీరి తొలి శాసనములలో తెలుగు చాల తక్కువ. ఊరిపేరు పోగా ప్రాకృత సంస్కృతములే ఎక్కువ. మంచి తెనుగు కృష్ణకు దక్షిణముననే కనబడు చున్నది. వీరికన్న ముందే రేనాడు తెలుగు ప్రాంతము. ఆరవ శతాబ్దమందే రేనాటి చోళుల తెనుగు శాసనములు కనబడుటచేత గుంటూరు జిల్లాలో తెలుగు వ్యాపించుటకు చాల ముందే ఇచ్చట తెలుగుండెనని చెప్పవచ్చును. కాబట్టి ప్రాకృత భాషయుండిన తీరాంధ్ర దేశమున దక్షిణము నుండి తెనుగుభాష వ్యాపించి భాషలో మార్పు తెచ్చినది. ఈ మార్పు తెలుగు చోళులవలన వచ్చినదే.

ఈ చోళులు చాల కుటుంబాలవారు. ఆంధ్ర దేశమునకు ఎగబ్రాకిరి. కొందరు తాము కరికాల చోళుని వంశస్థులమని చెప్పుకొని యున్నందున కావేరీ తీరమునుండి పల్లవరాజుల కాలమునందో అంతకుముందో ఎప్పుడో రేనాటికి వచ్చి యుండవలెను. వీరిలో చాలమందికి 'ఒరయూర్పురవరాధీశ్వర' యను బిరుదు కలదు. ఒరయూరు (ఉఱైయూరు) చోళుల ప్రాచీన రాజధాని. దీనికే కోడియని నామాంతరము. (కోడిని గూర్చిన చరిత్ర, మహిమలు ఉరయూరివే.)

కలు పొన్న విరుల బెరుగం
గలు కోడి రవంబు దిశలఁ గలయఁగఁ జెలఁగన్
బొలుచు నొరయూరి కధిపతి
నలఘు పరాక్రముఁడ టెంకనాదిత్యుండన్.

అని నన్నెచోడుడు చెప్పుకొన్నది తన నాటి కథ కాదు. పెద్దలది. పాసుగంటికి పోయి పండితారాధ్యులు ఉదయావనీశునికి శాపమిచ్చి వెడలినప్పుడు 'అక్కజంబుగ బూచె నక్కలు పొన్న కుక్కుంగో క్రుని కూసె కల్కోడి' ఇదంతయు ఉరయూరికథ. పండితారాధ్య బసవ పురాణములను వ్రాసిన పాల్కురికి సోమనాథుడు పెద్దలవలన వినిన కథలను గ్రంథస్థము చేసెను. తమిళ వాఙ్మయముతో పోల్చి చూచినచో నెవరును ఇంత దనుక పరిశోధన చేయులేదు. పెరియ పురాణములోని శైవ భక్తుల కథలకును, బసవ పురాణ పండితారాధ్య శివతత్త్వసారాదుల శైవ కథలకును ఎంతో భేద మున్నది. శైవము ఆంధ్రదేశమున, వ్యాపించి ప్రబలిన కాలమున నీ కథలు వ్యాపించి, వాని ఆకరములు విస్మృతములుకాగా, ఆ మహిమలను ప్రాచీనులకు చెందినవానిని, ఇటీవలివారికి మనవారు ముడిపెట్టిరి. చూడగా ఈ చోళులు, కావేరీ తీరము వారు. మొదట రేనాడు ములకనాడుల నాక్రమించి క్రమముగా నలువైపుల పాకనాడు, కమ్మనాడు, లనాడులకును, పడమట నలపాడి, గొళంబపాడి మొదలైన ప్రదేశములకును వ్యాపించిరి. అనగా నెల్లూరు, గుంటూరు, కర్నూలు, అనంతపూరు, బళ్లారి, మైసూరులో కొంత దూరము వ్యాపించిరి. వీరితో కూడ వీరి భాషయు వ్యాపించియుండు ననుటకు సందేహము లేదు.

ఇందులకు నిదర్శనము స్థూలదృష్టికే కనబడు చున్నది. కడప నెల్లూరు జిల్లాలలోకన్న ప్రాకృతము ఎక్కువగా వ్యాపించియుండిన ఇతర జిల్లాలలో పూర్వ ప్రాకృతములుపోయి వానిచోట క్రమముగా తెనుగు శాసన భాషగా కనబడుచున్నది గదా. కర్ణాటక దేశమందు కూడ ప్రాకృత స్థానమున కన్నడ మేర్పడి అది క్రమముగా అటు పశ్చిమ తీరమునకును, ఇటు కర్నూలు, తెలంగాణములకును వ్యాపించినది కనబడు చున్నది. కన్నడము తెలంగాణముతోనే నిలిచి వేంగికిని తీరాంధ్ర దేశమునకును రాలేదు. ఏలయన ఆరు ఏడు శతాబ్దముల నాటికే తీరాంధ్రము మీద తెలుగు యొక్క ప్రభావము కుదురు కొన్నది. తెలంగాణమున కన్నడము వ్యాపించినది. వేములవాడ చాళుక్యులు కన్నడముననే యభిమానించిరి. అటు గోదావరి తీరము మహిడి ఓరుగంటి వరకును ఈ కన్నడము పర్వినది. నాటికింకను తెలుగు కవిత్వ మేర్పడినను కావ్య మార్గము కుదురనందున పంపాదులు వేంగినుండిపోయి కన్నడమందే కావ్య రచన యొనర్చిరి. కాకతీయులలో రుద్రునివరకు కన్నడ ముండినది గదా. కాకతీయులును తెలుగు చోళులను కల్యాణి చాళుక్యుల సామంతులుగా నుండి ఆ యా ప్రాంతములలో మొదట కన్నడములోనే శాసనములు వేయించి స్వతంత్రులైన తర్వాతనే తెలుగులోకి దిగిరి. కాకతీయుల స్వాతంత్ర్య కాలమునకు సరిగా తెలంగాణములో తెలుగు వ్యాప్తి కనబడుట పరిశీలింపదగినది. తెలుగు శాసనభాషయైనది ఇచ్చట పండ్రెండవ శతాబ్ది నుండియే గదా. తెలంగాణము పేరు కూడా అర్వాచీనమే. ఒక్కొక్క భాగమున వేర్వేరు పేరుండి కాకతీయులు విజృంభించిన తర్వాతనే ఈ పేరు వచ్చుట. కాబట్టి తెలుగువారు, తెలుగు చోళులు, వ్యాపించి వారి భాషయు వ్యాపించి దేశమునకీ పేరు వచ్చినది.


తెలుగువారైన చోళులు ఉరయూరువారు కాబట్టి తెలుగు యొక్క పుట్టుపూర్వోత్తరము లను గ్రహించుటకు కాలమానమును బట్టి వెనుకకు పోగలమా యన్న గట్టిగా పట్టు దొరకకున్నను కొంత సూచన కనబడు చున్నది. పల్లవులు తమ బిరుదములలో తెలుగు పదముల కూర్పులవంటి వానిని ధరించు చుండిరి. 'విడేల్ విడుగు', 'పిరాప్పిడుగు', 'కడుంబిడుగు'. పిడుగు తమిళపదము కాదు. తమిళములో 'ఇడి' యుండును. పైగా పల్లవ శాసనములలో 'విభుండు, నిర్వియొల్పయ్యెంబు వెంటుల విత్తు' మొదలైన పదములును, పల్లవ సామంతులైన కళభ్రులలో ఐదవ శతాబ్దమున పాండ్యులను జయించి మధుర నేలిన వారిలో, 'పెరుంబిడుగు ముత్తరయన్ సువరన్ మారన్' ప్రసిద్ధుడు. వీరు ముత్తరాజులు, అనగా ముదిరాజులు, మూడు తరములవారు వీరు పల్లవ

ంతులై యుండి పాండ్యులను అణచిపెట్టి యుండినట్లు తెలియుచున్నది. పల్లవ బిరుదములను 'పెరుంబిడువిడేల్ విడుగు'లను వీరును ధరించి యుండిరి. 'పగాప్పిడుగు అనియు' కలదు. ఈ కళభ్రులెక్కడివారో తెలియదుగాని వీరు పాండ్యులను పడద్రోసిన కాలము క్రీ. శ. 6వ శతాబ్దమని చరిత్రకార సమ్మతము. వీరు కర్ణాటక జైనులని కొందరును, కళ్లర్, కళవర్, కంబర్ అనబడు అడవి జాతి వారని కొందరును అభిప్రాయపడి వున్నారు. శాతవాహనుల త్రొక్కిడివలన దక్షిణమునకు వచ్చిరట. ఈ కళ్లజాతివాడు 'పుల్లి'యనునతడు వెంగడం (తిరుపతి) కొండ ప్రాంతమును పాలించుచుండెనని సంగం వాఙ్మయమందు కలదు. తిరుపతి తొండల మండలమునకు ఎల్ల. కాళహస్తి తొండమ నాటిలోనిది. మదరాసుకూడ. తండియార్పేట అనబడు ప్రదేశము తొండైయార్పేట అని యుండెను. తొండమానులు పల్లవులు. వారిపేట. పల్లవుల తొండమండల భాగము కంచివరకు. కంచికి ఆ కాలమున అరువావడతలైనాడు అనిపేరు. చిదంబరమువరకు అరువనాడు. దానికి ఉత్తరపు పెల్లవడతలై, ఆనాడు. ఇక్కడివారే అరువాళర్. వీరినే అరవవారనిరి. అరవమనగా తమిళమున పాము. ఇచ్చట నాగులుండిరనియు, వారికిని పల్లవులకును సంబంధముండెననియు కథలు కలవు. నెల్లూరు జిల్లాలో కందుకూరినుండి దక్షిణమునగల దేశమున పండ్రెండు బోయకొట్టము లుండినట్లు తెలియుచున్నది. కందుకూరొక కొట్టము. కొట్టమనగా దుర్గము. కంచిరాజ్యమందును కొట్టములే ఎక్కువ. ముప్పది రెండట. కంచిరాజ్యమును పల్లవు లాక్రమించిన అతి ప్రాచీనకాలమున ఇచ్చట ఎవరు పాలించుచుండిరో తెలియదుగాని పల్లవులు మాత్రము నెల్లూరు మండలమును రెండవ నందివర్మ కాలమున జయించినప్పుడు ఇచ్చట బోయరాజులుండిరనియు, వారి నాయకుడు పృథ్వీ వ్యాఘ్రుడనువాడు (నిషాదపతి) పల్లవుల అశ్వమేధాశ్వమును పట్టుకొని పోరాడగా పల్లవులు ఓడించిరనియు తెలియుచున్నది. ఈ బోయలు ఎప్పటినుండి యుండిరో తెలియదు. వీరే కళ్లరులై యుండిన యెడల పుల్లిశబ్దము ప్రాకృతము. ('వగ్ఘ సిహాయపుల్లి' అని హేమచంద్రుని దేశీనామమాల) కాన ఈ పృథ్వీవ్యాఘ్రుడే ఆ పుల్లియో, వీని పూర్వులెవరైనా ఆ పేరిటివారుండి సంగంవాఙ్మయమున కెక్కిరోయని సందేహము కలుగుచున్నది. తిరుపతి, నెల్లూరులు సన్నిహిత ప్రదేశములే. పైగా వీరు పూర్తి తమిళులు కారు. వీనినెల్ల చూడగా (ఊహయే, చరిత్రయని గట్టిగా చెప్పుటకు లేదు) ఈ కళభ్రులు బోయవాండ్రై యుండి, పల్లవ సామంతులై తమ తెలుగు బిరుములతో దక్షిణమునకు పోయి పాండ్యులను జయించిరా లేక ఆదేశమునకు పోయి కావేరీ తీరము, వైగై తీరములలోనుండి పల్లవుల వలన నీ బిరుదములను సంపాదించిరా యనియు శంక కలుగుచున్నది.

రేనాటి చోళులకు సమకాలికులు ఈ బోయ రాజులు. అప్పటికే రేనాటికి కరికాలచోళుని వంశస్థులు వచ్చి రెండుమూడు శతాబ్దములై యుండవలెను. కరికాల చోళుని కాలము నాలుగవ శతాబ్దముగా పరిశోధకులు తలచియున్నారు. అతని శత్రువే ముక్కంటి కాడువెట్టి త్రిలోచన పల్లవుడు. సముద్రగుప్తుని కాలమునకు కంచిలో పల్లవులు కలరు. ఈ ప్రాచీన ప్రాకృత శాసనాల పల్లవ పల్లవులకాలముందే కావేరీతీరమునుండి చోళులు జయింపబడి వారివంశమువారు పల్లవ సామంతులుగా రేనాటికి వచ్చియుండవలెను. రేనాటిలో తెనుగు శాసనములు కనబడునాటికే కొంత భాషాభివృద్ధి కనబడుచుండుటచేత తెనుగునకు కొంత పరిణామము కుదిరియుండవలెను. తెనుగు కవితకును తమిళ కవితకును సామాన్య స్వరూపము యతిప్రాసలు. సంస్కృతములో యతి పద్ధతి లేదు. కన్నడములోను యతి లేదు. సంస్కృతములో ద్వితీయాక్షర ప్రాసము లేదు. కన్నడములో నున్నది. తమిళములో వలెనే తెనుగునందు రెండును కలవు. యతిని మోనైయనియు ప్రాసమును యదుగైయనియు తమిళములో చెప్పుదురు. కర్ణాటకులు తమిళ పదములతోను, భాషా మర్యాదతోను ద్వితీయాక్షర ప్రాసములను మిగుల్చుకొని వృత్తరచన చేయగా తెనుగువారు రెంటిని వదలకయే సంస్కృత వృత్తములను కలుపుకొనిరి. తమిళమందును వృత్తరచనకలదు. గుణగ విజయాదిత్యుని కాలమునుండియు తెనుగు కవిత కనబడుచున్నది. కాని తెలుగు తెనుగు పదములు కానరావు.

నన్నయనాటికే కవులు తెనుంగు రూపమును వాడిరి. శాసనాది రచయితలు తెలుంగు రూపమును వాడిరి. అనగా పండితుల భాషకును పామరుల భాషకును అప్పటికే కొంత భేదమేర్పడియుండవలెను. త్రిలింగములనగా శ్రీశైల(మంథెన) కాళేశ్వర దాక్షారామములు కావనియు, త్రిసగములనగా, కూడ ఇవి కావనియు తేలినది. ఇంతకును దాక్షారామమందు అంత గొప్పకొండ యెక్కడిది. మహేంద్ర పర్వతమునకు పోవలయును. అప్పుడు కళింగము కూడ చేరును. చూడగా మొదట తెలుగువారొకరు (వారిపేరు మాత్రము వాచ్యముగా కనబడకపోయినను) ఉండిరనియు, కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లాలే వారి ప్రాచీన స్థావరములనియు వారు క్రమముగా కర్నూలు, గుంటూరు జిల్లాలకును, తెలంగాణము, కృష్ణా జిల్లాలకును వ్యాపించి తర్వాత గోదావరి తీరమును కూడ దాటిరనియు స్పష్టపడుచున్నది. వేములవాడ చాళుక్యులు, కల్యాణిచాళుక్యులు, తొలి తొలి వారైన సామంతకాకతీయులు వీరందరును పాలించిన కాలమున తెలంగాణమునకు ఆపేరులేక, తర్వాత వచ్చుటయు మొదట కన్నడ శాసనములుండి, వానిచోట తర్వాత తెలుగు కనబడుటయు, కాకతీయులను ఆంధ్రులుగా వ్యవహరించి తెలుగు చోళులను తెలుగువారనుటయు— చూడగా ప్రాచీనాంధ్రము, అనగా ప్రాకృతము క్రమముగా అంతరించి ఆ దేశమున కన్నడము వ్యాపించి, అదియు తగ్గి తెలుగు పూర్తిగా దేశమంతయు పర్వినదని తెలియుచున్నది. కాకతీయులు స్వతంత్రులగునప్పటికి తెలుగువారు ఆయా ప్రాంతములలో చేరి తెలుగు శాసనభాషయై, రాష్ట్రభాషయై సామ్రాజ్యము విస్తరించి వేంగికూడ చేరి, దాక్షారామము కలిసి, శైవమతము విజృంభించినంతట త్రిలింగ శబ్దము కుదిరి సార్థకత వెంటనది. ఆంధ్రేతరులు తెలంగాణమునే ఆంధ్రదేశమనుటకు కారణము ప్రాచీనాంధ్రులు కర్ణాట తెలంగాణములలోడి దక్షిణాపథమునంతయు పాలింపగా, కన్నడ సామ్రాజ్యములు వచ్చి పశ్చిమ భాగమునకు కన్నడ కర్ణాటక నామములను పెట్టగా, మిగిలిన యాంధ్రదేశము ఆంధ్రముగానే యుండి క్రొత్త తెనుగుకూడ కలిసి మనకు రెండు పేర్లేర్పడినవి.

మరి కావేరీ తీరమునుండి పెన్నానదీ తీరమునకు వచ్చినవారు గదా చోళులు, వారిని గూర్చి తమిళ వాఙ్మయమందు 'తెలుగు' పదము కానరాదే,




వీరెట్లు తెలుగువారగుదురని సందేహము కలుగ వచ్చును. చేర చోళ పాండ్యులకు ముప్పురకును జాతిపరముగా తమిళ శబ్దము కానరాదుగాని, భాషా పరముగా నున్నది. కరికాలచోళుని గూర్చి సంగం వాఙ్మయమందు పాడల్ (పాటలు— పద్యములు కలవు. (తెనుగువారికి తెలిసినంత ఇతనిని గురించి వారికి తెలియదు లెండు) వీరిని 'మూవేందర్' ముగ్గురు రాజులు అని యందురు. మరి తెలుగు శబ్ద మెట్లు వచ్చినదనగా ఒక ఊహకు కొంత మార్గము కనబడు చున్నది. ఇది కథలమీద నాధార పడినదే గాని గట్టి చరిత్రయని చెప్పలేము. పల్లవులు పాలించు చుండిన కాలమున, అతి ప్రాచీనుడు ఆదొండ చక్రవర్తి యని యొక డుండెనట. పల్లవులు తొండమానులే గదా. ఈ చక్రవర్తి తన దేశమును సస్యవంతముగా చేయుటకై కృషీవలుల కొరకు వెదకి తులుదేశము నుండి వెళ్లాళ కుటుంబముల వారిని తెచ్చి తొండమండలములో నివసింప జేసెనట. అడవులను నరికించి చెరువులు కట్టించి శ్రీశైలము వరకును దేశమును ముక్కంటి పల్లవుడు బాగు చేయించిన కథ పాతదే గదా. ఆదొండ చక్రవర్తియే యీ త్రిలోచన పల్లవుడో కాదో తెలియదు గాని, వెళ్లాళురనగా కృషివలు లనుట నిర్వివాదము. వీరు తులు దేశము నుండి వలసవచ్చి మదరాసు ప్రాంతములో నివసించినందున వీరికి 'తొండై మండలం తుళువ వెళ్లాళు'రని పేరు వచ్చినది. వీరి జ్ఞాపక చిహ్నమే నేటి టి. టి. వి. హైస్కూలు (తొండై మండలం తుళువ వెళ్లాల హైస్కూలు.) మద్రాసు మింటు స్ట్రీటులో నున్నది. తులువారికి వాఙ్మయము లేదుగాని వారికి 'తిలు' యను పేరుండినదో లేదో తెలియదు. వీరే తొండమానటికి మొదట వచ్చిరా లేక చోళులు రేనాటికి మొదట వచ్చిరా యనుట చెప్పలేము. పల్లవుల యాశ్రితులు రేనాటి వారితో, ఇరుగు పొరుగు వారితో కలియక యుందురా? తెలుగు చోళులు, ప్రభువులు, యుద్ధవీరులు, పరిపాలకులు. తులువ వారు కర్షకులు. మన దేశమునందు కర్షకులందరు రెడ్లు. ఈ రెడ్లనందరివీ, నెల్లూరు జిల్లా, గుంటూరు జిల్లాలవరకు దాదాపు వేయేండ్ల కిందనే వచ్చి వ్యాపించి, నేటికిని ఇండ్లలో అతిప్రాచీన తమిళ భాషను మాటలాడు పుదూరు ద్రావిడ బ్రాహ్మణును 'వెళ్లాయర్' అనుచున్నారు. వెళ్లాల శబ్దమే యిట్లు మారినదో లేక అసలు సరియైన శబ్దమే యిదో ఎవరును పరిశోధింప లేదు. వేళ్ అనగా ఈటె. ఆయర్ అనగా ఆభీరులు. గొల్లలు, పాశుపాల్యము వృత్తిగాగలవారు. కాబట్టి వేళ్ + ఆయర్ వేళాయర్ ఐనదేమో. అసలు, ఆయరులకు ఈటెలు అనగా క్షత్ర ధర్మము లేదేమో? నెల్లూరు శాసన సంపుటములలోను, తిరుపతి శాసనముల లోను రెడ్లకే వెళ్లాళర్ అని కలదు. రెడ్లే రాష్ట్రకూటులనియు (రాష్ట్రకూట కుటుంబినః) సంసారులనియు చరిత్రచే తెలియు చున్నది. తుదకు తేలిన దేమనగా 'తిలు' శబ్ద వాచ్యులో, తెలు శబ్ద వాచ్యులో ఐయుండిన రెడ్డి కుటుంబములవారు రేనాటి చోళులతో అతి ప్రాచీనకాలమున చేరి

తెలుగువా రెవరు?

భాష పరిణామమునంది క్రమముగా తిలుంగ, తెలుంగ శబ్దము లుత్పన్నములై యుండవలెను. నాటి రాజ కుటుంబములు తమ యాశ్రిత కృషీవల కుటుంబములతో ఆంధ్రదేశమందు వ్యాపించి తెలుగు భాష వ్యాపించినది. నేటికిని స్వచ్ఛమైన తెలుగు మాటలాడువారు మన రెడ్లే.

ఇందుల కనుగుణముగా కాకతీయులును కావేరి తీరము నుండి వ్యాపించిరా యని సందేహపడుటకు కొంత విషయము కనబడు చున్నది. కాకతీయుల పూర్వ చరిత్ర, అనగా మొదటి బేతరాజునకు మునుపటిది తెలుపు శాసనములు లేవు. దొరికి నంతవరకు వీరు కల్యాణి చాళుక్యుల సామంతులుగా నుండినప్పటివే. వీనిలో మొదటిది క్రీ. శ. 1079 నాటి రెండవ బేతరాజు యొక్క హనుమకొండ శాసనము. రెండవది 1090 నాటి ఖాజీపేటది. వీరు పశ్చిమ చాళుక్యుల సామంతులుగా నుండి అభివృద్ధికి వచ్చినది స్పష్టము. అంతకు పూర్వము 'కాకర్త్య' శబ్ద మొకటి వేంగీ చాళుక్యుల శాసనము లలో దొరికినది. పెక్కు చర్చలకు కారణమైనది. మాంగల్లు శాసనమున దానార్ణవుని సహాయు యొక కాకర్త్య గుండ్యన యున్నాడు. (క్రీ. శ. 955—6). ఈ గుండ్యన కాకర్త్యుడగుటయేగాక రాష్ట్రకూటుడు కూడ. ఒక వేళ నిది ఆతని యుద్యోగమును గూర్చియు నుండవచ్చును. కాని తర్వాతి వారి వంశావళిలో నీ గుండ్యన కారాడు. ఇందులకు సమాధానము ఇతనికిని బేతరాజాదులకు నడుమ ఒక శతాబ్దము గడచుటయు వంశవృక్షమును కాకతీయులు బేతరాజునుండియే నిర్మించుకొనుటయు. పైగా వారు కొన్నిట రెండవ బేతరాజుతోను కొన్నిట త్రిభువనమల్లునితోను కొన్నిట ఏదియు లేకయు శాసనములు లిఖించిరి. వేంగి చాళుక్యులో కల్యాణి చాళుక్యులో వ్రాయించుకొన్నట్లు లేదు. అచ్చటచ్చట దుర్గయు డొకడు కనబడినను వంశవృక్ష నిర్మాణ శ్రద్ధ కానరాదు. దాదాపు ముప్పది యేండ్ల కాలములోనే మొదటి బేతరాజును వదలిన వీరు శతాబ్ది క్రింది గుండ్యనను వదలుటలో నాశ్చర్యము లేదు.



కాని గుండన్యను కాకతీయులతో కలుపుటకు కాకర్త్యశబ్దమేగాక 'సామన్త విష్టివంశ'ము కూడ నున్నది. 'సామన్త విష్టివంశః శ్రీమాన్ కాకతి పురాధి నాదోబేతః. గుండనది 'సామన్త ఒడ్డివంశః. విష్టి, ఒడ్డి శబ్దముల మీద చాల చర్చ జరిగినది. భేదమంతగా పాటింప దగినది కాదు. మాంగల్లు శాసనములో లేఖక ప్రమాదములు మెండు. బిట్టి శబ్దముతోడి చతుర్థ కులజులైన రాజవంశము వారి శాసన మొకటి తెలంగాణా శాసనములో II—37 కలదు. వీరు బిట్టికులతిలక జినాలయము కట్టించి క్రీ. శ. 1108 లో దానము లిచ్చియున్నారు. ఈ శాసనదాత భువనగిరి దండనాయకుడు సంగనూరు విభుడు బీరయరెడ్డి. రాష్ట్రకూటుడనగా చిన్న సామంతరాజును నర్థములో ఈ కాలమునకు శాసనములు గలవు. జయకేశి అరసు అనునతడు శక 996—1074 క్రీ. శ.లో పులిగెరెలో రాష్ట్రకూటుడుగా పాలించుచుండెను. (బాంబే కర్నాటక శాసనములు 29, 1935—36 సం.) కాకర్త్యగుండ్యన నతవాటి దేశమునకు రాష్ట్రకూటుడు.

కాకతీయులు మొదట కొరవిలో నుండి, తర్వాత అనుమకొండను చాళుక్య చక్రవర్తి త్రైలోక్య మల్ల ఆహవమల్లునికడ నుండియు, తర్వాత సబ్బిసాయిరమును (వేములవాడ ప్రాంతమును) ఆగమ విక్రయమాదిత్యుని కడనుండియు సంపాదించినది శాసన ప్రసిద్ధము. వీరు తొలుత వేంగీ చాళుక్యులకు ఆశ్రితులు, తర్వాత పశ్చిమ చాళుక్యులకు. కాకతి పురాధినాధులన్నది వీరికి ఆదినుండి గల బిరుదు. కాకతి పురమును గూర్చిగాని కాకతమ్మను గూర్చిగాని ఎంత ప్రయత్నించినను పూహ మాత్రముగానే నిలిచి చరిత్ర అందుట దుర్ఘటముగా నున్నది. శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారి ఊహలను మించుట యసాధ్యము. వీరు తమ కాకతీయాంధ్రరాజయుగ చరిత్రమునందు మొదటి ప్రకరణములోనే 'కాకతులు, కాకతీయులు' అను శీర్షిక క్రింద విస్తారము చర్చించియున్నారు. 'కాకతి శబ్దమునకు వరుసగ కాకణి, కాకణ్డి, కాకంది, యనునవి పూర్వరూపాంతరములని, జైనవాఙ్మయమును బట్టియు, బౌద్ధ వాఙ్మయమునుబట్టియు ప్రాచీన శాసనములను బట్టియు గన్పట్టుచున్నది. అని వ్రాసి, దానిని విస్తరించి 'కాకన్ది' గణమును గూర్చియు, కాకన్ది నగరమును గూర్చియు చాలా తెలిపినారు. కాకతియని శక్తికి పేరట. జైన వాఙ్మయములో పుష్పదంత పురాణములో కాశీ విషయమున కలంకారము కాకంది పురమున్నదని కలదు.

"పదయూరత్నకరండ దోళ్ భరత ధా
త్రీ ఖండదోళ్ రంజిసి
ర్పుదు కాశీ విషయం మహోజ విషయా
గమ్యం జగత్కామ్యమం

"తేయు పృద్వీతిలకం క్షమాకటకము
ర్వ కాంచి విశ్వంభరా
విదితోత్తంస మిళావతంస మవనీ
హారం మహీమాపురం" (9—11)

"......అనాడెంబ సరోవరన్కో వికసత్పంకేజ
మెంబంతె లక్ష్మీనిడం......కాకంది నామం పురం.
(9—19)

'కాకతి' యని గ్రామమున్నట్లు మారేమండ రామారావుగా రనగా అట్టిని చాల గంవని వీరభద్ర రావుగా రనిరి. కాకందియను పేరు కాకినాడకు ఉండినదో లేదోగాని, నెల్లూరుజిల్లా గూడూరు తాలూకాలో సముద్రతీర ప్రాంతము రెడ్డిపాలెము పరిసరము పూర్వము కాకన్ది యనుబడు చుండినది. (త్రిభువన చ్చక్రవర్తి కోనేరిన్ మెయికొండాన్ రాజేందిర చోళమండలత్తుక్కడల్ కొండ ఎవ్వ త్తిరి కోట్టత్తిల్ కాకన్ది మానగరిల్ పూశై కొండరుళుం పవన వినాయక దేవరుం.....' అని వంగ్రటంగము చెంత పండరంగేశ్వరస్వామి దేవాలయ శాసనములో నున్నది (నెల్లూరు శాసనములు, గూడూరు 87.) దీని తర్వాతి శాసనముచేత ఆ ప్రదేశమునకు పేరూరునాడని పేరనియు, అది ఎవ్వత్తిరి కోట్టములో అంతర్భాగమై జయంగొండ చోళమండలము (నెల్లూరు జిల్లాలో దక్షిణ దిగ్భాగము) లోనిదనియు కాకంది మహానగర మనియు తెలియు చున్నది. ఇందులో నొక శాసనమున నొక రాజరాజ పట్టి, సిద్ధరను భార్య ఇరుమడి శ్రీయా దేవి యను నామె ఉఱైయూర్ చోళన్ యొక్క కొమార్తె చేసిన దానములు గలవు. ఇవన్నియు కులోత్తుంగచోళుని తర్వాతివి. వీని నెవరును చక్కగా శోధించి ప్రకటింప లేదు. కొన్నిటికి వేణుగోపాల శ్రేష్మిగారే మూలమును ప్రకటింపక వదలిరి. ఈ వంగ్రటంగము నేడు నాయుడుపేట నుండి తూర్పుగా మల్లాం రోడ్డులో పోయిన సముద్ర తీర ప్రాంతమున కలదు. ఇదిగాక మరియొక కాకన్దియు కలదు.

అది కావేరిప్పూంబట్టణమే. కావేరి సముద్రమున చేరు చోటి పట్టణమని యర్థము. దీనికే పుహార్ అనియు (పుహు = ప్రవేశించు, సముద్రముతో సంగమించు) పేరు. దీనికి అసలి యొడ్డునే ఒరయూరు కలదు. కకున్దన్ అను రాజు పాలించి నందువలన దీనికి ఈ పేరు వచ్చినది అని 'సంఘం' వాఙ్మయమున కలదు. ఈ కావేరి తీరమునకే శిబిదేశమని పేరు. ఈ రాజులకు శిబి వంశస్థులుగాన శెంబియనులని ప్రసిద్ధి. (దండి దశకుమార చరిత్రలో కూడ కావేరీ తీరమును శిబిదేశ మన్నాడు.) కరికాలచోళుని వంశస్థులు ఆంధ్రదేశమునకు వచ్చి రేనాటిలో కొంతకాల ముండి దేశమంతయు వ్యాపించినట్లే కాకతీయులును కావేరి తీరము నుండియే వచ్చి యుందురా! ఒక యాశ్చర్యము. కాకతీయులలో తొలితొలి రాజులు చెప్పుకొనక పోయినను గణపతి చక్రవర్తి కాలమున కొన్ని శాసనములు వీరిని కరికాలాన్వయు లని చెప్పుచున్నది. ఇది తర్వాతి కల్పనయై యుండిన యెడల చోళులతో వీరెందులకు తమ్ము ముడి

తెలుగువా రెవరు?

పెట్టుకొన్నారో ఆలోచింపవలెను. అంతేకాదు. మొదటి బేతరాజునుండి తాము దుర్జయుని వంశ స్థుల మనియు చెప్పుకొన్నారు. దుర్జయకులాబ్ది చంద్రులు పలువురున్నారు. ఈ దుర్జయుడు దుర్యోధనుని కొడుకని భాసనాటకము ఊరు భంగములోని దానిని వీరభద్రరావుగారు చెప్పియే యున్నారు. దుర్జయుడు చారిత్రక పురుషుడా యనునది కాదు కావలసినది. ఇదంతయు దాక్షిణాత్య సంబంధమును సూచించుచున్నది అనునంత వరకే ముఖ్యము. భాసనాటకములు దక్షిణ దేశములో దొరకినవి. అనలవి ఆతని నాటకాలరంగ ప్రవతులనియు ప్రతీతి. కాకతీయులును కావేరీ తీరవాసులై యుండి తెలుగు చోళులవలెనే పైకెగ ప్రాకి యుందురు.

కావేరి తీరముతోడి సంబంధమును తెలుపు విషయములు మరి రెండు కలవు. శిబి చక్రవర్తి పావురమెత్తు మాంసమును డేగ కిచ్చిన కథ జగత్ప్రసిద్ధము. శిబి వంశస్థులు శెంబియనులు గదా. ఒరయూరు కథ మాత్రమేగాక చోళులను గూర్చిన శిబికథ చేబెర్లలోని కపోతేశ్వరాలయము చెప్పుచున్నది. ఇది ఆనంద గోత్రజుల కాలము నాటి దనియు మొదట బౌద్ధ చైత్య గృహముగానుండి తరువాత హిందూ దేవాలయ మాయెననియు నిర్ణయించి యున్నారు. ఇంకను ఆంధ్రదేవాలయ వాస్తుకళా పరిణామములలో దీని స్థానమును శ్రీ సి. శివరామమూర్తి గారిట్లు వ్రాసియున్నారు. 'ఇది నాగార్జునుని కొండలోని బౌద్ధ చైత్యము వంటి దాని ననుసరించి గజపృష్ఠాకార రూపమున నిర్మింపబడిన తొలుతటి హిందూ దేవాలయము ..,వెనుకటి పైభాగము గజపృష్ఠము వలె వంపుగా నున్నది..... క్రీ. శ. 4వ శతాబ్దిలో పాలించిన ఆనంద గోత్రజులగు రాజులు కట్టించినది. దీనికి తరువాత గజపృష్ఠాకారముగ నిర్మింపబడిన తొలుతటి హిందూ దేవాలయము మహాబలిపురమందలి రథ సర్గమున గలదు. పల్లవ శిల్పులు చేబెర్ల దేవాలయ రూపము ననుకరించి యుండుట అసంభవము కాదు. ఏలన, విచిత్రచిత్తుడని ప్రసిద్ధి చెందిన పల్లవరాజు మొదటి మహేంద్రవర్మ కృష్ణాతట భూమిని పాలించుచుండిన విష్ణుకుండి విక్రమ మహేంద్రుని దౌహిత్రు డగుటవలన అతడు కొండలను తొలిచి ఆలయములను నిర్మించు ఆంధ్ర సంప్రదాయమును తన కాంచీరాజ్యమున ప్రవేశ పెటి యుండవచ్చును. ఇట్టి గజపృష్ఠాకారమున నిర్మింపబడిన తొలుతటి దేవాయత్తమును మరి రెండు దక్కనునందు గలవు. అందొకటి తేర్ అను ప్రదేశమున నున్నది. రెండవది అయ్యావళి గోని దుర్గ దేవాలయము. ఈ రెండును చాలా ప్రాచీనములే. రెండవది క్రీ. శ. ౬రవ శతాబ్దము నకు చెందినది. క్రీ. శ. ఏడవ శతాబ్దారంభ దశక ములలో చాళుక్యులకును పల్లవులకును కలిగిన సంఘర్షణలు కూడ ఈ సంస్కృతి సంసర్గ ప్రభావములకు కారణమై యుండవచ్చును. లక్ష్మీ

'ప్రశ్నావళి' శీర్షికకి ప్రశ్నలను పంపేవారు కవరుమీద స్పష్టంగా 'ప్రశ్నావళి,' ఆంధ్ర పత్రిక వార పత్రిక, మద్రాసు — 1.' అని వ్రాయకోరుతున్నాము.— సం॥

ఆయ్యావళి దేవాలయ నిర్మాణ పద్ధతిని పల్లవ శిల్పులు అనుకరించి యుండవచ్చును. (తెలుగు విజ్ఞా. సర్వ 3 పు. 651). గజపృష్ఠ విమానములు మహాబలిపురముందేగాక మదరాసునకు చుట్టు ఐదారు చోట్ల గలవు. తిరువత్తూరిలో పెద్ద ప్రధాన విమానము, ఉన్నవానిలో పెద్ద గజపృష్ఠము. చిన్నవి సమాన పరిమాణము గలవి పోన్నేరిలోను, మదరాసు నుండి ఆవడికి పోవు మార్గమున పాడి యను చోటను, అరకోణము మార్గమున తిరుప్పాచ్చూరు తిరుమళిశై మొదలైన చోట్లను కలవు. ఇంతలేసి కట్టడములే వెలసి యుండగా జనుల వలసలు ఏర్పడి యుండుట ఒక యాశ్చర్యమా!

దక్షిణ దేశమున చోళరాజులను గూర్చి చోళ బ్రహ్మహత్య కథ యొకటి కలదు. ఆ రాజుచేసిన బ్రహ్మహత్య అతనిని వెన్నంటి తరుమగా నాతడు చాలదూరము పారిపోయి అది వదలనందున తిరువిడమరుదూరనుచోట శివాలయమున ప్రవేశింపగా వాకిటనే నిలిచి అతనికై వేచి యుండెనట. మహాత్ముల సలహావలన నాతడింకొక మార్గమునపోయి దానిని తప్పించుకొనెను. బ్రహ్మహత్య ఇంకను ఆ ద్వారము చెంతనే కనిపెట్టుకొని యున్నదట. మరి ఆంధ్రులలో వెలనాటి వారికొక ప్రతిబంధకమున్నది. వెలనాడు చోళరాజులు పాలించినది. చోళులతో సంబంధపడిన యీ కథ వెలనాటి తోను సంబంధపడి యుండుట ఆలోచింపదగినది. శైవవాఙ్మయములో అరువత్తుమూవరును గూర్చి మన పెరిగినది తమిళు లెరుగరు. శైవవ్యాప్తి చరిత్ర నన్వేషించిన ఎన్ని చారిత్రక సత్యములు వెలువడ గలవో!

ఇట్టిదంతయు చూడగా శాతవాహనులు ప్రాకృతమును, పల్లవులు మొదట ప్రాకృతమును తరువాత సంస్కృతమును వృద్ధిపరుపగా, చేర, చోళ పాండ్యులలో పాండ్యులు తమిళమును పోషింపగా, చేర రాజులు, మలయాళభాషను ఆదరించగ, చోళ రాజులు వారితో చేరిన కాకతీయులును, రెడ్లుగా మారిన రాష్ట్రకూటులును తెలుగును పోషించిరి. ఆంధ్రదేశమున వ్యాపించినందున క్రమముగ ప్రాకృత సంస్కృత భాషల ప్రభావముచేత మార్పు నంది సంస్కృత ప్రాకృత ద్రావిడ భాషలయొక్క భిన్నరీతులను పదములను వ్యాకరణ విశేషములను తెలుగు గ్రహించినది. ప్రాచీనాంధ్ర దేశమగుటచే ఆంధ్ర పదము నిలిచినది. తెలుగు వారు చేయుటచే తెలుగైనది. మనకును మన భాషకును రెండు పేర్లుండుటకు పై చారిత్రకాంశములే కారణముగా నుండవచ్చునని నా యూహ. పెద్దలు పరిశోధింతురు గాక.

(ఆంధ్రపత్రిక సౌమ్య సంవత్సరాది సంచిక నుంచి పునర్ముద్రితం.)

జి. ఎల్. కాంతం, కోటిపల్లి
మీరు అందరినీ మీ హాస్యంతో కడుపుబ్బ నవ్విస్తారు. మరి మిమ్మల్ని అదే విధంగా ఎవరు నవ్విస్తారు?

పూర్వం నా భార్యా సౌ॥ అమ్మలు; ఇప్పుడు మా బుజ్జోడు ఎవ్వరూ నవ్వించకపోతే నాలో నేనే నవ్వుకుంటాను

పి. వి. సత్యనారాయణశర్మ కృష్ణ లంక
మన ఇండియాతరపున మిమ్మల్ని చంద్రమండలం పంపిస్తే వెళతారా ?

ఓ. ఎస్ మా ప్రొడ్యూసర్లు ఒప్పుకుని పంపిస్తే తప్పక వెళతా కాని మీలాంటి ప్రేక్షకుడు కూడా అక్కడ వుండాలిగా ?

వానిబాబు, విశాఖపట్నం
గతించిన మన జీవితాన్ని మరచిపోయి జీవించడం మంచిదేనంటారా ?

మన అనకండి – నే నసలు నా జీవితం గురించే ఆలోచించను. ఆలోచిస్తే దగ్గరవాళ్ల జీవితాన్ని గురించి ఆలోచిస్తా.

పి. సుబ్రహ్మణ్యం, చిట్వేలి
మీరు నిజ జీవితంలో కూడా హాస్యంగా మాట్లాడుతారా ?

నేను అలా మాట్లాడితే మా ఆవిడ ఆరోజు కొంచెం దూర దూరంగా వుంటుంది అందుకని నే నెప్పుడూ సీరియస్సే.

మీరు తెలుగు కాకుండా మరియే భాషలలో ధారాళంగా మాట్లాడగలరు ?

తెలుగే నాకు సరిగ్గా రాదు; ఇంకో భాష అంటే యింకా బెడద.

మచ్చా వెంకటరామయ్య, ఉరవకొండ
ఎలక్షన్లలో ఓడిపోయిన మంత్రి, సినిమా రంగంనుండి బహిష్కరింపబడిన నటి, విడాకులు యిచ్చిన భార్య—వీరిలో ఎవరి దుఃఖం భరించరానిది ?

నాకు అలాంటి అనుభవం తగల్లేదు; మంచి మార్కులతో పాసయిన విద్యార్థికి కాలేజీలో సీటు లేదంటే – ఆదుఃఖాన్ని భరించడం కష్టం.



రాజబాబు

ఎం. సి. ప్రకాశరావు, హైద్రాబాదు
తమరు సినిమాల్లో నృత్యాలు ఆడవారి కంటే స్పీడుగా చేస్తారు ? కారణం ?

తప్పులు కనపడకుండా వుండడానికే

తమరు దెయ్యాల్ని ఎప్పుడయినా చూశారా ?

మొన్న దెయ్యం వేషం వేశా; అద్దంలో చూసుకుని దెయ్యమేమో అని దడుచుకున్నా; ఇంటికి రాగానే బొట్టుకూడా పెట్టుకున్నా.

కె. సూర్యనారాయణ, కన్నా పెంటపాడు
గురూ, మీరు నటించిన చిత్రాలలో మీకు నచ్చిన చిత్రం, మీకు నచ్చిన పాత్ర ఏమిటో తెలియచేస్తారా?

నిండుమనసులు, సర్కార్ ఎక్స్ప్రెస్, భార్య; సర్కార్ ఎక్స్ప్రెస్‌లో బాబూ రాజేంద్రప్రసాద్ వెంకటగిరిజా రమణారావు అంటే నా కిష్టం.

జి. నాగార్జునరావు, సికింద్రాబాదు
మీ శత చిత్రోత్సవం జరిగిందా? మీరింతవరకూ ఎన్ని చిత్రాలలో నటించారు?

ఇంకా జరుగలేదు – నిర్మాతలనుకుంటే అదొక లెక్కా—ఇప్పటికి 67 చిత్రాలలో నటించాను.

మీరు నాయకునిగా ఏ చిత్రంలో నయినా నటించారా?

ఇంకా లేదనే అనుకుంటున్నా –చూద్దాం.

వెలిచేటి వీరభద్రరావు, చి. కొత్తూరు
మిమ్మలను 'హాస్యబ్రహ్మ' చేశామనుకోండి; మీ సృష్టిలో ఎటువంటి ఫలితాలను ఆశిస్తారు?


నన్ను చెయ్యాలేకాని చేస్తే మొత్తం ప్రపంచం అంతా దుఃఖమయం. ప్రస్తుత మన భారతదేశ పరిస్థితే.

పుప్పాల వెంకటరామయ్య, నరసారావుపేట
హాస్యనటులయిన చలంగారు, పద్మనాభంగారు సొంతపిక్చర్స్ తీశారు. మరి మీరు సొంతపిక్చరు తియ్యరాండి? మీరు పిక్చర్ తీస్తే హీరో మీరు వుండండి. మరి హీరోయిన్‌గా ఎవర్ని సెలెక్టు చేస్తారు?

ఇంకా అనుకోలేదు; అనుకుంటే తప్పకుండా నా కథే తీస్తా. మా ఆవిడే హీరోయిన్; మరెవ్వరయినా వెయ్యడానికి ఒప్పుకున్నా. మా ఆవిడ నూరుకోదు

బహుమతి పొందిన ప్రశ్న

పసుపులేటి రామారావు, ఉంద్రాజవరం
భూమ్యాకర్షణనుండి తప్పించుకు పోతున్నాం. కానీ, ఈ స్త్రీనుండి తప్పించుకోలేక పోతున్నాం. ఎలాగురూ ?



ఆ స్త్రీ ఏ స్త్రీయో చెప్పండి; నే ప్రయత్నించి మిమ్మల్ని తప్పిస్తా. ఇది సృష్టినాయునా !



‘పంచకల్యాణి-దొంగలరాణి’లో విజయలలిత, కాంతారావు

చిత్రసమితి.

పంచకల్యాణి - దొంగలరాణి

కొత్తవాళ్ళతో చిత్రనిర్మాణం సాహససంతమైనదీ ప్రయాసతో కూడుకున్నదీను ఇప్పుడింతసాహసానికి పూనుకుంటున్నవారిలో గిడుతూరి సూర్యంకూడా ఒకరు ‘కొత్తవారు రావాలి, కొత్తదనం కావాలి’ అనే నినాదంతో ముందడుగువేస్తున్న సూర్యంగార్ని అభినందించి తీరాలి. పాత కొత్తల మేలు కలయికతో నిర్మించిన చిత్రం శ్రీ సరస్వతీ చిత్రవారి ‘పంచకల్యాణి—దొంగలరాణి’

చిత్రం జానపదమే అయినప్పటికి నీరోచితమైన కథ ఇతివృత్తంగా మాయ మంత్రాలకు దూరంగా నిర్మించిన చిత్రమిది. తక్కువ వ్యవధిలో తక్కువ బడ్జెట్‌లో చిత్రాలను నిర్మించవచ్చునని గిడుతూరి సూర్యం మరోకసారి ఈచిత్రం ద్వారా నిరూపించారు.

మామూలుగా ఒక మహారాజుగారు! ఆయన కొలువులో ఒక దుష్టబుద్ధి వుంటాడు. దుష్టబుద్ధి మహారాజును చెరలోవుంచి రాజ్యం ఆక్రమించుకుంటాడు. బయట ప్రపంచంలో ఊపిరి పీల్చుకున్న వారి పిల్లలు విజయలలిత, కాంతారావులుగా పెరిగి పెద్దవాళ్ళవుతారు. కథానుసారంగా విజయలలిత దొంగలరాణి అవుతుంది ఆమె గుర్రం పంచకల్యాణి. ఇందులో రాజగురువు పాత్ర గొప్పది. అతను దుష్టబుద్ధిపై పగబట్టి కొడుకచేతనే తండ్రిని చంపించి అపర చాణక్యుడనిపించుకుంటాడు!

దర్శకుని తెలివితేటలలోనే కొత్త నటీనటుల భవిష్యత్తు ఆధారపడి వుంటుంది. ముఖ్యపాత్రలలో చాలామంది కొత్తవాళ్ళకు స్థానంకల్పించి వారికి మంచి భవిష్యత్తు ఏర్పరిచారు నిర్మాతలు

పాత్రకు తగిన నటిగా విజయలలితను ఎన్నుకొని ఆమెను కథానాయకిగా పరిచయం చేసినందుకు నిర్మాతలు ప్రశంసనీయులు. దొంగలరాణిగా కత్తి యుద్ధాలు చేయడంలోను, వీరరసాన్ని పోషించడంలోను ఆమె అగ్రగణ్యురాలనిపించుకున్నది. కథానాయకుని పాత్రలో విశిష్టత లేకపోయినా తగిన విధంగా నటించి పాత్రను పోషించారు కాంతారావు త్యాగరాజా అవకాశాన్ని బాగా వినియోగించుకుని తన నటనాచాతుర్యాన్ని బహిర్గతం చేసి ఉత్తమ స్థాయి నటుల్లో చేరుకున్నారు. కొత్తవారిలో రాజగురువుగా నటించిన వసంతకుమార్ కృషి ప్రశంసనీయం. అలాగే బొబ్బిలి కనకారావు నటన ఉత్సాహజనకంగా వున్నది. తదితర ముఖ్యపాత్రలని మోదుకూరిసత్యం, జగ్గా సత్యం, జ్యోతిలక్ష్మి, నిర్మల మొదలైనవారు పోషించారు.

కరుణశ్రీ ‘కంసవధ’ నృత్యరూపకం, విజయలలిత కత్తియుద్ధాలు ప్రత్యేకాకర్షణగా వుండగల ఈచిత్రానికి సంగీత దర్శకుడు ఎ. ఎ. రాజ్ ఈ యువ సంగీతదర్శకుని ప్రతిభ ప్రతి పాటలోనూ ప్రస్ఫుటమవుతుంది. రెంటాల గోపాలకృష్ణ సంభాషణలు రాశారు

జానపద చిత్రాలలో ఒక ప్రత్యేక తరహా చిత్రం ‘పంచకల్యాణి—దొంగలరాణి’. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వమూ గిడుతూరి సూర్యం నిర్వహించారు. నిర్మాతలు గిడుతూరి సూర్యం, నల్లా వెంకట్రావు.

—సితరాజు

సినిమా

‘చిక్కడు దొరకడు’ మీకు చిక్కాడు! మీ డబ్బును దోచుకున్నాడు; ఆ తర్వాత ‘కదలడు వదలడు’ వచ్చాడు! మీకు నచ్చాడు! మీకు పైరెండు స్వరూపాల్లో శ్రీ ఎన్. టి. రామారావు కనిపించారు; మిమ్మల్ని దర్శకుడు శ్రీ విఠలాచార్య ఆకట్టుకున్నారు; శ్రీ విఠలాచార్య ప్రతిభను శ్రీ సీతారామస్వామి ఉపయోగించుకున్నారు. మరి తర్వాత కార్యక్రమం సంగతేమిటని అడిగాము. ఈసారి ‘తొణకడు బెణకడు’ రాబోతున్నాడు అన్నారు నిర్మాత శ్రీ సీతారామస్వామి ఈ చిత్ర కథను శ్రీ పిట్టూరి వ్రాస్తారట; సంగీతాన్ని శ్రీ టి వి. రాజు సమకూరుస్తారట. శ్రీ విఠలాచార్య జ్యేష్ఠకుమారుడు శ్రీ బి. వి. శ్రీనివాస్ దర్శకత్వం నెరవనున్నారట; కథానాయకుడిగా శ్రీ ఎన్ టి. రామారావు నటించనున్నారట.

ఎన్. టి. ఆర్.కి నాయికగా వాణిశ్రీ మొదటిచిత్రం

‘నిండుహృదయాలు’ ఎంతవరకు ‘వచ్చిందండి?’ అని నిర్మాత శ్రీ జగన్నాథరావును ప్రశ్నించాము చాలా భాగం పూర్తయినట్లే! ఒక డ్యూయెట్ చిత్రీకరణ చెయ్యాలి. అది అయిందంటే రికార్డింగు ప్రారంభమవుతుంది; ఆగస్టు పదిహేనవరోజున ‘నిండు హృదయాలు’ విడుదలౌతుంది అని చెప్పారు. ఈ చిత్రానికి ప్రముఖ తమిళ రచయిత శ్రీ పద్మనాభన్ కథను వ్రాయగా, శ్రీ సముద్రాల (జూనియర్) సంభాషణలను సమకూర్చారు. సంగీతాన్ని శ్రీ టి. వి రాజు. ఛాయాగ్రహణాన్ని శ్రీ ఎస్. ఎస్. లాల్, కళా దర్శకత్వాన్ని శ్రీ తోట, రూపాలంకరణను శ్రీ భద్రయ్య నిర్వహించిన ఈ సాంఘిక చిత్రంలో మీ హృదయాలను కదలించే ఒక చక్కటి పాత్రలో శ్రీ ఎన్. టి. రామారావు నటించారు; వారి ప్రక్కన నాయికగా కుమారి వాణిశ్రీ నటిస్తున్న మొదటిచిత్రం యిదే గీతాంజలి శోభన్‌బాబులు ఒక జంటగాను, చంద్రకళ చలం మరొకజోడుగాను నటిస్తున్నారు. చిత్రంలోని యితరపాత్రలను శ్రీయుతులు సత్యనారాయణ, ఛాయాదేవి పోషించారు. ఈ సాంఘిక కథను, మీ అభిమాన నటీ నటులద్వారా [illegible]

ఘనత దర్శకుడు శ్రీ కె. విశ్వనాథ్‌కే చెందుతుంది. ఈ చిత్రాన్ని జ్యోతిపిక్చర్స్ మీకు చూపిస్తారు.

ప్రధాన పాత్రలలో కృష్ణ, పద్మనాభం

శ్రీ ఆనందమోహన్‌చే నిర్మితమవుతున్న 'మా మంచి అక్కయ్య' అయిదు రీళ్ల వరకు శ్రీ అదుర్తి నరసింహమూర్తి దర్శకత్వంలో తయారయినట్లు మీకు యిది వరలో తెలియచేసాను. ఒక విజయవంతమయిన మళయాళ చిత్రంయొక్క తెలుగురూపమే ఈ చిత్రం. శ్రీయుతులు నాగభూషణం, శోభన్‌బాబు, ప్రభాకరరెడ్డి, ధూళిపాళ, రాజబాబు, బాలకృష్ణ, సూర్యకాంతం, బేబిరాణి ముఖ్య భూమికలను నిర్వహించే యీ సాంఘిక చిత్రంలో శ్రీమతి కె. ఆర్. విజయ కథానాయిక; చిత్రానికి ఆయువు పట్టయిన రెండు ప్రధాన పాత్రలను శ్రీయుతులు కృష్ణ, పద్మనాభం పోషిస్తున్నారు. శ్రీయుతులు కోదండపాణి సంగీతాన్ని, వి. ఎస్. ఆర్. స్వామి ఛాయాగ్రహణాన్ని, బి. ఎస్. కృష్ణ కళా దర్శకత్వాన్ని నిర్వహిస్తున్న యీ చిత్రం ఆంధ్ర ప్రేక్షకులను తప్పక మెప్పించగలదనుకుంటున్నారు. ఇప్పుడు ఈ చిత్రానికి శ్రీ వి. రామచంద్రరావు దర్శకుడు.

సంవత్సరంపాటు రోజుకి 16 గంటల పని, వారం బెంగుళూరులో విశ్రాంతి

'శ్రీ ఎన్. భావనారాయణ సోమతగల మంచి నిర్మాత' అన్నారు దర్శక నిర్మాత శ్రీ విఠలాచార్య. ఏమిటి సంగతి? అని ప్రశ్నించాను. 'మరేంలేదు. ఆయన చాలా కాలంగా ఒక చిత్రాన్ని డైరెక్టు చెయ్యమని అడుగుతున్నారు. 'సరే' అని ఒప్పుకున్నాను. శ్రీ ఎన్. టి. రామారావు ముఖ్యభూమికను నిర్వహించగలరు' అని సమాధానమిచ్చారు. 'నేను ఒకవారం బెంగుళూరులో రెస్టు తీసుకుందామనుకుంటున్నాను. గత సంవత్సరం జూన్ నుండి యీ సంవత్సరం జూన్ 10 వ తేదీ వరకు ప్రతిరోజూ పదహారుగంటలు పని చేస్తున్నాను. ఒకవారం విశ్రాంతి తీసుకున్న తర్వాత మరలా గౌతమీ, పి.ఎన్.ఆర్. విశాల్ కంబైన్స్ షూటింగుల హడావిడిలో పడపోతాను' అన్నారు.


ఇంతకుముందు కానరాని సన్నివేశాలు

'మహామంత్రి తిమ్మరుసు', 'నిర్దోషి' చిత్రాలను నిర్మించిన శ్రీ రామబ్రహ్మం గౌతమీ పిక్చర్స్ తరఫున 'అలీబాబా నలభై దొంగలు' తెరకెక్కిస్తున్నారు. శ్రీ డి. వి. నరసరాజుచే సరికొత్తరూపాన్ని అందుకున్న యీ కథలో మీకు తెలియని, యింతకు ముందు విడుదలయిన చిత్రాలలో కానరాని సన్నివేశాలుండగలవట. ఈ ప్రణయగాథకు శ్రీ ఘంటసాల శృంగారరసాన్ని చిందించే సంగీతాన్ని సమకూరుస్తున్నారు. ఈ రసమయ చిత్రకన్యను శ్రీ విఠలాచార్య చేపట్టారు. అలీబాబా పాత్రను వీరోచిత పాత్రలకు పేరెన్నికగన్న శ్రీ ఎన్. టి. రామారావు పోషిస్తున్నారు. అందాలు చిందించే అపురూప సౌందర్యరాశి మార్జియానా భూమికను దక్షిణభారత గ్లామర్ తార కుమారి జయలలిత ధరిస్తుంది. అలీబాబాకు అన్నగా శ్రీ నాగభూషణం; దుష్ట నాయకుడిగా శ్రీ సత్యనారాయణ నటిస్తున్నారు. ఇతర పాత్రలను శ్రీయుతులు మిక్కిలినేని, అల్లు రామలింగయ్య, ఛాయాదేవి నిర్వహిస్తున్నారు. ఈ చిత్రం యిటీవల వాహిని స్టుడియోలో మూడు రీళ్లవరకు ముస్తాబయింది. శ్రీ ఆచార్య నిర్దేశకత్వంలో క్యారెక్టర్ నటుడు శ్రీ నాగభూషణం నటిస్తున్న మొదటి చిత్రం యిదే.

అన్ని హంగులు సమపాళ్లలో అమరిన చిత్రం

తారకరామా పిక్చర్స్ నిర్మిస్తున్న 'భలేతమ్ముడు' ఆగస్టు చివరివారంలో మీకు దర్శనమివ్వనున్నాడు. 'భలేకథ, భలే పాటలు, శృంగార దృశ్యాలు, ఒళ్లు ఝల్లు మనిపించే భయంకర పోరాటాలు, మనోహర నృత్యాలు, కమ్మని సంగీతం సమపాళ్లలో సంతరించుకున్న సాంఘిక చిత్రమే యీ 'భలేతమ్ముడు' శ్రీ ఎన్.టి. రామారావు అన్న, తమ్ముడిగా అగుపడిన నటన మెచ్చే భలే చిత్రమయ్యా అనిపించే రీతిలో దర్శకుడు శ్రీ బి. ఎ. సుబ్బారావు ప్రతి సన్నివేశాన్ని జాగరూకతతో చిత్రించారు; శ్రీమతి కె. ఆర్. విజయ హుషారుగా నటించిన ఉత్తమచిత్రం; కొత్తతార షకీలా చక్కగా అభినయించింది. ప్రముఖ నేపథ్యగాయకుడు శ్రీ రఫీ గానమాధుర్యం చిత్రంలో ప్రత్యేక ఆకర్షణ. ఈ చిత్రాన్ని శ్రీ పుండరీకాక్షయ్య నిర్మించగా, విజయాపిక్చర్స్ విడుదల చేస్తారు.

—శ్రీనివాస్




'సిపాయి చిన్నయ్య'లో నాగేశ్వరరావు, భారతి

ఎన్. టి. ఆర్. ఆర్గనైజేషన్

6 లక్షల రూపాయల నిధి సమర్పణ

ఎన్. టి. ఆర్. ఆర్గనైజేషన్‌వారు చిత్తూరు, తిరుపతి, అనంతపురం, బళ్ళారి, బెంగుళూరు, మద్రాసు పట్టణాల్లో సేకరించిన 'ఆంధ్ర తుఫాన్ బాధితుల నిధి' ఆరులక్షల రూపాయలను యిటీవల మద్రాసులో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారికి ఆనాటి సభకి అధ్యక్షత వహించిన తమిళనాడు ముఖ్యమంత్రి శ్రీ ఎం. కరుణానిధిద్వారా అందజేశారు శ్రీ రేలంగి వెంకట్రామయ్య ఎన్. టి. ఆర్. ఆర్గనైజేషన్ తరపున ఆరులక్షల రూపాయల చెక్కుని శ్రీ కరుణానిధికి అందజేశారు. శ్రీ కరుణానిధి దానిని శ్రీ బ్రహ్మానందరెడ్డికి సమర్పించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా మైసూరు పరిశ్రమలమంత్రి శ్రీ ఎం. రాజశేఖరమూర్తి వచ్చారు. శ్రీ ఎం. జి. రామచంద్రన్ ఆనాటి ప్రదర్శనాలకి ప్రారంభోత్సవం చేశారు.



ఎన్. టి. ఆర్. ఆర్గనైజేషన్ కృషిని అభినందిస్తూ ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి ప్రాంతాలు, భాషలు వేరైనా అందరం భారతదేశ పౌరులమనీ ఒకరి కష్టాలలో మరొకరు ఆదుకోడం మానవధర్మం అని అన్నారు. నిధి సేకరణలో తోడ్పడిన తమిళనాడు, మైసూరు ప్రజలకి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీ ఘంటసాల ప్రార్థనాగీతంతో సభ ప్రారంభం అయింది. శ్రీ జగ్గయ్య సభికులకి స్వాగతం పలికారు.

తమిళనాడు ముఖ్యమంత్రి శ్రీ కరుణానిధి మాట్లాడుతూ ఆంధ్రలో తుఫానువల్ల కలిగిన నష్టం తమకెంతో బాధని కలిగించిందని అంతా ఆంధ్రలోనేకాక అందులో సగం తమిళనాడులోకూడా తుఫానువచ్చివుండ కూడదా అని తమకి అనిపించిందని, అందువల్ల రెండు రాష్ట్రాలకీ నష్టం అంతగా ఉండేది కాదని అన్నారు.

శ్రీ ఎం. జి. రామచంద్రన్ తమ ప్రసంగంలో రాష్ట్రాలు, భాషలు వేరైనా అంతా ఒకటేనని, సినిమా పరిశ్రమలో అలాంటి విభేదాలు లేకుండా ఆంధ్రులు, తమిళులు, కన్నడిగులు, కేరళీయులు అంతా సంఘటితమైన కృషితో కలిసి కట్టుగా వ్యవహరిస్తారని, సోదరభావంతో ఉంటారని అన్నారు. కళాకారులు ప్రజలని రంజింప చేయడమే కాకుండా క్లిష్ట పరిస్థితులలో దేశానికి సహాయపడటం ఎంతో అవసరమని శ్రీ ఎం. జి. ఆర్. అన్నారు.

అనంతరం శ్రీ ఎన్. టి. రామారావు తమ బృందం సభ్యులని కార్యకర్తలని పరిచయం చేశారు. అనంతరం వినోద కార్యక్రమాలు ప్రేక్షకులకి ఉల్లాసాన్ని కలిగించాయి. శ్రీ డి. వి. ఎస్. రాజు వందన సమర్పణ చేశారు.

(ఇ. వి.)

ఉత్తరాలు

(4-వ పేజీ తరువాయి)

శ్రీ రాజకుమార్, హైదరాబాద్(తెలంగాణా) గారు పాపం తమ కడుపు మంటను ఎలావెలిబుచ్చాలో తెలియక శ్రీరాశిగారి మీద తీర్చుకొంటున్నట్లున్నది. శ్రీ రాజకుమార్‌గారు ఎదుటి వారిపై విమర్శకు పూనుకొనప్పుడు తమ రాజకీయ పరిజ్ఞానమెంతో విశదపరచవచ్చుగదా? శ్రీరాశిగారు శ్రీభార్గవ కమిటీ నిర్ణయం ఎందుకు ఆలస్యం జరుగుతున్నదని ప్రశ్నించారు. మరి దానికి సమాధానమేది? కొన్ని రోజుల క్రితం శ్రీ విజలింగప్పగారు ఏమని సెలవిచ్చారో శ్రీ రాజకుమార్ గారు విన్నారా? 'తెలంగాణాలో మిగులు నిధులు ఉన్నా లేకపోయినా, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిధులు సమకూర్చాలని చెప్పలేదా? కుమార్ లలిత్‌గారు మిగులు నిధులు తేల్చినప్పుడు, భార్గవ గారి నిర్ణయం తేలనప్పుడు నిధులు గురించి ప్రకటనగాని, చర్చగానీ', లేకపోయినా' అనే పద ప్రయోగానికి కారణమేమిటి?

మరిఒక పాఠకుడు 'శ్రీ రాశిగారు శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి, శ్రీ ప్రగడ కోటయ్యకన్నా గొప్పవారా' అని ప్రశ్నించారు. ఆ పాఠకుడు శ్రీ కోటయ్య ఆంధ్రపత్రిక దినపత్రిక లో ప్రచురించిన వ్యాసం చదివారా? వారు అసలు తెలంగాణాలో మిగులు నిధులు ఉన్నాయా అని సందేహాన్ని వ్యక్తపరచలేదా? మరి ఆ విషయాన్ని అనుసరించే కదా శ్రీ రాశిగారు తమ అభిప్రాయాలను వివరించారు. పోనీ శ్రీ రాశిగారు రాష్ట్ర సమైక్యత దృష్ట్యా వ్రాసారా అని చూసినా ఏకోశాన కనబడటంలేదు. వారు విడాడిపోదామనే కదాఅన్నారు.

శ్రీ రాజకుమార్‌గారు శ్రీ రాశిగారు ఆంధ్రుడు (కాకపోయినా) అని మరీ మరీ ఒత్తిచెప్పడంతో ఆంధ్రుల మీద వారి ద్వేషాన్ని ప్రకటించుకొన్నారు. హైదరాబాద్ లో నివసిస్తున్న శ్రీ రాజకుమార్‌గారు రాజసం వెలిబుచ్చినంత మాత్రాన సరిపోదు. ఇక్కడ ఆంధ్రులు వెచ్చించిన ధనం తక్కువ మొత్తమని నిరాకరించ గలరా? మరి ఆధనమంతా కనీసం మామూలు నిష్పత్తిలో నైనా ఎందుకు పంచబడలేదు? తెలంగాణా లో ఆంధ్రులు దోచుకొని పోతున్నారనే వాదం ప్రబలినప్పుడు ఆంధ్రులు విడిపోదామని కోరడం భావ్యం. ఆంధ్రదేశం పట్టిపోలేదు. వారు ఒకరిని యాచించే స్థితిలో లేరు. ఒకేదేశంలో ఒకే రాష్ట్రంలో, ఒకే ప్రభుత్వం కింద బ్రతుకు తున్నామని భావించి తమని తాము అభివృద్ధి చేసి కోవడం తప్పా? ఆ ప్రజ్ఞాపాటవాలు ఇంకొకరికి లేకపోతే దానికి ఎవరు బాధ్యులు?

ఇక్కడ ఆంధ్రుల మీద హింసాకాండను, జరిగిన జరుగుతున్న అవమానాలనూ శ్రీ రాజకుమార్ గారు ఖండించరేమో? వీర తెలంగాణావారు కనీసం రైలు పట్టాలను పీకి అమాయక ప్రజను చంపితే ప్రత్యేక రాష్ట్రం సాధించగలమని భావిస్తున్నారా? ఆంధ్రుల ప్రత్యేకరాష్ట్ర సాధనలో తమిళులు ఇదే విధంగా బాధపడ్డారా? రైళ్ళు రాకపోకలు నిలిపినప్పుడు తమిళులకు ఆంధ్రదేశంలో ఇదే విధమయిన అవమానాలు జరిగినవా? ప్రస్తుతం ఆంధ్రులు తమిళనాడులో సుఖ శాంతులతో లేరా? తమ స్వంత రాష్ట్రంలో కంటే ఇంకా హాయిగా ఉన్నారనడంలో అతిశయోక్తి లేదు. ప్రత్యేకరాష్ట్ర సాధనకు తెలంగాణా ప్రజలు ఆంధ్రుల అండదండలు పొందినంత మాత్రాన్నే వారి ఆశయం నెరవేరకలదు. వారి ఆశయ సాధనకు ఆంధ్రులు వ్యతిరేకులు కారు. కాని వారికి ఇకమీదట ఇటువంటి అవమానాలు జరగనంత కాలం మాత్రమే.

—గరిమెళ్ళ అశోక్ కుమార్,
హైదరాబాద్. (తెలంగాణా)

* * *

'తెలంగాణా వీరుడైన సత్తయ్య వ్రాయు జాబు ఏమనగా మీరు మీ పవిత్ర ఆంధ్రపత్రికలో 'తెలుగు సమైక్యతా మైదానంలో తోడేళ్ళ గుంపు' అనే వ్యాసం వ్రాశారు చాలా బాగానే ఉంది మీ తెలివితేట బాగా ఉపయోగించారు. మీ ఉద్దేశాన్ని బట్టి చూస్తే మిమ్మునే కాక మిమ్ము పుట్టించిన ఆ బ్రహ్మదేవుని శ్లాగించదగిన విషయం మీరు వ్రాశారు. తెలంగాణా ప్రజలు ఆంధ్ర యువతులపై అన్యాయంగా వ్రాసారని చాలా వర్ణించారు మరియు ఆంధ్ర వారి ఇండ్లు కాలేశారని వ్రాశారు అయితే మెమంతా దుర్మార్గులమే? మేమెంత మెత్తగా మా పురుషత్వము చూపెలా మే అటువంటప్పుడు ఈ తెలంగాణా వచ్చి జీవించటమెందుకో! మరి మీకు పురుషత్వము లేదేమో! మరియు తెలంగాణా వారి పేర్లు ప్రత్యేకంగా వర్ణించారు చాలా బాగుంది అయితే మా విషయం. మీరు ఇంత ఉబాలాట పడకండి. నేడో రేపో తెలంగాణా కాబోతున్నది. ఇక పైన మీ పేపరులో ఇలాటి విషయం గురించి చాలా జాగ్రత్తగా వ్రాయాలి. లేనిచో మీ కార్యాలయం రూపుమారుతుందని కచ్చితంగా తెలుసుకోగలరు. ఎదో రాశారు బతికి చచ్చిన వాలిలా తెలివి ఉండి తెలివిహీనునిగా రాశారు. కాని ఇకపైన తెలంగాణా సమస్య మీ పేపరులో ఉండకూడదని గట్టిగా సత్తెకాలపు సత్తయ్య ఇతర ప్రముఖులు చెప్పుతున్నారు.'

గమనిక

[ఉత్తరం రాసిన వారు చివర పెట్టిన సంతకం స్పష్టంగా తెలియుటం లేదుకాని, ఇన్‌లాండ్ కవర్ కాబట్టి, సెండర్స్ ఎడ్రెస్‌కింద **shayaneyswar, Hydrabad, Paraysnan Gally** అన్న అక్షరాలు చదవగలుగుతున్నాము! బూతు మాటలు ఉన్న కొన్ని వాక్యాలని చట్టనిబంధనల వల్ల వెయ్యటానికి వీలులేకుండా ఉంది— సం.

* * *

27–6–69 సంచికలో శ్రీ చిన్నప్పరెడ్డిగారు, శ్రీ రామచందర్ గార్ల జాబులు, అందుకు శ్రీ'రాశి' సమాధానం చదివి దీనిని రాస్తున్నాను. (6వ పేజీలో 'తెలంగాణా విడిపోతే'? అన్న 'బార్డర్ నోట్' గమనార్హం!)

శ్రీ'రాశి'వ్యాసాలు ఒకప్రవాసాంధ్రునిగ, ఏపక్షపాతానికీ లొంగకుండా పరిశీలించాను. అలాగే పైనుదహరించిన జాబులు కూడ చదివేను.

వీటిని పరిశీలించిన పిదప మనకు తేలేదేమంటే యూతా, వాతా కొంత 'కుంభకోణం' ప్రభుత్వపరంగా జరిగింది. దానిని సరిజేయటంలోనే

అన్నికి వాయుపుత్రోడ్గోండని!

ఈ మహాయుద్ధానికి రెండు శక్తులు కారణమై ఉన్నాయి. ఒకటి ధర్మపక్షం. రెండవది అధర్మపక్షం. ధర్మపక్షంవాదం ప్రకారం 'తెలంగాణాకి అన్యాయం జరిగింది. దాని ప్రకారం 100 కోట్లు అభివృద్ధి పథకం మీద వ్యయం చెయ్యాలని. ఇది పరిశీలనకి తీసుకోవచ్చును. బుజువైన పక్షంలో అమలులో పెట్టవచ్చును. పోతే—2వది (అధర్మపక్షం) వీరివాదం మరేమీకాదు. వీరిధ్యేయం ఒక్కటే. బ్రహ్మానందరెడ్డి పదవీచ్యుతుడు కావటం, తెలంగాణా విడిపోవటం ఈ రెంటివల్ల సమస్యలేవిధంగా పరిష్కారమవుతాయో కూడా మనం యోచించాలి ఇవేళ సత్యాగ్రహాలు, బంద్‌లు, నినాదాలు చేసే మూరాలు రేపు తెలంగాణా ముక్కలు చెక్కలయి అయారాజకీయ నాయకుల వాక్కుప్రకారం అలో రాష్ట్రానికి వెళితే ఆనందిస్తారా? అదివారి వారి కోరికలను తీర్చి వస్తేనా?

అదే నిజమైతే 'తెలంగాణా వేర్పాటు' దోరణి వల్ల అసలయిన వారికన్నా, ఈ సంఘ విద్రోహ, లకే లాభిస్తుందని నొక్కి చెబుతున్నాను

కుటుంబ కలహాలు వచ్చిన మాట నిజమే! అందు కవి అన్నమీద దౌర్జన్యానికి కౌడీలను గూండాలను పురికొల్పితే చివరికి పతనమయేది వారిచేతుల్లోనే . ఇది యీనాడు గ్రహించకపోయినా కాలమే నిరూపిస్తుంది 'తెలంగాణా' వేరయితే నష్టం ముమ్మాటికీ వారిదే ఇది నిజం!

రవీంద్ర (లక్సెట్టిపేట)

* * *

మన పత్రికకు వచ్చే లేఖలలో కొన్ని సంస్కార శూన్యమూ, వేర్పాటు పద్ధతులయప్రోత్సాహపరిచవిగాను వుండటము విచారకరము. ఒక్కనాటిని పూర్తి యధాతధంగా ప్రచురించటం వలన మీ పత్రికకున్నగల అభిమానాన్ని తగ్గింప చేసుకోవడమే అవుతుంది. తార్కాణంగా, పత్రికలో ఏవ్యాసం ప్రచురింప బడినా అవ్యాసంపై మాత్రం కూలంకషంగా చర్చింప వచ్చును. కాని వ్యాసకర్త కుంటివాడా? గ్రుడ్డివాడా? అని ప్రశ్నించే హక్కు పాఠకుని కెక్కడిది?—అలాగే, విజయవాడ, హైద్రాబాదు, కర్నూలు లాటి ఏ వూరులోనుండి వ్రాసినా, ఆంధ్రప్రదేశ్‌నుండి వ్రాసినట్లైగాని, ఒకే రాష్ట్రములోని ఆయా ప్రాంతాములనుదహరించుట ఎంత విచారకరం? అయినా ఒకతెలుగు పత్రికలో, తెలుగు పట్టణాలు తెలియకపోతేగదా? బకెట్లలో వ్రాయవలసినది?

యివి సంస్కార - రహితమూ, ప్రాంతీయ దురభిమాన పూరితమూలా కాక మరేమిటి? యిలాటివి మీ పత్రికలో గత 4,5 వారముల నుండి కానవస్తున్నవి యిట్టివి తొలగించి లేఖలు ప్రచురించినందువల్ల తప్పులేదని, మీపత్రికను గత 10,12 ఏళ్ళనుండి అత్యంత అభిమానంతో కొని, చదువుతున్న పాఠకునిగా సూచిస్తున్నాను యిలా నిర్దుష్టంగా వ్రాసిన నన్నూ ఏదో ఒక వికలాంగునిగా వ్రాసినా వ్రాయ గలరేమోయని ఒకించ వలసి వస్తోంది. జయంతశ్రీ (ఖమ్మం)

తెలంగాణా ఉద్యమం..

(15వ పేజీ తరువాయి)

సరిగా ప్రవరిస్తుందని నమ్ముతున్నాను' అన్నారు.

తెలంగాణా ప్రజల కష్టనిష్ఠూరాలను పరిశీలించడానికి వెంటనే ఒక ఉన్నతాధికారసంఘం నియమించబడాలని తెలంగాణా ప్రాంతీయ సంఘం మాజీ అధ్యక్షుడు కె. అచ్యుతరెడ్డి 13వ తేదీన ఒక పత్రికా ప్రకటన చేశారు.

బుధవారం 19—2—69

విజయవాడ, 17: ఇటీవల జరిగినకల్లోలాలకు కారకులను నిర్ణయించి శిక్షించేందుకు సుప్రీంకోర్టు న్యాయమూర్తితో ఒక న్యాయ విచారణ సంఘాన్ని నియమించి విచారింప చేయాలని కల్లోలాలు జరిగిన ప్రాంతాల్లో ప్రజలకు ప్రభుత్వ రక్షణ యివ్వనందుకు బాధ్యులైన అధికారులను బర్తరఫ్ చేయాలని కోరుతూ విశాలాంధ్ర పరిషత్ మహాసభ తీర్మానించింది

'జనవరి 30వ తేదీన ముగ్గురు తెలంగాణా సూపర్‌వైజర్లను బెదరించడం జరిగిందని, మరి కొద్దిమంది తెలంగాణా సూపర్‌వైజర్లు ఎందుకైనా మంచిదని శ్రీశైలం ప్రాజక్టు కుడివైపు (ఆంధ్ర ప్రాంతం) వదలివెళ్ళవలసినదిగా ఆంధ్ర సూపర్‌వైజర్లు సలహా యిచ్చారు ఈ పరిస్థితులలో 21 మంది సూపర్‌వైజర్లు తమ కుటుంబాలతో ఎడమ దరికి(తెలంగాణా) ఆశ్రయించేరారు ఎడమదరిన తమ కుటుంబాలను వదిలి కొందరు సూపర్‌వైజరు ఆర్ద్రతో తిరిగి కుడివైపునకు తమ ఇండ్లకువచ్చారు!' అని కొండాలక్ష్మణ్ బాపూజీ అన్నారు

హైదరాబాద్‌లో విద్యార్థులు, 19వేదీ పుదయం పలు ప్రాంతాలలో వాహనాలపై, ముఖ్య రోడ్డురవాణా సంస్థ బస్సులపైన రాళ్ళు రువ్వడ కొనసాగించారు. ఒక లోకల్ రైలుపైన కూడా రాళ్ళు రువ్వారు. మొత్తం 15 బస్సులు దెబ్బ తిన్నాయి. కొన్ని ప్రయివేటు కారులు కూడా రాళ్ళ దెబ్బలు తిన్నాయి. పగిలిన గాజుముక్క ఒకటి కంటి రెప్పకిదిగినందువలన ఒక బస్సు డ్రయివరు కన్నుకు తీవ్రంగా గాయం తగిలింది ఈ సందర్భంలో పోలీసులు 5 గురు విద్యార్థులను అరెస్టు చేశారు.

శుక్రవారం 21—2—69 .

శ్రీశైలం ప్రాజెక్టువద్ద తెలంగాణా సిబ్బందిపై అత్యాచారాలు జరిగాయని, వారికి రక్షణకలుగ చేయడానికి ప్రాజెక్టు అధికారులు ఎట్టిచర్య తీసుకోలేదని మంత్రి కొండా లక్ష్మణ బాపూజీ అన్నారు.

ఆంధ్రప్రభుత్వ ఉద్యోగాల (నివాసార్హత)చట్టం దానిక్రింద చేయబడిన నిబంధనలు సవ్యమైనవే నని, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు డివిజన్‌బెంచి నేడు నిర్ణయించింది. ఈ చట్టం , నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమైనవని లోగడ న్యాయమూర్తి చిన్నప్పరెడ్డి యిచ్చిన తీర్పును డివిజన్ బెంచి త్రోసిపుచ్చింది తెలంగాణా ప్రాంతంలో పని చేస్తున్న ముల్కీలు కాని ఆంధ్ర వుద్యోగస్తులను ఫిబ్రవరి 28 లోగా ఆవుద్యోగాలనుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం జనవరి 25నచేసిన ఉత్తర్వును సవాల్ చేసే రిట్ పిటిషన్ను కూడా యీ బెంచి అనుమతించింది

శుక్రవారం 28—2—69

24వ తేదిన ప్రశాంతముగా పెద్దకొన ల్యాణ్ స్త్రీల కళాశాల ముందు నిలబడి నినాదాలు చేస్తూవుండిన విద్యార్థులను వారి నాయకులను ముందు హెచ్చరిక లేకుండా అమానుషంగా లాఠీ చార్జి చేయించిన పోలీసు అధికారులపై తక్షణం తీవ్రమైన చర్య తీసుకొన వలసినదిగా నెల్లూరు జిల్లా కలెక్టరు గారిని, ముఖ్యమంత్రి గారిని కోరుతూ నెల్లూరులో జరిగిన సభలో తీర్మానం చేశారు. (ఇంకా వుంది)

న్యూఢిల్లీ లేఖ

(7వ పేజీ తరువాయి)

విదేశాల సహాయంతో తమ అధికారాన్ని నిలబెట్టుకొనటానికి ప్రయత్నించటం,భారతీయ సాంప్రదాయాలలో ముఖ్యమయినది.'

రష్యా పత్రిక ప్రావ్దా భారతదేశంలో కుడి పక్షాల శక్తులు ఎక్కువ అయిపోతున్నాయని కొంత కాలంగా హెచ్చరిస్తూ వస్తోంది

"ఒక సంస్థ కేవలం ప్రవారం మీద ఆధారపడి జీవించలేదు. ప్రచారం ప్రథమకర్తవ్యం కాదు, స్వభావంలో కూడా కావాలి''. అని ఒక రష్యా సందేశం .

కొందరు అమెరికన్లు ఈ మధ్య ప్రధాన మంత్రిని చూశారు. భారతీయ బాంకులు జాతీ ఆదేవారి చేతుల్లో ఉన్నాయినీ, వారిక సరయి రుణవిధానం లేదని, మేడమ్ గాంధిగారు వారితో చెప్పారు.

దుబారా...

ఈ జూదరులు పోతారు వారి స్థా... వస్తారు? దుబారా ఖర్చులు చేసే వారా?కొంద రికి వచ్చేప్పుడు ఈ విధంగా ఉన్న... !

భారత దేశంలోని బాంకులలో ఉండే డబ్బు జాతీ రులది కాదు. అది ఎందరో మధ్యతరగతి వారి కృషి ఫలితానికి చిహ్నం—తమకీ తమ పిల్లలకీ ఏర్పరచు కున్న రక్షణకి చిహ్నం. ప్లానింగ్ కమీషన్‌వారి కళ్లు దీనిమీద పడ్డాయి మేడమ్ గాంధిగారు శ్రీ దేశాయి స్థానం తీసుకున్నారు వారి అనుచరులలో ఒకరు బాంకులలో ఉన్న వేలకోట్ల మీద అధికారం చెలాయించగలరు

తొక, దుక్క...

పశ్చిమబెంగాలు కమ్యూనిస్టు ప్రభుత్వం లనేతోక కేంద్రప్రభుత్వం అనే శ్వానాన్ని ఆడించ గలుగుతోంది, అని బ్రిటిషు పత్రిక ఒకటి రాసింది. ప్రజల నష్టం ద్వారా సంపాదనకి పూనుకున్న కలకత్తా ప్రభుత్వానికి బాంకుల జాతీయకరణం నేతిలోపడ్డ రొట్టె.


Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press: 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.

మీకు ఏ కారణము వల్ల తల నొప్పి వచ్చినా అది ఒకే ఒక సారిడన్‌తో మటుమాయమై పోతుంది

ఒకే ఒక సారిడన్ నొప్పిని త్వరగా పోగొట్టుతుంది. ఇంతేగాక, అందులో వున్న ప్రత్యేక పదార్థముల వలన సారిడన్ తల నొప్పి, ఒంటి నొప్పి లేక పళ్ల నొప్పితోబాటు కలిగే భారమును పోగొట్టును మరియు మీకు హాయి నవోత్సాహములను కలిగించును. అదే సారిడన్ ప్రత్యేకత!

సారిడన్

'రోష్'



HTA-VT 8421

'రోష్' తయారీ   ఏకైక డిస్ట్రిబ్యూటర్లు: వాల్టాస్ లిమిటెడ్

Regd. No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA